[illegible]

1945 నుండి 1999 వరకు [illegible]

[illegible]

- డా. సి. నారాయణ రెడ్డి

ఆధునిక కథా సరిత్సాగరం

కరీంనగర్ జిల్లా కథలు

మొదటి సంపుటి



సంపాదకులు

బి.ఎస్. రాములు

వనమాల చంద్రశేఖర్

ఆధునిక
కథా సరిత్సాగరం

కరీంనగర్ జిల్లా కథలు మొదటి సంపుటి

సంపాదకులు :

బి.ఎస్. రాములు

వనమాల చంద్రశేఖర్
M.A., LL.M.

ఆధునిక భారతీయ సామాజిక తత్వవేత్త
బి.ఎస్. రాములు 50వ జన్మదిన స్వర్ణోత్సవం సందర్భంగా

విశాల సాహిత్య అకాడమీ ప్రచురణ
6-2-157, మిషన్ హాస్పటల్ దగ్గర
జగిత్యాల-505 327, కరీంనగర్ జిల్లా

ఆధునిక కథా సరిత్సాగరం

కరీంనగర్ జిల్లా కథలు మొదటి సంపుటి

ADHUNIKA KATHA SARITHSAGARAM

KARIMNAGAR ZILLA KATHALU Vol. I

Selected Telugu short stories of
Karimnagar District writers (1945-1999)

Compiled & Edited by

B.S. RAMULU,
VANAMALA CHANDRASHEKHAR M.A., LL.M.

First Edition : September, 1999

Published by :
B. SHYAMALA, Director
Vishala Sahitya Academy,
6-2-157, Near Mission Hospital,
Jagtial - 505 327, Dist : Karimnagar - A.P.
Phone : 08724 - 22056

Price : **Rs. 30/-** ($ 5/-) VPH SOLE

Copies also available at :
Vishalandhra Book House all branches
Navodaya Book House - Kachiguda, Hyd.
Disha Book Centre - Chikkadapally, Hyd.

Composed & Printed at :
JAYASRI GRAPHICS
Weekly Bazar, JAGTIAL Phone : 24357.

కథల సూచిక

కరీంనగర్ జిల్లా చరిత్ర సంస్కృతి కథానేపథ్యం

- బి.ఎస్.రాములు

భౌగోళికంగా కరీంనగర్ ప్రాంతం భారతదేశంలోని వింధ్య పర్వతాలకు దక్షిణాన దక్కను పీఠభూమిలో భాగం. పూర్వం యిది మహారణ్యాలతో నిండి ఉండేది. కొంతకాలం యిది దండకారణ్యంలో భాగంగా పిలువబడింది. మైదానాల చుట్టూ పర్వతాలు ప్రకృతి చూపరులకు ఎంతో అందంగా కన్పిస్తాయి. ఈ ప్రాంతానికి పర్వతాలు పెట్టని కోటలు. లక్షల సంవత్సరాల క్రితంనుండి వర్షాలకు ఎత్తైన కొండల్లోని మట్టి కరిగి ప్రవహించి మైదానాలను సారవంతం చేశాయి. లక్షల సంవత్సరాల వర్షపు నీటి ప్రవాహాల కనువుగా వాగులు, నదులు, వాటి దిశలు రూపుదిద్దుకున్నాయి. ఇక్కడి అడవులు కాకులు దూరని కారడవులు. పులులు, సింహాలు, బండిఏగోలాలు, చిరుతపులులు, గుడ్డేలుగులు, మొదలుకొని వందలాది జంతువులు పక్షులు, చెట్లు, మొక్కలు, పొదలు జీవిస్తూ ఉండేవి.

ఆదిమానవులు సంచరించిన జాడలు దొరికిన ప్రాంతాల్లో కరీంనగర్ ప్రాంతం ఒకటి. ప్రపంచంలో ఆది మానవులు 50 వేల ఏళ్లనాడు రూపుదిద్దుకున్నారని ఒక అంచనా. ఇక్కడి గోదావరి మానేరు నదులు, యిప్పటికన్నా ఎంతో విస్తీర్ణంతో జీవనదులుగా ప్రవహించేవి. ఇక్కడి గోదావరి సముద్రం అంచుదాకా ఒక ప్రధాన నీటి మార్గంగా ఉపయోగపడింది. అలా యిక్కడి పీఠభూమి మానవులు కర్రదుంగల బల్లకట్టు ద్వారా పల్లపుప్రాంతాలను అన్వేషిస్తూ వలసలు సాగించారు. నీటి మార్గంలో ఎగువ ప్రాంతంలో ఉండడంలో కొన్ని సౌకర్యాలున్నాయి. పల్లానికి వేగంగా ప్రయాణించడం చాలా సులభం. పూర్వం భూమార్గం దొంగలవల్ల, దాడులవల్ల, జంతువులవల్ల ప్రమాదభరితం. నదీమార్గం కాస్త నయం. ఈ సౌకర్యాలను గమనించి శాతవాహనులు తమ తొలి రాజధానుల్లో ఒకటైన 'కోటిలింగాల'ను గోదావరి ఒడ్డున నిర్మించుకున్నారు. గోదావరి పుట్టిన నాసిక్, త్రయంబకం నుండి కోటిలింగాల దాకా కొండల్ని తొలిచి ప్రవహించినట్టు రాళ్లమయంగా ఉంటుంది నది. కాని కోటిలింగాల నుండి కాళేశ్వరం, భద్రాచలం, రాజమండ్రి ధవళేశ్వరం మీదుగా సముద్రం అంచును చేరేదాకా నదిలో కొండరాల్లు కనపడవు.

ప్రపంచంలో కలియుగ, బౌద్ధ, విక్రమాదిత్య, శాతవాహన, క్రీస్తు హిజరీ మొదలైన శకాలు వాడుకలో ఉన్నాయి. శాతవాహన శకం అందులో ఒకటి. హరప్పా, సింధునాగరికత, మెసపొటేమియా, సుమేరియా, ఈజిప్టు, గ్రీకు, చైనా, దక్షిణ భారత నాగరికతలు ప్రపంచంలో ప్రాచీన నాగరికతలు, కరీంనగర్ ప్రాంతం కూడా అందులో ఒకటి. వీటి వివరాలు డా. జె. రమణయ్య గారి వ్యాసంలో ఉన్నాయి.

ఆంధ్రులు ఆర్యేతర జాతుల వారనేది నిర్వివాదాంశం. కొందరు చరిత్రకారులు ఈ ప్రాంతాన్ని ప్రధానంగా నాగజాతి ప్రజల ప్రాంతం అని అభిప్రాయపడ్డారు. నాగజాతి ప్రజలను రాక్షసులని, ద్రావిడులని దళితులని కూడా కొందరు వ్యవహరిస్తారు.

ఆశోకుని ప్రోత్సాహంతో ఈ ప్రాంతంలో బౌద్ధ ప్రచారంకోసం భిక్షువులు ప్రవేశించేనాటికి యిక్కడ మాతృస్వామ్య వ్యవస్థ బలంగా ఉండేది. ఈ ప్రాంతంలో జరిగే లగ్గాల్లో చేసే ఐరేని కుండలపూజ, వంట, కుండ, గడిచివచ్చిన ప్రాచీన వ్యవసాయ, తల్లి సంస్కృతికి నిదర్శనం. పెళ్లినాడు అందుగుకొమ్మ

ఇంటి ముందు నాటడం పెళ్లికి కొత్త పందిరి వేయడం మొదలుకొని పెళ్లయ్యాక బావమరుదులు అడ్డగించి కట్నం తీసికోవడం పదహారు రోజుల పండుగ దాకా జరపడం గిరిజన సంస్కృతి చిహ్నాలే.

బౌద్ధం, జైనం, వీరశైవం, వైష్ణవం వచ్చి శతాబ్దాలు ఉండిపోయినా గిరిజన జీవితంనాటి ఆచారవ్యవహారాలు యిప్పటికి కొనసాగడం చూడవచ్చు. ఎడ్లపూజ, పొలాల అమావాస్య, చెట్లల్లకు పోవుడు అనేవి పోడు వ్యవసాయం ప్రారంభించే సమయంలో మనం గిరిజనులుగా ఉన్నప్పుడు చేసికోవడం మొదలెట్టిన పండుగలు.

బౌద్ధం, జైనం పితృస్వామ్య వ్యవస్థకు మద్దతు యిచ్చినప్పటికీ మాతృస్వామ్య వ్యవస్థకూడా బలంగానే కొనసాగడం ఇక్కడి విశేషం. ప్రపంచంలోని మతాలన్నీ సామ్రాజ్యాల నిర్మాణాలకు సోపానాలుగా పని చేశాయి. ఇస్లాం - చెంఘిజ్‌ఖాన్ మనుమలు చక్రవర్తులయ్యేట్టు చేసింది. బాబరు చెంఘీజ్‌ఖాన్ మనుమలలో ఒకడు. మరొకరు చైనాను ఏలారు.

క్రీ.పూ. నుండి ఈ ప్రాంతంలో చక్కని చెరువులు నిర్మించబడ్డాయి. కొత్త చెరువుల నానుకొని కొత్త ఊర్లు వెలిశాయి. మధ్యయుగం నుండి మోటబావుల టెక్నాలజీ వచ్చింది. దాదాపు మూడువేల ఏళ్లనుండి ఇక్కడి ప్రజలకు నూలుబట్ట నేయడం తెల్సు. రెండున్నర వేల ఏల్లనుండి పట్టుబట్ట తెల్సు. ఇక్కడి జైనమతానుయాయులే తొమ్మిదో శతాబ్దంనుండి శైవమతస్థులుగా మారడం మొదలైంది.

ప్రస్తుతం ప్రపంచ జనాభాలో ప్రతి రెండు వేల మందిలో ఒకరు కరీంనగర్ జిల్లావారు. 450 ఏళ్లు ఏలిన శాతవాహన వంశ తొలిరాజు 'సిముక' (శ్రీముఖుడని తర్వాత సంస్కృతీకరించారు) ఈ ప్రాంతానికి చెందిన ఒక శూద్ర గిరిజన నాయకుడు. కొందరితనిని మహారాష్ట్రలోని పైఠాన్ ప్రాంతానికి చెందినవాడని అంటారు. 'కోటిలింగాల'లో పురావస్తు సాక్ష్యాలు మలివిడత బయల్పడ్డాక శాతవాహనులు ఇక్కడివారేనన వాదం బలపడింది.

శాతవాహనులకు కథా సాహిత్యానికి సంబంధం ఉంది. నాటి ప్రాంతీయ వ్యవహార భాష అయిన పైశాచీ భాషలో గుణాఢ్యుడు 'బృహత్కథ'ను సంకలనం చేశాడు. అతడు సిముకుని ఆస్థానకవి. క్రీ.శ.2వ శతాబ్దంలో 'బృహత్కథ' 'పెరుంగదై' పేరుతో తమిళంలోకి అనువదించబడింది. క్రీ.శ. 516 ప్రాంతంలో బృహత్కథ చైనా, టిబెట్ భాషల్లోకి అనువదించబడింది. ఆధునిక కాలంలో భారతీయ భాషల్లోకి, ఇంగ్లీషు, జర్మనీ, ఫ్రెంచ్, రష్యన్, మొ॥ యూరపియన్ భాషల్లోకి అనువదించబడింది. పైశాచీ భాషనుండి సోమదేవుడు సంస్కృతంలోకి అనువదించిన "కథా సరిత్సాగరం" ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. దీనిలో 124 తరంగాలు, దాదాపు 22000 శ్లోకాలున్నాయి. బృహత్కథను "బృహత్కధా మంజరి' 'గా మరొక అనువాదం చేసిన క్షేమేంద్రుడు కాశ్మీర రాజు అనంతుని క్రీ.శ. (1029-1064) ఆస్థానకవి.

'కథా సరిత్సాగరం'' గా అనువదించిన సోమదేవుడు కరీంనగర్ జిల్లా వేములవాడ, గంగాధర ప్రాంతానికి చెందినవాడు. అతడు క్రీ.శ. 959లో ''కథాసరిత్సాగరం'' అనువదించాడు. గుణాఢ్యుని [illegible] ప్రపంచ కథలకు పుట్టిల్లుగా గుర్తింబడింది. అవి పంచతంత్ర కథల్లోకి, బేతాళ పంచవింశతి, శుకసప్తతి, బౌద్ధ జాతక కథల్లోకి పాకాయి. మరో శాతవాహన రాజైన హాలుడు గాథా సప్తశతిని సేకరించి, రచించి ప్రాకృతంలో గ్రంథస్తం చేసి ప్రపంచ కథా సాహిత్యానికెంతో మేలు చేశాడు. ఇలా కరీంనగర్ జిల్లా, తెలంగాణా ప్రాంత కథలు, సంస్కృతి, జీవితం ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం కావడానికి కారకులైన సిముక, గుణాఢ్య, హాలుడు, సోమదేవ ప్రభుతులు వందనీయులు. ఒకవేళ వారు ఈ ప్రాంతంవారు కాకుండా ఏప్రాంతం వారైనప్పటికీ వందనీయులే. అందువల్ల వారి స్ఫూర్తితో ఈ కథల సంకలనానికి ఆధునిక కథా సరిత్సాగరమని పేరు పెట్టడం జరిగింది. వరుసగా 5 సంకలనాలు వేయాలనుకోవడం జరిగింది. అందులో ఇది మొదటిది.

2

ఇవి రూపంలో మాత్రమే కరీంనగర్ జిల్లా కథలు. కరీంనగర్ జిల్లా ప్రజల గురించి ఆ జిల్లా రచయితలే చిత్రించిన కథలివి. సంస్కృతి, చరిత్ర, భాషా పరంగా యివి తెలుగుజాతి కథలు. సారాంశంలో యివి భారతీయ కథలు. మానవీయ కథలు. ఈ కథల్లో ఈ దేశ ప్రజల సంస్కృతి, కులం, వర్గం, భాష, కుటుంబవ్యవస్థ, స్త్రీ సమస్య, మానవ సంబంధాలు, ఆలోచనా విధానం, ఆధునికత ప్రజల జీవితాల్లో ప్రవేశించిన తీరు, వాటి 60 ఏళ్ల పరిణామాలు చూడవచ్చు. ఒక నిర్దిష్ట ప్రాంత, భాష, సంస్కృతి, సమాజ నేపథ్యంగా సమకాలీన భారతీయ ప్రజల భావాలు, సంఘర్షణ, స్పందనలు, విభిన్న దృక్పధాలు, జీవితాలు ఈ కథల్లో కనపడుతాయి. ఈ కథల్లోని బతుకుపోరాటం, మానవ స్వభావాలు విశ్వజనీనమైనవి.

వేల ఏళ్ళుగా ఈ దేశంలో కులవ్యవస్థ, జనపదాలు, స్వయం పోషక గ్రామాలు, రాజరికాలు, నాగరికతలు ఏకకాలంలో కొనసాగాయి. చాలా సందర్భాల్లో సహజీవనం చేశాయి. ఆధిపత్యంలో ఉన్నదాన్ని ప్రశ్నించనంత వరకు అంతా సాఫీగా సాగుతున్నట్టే కనపడుతుంది. ఒక చైనా నాటకంలో మీ సమస్యలు పరిష్కారానికి సంగం పెట్టుకొమ్మంటే మాకు సమస్యలుంటే కదా అని పల్లె ప్రజలు మొదట గొల్లున నవ్వుతారు. ఈ తర్వాత కొద్దికాలానికే సంగం బలపడి పోరాటాలు మొదలయ్యాక అబ్బా ఎన్ని సమస్యలున్నాయో అని ఆశ్చర్యపోతారు. అందుకు వ్యవస్థను మార్చుకోవడమే పరిష్కారమని ఊరంతా కదులుతుంది. సరిగ్గా కరీంనగర్ జిల్లా ప్రజలు కూడా మొదట అలాగే ఫీలయి తర్వాత కదలబారారు.

దోపిడి, పీడన, అణిచివేతను ప్రశ్నించడం చైతన్యానికి సంబంధించినది. వ్యవసాయ సమాజంలో, ఈ చైతన్యం కులాధిక్యతను, రాజ్యాధిక్యతను ప్రశ్నించే రూపంలో కొనసాగింది. బుద్ధుడు కులరహిత మానవీయ సమాజాన్ని అభిలషించాడు. బౌద్ధం వెయ్యేళ్ళు ప్రపంచాన్ని మానవీయం చేసింది. కొన్ని వర్గాల స్వార్ధంకోసం కుల వ్యవస్థ, కుల తారతమ్యాలు తిరిగి పునరుద్ధరించబడ్డాయి. కులాలు అసంఖ్యాకంగా పెరిగిపోవడానికి కుల బహిష్కరణలు కూడా ప్రధాన కారణమని "మనుస్మృతి" ద్వారా తెల్సుకోవచ్చు. కులాల సంఖ్య పెరగడానికి, మతాంతీకరణాలు జరగడానికి దారి తీసిన చరిత్రకు ఒక ప్రతీక జి. రాములు గారి "ఆత్మఘోష" కథ. ఆర్య సమాజ ఉద్యమం కుల తారతమ్యాల మూలకారణాల జోలికి వెళ్లలేకపోయిందని ఈ కథ ద్వారా తెలుస్తుంది. తెలంగాణా సాయుధ పోరాటం ప్రారంభం కాకముందటి సమాజాన్ని ఈ కథ తెలుపుతుంది.

కుల వర్గ రాజరిక, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలు చేసిన తెలంగాణా పోరాటానికి సంబంధించిన కథలు ఈ జిల్లాకు సంబంధించినవి ప్రస్తుతానికి లభ్యం కాలేదు. దొరికితే రెండో సంకలనంలో చేర్చబడుతాయి. ప్రజల పోరాటాల ఫలితంగా స్వాతంత్రం వచ్చిన ఫలితంగా గ్రామాల్లో వచ్చిన చైతన్యాన్ని కొత్త బాట అని డా॥ పి. యశోదారెడ్డి గారి "కొత్తబాట" కథ తెలుపుతుంది. అయితే ఈ చైతన్యం తిరిగి కొన్ని కులాల, వర్గాల ప్రయోజనాలకనువుగా ఉపయోగించుకోవడం మొదలైన తీరు జి.సురమౌళి గారి "అంగుడు పొద్దు" కథలో కనపడుతుంది. 1954లో మహబూబ్‌నగర్ జిల్లా అలంపురంలో జరిగిన తెలంగాణా రచయితల మహాసభలనుద్దేశించి రాసిన ఈ కథలో యిదంతా మనదే అనే పేరిట సాగే కొత్తరకం వెట్టి చాకిరిని, స్పష్టం చేశారు సురమౌళి గారు.

వ్యవసాయిక సమాజం తాలూకు ఉత్తత్తి శక్తులు, ఉత్తత్తి సంబంధాలు, ఉత్పత్తి సాధనాలు మారకుండానే మనదేశంలో పారిశ్రామిక ఉత్పత్తులు ప్రజల జీవితంలో ప్రవేశించాయి. తద్వారా కోట్లాది మంది కుల వృత్తులు గిట్టుబాటు కాక వలస పోయారు. వ్యవసాయం మీద ఒత్తిడి పెరిగింది. సాగుభూమికి ప్రాధాన్యత పెరిగింది. తద్వారా భూమికోసం ఆరాటం అనివార్యమయ్యింది. తొలినాటి ఈ పరిణామాలను చిత్రించిన కథలు లభించలేదు. అయితే వలసల వల్ల, పరిశ్రమల వల్ల పరిపాలన కేంద్రాల వల్ల

పెరిగిన పట్టణాలను, వాటి నాగరికతలను చూడాలని, దాన్ని అందుకోవాలనే ఆరాటంతో పల్లె ప్రజలు ఊళ్ళ నుండి పారిపోయి ఎదుర్కొన్న సమస్యలను గూడూరి సీతారాం గారి "మారాజు" కథ చిత్రిస్తుంది.

ఒక పల్లెటూరి బక్కరైతుకు ప్రభుత్వ నిర్మాణాల ద్వారా సామాజిక న్యాయాన్ని, అభివృద్ధిని అందుకోవడం అసాధ్యమైన తీరును అల్లం రాజయ్య వ్రాసిన "అడవి మనిషి" కథ తెలుపుతుంది. ఎమర్జెన్సీ అనంతరం నక్సలైట్ భావజాల చైతన్యంతో ప్రజలు ముందుకు కదలడం ప్రారంభించారు. ఆ ప్రజా పోరాటాల్ని చిత్రించిన ఈ కథకుడు అల్లం రాజయ్య కరీంనగర్ జిల్లా సాహిత్య చరిత్రలో ఒక మైలురాయి.

గత అరవై ఏళ్లల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. గంజి, అంబలి, గడక స్థానంలో చాయ్, అన్నం ప్రవేశించాయి. అటుకుల స్థానే యిడ్లీలు వచ్చాయి. కల్లుకు తోడుగా సారా బీరుషాపులు వచ్చాయి. గుడిసె వాసాలు, మట్టి పెంకుల ఇళ్లకు తోడుగా సిమెంటు బంగ్లాలు పెరిగాయి. ఆముదము దీపాల స్థానే గ్యాసునూనె, కరెంటు వచ్చాయి. నువ్వుల నూనె స్థానే పల్లినూనె వాడకంలోకి వచ్చింది. మంగలి, మంత్రసాని స్థానే ఆయాలు, దవాఖానలు వచ్చాయి. ఆయుర్వేదం స్థానే అల్లోపతి వైద్యవిధానం వచ్చింది. ధోతి, పంచె స్థానే నిక్కర్లు, ప్యాంట్లు డ్రెస్సులు వచ్చాయి. పొయ్యిల కట్టెలు పిడుకల వంట నుండి బొగ్గుల పొయ్యి గ్యాసు పొయ్యిలు కూడా వచ్చాయి. గ్రామీణ జానపద కళా రూపాలు అంతరించి రేడియో, టీవి, సినిమాల పెత్తనం స్థిరపడింది.ఎడ్ల బండి స్థానే ట్రాక్టర్లు, జీపులు, కార్లు, రైళ్లు, బస్సులు, సైకిళ్లు వచ్చాయి. పోడు వ్యవసాయం నుండి ఆధునిక వ్యవసాయ పద్ధతులు అభివృద్ధి చెందాయి. సాంప్రదాయక విత్తనాల నుండి హైబ్రిడ్ విత్తనాలు వచ్చాయి. మట్టికుండల వంటనుండి అల్యూమినియం, యిత్తడి, స్టీలు గిన్నెలకు విస్తరించడం జరిగింది.

జాతీయోద్యమం, ఆంధ్రమహాసభ, కులసంఘాలు, కమ్యూనిస్టుల పోరాటం, బొంబాయి వలసలు, బీడీల పరిశ్రమ, ఆర్యసమాజ ఉద్యమం, సోషలిస్టుల ఉద్యమం, రజాకార్లు, ముల్కి ఉద్యమం, జై తెలంగాణా ఉద్యమం, నక్సలైటు ఉద్యమం, హిందువాద ఆర్ఎస్ఎస్ ఉద్యమం, ఎమర్జెన్సీ చీకటి, విద్యార్థుల ఉద్యమం, హాస్టల్ విద్యార్థుల పోరాటాలు, విప్లవ విద్యార్థి యువజన సంఘాలు. అంబేద్కర్ సంఘాలు, రోడ్లు, కరెంటు, ఫోన్లు , రిజర్వేషన్లు, చదువుకున్న కొత్త తరాలు, స్త్రీ విద్య, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థ, సింగరేణి బొగ్గు పరిశ్రమ, ఆర్.టి.సి., కాంట్రాక్టర్ల వ్యవస్థ, జాతర్లు, మూఢవిశ్వాసాలు, ఇంగ్లీషు మీడియం, ప్రైవేటుస్కూల్లు, నిరక్ష్యరాస్యత, ప్రజల అమాయకత్వం గురించి సమాజ ప్రతిఫలనంగా కథా సాహిత్యం ఏ మేరకు పట్టించుకొని చిత్రించిందో పరిశీలించాల్సి ఉంది. ఈ మొదటి కథా సంకలనంలో యివి ఏ మేరకు ప్రతిఫలించాయో సామాజిక శాస్త్రవేత్తలు, వ్యాసాల ద్వారా విశ్లేషిస్తే ఎంతో ఉపయోగం.

ఈ మొదటి సంకలనంలోని తొలితరం కథలు, తొలితరం జీవితాలను కూడా ప్రతిబింబిస్తాయి. స్వాతంత్ర్యానంతరం గ్రామీణ జీవితాలను, ప్రజల తిరుగుబాటు ధోరణులను యిందులోని రెండో భాగం చూపుతాయి. మూడవభాగంలో కుటుంబ సంబంధాలు, సమాజ పరిణామాలు చిత్రించిన కథల్ని చేర్చడం జరిగింది. నాలుగవ భాగంలో ఇటీవలి జీవితాల చిత్రణ కనపడుతుంది. ఇలా మొదటి సంకలనం కరీంనగర్ కథాపరిణామంతో పాటు, జిల్లా చరిత్ర, సామాజిక సంబంధాల యాభయి ఏళ్ల పరిణామాల్ని ఒక క్రమపద్ధతిలో అందించే లక్ష్యంతో కూర్చడం జరిగింది. గత యాభయ్యేళ్లలో కరీంనగర్ జిల్లా భాషలో వస్తున్న పరిణామాల తీరును కూడా ఈ కథల ద్వారా గమనించవచ్చు. తెలుగులో జీవితంలోని ఇన్ని కోణాలను జిల్లా స్థాయిలో ఒక సమగ్రదృష్టితో వెలువడుతున్న తొలి కథా సంకలనం యిది. అలా అని జీవితంలోని అన్ని కోణాలను ఈ కథల ద్వారా చూడవచ్చునని చెప్పలేం. కాని చాలా విషయాలు ఈ కథల్లో ఉండడాన్ని గమనించవచ్చు. ఈ కథల సంకలనం చదివాక కరీంనగర్ జిల్లా చరిత్ర గురించి. ప్రజలగురించి, ఇక్కడి కథకులగురించి ఎంతోకొంత అవగాహన కలిగితే మాలక్ష్యం నెరవేరినట్టే. ✷

కరీంనగర్ జిల్లాలో వెలసిన తొలి నాగరికతలు

డా॥ జె. రమణయ్య M.A. M. Phil. Ph.D.
రిటైర్డ్ రీడర్, చరిత్రశాఖ.

గోదావరినానుకొని దక్షిణంగా వ్యాపించి యున్న కరీంనగర్ జిల్లాలో శతాబ్దాల తరబడి చరిత్ర పూర్వయుగము (Pre-historic period) లో తొలి నాగరికతలు వెలిసాయి. గోదావరి లోయలో పురావస్తు శాఖవారిచే ఆదిమానవుని స్థావరములనేకం గుర్తింపబడ్డాయి. పెద్దపెల్లి న్యాయవాది ఠాకూర్ రాజారాంసింగ్ వీటి పరిశోధనలలో చేసిన కృషి ప్రశంసనీయం. పెద్దపెల్లి తాలూకాలోని అల్లూరు, జనగాం గ్రామాల్లో అనగా నేటి గోదావరిఖని ప్రాంతంలో ప్రాచీన శిలాయుగపు అనేక పనిముట్లు L. Munn చే గుర్తింపబడ్డాయి[1]. తొలి, మధ్య, ఉత్తర పాతరాతి యుగముల (Early, Middle and Upper Palaeolithic) స్థావరాలు రామగుండం బసంత్‌నగర్ మధ్యనున్న నీటిబుగ్గ ప్రాంతములోను, రామగిరి గుట్ట వరుసల్లో సబ్బితం గ్రామ సమీపమున గల గౌరీగుండం జలపాతం వద్దను మరియు దేవునిపల్లి, రచ్చపల్లి, వేమ్నూర్, బుచ్చయ్యపల్లి, నర్సంపల్లి మున్నగు ప్రాంతాల్లో బయల్పడ్డాయి[2]. చేతి గొడ్డండ్లు (Hand-axes) ఇతర రాతి పనిముట్లు అనేకములు ఈ ప్రాంతాల్లో లభ్యమైనాయి. ఈ స్థావరాల పరిశోధనలు కరీంనగర్ జిల్లా తొలి నాగరికత, ఆదిమానవుని జీవిత విధానము కనీసం యాభైవేల సంవత్సరముల ప్రాచీనమైనవని తెలుపుతున్నాయి.

నవీన శిలాయుగపు స్థావరములు (Neolithic Sites) మానేరునది తీరాన గల తొగర్రాయి, కదంబాపూర్‌లలోను, పెద్దపెల్లి సమీపమున గల పెద్దబొంకూరు మరియు హుస్నాబాద్ సమీపమున గల బూడిగపల్లిలోను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్‌గా పనిచేసిన డా. వి.వి. కృష్ణ శాస్త్రి గారు విస్తారమైన పరిశోధనలు గావించారు. తొగర్రాయి సమీపాన పాండవుల గుట్ట స్థావరం వద్ద నవీన శిలాయుగపు రాతి పనిముట్లు తయారుచేయు కర్మాగార కేంద్రమొకటి గుర్తింపబడింది. రేగొండ, బూడిగపల్లి, కదంబాపూర్ గుట్ట బోరుల్లో (Rock Shelters) లో నవీన శిలాయుగపు మానవుడు నివసించిన ఆధారలున్నాయి. గుట్ట బోరుల్లోనేగాక క్రమంగా సమతల మైదాన ప్రాంతాల్లోగూడా నవీన శిలాయుగపు మానవులు స్థావరాలేర్పరచుకొన్నారనుటకు పెద్దబొంకూర్ గ్రామమే నిదర్శనం. ఈ కాలపు పనిముట్లు మంథని సమీపమున గల గుంజపడిగెలోను, పర్లపల్లి, కోహెడ, శనిగరం, వేములవాడ మరియు గోదావరిఖని ప్రాంతాల్లో లభ్యమైనాయి[3]. ఈ నవీన శిలాయుగపు సంస్కృతి దాదాపు ఐదువేల సంవత్సరాల నాటిదని చెప్పవచ్చు.

బృహత్ శిలాయుగపు (Megalithic) సమాధులు రాక్షస గుళ్ళు లేదా రాకాసి గుండ్లు అనగా పెద్దపెద్ద రాళ్ళను వర్తులాకారములో సమాధి చుట్టు నిలిపి మధ్యలో ఒక పొడుగాటి బృహత్ శిల(Cist) ను నిలుపు ఆచారముండేది. మూడువేల సంవత్సరముల నాటి బృహత్ శిలా సంస్కృతి (Megalithic Culture) ను చాటు స్థావరాలు హుజూరాబాద్ సమీపాన గల సింగాపూర్, తుమ్మనపెల్లి, చెల్పూర్, సిరిసిపెల్లి, హుస్నాబాద్ సమీపాన గల బూడిగపల్లి, సుల్తానాబాద్ సమీపాన గల కదంబాపూర్, వేములవాడ

సమీపాన గల నాంపెల్లి, రాయికల్ సమీపాన గల వస్తాపూర్ మరియు అనేక గ్రామాల్లో బయల్పడ్డాయి. ఈ సమాధులు ఎక్కువగా గుట్టలకు సమీపాన ఉన్నాయి. ఎందుకంటే బృహత్ శిలలు సులభంగా లభ్యమవుతాయి. కరీంనగర్ నుండి వరంగల్ పోవు రహదారి ప్రక్కనే సింగాపూర్ వద్ద 50 వరకు ఈ కాలపు సమాధులున్నాయి. హుస్నాబాద్ సమీపాన గల బూడిగపల్లి చుట్టుప్రక్కల విస్తరించియున్న వలాసగట్టు, సంజీవరాయునిగట్టు, వెంకయగట్టు అనుకొండల సమీపాన ఏక బృహత్ శిల (Cist) ను కలిగిన సమాధులు అనేకం ఉన్నాయి. కదంబాపూర్ వద్ద మానేరు నది ఒడ్డున గుట్టకు తూర్పు పడమర దిశలయందు ఈ యుగపు ఐదువందల సమాధులు గలవు. ఇచట పురావస్తు శాఖవారు మచ్చుకు ఐదు సమాధులను తవ్వి పరిశోధనలు గావించారు[4]. తుమ్మనపల్లి వద్ద ఆరు, సిరిసిపల్లి వద్ద యాభయి సమాధులు కనబడుతాయి. ఈ సమాధులలో కుండలు, పెంకుల ముక్కలు, ఇనుప పరికరములు, టెర్రాకొట్ట పూసలు (Beads of terracotta), విలువైన రాళ్ళు, బంగారు, రాగి వస్తువులు మున్నగునవి పరిశోధనలలో బయల్పడ్డాయి. బూడిగపల్లి, రేగొండలలో గుర్రములపై స్వారీచేయు వ్యక్తుల చిత్రములు బృహత్ శిలాయుగపు అరుదైన Rock Paintings గుర్తించబడుట ఈ ప్రాంతపు తొలి నాగరికతల విశేషం.

బృహత్ శిలాయుగము అనంతరం తొలి చారిత్రక యుగపు సంస్కృతి (Early Historical Culture) ఆరంభమైనది. క్రీ.పూ. ఆరవ శతాబ్దములో భారతదేశంలో వెలసిన షోడశ (16) మహాజన పదాలలో పోదన (Bodhan) కేంద్రముగా ఆంధ్రప్రాంతము ఆస్మక లేదా అస్సక పేరుతో ఒకటిగా వెలుగొందెను. ఈ ప్రాంతమును తొలుత నందులు తరువాత మౌర్యులు పాలించినట్లు తెలుస్తున్నది. మౌర్యులు మరియు వారి పూర్వుల కాలపు 418 Punch marked silver coins ఈ జిల్లాలో లభ్యమైనాయి. వాటిని హైద్రాబాద్ మ్యూజియంలో భద్రపరిచారు[5].

మౌర్యుల పతనానంతరం దక్కన్‌లో శాతవాహనులు సార్వభౌములైనారు. 30 మంది రాజులు 450 సంవత్సరములు పాలించినట్లు తెలుస్తున్నది. పురావస్తు శాఖవారు 1968 నుండి 1974 వరకు పెద్ద బొంకూర్, ధూళికట్టల వద్ద త్రవ్వకాలు జరిపినారు. కోటిలింగాలలో మొన్న మొన్నటి వరకు త్రవ్వకాలు జరిగాయి. తొలి చారిత్రక యుగపు సంస్కృతి బయల్పడింది. శాతవాహనుల కాలపు సంస్కృతి అవశేషాలు పెక్కు కరీంనగర్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో బయల్పడుట విశేషం. శాతవాహనుల కాలము వరకు జనాభా పెరిగి ఈ ప్రాంతము గొప్ప వర్తక ప్రాధాన్యత గల ప్రదేశంగా గుర్తింపబడినది. 1952లో నుస్తులాపూర్ సమీపమున ఎనిమిది వెండి నాణెములు, 39 రోమన్ నాణెములు బయల్పడ్డాయి[6]. రోమన్ చక్రవర్తులు ఆగస్టస్ (27 B.C. నుండి 14 A.D.) మరియు నీరో (A.D. 14 నుండి 37) సంబంధిత నాణెములు వీటిలో ఉన్నాయి. వీటిని బట్టి ఈ జిల్లాకు క్రీ.పూ. ఒకటవ శతాబ్దములోనే రోమన్ సామ్రాజ్యముతో విస్తారమైన వ్యాపార సంబంధము లుండేవని తేటతెల్లమగుతున్నది. పెద్దబొంకూర్‌లో శాతవాహనుల నాణెములు వందల కొలది లభ్యమైనవి. కప్పరావుపేట సమీపమున శాతవాహనుల తొలిరాజైన సిముకుని లేదా శ్రీముఖుని నాణెములు పోస్టల్ శాఖలో పనిచేసిన ధర్మపురి వాస్తవ్యులు కీ.శే. సంగనభట్ల నరహరి గారికి లభ్యమైనవి. ఈ జిల్లాలోని త్రవ్వకాలలో 284 పూర్ణనాణెములు, 116 పగిలిన రాగి నాణెములు వివిధ శాతవాహన పాలకుల పేర్లతో లభ్యమైనవి. శాతవాహన, మొదటి శాతకర్ణి, గౌతమీపుత్ర శాతకర్ణి, వాశిష్ట పుత్రపులోమావి, శివశ్రీపులోమావి, యజ్ఞశ్రీశాతకర్ణి, రుద్రశాతకర్ణి మున్నగు రాజుల పేర్లు ఈ నాణెములపై కలవు[7]. నాణెములే కాకుండా ధూళికట్ట, కోటిలింగాలలో శాతవాహనుల దుర్గములు బయల్పడినవి. మౌర్యచంద్రగుప్తుని ఆస్థానము నలంకరించిన గ్రీకు రాయబారి మెగస్తనీస్ రచించిన ఇండికా గ్రంథములో శాతవాహనులకు ముప్పది బలిష్టమైన దుర్గములుండెనని పేర్కొన్నాడు. ఆ దుర్గములలో ధూళికట్ట, కోటిలింగాల దుర్గములు కూడా పరిగణనలోనికి వచ్చి యుండవచ్చునని ఆధునిక

చరిత్రకారుల అభిప్రాయం. వాస్తవంగా ధూళికోట నామమే నేడు ధూళికట్టగా మారింది. పెద్దబొంకూర్ శాతవాహనుల గ్రామము కాగా ధూళికోట లేదా ధూళికట్ట మరియు కోటిలింగాల నగరములుగా గుర్తింపబడ్డాయి. శాతవాహనుల కాలపు చారిత్రక అవశేషాలు పెక్కు ఈ జిల్లాలోని అనేక గ్రామాల్లో బయల్పడుట వలన దక్కన్‌లో ఈ ప్రాంతము Political Nucleus రాజకీయ విశిష్టత సంతరించుకున్న ప్రదేశమని చారిత్రకుల అభిప్రాయం.

తొలి చారిత్రక యుగపు అవశేషాలు పెక్కు చిన్నబొంకూర్, వేమ్నూర్, కాచాపూర్, బోడగుట్ట, బొంపల్లి, రచ్చపల్లి, పైడిచింతలపల్లి, కదీంకనగర్తి మున్నగు గ్రామములందు బయల్పడినవి. క్రీ.పూ. రెండవ శతాబ్దపు బ్రాహ్మీ లిపిలోనున్న చిన్న చిన్న Label Inscriptions శాసనములు అనేకములు త్రవ్వకాలలో బయల్పడినవి. పెద్దబొంకూర్‌లో టెర్రాకొట్ట Terracotta గజలక్ష్మి ప్రతిమతో పాటు మహామాత Mother Goddess నగ్న విగ్రహములు బయల్పడినవి. ఇవి ఏలేశ్వరం, నాగార్జున కొండ, కొండాపురంలలో లభ్యమైన ప్రతిమలను పోలి ఉన్నాయి. ఒక శిశువుతో కూడిన లోహపు మహామాత విగ్రహము Bronze Seulpture క్రీ.పూ. రెండవ శతాబ్దమునకు సంబంధించినది ధూళికట్ట త్రవ్వకాలలో లభ్యమగుట విశేషం. దీనిని బట్టి సంతానోత్పత్తికై అంకధాత్రి తరహా విగ్రహముల నారాధించేవారని తెలుస్తున్నది. పెద్దబొంకూర్ త్రవ్వకాలలో ఇనుప నాగసర్ప ప్రతిమ లభించినది. వీటిని బట్టి ఆనాటి ప్రజలు గ్రామ దేవతలను, సర్పములను, వృక్షములను పూజించేవారని స్పష్టమగుచున్నది[8].

ధూళికట్ట వద్ద క్రీ.పూ. రెండవ శతాబ్దమునకు చెందిన హీనయాన శాఖ సంబంధిత బౌద్ధ స్తూపమొకటి బయల్పడినది. దీని గర్భము అందమైన 47 ఆయక శిలా ఫలకములచే అలంకరింపబడినది. ఐదు పడగల సుందరమైన ముచిలింద నాగసర్పము, బోధివృక్షము, మహాభినిష్క్రమణము మున్నగు అంశములు ఈ ఫలకములపై బహు అందంగా చెక్కబడినవి. ఈ ఫలకములు, వాటిపై గల చిత్రములు అమరావతి, నాగార్జున కొండ స్తూపముల నలంకరించిన ఫలకములను పోలిఉన్నాయి. ఆనాటి గహపతి శెట్టిలు వర్తకము చేసి బౌద్ధ స్తూపములకు విహారములకు దానములిచ్చేవారు. అలాంటి చిన్న శాసనమొకటి "గహపతినోపతాలస మత్తుయ దానమ్" యని బ్రాహ్మీలిపిలో ఇచటి ఒక ఫలకముపై చెక్కబడి యున్నది.

కరీంనగరము నుండి లక్షెటిపేటకు పోవు రహదారి కుడివైపున స్తంభంపెల్లి సమీపాన పాషిగాంవ్ గుట్టపై సూర్యరశ్మికి ప్రకాశించుచున్న ఆరు శిలాఫలకములతో చిన్న బౌద్ధ స్తూపమొకటి దర్శనమిస్తుంది. దీనికి దక్షిణమున శాతవాహనుల కాలపు పెద్దపెద్ద వెడల్పైన ఇటుకలతో బౌద్ధ భిక్షువులకై నిర్మించిన మఠము లేదా ఆరామము యొక్క చిహ్నములు నేటికినీ నిలిచి ఉన్నాయి.

శాతవాహనుల అనంతరము ఈ ప్రాంతపు చరిత్ర అంధకారంలో ఉన్నది. క్రీ.శ. 550 నుండి 750 వరకు రెండు శతాబ్దములు ఈ ప్రాంతము బాదామి చాళుక్యుల ఏలుబడిలో ఉండింది. తదనంతరం రాష్ట్రకూటులకు సమకాలీనులుగా సమాంతరంగా వేములవాడ నుండి క్రీ.శ. 750 నుండి 973 వరకు వేములవాడ చాళుక్య ప్రభువులు పాలించారు. వీరిలో రెండవ అరికేసరి (930-955) ప్రధాన పాలకుడు. ఇతని ఆస్థానమునలంకరించిన కన్నడ ఆదికవి పంప మహాకవి "విక్రమార్జున విజయము" అనే పంప భారతమును రచించాడు. క్రీ.శ. 941లో జైన తొలి తీర్థంకరుడగు ఋషభుని గురించి ఆదిపురాణమును కన్నడములో రచించాడు. అతని సోదరుడైన జినవల్లభుడు గంగాధర సమీపాన గల వృషభాద్రిపై అనగా నేటి వ్యవహార నామమైన బొమ్మలగుట్టపై త్రిభువన తిలక యను జైన బసది, కవితా గుణార్ణవ యను తటాకము, నిర్మించి మదన విలాస యను తోటను ఏర్పరిచాడు. అతడు వేయించిన క్రీ.శ. 945 శాసనములో చివరగా మూడు తెలుగు కంద పద్యములు చెక్కబడడం విశేషం. ఆదికవి నన్నయ్య రచించిన మహాభారతము కంటే ఒక శతాబ్దము పూర్వమే తెలుగు భాష కరీంనగర్ జిల్లాలో కంద పద్యములు రచించే స్థాయికి చేరుకోవడం గమనింపదగిన ప్రధానాంశం. అంతకంటే పూర్వపు పాలకులు

కన్నడ ప్రభువులు గనుక వారు కన్నడము సంస్కృత భాషలనే పోషించారు. గంగాధరలో నివసించిన మహాకవి సోమదేవ సూరి వాగరాజు కాలములో యశస్తిలక చంపువు, నీతివాక్యామృతము, శ్యాద్వదోపనిషద్ మున్నగు గ్రంథములను రచించాడు. అతడు క్రీ.శ. 959లో యశస్తిలక చంపువును పూర్తిచేసెను. అదేకాలంలో గుణాఢ్యుని బృహత్కథను సోమదేవసూరి "కథాసరిత్సాగరః" పేరుతో సంస్కృతంలోకి అనువదించాడు. ఈ జిల్లాలో దేవాలయముల నిర్మాణము గావించిన తొలి ప్రభువులు వేములవాడ చాళుక్యులే. భీమేశ్వర, నగరేశ్వర ఆలయములు ఈ జిల్లాలోని తొలి రాతి కట్టడములు. అంతకు పూర్వము ఏడు ఎనిమిది శతాబ్దములలో చెక్కబడిన నాలుగు రాతి గుహాలయములు మానేరు ఒడ్డున అడవి సోమనపెల్లిలో బయల్పడుట ఈ జిల్లా చరిత్రలో విశేషాంశము.

తదనంతరం కళ్యాణి చాళుక్యులు క్రీ.శ. 973 నుండి 1159 వరకు ఈ జిల్లా ప్రాంతముపై ఆధిపత్యము వహించిరి. వీరికాలము నుండే చెరువులు నిర్మించి వాటి సమీపాన అనేక నూతన గ్రామముల స్థాపన గావించారు. గ్రామస్థాపనకు పూర్వం ప్రతిచోట కమ్మరి, కుమ్మరి, కంసాలి, క్షురకుడు, వడ్రంగి, పురోహితుడు, సాలి, గొల్ల మున్నగు పన్నెండు మంది ఆయగార్లను ప్రప్రథమంగా నియమించి తటాకము గుడి నిర్మించి ఊర్లను రూపొందించే ఆచారము మధ్యయుగారంభము నుండే ప్రారంభమైనది. అడవులను నరికి అనేక నూతన గ్రామముల స్థాపన గావింపబడినది. సుప్రసిద్ధ కళ్యాణి చక్రవర్తి ఆరవ విక్రమాదిత్యుని మహామండలేశ్వరుడైన రాజాదిత్యుడు వేములవాడలో చెరువుకట్టపై నేడు విరాజిల్లుచున్న శ్రీ రాజరాజేశ్వర దేవాలయమును క్రీ.శ. 1083లో నిర్మించెను. క్రీ.శ. 1160 నాటికి అనుమకొండ నేలు కాకతి రుద్రేవుడు సబ్బినాడుగా పిలువబడిన ఈ జిల్లా ప్రాంతము నంతయు వశపరచుకున్నాడని క్రీ.శ. 1163 వేయి స్తంభాల గుడి శాసనము తెలుపుచున్నది. కరీంనగరము ప్రాంతమును నగునూరు రాజధానిగా పండరాజు పాలించెనని క్రీ.శ. 1112 శాసనము తెలుపుచున్నది. రుద్రదేవుని మంత్రి గంగాధరుడు నగునూరు పాలకునిగా క్రీ.శ. 1171లో వేయించిన శాసనము ప్రస్తుతము కరీంనగర్ జిల్లా కలెక్టర్ గృహావరణలో నిలిచియున్నది. పొలవాస రాజధానిగా మొదటి మేడరాజు, జగ్గదేవుడు, రెండవ మేడరాజు 1080 నుండి 1158 వరకు ఉత్తర సబ్బినాడును స్వతంత్రంగా పరిపాలించారు. గంగాధరుడే పొలవాస పాలకుడైన రెండవ మేడరాజును ఓడించి పొలాసను దగ్ధం చేశాడు. 1323లో కాకతీయుల అధికారము అంతరించగానే ముసునూరి నాయకులు పాలించిరి. ఈ ప్రాంతమును 1518 నుండి 1687 వరకు కుతుబ్‌షాహీ సుల్తాన్‌లు, 1687 నుండి 1724 వరకు మొగలులు, 1724 నుండి 1948లో జరిగిన పోలీస్‌చర్య మట్టుకు ఆసఫ్‌జాహి నవాబులు పాలించారు.

పాద పీఠికలు

1. Munn. L.Annual Report of the Archaeological Dept of H.E.H.the Nizam's Dominions 1925-1926, PP. 19-20.
2. V.V.Krishna Sastry, the proto and Early Culture of A.P. PP.11-14.
3. Journal of Andhra Historical Research Society vol .XXXII (1-4 parts) P.48.
4. V.V. Krishna sastry, op.cit, P.83.
5. Parameshwarilal Gupta, Punch Marked coins in A.P. Govt. Museum, PP.4&5.
6. Ibid, P.27.
7. M.Rama Rao, Satavahana coins fin A.P. Govt. Museum, P.9.
8. J.Ramanaiah, Temples South India, New Delhi, 1989, PP. 10&11.
9. C.Srinivasamurti, Early Andhra Art and Iconography, plates No. 14&22.
10. J Ramanaiah, The Chalukya and kakatiya Temples- A study, Delhi. 1989. P.4.

ఈ కథా సంకలనం రూపొందిన తీరు

- వనమాల చంద్రశేఖర్ M.A., LL.M.

ప్రాచీన కథా సాహిత్యంలో ప్రపంచానికి ఎంతో అందించినప్పటికి ఆధునిక కథా సాహిత్యంలో కరీంనగర్ జిల్లాప్రవేశం చాలా ఆలస్యంగా జరిగింది. అందుకు ఎన్నో చారిత్రక కారణాలున్నాయి. కరీంనగర్ జిల్లానుండి తొలికథ 1940ల్లో వెలువడింది. తొలికథ రాసిన తొలి కథకుడు జి. రాములుగారు. వీరు 1945లో రాసి ప్రచురించిన 'ఆత్మఘోష' కథతో ఈ కథా సంకలనం ప్రారంభమవుతున్నది. సంఘ సంస్కరణాభిలాష ఆనాటి సాంఘిక స్థితిగతుల్ని చిత్రించడం ఈ కథ ప్రత్యేకత. అందువల్ల ఈ జిల్లాకు సంబంధించినంత వరకు తొలి తెలుగు ప్రగతి శీల కథ ఇది. జి. రాములుగారు, డా॥ సి.నారాయణరెడ్డి యు.జి.సి. ఛైర్మన్ ప్రొఫెసర్ జి.రాంరెడ్డి, సుప్రీంకోర్టు జడ్జి బి.పి. జీవన్‌రెడ్డి గారలకు విద్య నేర్పిన గురువు కావడం విశేషం.

జి.రాములుగారి తర్వాత జిల్లాలో ప్రముఖ రచయిత జి.సురమౌళి గారు 1950లో తమ కథారచనను ప్రారంభించారు. జి.సురమౌళి గారిచ్చిన ఉత్తేజంతో సి.నా.రె. గారి సహచర్యంతో గూడూరి సీతారాంగారు (9వ తరగతి చదువుతున్న) విద్యార్థి దశ (1952) నుండే కథలు రాయడం ప్రారంభించారు 1954 లో డా॥ పి.యశోదారెడ్డి గారు ఆకాశవాణి ద్వారా ఎన్నో కథల్ని ప్రసారం చేయడం ప్రారంభించారు.

కరీంనగర్ జిల్లా ఆధునిక కథా సాహిత్యక్రమం ఒక క్రమపద్ధతిలో నిరంతరాయంగా జరగలేదు. తొలి తరం రచయితలు మలి రచయితలకు పరిచయం కాలేదు. వాళ్ళు రాయడం మానేసాక చాలా కాలానికి మలి తరం కథలు రాయడం ప్రారంభించింది. ఇటీవలి దాకా కరీంనగర్ జిల్లా కథాసాహిత్యం 1970నుండి మొదలయిందని భావించడం జరిగింది. అయినా 1973లో "మావూరు ముచ్చట్లు" పేరుతో డా॥ పి.యశోదారెడ్డి గారి మాండలిక కథల పుస్తకం వెలువడినప్పటికీ తర్వాతి తరానికి అది వెలువడినట్టు కూడా తెలియదు. డా॥ మలయశ్రీ పరిశోధనా గ్రంథం ఇలాంటి ఎన్నో విషయాల్ని వెలికితెచ్చింది.

తొలితరం కథకులు సృష్టించిన కథాసాహిత్యం అద్భుతమైనది. కరీంనగర్ జిల్లా మాండలికంలో రాసిన కథలు 1950 నుండే గోల్కొండ ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ప్రజామత, స్రవంతి, తెలుగు స్వతంత్ర వంటి ప్రముఖ పత్రికలలో ప్రచురించబడ్డాయి. ఆసక్తికరమైన విషయమేమిటంటే మొత్తం కథంతా తెలంగాణ భాషలోనే రాసినప్పటికి ఆ కథలు పాఠకుల ఆమోదం పొందాయి. సంపాదకులు ఆదరించి ప్రచురించారు. 50 ఏళ్ళ తర్వాత ఇప్పుడు మొత్తం తెలంగాణ భాషలో రాసిన కథల్ని ప్రముఖ పత్రికల్లో ప్రచురించలేని దశకు చేరుకున్నాయి. ఇది మనం భాషాపరంగా సాధించిన అభివృద్ధి.

ఈ కథా సంకలనం రూపొందించడానికి ఒక నేపథ్యం ఉంది. "జగిత్యాల ప్రాంత చరిత్ర, సంస్కృతి విశిష్ట వ్యక్తులు" గురించి ఒక సమగ్ర గ్రంథం వెలువరించాలనే ఆశయంతో ముందు ప్రారంభమైనాను. వేల ఏళ్ల సంస్కృతి చరిత్ర గురించి విస్తార అధ్యయనం అవసరమై గత ఐదేళ్ళుగా యిది వాయిదా పడుతూ వస్తున్నది. తెలుగు సాహితీ ప్రపంచంలో ఒక విశిష్ట స్థానాల్ని ఏర్పరచుకున్న ప్రముఖ రచయిత హేతువాది అయిన శ్రీ బి.ఎస్ రాములు గారు జగిత్యాలలో ఉండగా నేనెందుకు

వారి సహాయాన్ని అర్థించకూడదు అనుకున్నాను. వెంటనే విషయాన్ని చర్చించడం జరిగింది. బి.ఎస్ గారు గ్రంధ పరిశోధనా భారాన్ని తన మీద వేసుకొని కార్యరూపాన్ని ఇవ్వడం జరిగింది. త్వరలో ఈ గ్రంధం రూపుదిద్దుకోనున్నది. ఈ గ్రంధ విషయ సేకరణ కోసం వేలాదిమందిని కలవాల్సి ఉంది. వారిని కలిసినప్పుడు చిరు కానుకగా ఇవ్వడానికి ఒక కథా సంకలనం ప్రచురిస్తే బాగుంటుందనుకున్నాను. దాంతో ఆగ మేఘాల మీద కథల్ని సేకరించి కంపోజ్ కివ్వడం జరిగింది.

మొదట మేము ఇరవై కథల్ని సంకలనంగా వేయాలని అనుకున్నాము. కాని తవ్వుతున్న కొద్ది 50 మందికి పైగా కథా రచయితలు తేలారు. కాలక్షేపం కథలు కాకుండా ప్రజల గురించిన కథలే 400 కథల దాకా ఈ కొద్ది కాలంలో వచ్చాయి. ఇదొక గొప్ప విషయం. రచయితల కాలాన్ని రచనల కాలాన్ని మరియు కథల్లోని సామాజిక చరిత్ర కాలాన్ని అనుసరించి ప్రజల జీవన విధానాన్ని, సంస్కృతిని వీలయినన్ని కోణాల్లో వాటి పరిణామ క్రమంలో అర్థంచేసుకునే విధంగా ఈ సంకలనంలో ఏర్చి కూర్చాము. ఒక రచయిత రాసిన కథలు మరింత గొప్పవి ఉన్నప్పటికి సంకలనం లక్ష్యం రీత్యా పనికివచ్చే మరియు పూరించే కథల్ని ఎన్నుకొన్నాము. ఉదాహరణకు బి.ఎస్. రాములు, అల్లం రాజయ్య, డా॥ కాలువ మల్లయ్య గారలు ఎన్నో అద్భుతమైన కథలు రాసారు. దళిత జీవితం చిత్రణను పూరించేందుకు కాలువ మల్లయ్య కథల్నించి 'ఎంగిలిచేత్తో' కథను, బి.ఎస్.రాములు కథలనుండి 'స్మృతి' కథను, అల్లం రాజయ్య కథలనుండి 'అడవిమనిషి' కథను తీసుకోవడం జరిగింది.

ఈ సంకలనంలో ఒకే వస్తువు ఒకే ఇతివృత్తంతో ఒక కథకన్నా ఎక్కువ వుండకుండా రిపీట్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నాము. ఇందులో ప్రచురించిన కథలకంటే గొప్పకథలు, వైవిధ్యమున్న కథలు వారు రాసి ఉన్నప్పటికి సంకలనం సమగ్రత దృష్ట్యా అవసరమైనవి తీసికున్నాము. ఉదాహరణకు కాలక్రమం రీత్యా రెండవ భాగంలో చేరాల్సిన బి.ఎస్.రాములు, కాలువ మల్లయ్య గారల నుంచి మూడవ భాగానికి అవసరమైన కథలు తీసికొన్నాము. మూడవ భాగంలో చేరాల్సిన కె.వి. నరేందర్ నుంచి రెండవ భాగానికి అవసరమైన కథ ఎన్నిక చేశాము. ఇదివరకే సంకలానాల్లో చేరి ప్రాచుర్యం పొందిన కథల్ని వీలైన మేరకు పరిహరించి వేరే కథలు తీసుకున్నాము. పదిపేజీల లోపుండే కథలకు ఈ సంకలనాన్ని పరిమితం చేశాము.

తెలుగు, కన్నడ సాహిత్యాలకు తొలిసాహిత్యాన్ని అందించిన కరీంనగర్ జిల్లా మొదటినుండి కథా సాహిత్యంలో ప్రాధాన్యత వహిస్తూ వస్తోంది. నేటి కథకులు కుటుంబ వ్యవస్థ గూర్చి, గ్రామీణ ప్రజల్ని గూర్చి, కార్మికుల్ని కర్షకుల్ని గూర్చి కుల వృత్తుల గూర్చి దళితుల గూర్చి, అట్టడుగు వర్గాల వారి గూర్చి, స్త్రీలు, పిల్లలు, వృద్ధుల గూర్చి, విప్లవించే ప్రజల గూర్చి విశ్లేషిస్తూ కథలు రాస్తున్నారు. ఇటీవల ప్రజా జీవనంలో వస్తున్న మార్పుల్ని చిత్రించడంలో కరీంనగర్ జిల్లా రచయితలు చాలామేరకు కృతకృత్యులైనారని చెప్పవచ్చు.

రెండు ముఖ్యమైన పరిణామాల్లో కరీంనగర్ జిల్లా రచయితలే ముందుండి నాయకత్వం అందించి తెలుగు సాహిత్యాన్ని మలుపు తిప్పారు. 1972 నుండి 'బద్‌లా' విప్లవ కథలకు, 1977 నుంచి ప్రజాపోరాట విప్లవ కథలకు కరీంనగర్ జిల్లా రచయితలు చేసిన కృషి అద్వితీయమైనది. ఈ జిల్లా 1990 నుండి దళిత సాహిత్య దృక్పథానికి, గాఢతను, నూతనత్వాన్ని అందించింది. తాత్విక, సిద్ధాంతిక గ్రంథాలు వెలువడ్డమే తప్ప దళిత సాహిత్య సృష్టి లేదన్న విమర్శకు జవాబుగా బి.ఎస్. రాములు గారి సంపాదకత్వంలో 1993లో కరీంనగర్ జిల్లా దళిత పాటల పుస్తకం వెలువడింది. ఆ తరహాలో రాష్ట్రంలో అదే మొదటిది. దాని తరువాయిగా కరీంనగర్ జిల్లాదళిత కథలు సంకలనం కోసం ప్రయత్నాలు జరిగాయి. ఆ సరికి సంకలనం వేయగలిగినన్ని కథలు యిక్కడ రచయితలు రాయలేకపోయారు. కాని ఇప్పుడు ఆ లోటు తీరింది.

దళిత కథ ఒక స్పష్టమైన దృక్పథంతో ముందుకు రావడానికి ఈ జిల్లా కృషి ఎంతో ఉంది. దళిత సాహిత్య యుగకర్త అని, పోస్టు మాడర్నిస్టు తొలి తెలుగు కథకుడని ఆధునిక భారతీయ సామాజిక తత్వవేత్త అని, ప్రశంసించబడిన బి.ఎస్.రాములు గారు సామాజిక, సాహిత్య, అలంకార శాస్త్ర రంగాల్లో చేసిన కృషి అపారమైనది. కథలు రాయ నేర్పడం కోసం "కథల బడి కథా సాహిత్య అలంకార శాస్త్రం" వెలువరించారు. తెలుగు సాహిత్యానికి తనవంతు కృషిని అందించారు. కార్మిక వర్గ దృక్పథంలో భాగంగా స్త్రీవాద కోణాల్ని తొలినుండి పట్టించుకొన్న రచయితలు స్త్రీ వాదం వెలికి తెచ్చిన అంశాలతో, జీవితాన్ని విశ్లేషిస్తూ అద్భుతమైన స్త్రీ వాద కథలు రాశారు. అయితే ప్రత్యేకంగా ఒక వాదం కోసం కథ కాకుండా జీవితాన్ని చిత్రించే దృష్టితో ఇక్కడి రచయితలు, పీడిత వర్గ, పీడత కుల, స్త్రీ వాద, దళిత వాద దృక్పథాలు యిచ్చిన వెలుగును స్వీకరించి సమన్వయిస్తున్న పరిణామం, పరిణతి సాధిస్తున్నారు.

కరీంనగర్ జిల్లా కన్నా జనాభాలో వైశాల్యంలో చిన్నవైన దేశాలెన్నో ఉన్నాయి. ఈ జిల్లా ఒక దేశమైతే అన్ని రంగాల్లో సాధించాల్సిన స్వయం సమృద్ధికి నిర్దిష్ట ప్రణాళికలు అవసరమైనట్టే సాహిత్య, కళా, సాంస్కృతిక రంగాల్లోను అవసరం. ఆ దృష్ట్యా చూసినప్పుడు ఈ జిల్లా రచయితలు నిర్వర్తించాల్సిన కర్తవ్యాలు యింకా ఎన్నో మిగిలే ఉన్నాయి. కరీంనగర్ జిల్లా ప్రజల జీవితాన్ని చిత్రించే ఒక్క సినిమా యిప్పటివరకు రాలేదు. సినిమాలో, టి.వి.లో, రేడియోలో ఈ జిల్లా కథకులు, సాధించిన స్థానం అత్యల్పం.

ఈ జిల్లా రచయితల కథలు, కేంద్ర సాహిత్య అకాడమీ ద్వారా, నేషనల్ బుక్ ట్రస్టు ద్వారా ప్రచురించిన సంకలనాల్లో 1990 దాకా ఒక్క కథైనా చేరకపోవడం ఒక సాహిత్య విషాదం. అరసం గుంటూరు శాఖ ప్రచురించిన పాతకథల సంకలనాల్లో గాని, తర్వాత వెలువరించిన 'విస్మృత కథ' సంకలనంలో గాని కరీంనగర్ జిల్లాకు చెందిన ఒక్క కథైనా చేరకపోవడం విచారకరం. ఇవన్నీ కల్సి కరీంనగర్ జిల్లా కథా సాహిత్యానికి తెలుగు సాహిత్యంలో జరిగిపోయిన అన్యాయాల్ని తెలుపుతాయి.


అందువల్ల అలవోకగా ఒక చిరుకానుకగా ఒక కథా సంకలనం ప్రచురించాలన్న ఆలోచన బి.ఎస్.రాములు గారి ప్రమేయంతో గంభీర రూపం దాల్చింది. కరీంనగర్ జిల్లా తన కథా సాహిత్య సమగ్ర స్వరూపాన్ని తానే నిరూపించుకోవాల్సి ఉందనిపించింది. అందుకు వంద కథల్ని అయిదు సంకలనాలుగా ప్రచురించి నూతన సహస్రాబ్దికి విశిష్ట కానుకగా అందించాలని కథా ప్రపంచంలో అది మరో కథా సరిత్సాగరంలా విశ్వ విఖ్యాతి చెందాలనే గాఢమైన కర్తవ్య దీక్షతో ఈ మొదటి సంకలనం కథల్ని రెండు మూడు వడపోతలకు గురిచేసి పాతకొత్తల మేలు కలయికతో ఈ తుది రూపం యిచ్చాము. అయిదు కథా సంకలనాలకు సమాన సాహిత్య గౌరవం విశిష్టత సాధించడం కోసం ఎందరో ప్రముఖ రచయితలను రెండో సంకలనంలో చేర్చడం జరిగింది.

ఒక జిల్లా రచయితల కథలతో ఆ జిల్లా ప్రజల చరిత్ర, సంస్కృతి పరిణామాల్ని తెలిపే కథా సంకలనం ప్రచురించడం తెలుగులో యిదే ప్రథమం. ఈ కృషికి ప్రేరణనిచ్చి అన్నివిధాలా సూచనలతో పాటు, అండదండలిచ్చిన బి.ఎస్.రాములు గారికి ఏమివ్వగలం? వారి 50వ జన్మదిన స్వర్ణోత్సవ కానుకగా వారి రచనలే కాకుండా, జిల్లా కథలు ఇలా వెలువరించడం తెలుగు సాహిత్యంలో కొత్త సంప్రదాయం.

భారతీయ సాహిత్యాకాశంలో ధృవతారలుగా వెలుగొందే గొప్ప రచయితల కథా సంకలనాన్ని మీకందించే అవకాశం మాకు లభించినందుకు నిజంగా గర్వపడుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు సాహితీ జగత్తులో ఈ సంకలనం ఒక నమూనాగా ప్రతి జిల్లానుండి కథా సంకలనాలు రావాలని ఆశిస్తున్నాము. నూతన సహస్రాబ్ధికి అవి మనమిచ్చే వారసత్వం.

బి.ఎస్ రాములు 50 వ జన్మదిన స్వర్ణోత్సవ దృశ్యాలు

23-8-98 జగిత్యాల



కథల బతి అవిష్కరణ 4-8-98 - డా॥ సి.నారాయణ రెడ్డి, గూడూరు సీతారాం, బి.ఎస్. రాములు



బి.ఎస్. రాములు శ్యామల దంపతుల్ని సత్కరిస్తున్న మాష్టార్జీ ప్రేమల దంపతులు



బి.ఎస్. రాములు శ్యామల దంపతుల్ని సత్కరిస్తున్న ఎస్.హెచ్.వి. ప్రభాకర్ రావు, స్వర్ణలత దంపతులు



బి.ఎస్. రాములు శ్యామల దంపతుల్ని సత్కరిస్తున్న దెన్నె జగదీశ్వర్ భూలక్ష్మి దంపతులు

1

ఆత్మఘోష

– జి. రాములు

బత్తుల ఆశన్నగారి కుమారుడు వెంకటేశ్వర్లు మెట్రిక్‌లో మొదటి తరగతియందుత్తీర్ణుడై వేసవిశలవులలో ఇంటికి వచ్చెను. ఇదే శలవులలో పెండ్లి చేయవలెనని ఆశన్నగారు తలచిరి. ఇదివరకే అనుకొని ఉంచిన దాసరిసింగం గారి కూతురు నడుగుటకు కొత్తపల్లికి ప్రయాణభేరి వేసిరి. కాని నాడు వెంకటేశ్వర్లు ప్రొద్దున లేవగానే మామూలు ప్రకారం టీ త్రాగలేదు. భోజనము వేళ అయినది. స్నానము గూడ చేయడు. కొడుకుపై ప్రేమమెండు లక్ష్మికి. అరికాలికి ముల్లు నాటనీయదు. వెంటనే వెంకటేశ్వర్ల గదిలోకి ప్రవేశించి నాయనా 10 గం॥ అయిపోయినది. స్నానము చేసి భోజనానికి లేవరాదా ? అన్నది. కాని జవాబు రాలేదు. కొడుకు దగ్గరకు వెళ్ళి తండ్రీ ! చిన్నబోయిన కారణమేమి ? ఎవరితో మాటలాడక గదిలో ఒంటరిగా కూర్చున్నావు, నావద్ద దాచియుంచవలసిన విషయమా ! చెప్పవా ? అనెను. తల్లి అనిన వెంకటేశ్వర్లకు భక్తి మరియు ప్రేమ మెండు. చెప్పక తప్పదయ్యెను. అమ్మా ! నాకేలచదువు చెప్పించితిరి. చిలుకముక్కుకు జీడిగింజ అన్నట్లు ఆ తాగుబోతు ఇంట్లో పుట్టి పెరిగి నాగరికత అంటె ఏమాత్రం తెలియని ఆ పిల్లను నా మెడకు గట్టనాన్నగారు ప్రయత్నించుచున్నారు. ఆ మోటు నిరక్షర కుక్షియగు పిల్లతో ఎలాగనమ్మా నా జీవితము గడచేది అని ఏమేమో చెప్పి తానిదివరకే రాధను పెండ్లాడ నిశ్చయించుకున్నట్లు రాధను తప్ప ఇతరుల నెవరిని పెండ్లాడనను తన దృఢనిశ్చయమును తెలియజేసెను.

అది చాల చిక్కైన పనియని తెలిసి గూడ కొడుకును ఎలాగైనా అన్నము తినిపించ [illegible] "ఇందుకేనా అలిగినది నీ యిష్టము లేని పిల్లను చేస్తె మాత్రం కాపురమెట్లు జరుగగలదు. నేను [illegible] నాన్నగారితో చెప్పి నీ యిష్టప్రకారము జరుగునట్లు జేసెద"ననెను. వెంకటేశ్వర్లకు రాధ ఇంటియందున్నట్లె కన్పించినది. వెంటనే లేచి స్నానము చేసి భోజనమునకు లేచెను. దుకాణము నుండి వచ్చి ప్రయాణసన్నాహములు జరుపుకుంటున్న ఆశన్నగారిని పిలిచి లక్ష్మి జరిగిన దంతయు పూసగుచ్చినట్లు చెప్పెను. ఆశన్న ఒక నిట్టూర్పు విడిచి కర్ణాల పాపయ్యగారి కూతురుగాదు ! రాధ !! అనెను.

"ఔను అయితే మాత్రం పడిపోయినదేంటి పిల్ల చదువుకున్నది, సౌందర్యవతి మంచి తెలివితేటలు గలది" వారు మంచి గౌరవజీవనము గడుపుచున్నారు. ఆ తాగుబోతు మరియు కయ్యానికి కాలుజాపుదాసరి సింగంకంటె నాకు వీరి సంబంధమే చాల మేలనిపించు చున్నది." అని లక్ష్మి అనగా విని "వారు కులములో లేరు ఇది వరకే దాసుగారికి మన మన్న అనుగ్రహము మెండు. లేని చిక్కులు తెచ్చిపెట్టగలడు." అని ఆశన్న గారు నుడివిరి. అది విని దీనికేమి జవాబీయవలెనా అని లక్ష్మి కొంతవరకూహించి "ఏమండీ ! ఇది గాంధియుగము తక్కువ కులమేమిటి ? కులములు కూలిపోవలెనని చెప్పు మహాత్ముని వాక్కులు మొన్న 15-8 45 ఫ. గోలకొండ పత్రికలో చదివిమీరే చెప్పితిరి గదా. ఉన్న ఒక కొడుకుకు పెండ్లిలేక ఇంటియందు పడియుండుట మీాఇష్టము కావచ్చును. కాని కొడుకునలా

ఉంచి ఆనందభోగాలు అనుభవించు చుండుటకన్న ప్రపంచమును వీడుటయే మేలని నాకు తోచుచున్నది" అన్న బ్రహ్మాస్త్రమునకు బద్ధుడై ఆశన్న నాటి ప్రయాణమును కట్టిపెట్టి తెల్లవారి బస్సునెక్కి గాలిగూడ టిక్కట్టు తీసుకున్నాడు.

అప్పుడే భోజనము చేసి సావిట్లో పచారుచేస్తున్న పాపయ్యగారికి బయటఎవరో తలుపునెట్టినట్లు ధ్వని వినరాగా దర్వాజా తీసి ఆశన్నగారిని చూచి నమస్కారములు చేసిలోనికి గొనిపోయి కూర్చుండబెట్టెను. వెంటనే ఒక కప్పుపాలు తెచ్చి రాధ అతిథి చెంతనుంచిపోయెను. పాపయ్య ఆశన్నగారి వంక చూచుచు "మావాడు మీ అబ్బాయి వెంకటేశ్వర్లు క్లాసు మేట్లండి. ఎప్పుడూ మా యింటికి వస్తుంటాడు వెంకటేశ్వర్లు' అని ప్రస్తుతం వచ్చిన కారణమడుగగా చల్లకువచ్చి ముంతదాయనేలనని ఆశన్నగారు వచ్చినపనిని గూర్చి చెప్పిరి. పాపయ్యగారు తలూపుటయే తడవ వెంటనే ఇద్దరు రామమందిరములోకి వెళ్ళి మాట్లాడుకొనవలసిన విషయములను మాట్లాడుకొని అక్కడనే ఒక బ్రాహ్మణునిచే ముహూర్తము నిశ్చయింపుజేసి ఎవరి తోవవారు బట్టిరి.

25వ తేది వచ్చినది. పాపయ్యగారి ఇంటిలో వైభవముగా పెండ్లి జరుగుచున్నది. ఆశన్నగారి తరపునుండి మాత్రము కొలది మందియే ముఖ్యబాంధవులు వచ్చియుండిరి. పెండ్లి అయిన తెల్లవారే గుసగుసలు బయలుదేరినవి. దాసుగారికి దొరికినది మంచి తరుణము. వెంటనే తన ప్రచారము మొదలుపెట్టాడు. తక్కువ కులము పిల్లను చేసికొని మీ అత్తవారు కులభ్రష్టులైపోయినారు. ఇక ముందు మీరు వారితో సంబంధములు వదులుకుంటేనే గాని లేనిచో మీకు గూడ కులబందు అను నోటీసులు ఆశన్నగారి ఇద్దరు అల్లుండ్రకు అందీయనైనవి. పెండ్లికివచ్చిన ఆశన్నగారి బంధువులు గూడ వెలివేయబడిరి. ఆశన్నగారు దేనికైనను లెక్కచేయలేదు కాని తన ఇద్దరుబిడ్డలను విడిచికూర్చున్న తన తెలివిమాలిన అల్లుండ్రపై చాల కోపమువచ్చినది కాని ఏమిచేయగలడు.

కొడుకు సౌఖ్యమునకై ఇంత పనిజేసిన లక్ష్మికి ఇద్దరి బిడ్డలపండు వంటి కాపురములు చెడిపోవుట భరించరానిదైపోయెను. తన వల్లగదా యిందరికి కష్టమువచ్చినది. ఎవరితో మాట్లాడిన ఏమి మాట వినవలసి వచ్చునో యని రాధ ఎప్పుడుజూచిన చిన్నబోయి ఉండెడిది. రామచిలుక వంటి రాధను పెండ్లాడి సౌఖ్యంగా జీవనము గడుపుదమనుకొన్న వెంకటేశ్వర్లకు ఎటుజూచినను అసౌఖ్యమే కాన్పించుచుండెను. ఇంతకుముందు లీడరనిపించుకొని ప్రతి మీటింగుకు హాజరయి సంఘోన్నతికై ఉద్బోధనలు గావించెడి తన తండ్రికి ఎక్కడికి పోయిననేమి అవమానము సంభవించునో అని ఏమూలనో చేతులు జూచుక కూర్చుండవలసి వచ్చెను. బిడ్డలను చూడలేక తల్లి ఒకవైపు కృషించుచుండెను. ఎవరు ఏమందురో అను భయము రాధ ఉత్సాహము నావరించియుండెను. వెంకటేశ్వర్లకు ఇల్లు చీకటికోణముగా గాన్పించజొచ్చెను. తనవల్ల ఇద్దరి తోబుట్టువుల కాపురములు చెడుట అతని మనసుపై గూడ దెబ్బతీసినది. ఇన్ని చిక్కులలో జిక్కుకొని ఏమి చదువగలడు ? పరీక్ష కాలము సమీపించినది. అతని కండ్లు పుస్తకమువైపు ఉన్నను మనస్సు లేదాయెను. అందరితో బాటు తానుగూడ కూర్చొని పేపర్లు వ్రాశాడు కాని ఏమి వ్రాయుచున్నది తనకే అర్థముగాని స్థితిలో నుండెను. రిజల్టు కొరకు అందరు పేపర్లు ప్రతిదినము రెప్పవాల్పక చూస్తున్నారు. వెంకటేశ్వర్ల పేరుమాత్రము ఏ పేపరులో కానరాలేదు. నిరుత్సాహములో మునిగి ఒడికిపోవడమే మానేశాడు.

ఇట్లు చింతించుచు కూర్చున్న లాభము లేదు ప్రయత్నించిన గాని ఫలము లభించదు. అని వెంకటేశ్వర్లు రెండుకార్డులు కొని ఇద్దరు బావగార్లకు ఘాటుగా ఉత్తరాలు రాశాడు. కాని లాభమేమి నిరక్షరకుక్షులు ఈ నవయుగ సిద్ధాంతాలు వారికి నచ్చుతాయా ? అదియును గాక దాసు గారి "జోహుకుం

'లో మెలగేవారు. "మీ భారతనీతులు మాకేమి అర్థముగావు పో" పొమ్మని బదులు రాయించారు ఇద్దరు బావలు గూడాను. చేయునదేమి లేక ఊర్కున్నాడు వెంకటేశ్వర్లు.

ఒక దినము ముషీరుపత్రిక చదువుకొని వెంకటేశ్వర్లు రోడ్డుపై పోవుచుండగా నల్లా వద్ద నిలుచున్న ఒకావిడ మీరెవరయ్యా బాబూ అని యడిగెను. మామూలు ప్రకారము వెంకటేశ్వర్లు మేము శాలోల్లమమ్మా అన్నాడు. అట్లయిన బాబూ కొంచెము యీ బిందె ఎత్తిపోవా ! పుణ్ణెము ఉంటుంది. మేముగూడ శాలోల్లమే నాయనా అన్నది ఆ పెద్దమనిషి. పాపము బిందె చాలపెద్దగా నున్నదని భుజముపై కెత్తి వెళ్ళిపోయాడు వెంకటేశ్వర్లు. ఆవిడ ఎవరనుకున్నారు ? హకీం సాబుగారి భార్య. అప్పుడే చుట్టాలు ఇంటికి వచ్చారు. ఇంటిలో నీటిచుక్క అయినా లేదు. నల్ల బందు అయినది. చేయునదేమి లేక ఒక బిందె తీసికొని ఎదురుగా రోడ్డు మీదనున్న నల్లవద్దకు పరుగున వచ్చియుండెను.

సరస్వతీ లాడ్జిలో కూర్చున్న దాసు ఏజంటు ఒకడు ఇదంతయు కనిపెట్టి వెంటనే దాసుగారికి రిపోర్టు చేసెను. తెల్లవారే హకీం సాబ్ గారికి నోటీసు అందినది. "నిన్న నల్లవద్ద మీ ఆవిడకు నీళ్లెత్తిన వాడు ఫలాని ఆశన్నగారి కుమారుడు. వాండ్లు కులభ్రష్టులు అయినారు. వారిచేత నీళ్ళు తాగినారు. కావున తమకు గూడ అదేపదవి ప్రాప్తిరస్తు." పాపం హకీం సాబ్ గారికి ఊపిరి గూడరాలేదు. వెంటనే రిక్షాపై దాసుగారి ఇంటికిపోయెను. ఏమేమో బ్రతిమాలెను. దాసు ఏదో ఒక మంత్రము చెవిలో ఊది పంపించాడు. మరునాడే వెంకటేశ్వర్లపై దావా చేశాడు హకీం.

వెంకటేశ్వర్లు అదాతులలో హాజరయ్యి "బిందె బరువుగానున్నది లేవనెత్తిపో బాబూ అని బ్రతిమాలిన ఎత్తితిని. ఇందులో నా తప్పేమి" అని చెప్పుకొనెను. అది విని హకీం సాబు "హుజూర్ మొదలు మీరెవరండీ బాబు అన్నప్పుడు మేము శాలోల్లమని ధోకాచేశాడు. ఇందు మూలముగా మాకు కులములో తప్పువచ్చినది. మళ్ళీ కులము వచ్చుటకు వంద రూపాయిలతో ప్రాయశ్చిత్తముగా కులజులకు దావతు చేయవలసి యుంటుంది. కావున సర్కార్ ! వంద రూపాయలు యిప్పించి ధోకా చేసినందులకు వెంకటేశ్వర్లకు తగు సజాయివ్వవలెను" అని చెప్పుకొనెను. వెంటనే మునిసిఫ్‌గారు వంద రూపాయిలు హకీం గారికి ఇచ్చునట్లును ధోకాచేసినందులకు వంద రూ॥లు జురుమాన విధించి తీర్పు వినిపించిరి. పాపము కష్టసాగరములో కొట్టుకొని పోవుచున్న వెంకటేశ్వర్లకు న్యాయస్థానంలో కూడ అన్యాయమే సంభవించినది. కులములో నుంచి దీసివైచి గూడ ఈ మూఢ పిశాచాలు మమ్ము విడుచుటలేదే అనుచు ఖిన్నుడై ఇంటికేగెను.

ఇంకేమున్నది ఇంటినుండి బయటికి వచ్చుట గూడ కష్టమైపోయెను. కాలు బయటపెట్టిన ఎవరో ఒకరు "మీరు ఎవరు నాయనా? మీ కులమేమిటి?" అని పనిలేకనే అడుగుచుంటారు. చెప్పిన ఏమి సంకటము సంభవించునో అని భయము. చెప్పనిది విడువవా మూఢగ్రహాలు. ఇట్టి అవమానాలు వెంకటేశ్వర్లకు భరించరానివై పోయినవి. ఎటూ తోచక పార్కులోనికి వెళ్లి మనుష్యులకు కానరాకుండ ఒక పచ్చని పొద చాటున కూర్చుండి రెండు నిముషములేదో ఆలోచించి, దిగ్గునలేచి హకీంగారి ఇంటిత్రోవ బట్టాడు. హకీం సా॥వెంకటేశ్వర్లను కూర్చుండబెట్టి నాయనా ! మీ తండ్రి గారు మాకు గౌరవనీయులు మీరు సర్వము తెలిసినవారై ఇట్లేలచేసికొంటిరయ్యా అనెను.

వెంకటేశ్వర్లు - "హకీం సాబ్‌గారూ వంద రూపాయలు వెచ్చించిన మీకు కులము వచ్చెనుగదా ఆ పద్ధతి ఇతరులకు పట్టదా ?"

హకీం సాబ్ - "నూరు కాకున్న నూటేబదితోనైన నేను దాసు గారిని మెప్పిస్తానండి. కాని

మీరు మొదలు ఆ పాపయ్యగారి సంబంధము వదులుకోవలసివచ్చునో ఏమో"

వెంకటేశ్వర్లు - "అట్లెందుకండి పాపయ్యగారితో గూడ అట్లె జరిపింతము."

హకీం సాబ్ - "ఈ విషయము దాసుగారినే విచారించండి. ఎట్లు జేసిన పెద్ద మనిషి కనుక అతనికి చెల్లును."

ప్రతిదినము కలుగుచున్న అవమానములు వెంకటేశ్వర్లను దాసుచెంతకు గూడ లాగుకొని పోయినవి. దాసును చూడగనే నమస్కరించి కూర్చున్నాడు. వెంకటేశ్వర్లను చూచి దాసు గుడ్లెర్రజేసి తెలివిలేక కులము ఆచారములను మంటగలిపి ఇష్టమువచ్చిన వారిని ఇల్లాలుగ జేసుకొంటు మమ్ములనందరిని పంచములలో గలుపజూచినారా ? ఎక్కడ జూచినను నేనే పెద్దమనిషిని అని నాకు పోటీగా నిలబడు మీ తండ్రిగారి తెలివికి త్రుప్పుపట్టినది కాబోలు అని గద్దించెను. తన తండ్రిగారిని దూరుచున్న దాసుపై వెంకటేశ్వర్లకు పట్టరాని కోపము వచ్చినది. తన వేదాంతంలోకి దిగాడు.

వెంకటేశ్వర్లు - "ఏమయ్యా ! నూరేండ్ల పూర్వపు కాలమునాటి మనిషి వలె మాట్లాడుచున్నావు. ఇది గాంధియుగం. ఐకమత్యము కావలెనని దేశము అంటుంది. కులాలు కూలిపోవాలి అని దేశనాయకులంటున్నారు. మీరేమో క్రొత్త కులాలను సృష్టిలోకి తెస్తున్నారు. ఇ ది మీకు న్యాయము కాదు. మనకే కాదు దేశమునకు గూడ ద్రోహము చేసిన వారగుదురు."

దాసు - "ఓహో తాము కేవలము గాంధిగారి భక్తులే అయితే కులమూ కులము అని కలవరపడుచున్నారెందుకు, రాయబారాలు జరుపుచున్నారెందులకు పో ! ఆ హరిజనవాడలో ఇల్లుకట్టుకోరాదూ ? చదివిన వాడవు వాండ్లకు విద్యనేర్పుచు కాలము గడుపుకోరాదు ?"

వెం॥ "ఆ దినము రాకతప్పదు. ఆనాటికి తాము ఇంత దయతో బోధించవలసిన యవసరమే యుండదు. ప్రస్తుతం అవిద్యావంతులును, తాతలనాటి మూఢాచార పరాయణులగు ఈ లోకులచే కలుగుచున్న అవమానములు మమ్ము మళ్ళి వెనుకకు దారి బట్టించుచున్నవి."

దాసు - "చెడి చింతించిన లాభమేమి ? "

వెం॥ - "అయ్యా మీ కానూను ప్రకారమైనా నడువండి. హకీం గారిచ్చినట్లు మేముగూడ వందరూపాయలు విందిచ్చెదము."

దాసు - " సరే ఇంకేమి నూరురూపాయిలిచ్చి మీ యిష్టము వచ్చిన వారిని ఇంట్లో దెచ్చిపెట్టకొనండి. బాగానే ఉంటుంది. ఈ కాయ కొరుకుడు మాటలు విడిచిపెట్టి పాపయ్య సంబంధము వొదిలిపెట్టండి తర్వాత చూద్దాము."

వెం॥-"తర్వాత చూసేదేమిటి?పాపయ్యగారితో గూడ అదే మోస్తరు జరిపించుదాము."

దాసు - "చాలా బాగున్నది పాకీవానిని గూడ వంద పుచ్చుకొని కలుపుకోవచ్చు".

వెం॥ "పాపయ్య పాకీవాడా ?"

దాసు - "పాపయ్య గారిని పాకీవాడనుట లేదుకాని వారి తాతల నాటినుండి కులములో లేరు మొదటినుండి వారు తక్కువకులమువారుగా పరిగణింపబడుచున్నారు. ఇది మీ నాన్నగారిక మరియు నీకు తెలిసిన విషయమే కదా ?"

వెం॥ - "అయినను వారు మొదలు పద్మశాలీలేగదా సంఘ దురాచారాల వల్లనే గదా వారు వెలివేయబడినది. ఇప్పుడు కలిసిన వారు పద్మశాలీలలోనే కలువవలెనా లేదా ? మీరే చెప్పండి. అందుకనే అంటారు పద్మశాలి సంఘము అన్నిటికంటె చాల వెనుకబడి యున్నదని, ఒక కులములో పది కులాలు సృష్టించుతారని, తిని త్రాగి కులమిస్తారు అని ప్రతీతి అయిపోయినది. నిజము గూడాను. హిందువులలో చాకలి, మంగలి, తెనుగు, బోయ మున్నగునవెన్నియో సంఘములున్నవి. వారిలో అందరు సత్ప్రవర్తనులేనా ? తప్పు జేయనే చేయరా ? అట్లెన్నిటికిని కాజాలదు. తప్పు అందరు జేస్తారు. కాని వారిలో తక్కువ చాకలికులముగాని, నక్లీ మంగలివారు కాని ఉన్నారా ? వాండ్లు పద్మశాలికంటే పన్నెండు పాళ్ళు పైకి పోయినరనుటకు ఈ నిదర్శనము చాలదా ? ఇక మన సంఘములో ఈ నక్లీ, అస్లికులములుండుటకు కారణమేమి. ఇది మన సంఘమునకు తీరని కళంకము కాదా ? కులము బందు అనుట మీకు తేలిక పని అయిపోయినది. కాని, దానివల్ల ఎన్ని కష్టములు తెచ్చి పెట్టుచున్నారో ? మీకేమి తెలియును కులము బందు అయి నాలుగు దినములు ఐనదో లేదో మాకు ఇన్ని అవమానాలు ఇబ్బందులు సంభవించుచున్నవి. వేయేల నరకమే ప్రత్యక్ష మగుచున్నది. కన్నతల్లికి తెలుసు ప్రసవవేదనమన్నట్లు నాకు యిప్పుడు బోధపడుచున్నది. ఆవేరైయున్న సోదరుల దుస్థితి తప్పక మీరు ఇతర సంఘముల ననుసరిస్తూ నక్లీకుల మను కళంకపదమును తుడిచివేయుడు. దుష్టుని కడుపున పుట్టేవాడు దుష్టుడు కాకపోవునాయని పుట్టకముందే ప్రహ్లాదుని చంపప్రయత్నించిన ఇంద్రునివలె, తప్పుజేసిన వారిని దండించడమే కాక వారి సంతతిలో పుట్టబోయే వారికి గూడ సజా రాసిపెట్టుట యెక్కడిధర్మమో తెలియకున్నది. మేము మాత్రము ఎట్లో ఓర్చుకొని ఉండేవారమే. కాని అన్యాయముగా మా యిద్దరి తోబుట్టువుల కాపురము పాడు జేసితిరి. వారికై మిమ్మింతగా వేడుకోవలసి వచ్చినది. పడుచుపిల్లలను ఇంటియందుంచుకొన్న ఏ సమయమునకే యాపతి వాటిల్లునో యను భయమువలన ఇంత ప్రాధేయపడవలసి వచ్చింది."

దాసు "అయ్యా ! నీవు చదువుకొన్నవాడవు. నీ ధర్మసూచనలు మా కర్థముగావు. మేము క్రొత్తగా ఏదియు జేయుటలేదు. తాతలనాటి నుండి వచ్చే యాచారములను ఖండించే మహానుభావుడవు నేటికి పుట్టినావు. మేమంతదూరము రాలేదు. నవాబుగా రేలనో పిలిచారట, పోవలెను క్షమించండి, ఇంతకుమించి మాట్లాడునది, చేయునది ఏమిన్నిలేదు. కానయికముందు తాము మాయింటికి వచ్చుశ్రమ కోర్చుకొనుట నాకిష్టము లేదు శలవు !"

వెంకటేశ్వర్లు నిరాశజెంది ఛీ ! యెంత మూఢులు. తాతలనాటి యాఛారములలోనే కొట్టుకపోతామంటారు గాని ధర్మాధర్మముల వైపు చూడనయిన చూడరు అనుచు యిల్లు చేరుకొన్నాడు.

కొన్ని దినములు గడచినవి. ఎవరో ఒక యువకుడు ఏదోయొక నెపమున యింటికి మాటిమాటికి వచ్చుచు పోవుచుండుట కనిపెట్టి, వెంకటేశ్వర్లు తాను రాధయింటి కలాగే పోవుచుండెడువాడు గనుక విషయాన్ని వెంటనే గ్రహించాడు. తలలో మెదడు ఏమియులేకుండ ఎగిరిపోయినట్లు అయినది. ఏమి జేయవలెనా యని ఘంటలకొలది ఆలోచించాడు. తుదకు ఎటు తోచక ఆ యువకుణ్ణి సమీపించి,

"బాబూ ! నాకంతయు తెలిసినది. నీవు భయపడవలసిన యవసరము లేదు. మా చెల్లెలి నిచ్చి పెండ్లి చేయవలెనని మా కిష్టమున్నది. ఏమందువు ?" అని యడిగెను.

అందులకా యువకుడు తడబడుచున్న కంఠముతో "అబ్బే అట్లుగాదండి. ఊర్కేనే మీ యింటికి వస్తూపోతూ యుంటాను. నాకిదివరకే పెండ్లి అయినది. మేము కాపులమండీ" అని అంటూ

బయటపడ్డాడు.

వెంకటేశ్వర్లుమనసు తిరిగిపోయినది. తన అక్క సోదరి నిట్లుంచుట పనికిరాదనుకున్నాడు. తుది ప్రయత్నమని యిద్దరుబావగార్లకు మళ్ళీ ఉత్తరాలు ఇది ధర్మముగాదని ప్రబోధించుచు వ్రాశాడు. లాభమేమున్నది ? వారలిద్దరును యిదివరకే మళ్ళీ పెర్డ్లిండ్లు చేసుకొన్నారు.

వెంకటేశ్వర్లు చదికిలబడిపోయాడు. ఏమీ తోచలేదు. అంధకార మావరించినది. కోపము తలకెక్కినది. వెనుకా ముందు విచారించ లేకపోయాడు. ఇక యిట్లున్న అపకీర్తి తప్పదనుకొన్నాడు. అవమానాలు తప్పించుకొనే ఒక కొత్తమార్గము కనిపెట్టాడు. వెంటనే యొక ఇత్తెహాదుల్ ముసల్మీన్ ప్రముఖుని వద్ద హాజరయ్యాడు. తన కిస్లాంమత మిష్టము అన్నాడు.

ఇక ఆలస్యమెక్కడిది బిసుమిల్లా అనిపించారు.

ఇంటికి కబురు తెలిసినది. ఆశన్నగారు శెల్లా భుజముపై వేసుకొని ఎటో బయలుదేరి వెళ్ళిపోయారు, నేటికిని తిరిగిరాలేదు. లక్ష్మిగూడ ఆత్మహత్య తలపెట్టుకున్నది. కాని వెంకటేశ్వర్లు తల్లిచెంత కరిగి అమ్మా ! నీవు నా సుఖమునుగోరి యిన్ని కష్టముల కొడిగట్టుకొంటివి. మా సౌఖ్యమేమియు జూడక. నీ విట్లు వెళ్లుట పాడిగాదు. మా సౌఖ్యమును నీవు జూడవలయుననియే నేను యిట్లుజేసినాను. నీకిష్టము లేకున్న నీమతమును మార్చుకొనవలసిన యవసరము లేదు. అని తోడ్కొనిపోయి, తన యిద్దరు అక్కచెల్లెండ్రకు ఇస్లాంమత మిప్పించి, ఒకావిడ నొక ప్లీడరుకును. మరియొకామెనుఒక మిలిటరీ యధికారి కిచ్చి నిఖా చేయించాడు. ఇక సిఫారసుల కేమిలోటు ! మంచి ఉద్యోగమునకై పాటుబడవలసిన యవసరమే లేదు.

ఒక గొప్ప పద్మశాలి లీడరు కుమారుడు ఇస్లాంమతము స్వీకరించాడు. అను శీర్షికలతో నగరములోని పత్రికలన్నియు పేజీలకు పేజీలు నల్లగా జేయజొచ్చెను. ఆరునెలల నుండి ఎక్కడికో పోయియుండిన నరసింహము పంతులుగారు బస్సుదిగి ఇంటికిపోతూ గోడపై అంటించిన ముషీరుపై ఎడమకన్ను వేసేసరికి కుడికన్నుగూడ మూతపడినట్లయినది. గుండె ధడాల్‌మన్నది.

నేనేమో ప్రచారముచేస్తూ సంఘాన్నిపైకి తీస్తున్నానని సగర్వముగా తిరుగుచున్నాను. శుద్ధిసంస్కారసంఘనాయకుడును, ముఖ్యస్నేహితుడు నగు నాయకరావుగారి కేమని ముఖము జూపించగలను అని భయపడుచు పంతులుగారు యింటికి కూడా పోలేదు. చక్కా వెంకటేశ్వరుల బసకు చేరుకున్నాడు.

వెంకటేశ్వర్లు పంతులుగారికి నమస్కరించి కూర్చుండబెట్టెను.

పంతులుగారిని చూడగనే లక్ష్మి ఘోడున ఏడ్వసాగెను.

పంతులుగారు కన్నీరు గార్చుచు. "నాయనా ! ఇట్లేల జేసితివి ? నా కష్టమునంతయు బూడిదపాలు జేసితివి అనెను."

అది విని వెంకటేశ్వర్లు జరిగినదంతయు పూసగుచ్చినట్లు జెప్పి,

"జరిగినదేమో జరిగినది. ఇక ముందు మీరు జాగ్రత్తగా యుండి సంఘదురాచారాల వలన ప్రాప్తమానాలు అవమానముల ననుభవించుచు నలిగిపోవుచున్న సోదరులు విసిగిమమ్ముల ననుసరించకుండ కాపాడుకోండి. లేకున్న మీరు హిందూమతమునకు ద్రోహము చేసినవారగుదురు.

దాసుగారి నిరంకుశాధికారములో ఈ పని నెరవేరజాలదని నా యనుభవమునుబట్టి నొక్కి చెప్పగలను. కావున ఈసారి పద్మశాలి మహాసభ నిజాం రాష్ట్ర ఆంధ్రప్రాంతంలో జరిపి తగు ప్రచారము సలిపి తక్కువకులమువారని పిలువబడుచున్న సోదరుల నాహ్వానించి,

"అయ్యా ! నీవు మేము కుంతీసూనులమే అని కర్ణునితో పాండవులన్నట్లుగా మీరుగూడ అయ్యా ! మీరు మేము ఒకింటివారమే. మా పెద్దల దురాచారముల వలన సంభవించిన కష్టకాండను మీరింతవరకు ఓపికతో వెల్లడిస్తున్నందులకు ధన్యవాదాలు. క్షమించి యింక ముందు మా నిజసోదరులమగు మాకు చేదోడుగా నుండుడని బోధించి ఐకమత్యము మాలోగలదని ఋజువుచేయుడు. ముసలిమూకల అడ్డులను లక్ష్యపెట్టక ఇట్టి ధర్మకార్యము నొడ్డెక్కించితిరా సంఘమున కెంతయో బలము చేకూరగలదు. సంఘము నంటియున్న కళంకము నశించును. హిందూమతల్లికి మేలు జేసిన వారగుదురు, అనెను.

పంతులు - "హిందూమతల్లికి మేలు జేయుమని మాకు బోధించుచు, మీరు ద్రోహము జేయుట పాడిగాదు. మీరు మీ నిజమాతయొడిలోనికి మళ్ళీ రావలసియుండును."

వెం॥ "అదెట్లు వీలగునండి ?"

పంతులు - "వీలుగా కేమి !"

అనుచు వైశాఖ శుద్ధ షష్టి బేస్తవారమునాటి తెలంగాణపత్రిక వెంకటేశ్వర్లు ఎదుటనుంచి వరంగలులోయొక క్రైస్తవుని శుద్ధిసమాచారమును చూపించెను.

వెం॥ - "ఇద్దరు తోబుట్టువులను ఇందులో ఇరికించి నేను బయట బడుట నా కిష్టము లేదు, నా యొక్కనితో పడిపోయిన దేమి ? ఇక ముందు యిట్లు జరుగకుండునట్లు నేటినుండియే మీ కార్యక్రమమును మొదలుపెట్టండి. ఈ పనియందు తమకు జయము కలుగునట్లు నేను గూడ భగవంతుని ప్రార్థించుచుండగలను."

(ఇందలి పాత్రలన్నియు కల్పితములు)

(ప్రథమ ముద్రణ పార్థివ సం॥ జ్యేష్ట బ॥ పంచమి, తేదిన 1945లో
శ్రీ చందానారాయణ శ్రేష్టిగారి బాలా త్రిపురా సుందరి ముద్రాక్షరశాలయందు
పుస్తకంగా ముద్రింపబడియె).

* * *

2

కొత్తబాట

– డా.పి.యశోదారెడ్డి

నేను రాన్రా తమ్ముడు ! అది తరాల నాటి బాట. ఎప్పుడేసిందో ఏంకతనో ? ఈ వానలకూ వారదలకూ ఏర్లు పొంగంగ అది ఎన్ని కయ్యలు గొట్టిందో ? ఎన్ని గండ్లు పడ్డదో ? కూసుంటే నడుములిర్గె, నడిస్తే కాళ్లు బెణికెనంట వొర్రెలల్ల వొంపులల్ల పడి ఆ అందతుకుల బాట పొంటి పడి నడ్వనాశాత గాదు తండ్రీ ! అంట ఎంతజెప్పిన గని వాని సెవ్వు మీద పేను వారెనా ? నా మాట యింటెనా ? వాని పట్టు ఇడిస్తెనా ?

తుమ్మబంక అంటుకున్నట్లు ఎంటపడి 'కాదక్కా ! మనూరి కో కొత్త బాటేసినం, నీవు చూసి మెచ్చిందాక గాదు' అంట ఒకటే పట్టు, మొండిపట్టు, జిగె పట్టు, ఇదెక్కడి సొద ? వీడెక్కడి నక్షత్రకుడురా ? నాయినా ! అంట పయనమై బండి ఎక్కి, బయిలుదేరిన్న. తోవపొంటి ఊకున్నడా ? లేదు, ఉల్లాసం బట్టలేక ఒకటే చెప్పుకపోతుండడు వసదాగిన పిట్టోలె.

అక్కా ! ఇది ఈగెకాలం కాదె ! పూలకాలం, ఎన్నెల మాసం, తియ్యటి తీపుల దినం, ఏమనుకున్నవో ? ఎక్కడ జూసిన కమ్మటి వాసన, ఇన సొంపైన రోద, పండాకు రాలంగ అడివి అంత పసరాకు పోషాకులు తొడ్గి సోకులు పోతుండది. ఆ మోదుగు వనం జూడు ! పెయి అంత పుల్కరిచ్చినట్లు మొగ్గదొడికి, ఎర్రగ పూసి, కొత్తబాటకు మంగళార్తులు పడ్తున్న ముత్తైదలోలె సాళ్లు సాళ్లుగ నిలవడ్డవి. ఆ పొంటె ఉన్న మద్దుల జరవార జూడు ! ఎంత ఎత్తుకు ఎదిగినవో ? కొటారి కొమ్మలల్ల తేనెతెట్టే లన్ని పిక్కటిల్లంగ తేనెలు ఎట్ల నింపుకొన్నవో ? ఏందే ? అక్కా ! ఉల్కవు ? పల్కవు ?

అదో ! అక్కడి దిక్కు జెర నీ చెవు వారిచ్చి ఇను, ఎడవాసిన ఎదలను ఏకం జేయ పేరు పెట్టి పిలుస్తున్నట్లు ఆ కోయిల కూతలు ! అక్కా ! అదో ! ఆ కండ్లపడేదే చింతలతోపు, చింతలింకా చిగురుకోలేదు. గున్న మావిళ్ళు జూడు ! గజ్జె గాసినట్లుగాసి పొన్నకాయల సొంటి ఆడపిల్లలు పొంకంగ సింగారిచ్చుకున్నట్లు [illegible]స్తుండవి. యాపలు ఇప్పుడిప్పుడె మొగ్గలు ఇచ్చుకుంటుండవి.

అదో ! సూడు ! మాటలల్లనె మనూరి పొలిమేర రానెవచ్చె. ఎదురు కోళ్ళనాడు మొగ పెండ్లి సుట్టాలకు మర్యాదలు జేయ గుంపు గట్టినట్లు గుబుర్గ పెరిగిన ఈ వాయిలు పొదలు జూడు ! ఇవిటి ఆసరతోటి అల్లిబిల్లిగ అల్లుకున్న ఆ తీగెల మురిపెం జూడు ! అక్కాబాట పక్కల పొంటి ముసలి మాన్లన్ని గూలంగ ఎదిగి వస్తున్న కొత్త చెట్లను జూడమ్మా !

ఈ సూపుతోటే కొంచెం అటు దిక్కు నీ కన్ను వారజేయి, ఆ చెర్వు జూడు ! ఇప్పుడు నిండుగ నీల్ల సముద్రమోలె నీరు మోస్తుండది. ఈ చెర్వుకు ఆయకట్ట కట్టిన పుణ్యాన అందరికీ ఆదెరువైంది.

అవును నిజంగనె ! ఏకసిస్తుగ పాదరసం వొల్కవోసినట్లు ఈ చెర్వు ఎన్నెలకు మెరుస్తుండది.

గని, ఇల్లలుకంగనె పండుగైతాది ? ఈ పాయకుంటల కెళ్ళి పెద్ద కొర్ర మీన్లు చెంగుచెంగున దుంకుకుంట, ఎగిరి సన్న చాపలను గుట్కుగుట్కు మనుకుంట సుడిగుండాలను లేప్తనే ఉండవి. గవిన్ల గుడ్డెలు గులు చెదల పుట్టలను గోళ్లగీకి పుట్టకు పుట్ట పెరుగుల గెట్టెలను మెక్కింది జాలక, చెట్ల శికెలకు ఎగవాకి జుంటి తేనెలు ఆ పూటం జుర్రుకొన్నది సాలక, ఆ పూట కల్లుకు గట్టిన ఈత లొట్టి కోస ంఈడ్కి ఆడ్కి కాళ్లు గాలిన పిల్లులోలె ఆసువోస్తనే ఉండవి. అని, మనుసుల అనుకుంట, ఆ గుడ్డెల్గులను జూసే కంటిని అట్ల మీదిమీదికి సారిచ్చే ట్యాళ్లకు గుట్టమీద జారుడు బండల ఎన్క అల్గుదుంకె కా, చిర్తగండు ఆకాదు, అడిదే ! అప్పుడె ఈనిందో ఏమొ ? కండ్లుగానక పొట్టాపతికి గాంద్రు గాంద్రు మనుకుంట తన పొట్టన పుట్టిన తన కూనల్నే నముల్కమింగ జూస్తుండది. ఆ పక్కనే గొర్రెపోతును అమాతం మందు గుడిగెలు మింగినట్లు మింగిన తాసుపాము సీకెర చెట్టుకు తీగొలె సుట్టకున్నది. తిన్నది అరుగని పూడువాము గురిగింజ లోలె గుడ్లు మిట్కు మిట్కున మిట్కరిచ్చుకుంట సుట్టకుదురోలె సుట్టుకొని 'అతీగతీ' ఎరుగకుండ వడ్డది. ఆడాడ నక్కలు పొంచుకొని అదునుగాస్తున్న పాలిపెర గండ్లవడ్తనె ఉండది.

మరి ! మా తిక్క సన్నాసి కొత్తబాటేసినం, కొత్తదారి, కొత్త మలుపు అంటపదం బాడ్తుండేంది ? ఇదంత నాకు దెల్సిన బాటనె ! ఎన్నేండ్లనుంచో తొక్కుడు వడ్డ బాట ! ఇందుట్ల కొత్త యాడుండది ? అంట అనుకున్న గని, నా మనసు నాకు బుద్ధి చెప్పుతున్నట్లనిపిచ్చింది.

అయిన గాకున్నగని మరీ, ఇంత కరుగనితనం, ఉండగూడదు. పురాగ ఎలుతురుకు దడిగట్టినట్లు ఒక్క పచ్చరం బర్వగూడదు. యాదాన్ని మెచ్చకుండ, మరి అంటె మరి, రొమ్ముల ఎముకలు లెక్కబెడ్తనంటె ఎట్ల ? రొండు కండ్లు దెర్సి నిదానంగ లోతులు వాటిచ్చి సూడాలె, యాది కనుమరుగైన, మరుగున పడి తప్పినట్లెగద ! నాకు ఎన్నటినుండో ఎరుకున్న బాటైతే మట్కు బాగైందా ? లేదా ? బాట నడిసే కాలుకు రొంపి అంటుకోకుంటె కూసున్న కాడికి వొచ్చి కాళ్లకు రొచ్చు, తాక్తదా ? తగుల్తదా ? ఎంత చెడ్డగని, ఎంత బాగ బతికిన గని ఇంకోని ఆసరతోటి, మంది బుజాలెక్కి నడువకుండ పయినం సాగితె సాలు మనకు కావలసింది, మనం జూడవలిసిందల్ల, ఒగడు తన కాళ్లమీద తాను నిలవడడ్డదా ? లేదా ? అనేది.

ఊర చెరువు దాటినం, మత్తడి దాటినం, మోతెబరి రైతుల పసుల కొట్టాలు గొన్రనావట్టినవి, ఈ కొట్టాల్ల గడ్డివాములన్ని బిగి చెదరకుండ కుదురుగ మట్టసంగ ఉండవి. ఇంటి మొకం బట్టిన ఎడ్లు లగేస్తుండవి. మా ఊరి ఎల్లమ్మ గుడి వొచ్చింది. ఆమె పసుపు బండార్లతోటి చెక్కు చెదరకుండ ఉండది. పూజారి కిష్టమాచార్ల ఇల్లు దాటినం.

ఆ కండ్ల వడేదే ! గోపాల్రాయని భవంతి బంగుల. ఈడ్కి బండి జేరింది అంటె సూపుకు గోడ గట్టినట్లె. ఇందాక మరిసింది యాదికి వచ్చనట్లు మురిపాల వస్తువును గవుసెన్ల దాసినట్లు, ఎవరి కంట్లపడకుండ ఈ త్యాస గూడ మా తమ్మయ్య నొగల మీదికెళ్లి చెంగున దుంకి కచ్రానికి ఎర్రపర్దాలు సింగారిస్తడనుకొని నా పాపెట్ల సెదిరిన ఎంటికలు సక్కన దిద్దుకొని కొంగు నిండుగ సవరిచ్చుకున్న. ఆ సొంటి దాపురికపు పనులు యావి జరుగలేదు. అంతకొస్తె ఆడ పర్దాలు ఉన్న ఉనికి గూడ కండ్లపడలేదు. నా ప్రాణానికి కొత్తగ ఊపిరి పీల్చుకున్నట్లనిపిచ్చింది.

పెండ్లిసూపుల నాడు పిలగాణ్ణోళ్లు పెండ్లిపిల్లను గోటికొన నుండి శికెళ్ల జూసినట్లు నేను మా ఊరిని జూడవట్టిన. నాకంటి ఎదురుంగనె రచ్చకట్ట. కందెరుగని మణుసులోలె మార్చకట్ట రాగి చెట్టు రొండు ఒకదాన్నిడ్సి ఇంగోటి ఉండదన్నట్లు ఒకదానికోటి తోడంట దీటుగ నిలవడ్డవి. అదేం సిత్రమొ ?

గని ఈ సారి సూడు సూడుమంట మారచ్చకట్ట కింద అన్ని చెప్పులె కుప్పలైనవి. ఎప్పటితీర్గ, ఈ ముచ్చెలకన్న కిందై వోరగ గూసండె మణుసులు మట్కుకాన్రాలేదు. ఇదేం ముంచ్చుకొచ్చె మా ఊరికి ? ఇది కలనా ? మాయనా ? అంటనిదానిచ్చి చూసెట్యాళ్లకు వాళ్లల్ల ఒగరో ఇద్దరో రచ్చమీద కూసున్నట్లు గానొచ్చిన్రు. నా కండ్లను నాకే నమ్మ బుద్ధిగాలేదు. రొండు జేతుల బాగనల్పుకొని మళ్ల జూసిన గూడ అదే నిలుకడై నిలవడి నిజం అని తోసింది. ఓ రచ్చబండ ! ఓ రాగిచెట్టు ! ఎన్నాళ్లకెన్నాళ్లకు ఏరుతార్లు ఎచ్చు తచ్చులు మాని తోటి మనిషికి సమానంగ తావును, నీడను పంచి ఇచ్చే యోగం, బుద్ధి మీకు దక్కింది ! అని మెచ్చుకుంట సంబురాన ముందుకు సాగిన.

బండి సాగిపోతునే ఉండది. ఇంగ, గోపాల్రాయని బంగ్ల ఎంటనె ఆయిన బామ్మర్ది రంగరాయని రొండంతస్తుల గచ్చు బవంతి, ఊరంతటికి కులపెద్దనంటనెత్తి ఎత్తుకోని నిలవడ్డట్లు గానొచ్చింది. మరి ? ఎన్నడులేంది ఆ భవంతి బంకులేమొ దిగూళ్లల్ల దీపాలు ఎలుగుతలేవు, నేను జూస్తున్నది పొద్దు మాపుపూటనేగని, ప్రమిదలన్ని చమురు నిండుకోంగ దుమ్ము కొట్లాడుతుండవి. ఇల్లంతపాడు గొట్లాడినట్లు, కళ దప్పి దో అంటుండది. ఎందుకో ? అంట అనుమాన పడ్తుండంగనె మావోడు పెద్దపులిని ప్రాణంతోటి పగ్గాన ఏసిన కుశాలు తోటి,

"అక్కా ! ఇన్నాళ్లకు మనూరికి వట్టిన మిత్తి దొర్సాని అదె పెద్ద మారెమ్మ పేరు లేకుండ ఊడ్సుకపోయింది. మన ఊరోళ్లంత ఇప్పుడిప్పుడె తెలివి దెల్సి మిత్తి పూజ మీదనె మిద్దెలు మోపి శ్రీమంతుడైన రంగరాయని మీద మళ్లెవడి అయినకె పంగనామం బెట్టిన్రు. దాంతోటి ఆయిన దిమ్మ దిరిగి చెప్పుకుంటె సిగ్గువాయె, మూసుకుంటె ప్రాణం బాయెనంట ఇర్కుటాన వడి కుడ్తిల పడ్డ ఎల్కతీర్గ తండ్లాడినగని ఉపాయం దోసక పెండ్లాం పిల్లల దీస్కోని సుట్టాల మార్గం అంట రంగాపురం జేరిండు.'

ఈ రంగారాయుడు చిన్న సన్నోడు గాడే ! ఈ పసికారు రొండెర్గక నివురు గమ్మిన కొరివి తోటి నెత్తి గోక్కుంటలేరు గదా ! ఏమో ? మనుసు ఉట్టి ఊగినట్లు ఊగింది.

బండి మా పాలోండ్ల ఇండ్లకాడికెళ్లి సాగుతుండది. ఇప్పుడు మా బావ పోలీసు పటేలు పాపిరెడ్డికి సాగువాటు సరిగలేదంట సూచాయగ ఇన్న. మరి ఆయినేం పచ్చపూసగన్కనా ? రంగరాయనికి కుడీ ఎడ్మ అంతె ! సేరుకు సవశేరు 'ద్ది'. ఊళ్ల ఒకణ్ణి ఎక్కిచ్చి ఒగణ్ణి దించి ఇద్దర్ని ఎదుగనీయకుండ ఎప్పటిశిగెలు అప్పుడె గత్తరిచ్చె విద్దెలు ఈ అయ్యలకు పొత్తిళ్ల నాడె అబ్బుకొచ్చినవి. అవును గని, అనుమంతరాయుడు ? ఆయిని నోట్లనాలికె సింగోటం ? వీళ్లు మరి ? అనుకుంటున్న మాటను పసిగట్టినట్లు నా తమ్ముడు -

అక్కా ! ఆ కుటిల వాజి అనుమంతరాయుడు, కడ్పుల ఇసం నాల్కెన తీపి తోటి నగుకుంట గొర్రె దాటుమంది గొంతులకు ఉరులు దగిలిస్తుంటె నక్క తంతుల సింగోటం ఉన్నది లేంది దప్తరంల ఎక్కిస్తుండె. ఇంగ ఇప్పుడు కండ్లు దెర్సిన జనం వాళ్ల కన్న రొండాకులు ఎక్కువ జదివినట్లు ఆ తంత్రాలన్ని పురుట్లనె పుట్కుమనిపిస్తుండరు. లేకుంటె ఏందంట ? ఎన్నాళ్ళంట వీళ్ల చెప్పుకింది తేళ్లతీర్గ అణిగి మణిగి ఉంటరు ? సన్నకారు మంది అంత ఇప్పుడు అయిందానికి కానిదానికి కయ్యాలకు దిగి కుస్తీపట్లు పట్టి నెత్తురు కండ్ల జూస్కోని పంచాయితల పడి ఆ పంచాయితిదార్లకు అప్పు సప్పు జేసి దండుగలు గట్టుకంలేదు. ఏ వాడన పంచాయితి ఆ వాడనె తీర్పులు జరుగుతుండవి. అక్కా ! ఇన్నాళ్ల తీరుగ అర్ధమ్మ రాత్రిర్లు దొంగతనాలు లేవు. సేండ్ల దోపిళ్లు లేవు, పరిక్కంపలు లేవు. లాగుల తొండలు లేవు. ముంతపొగలు లేవు. ఈపు ముద్దెర్లు లేవు. బండ బర్వులు లేవు, ఆడుక్క తిండ్లు లేవు, మంది...

బండి మా ఇంటిదిక్కు మూలమల్పు దిరిగింది. ఆడ మా పెదమామ ఇంటిపొంటి ఉన్న గుడిసెల్లి ఇండ్లల్ల దీపాలు ఎలిగినట్లు నలుగురు మణుసులు మెసిల్నట్లు జళజళ గలగల సప్పుడు ఇనిపిచ్చింది. ఇదేందిరా ? అన్నట్లు మా తమ్ముణి దిక్కుజూసిన, ఎంటనె మా హాజిర్ జవాబు ఎక్కళ్ళేని ఉల్లాసం తోటి బుజాన ఏసుకున్న దస్తు రుమాలు జాడిచ్చి దులుపు కుంట అక్కా ! ఇది మన మ్యాన పల్లకీ లుండె పాత పొత్తులిల్లు, జనం మెదులక బండజింకలు జేరి అబ్బో అన్నట్లుంటుండె, అది ఇప్పుడు మనూరికి రాత్రి బడి ఐంది. మేమంత గలిసి ఈ ఊళ్ల ఎవరి పెండ్లిళ్లైనగని, వాళ్ళెంత మోతెబరి కర్ణప్పటేండ్లైన, వాండ్ల పెండ్లిండ్లకు మణుసులు మోసే మ్యానా పల్లకీలు రాగూడదు. సంబురానికి మెరిమెణ జేసి పగటి దీపాలెలిగిచ్చి ఊరంత మెరిచ్చిన మెరియ్యాని గని పల్లకీల ఊరేగింపులు తీసె మగ్దూరు లేదు అంట కట్టడి జేసినం. ఇంత మన పెత్తాత కండ్లు నిప్పుకలు సెరుగంగ, చేసేది లేక తామసం ఆపుకోని పణ మీది చెముటలు చిన్న పంచెతోటి తుడ్సుకుంట బస్సుబుస్సు మంటుండంగ మేమంత ఈ పాత సవారీలను బద్దురంగ గుమ్మలింట్ల అలంకారాలోలె యాళ్లాడగట్టినం.

బండి మా ఇంటి కమాను ముంగల ఆగింది. గజ్జెల సప్పుడు ఇని ఆ సుట్టు పక్కల పిల్లలంత ఉరుక్కుంటొచ్చి సుట్టు జుట్టుకున్నరు. ఈ పిల్లలు ఇన్నాళ్ల తీర్గ ఈసురుమంట లేరు, ఇప్పుడు సీమిడి ముక్కులు లేవు, వోరగాళ్లు లేవు, ఊడ్సుకండ్లు లేవు, పిల్లలందరు దోసపండ్లోలె, ఉంకు చెండ్లోలె, కళకళలాడ్తుండరు.

బండి దిగి బంకులు దాటి ఇంట్లకు నడ్సిన. అలువాటు సొప్పున బాయి కాడి గచ్చుల్లకు నడ్సిన. ఆడ ఎప్పటి తీర్గకండ్లు బయట బంకుల్లకు సారిచ్చి, ఓ చేత సెంబు, ఓ చేయి నడుమున వెట్టి వొయ్యారంగ వోనమాలి నిలవడిలేదు. వొనమాలమ్మ ఇప్పుడు మా పెద్దత్త పక్కన దేవుణింటి ముందల గూసుండి వొత్తులు పేనుతుండది. ఇది కలనా ? నిజమా ? అంట డింగై అక్కడిక్కడ జూస్తుండంగనె 'అక్కా ! అంట విల్సుకుంటొచ్చి కుసుమ నాకు నీల్ల చెంబు అందిచ్చింది. ఒక్కసారి అమాతం నా చేతులున్న చెంబు జారినంత పనైంది, గని అనుకోకుండ నా రొండు చేతులు మా పాలేరు రాజని బిడ్డ కుసుమ (దానికి ఆ పేరు పెట్టింది నేనే) దిక్కుసాగినవి. అది నా ఎదకొచ్చి ఆనింది. అన్ని కండ్లు ఒక దిక్కే సూడవట్టినవి. ఎవ్వరు కదులలేదు. ఎవ్వరినోట మాట పెకులలేదు. మాబాయి దగ్గెరున్న తరాల నాటి కారు మల్లె మొద్దు అనుకోకుండ మళ్లా ఈ నాటికి సిగురేసి సిగ్గారి తీర్గవన్నెలు వడ్తుండది. ఇంతట్ల కె మా తమ్ముడొచ్చి ముసిముసి నగుకుంట బాయికాడి కమాను స్తంభానికి ఆని నిలవడ్డడు. ఇల్లంత ఎన్నెలలు కురిసినట్లునిపిచ్చింది.

అవును ఇది కొత్తబాటనె ! ఇంతకంటె కొత్తబాట, మంచిబాట ఇంగెట్లుంటది ? యాడుంటది. బాట ఏసేటోళ్లు ఏస్తుంటె, నడ్సెటోళ్లు నడుస్తుండాలెగని, పాపం ఆ బాట వొల్లనంటదా ? వొదుగనంటదా నల్గురు పల్కిందె మాట, నల్గురు మెచ్చిందే నడుత, నల్గురు నడిసిందె బాట.

(కథా చరిత్ర (1989) - డా॥ పి. యశోదారెడ్డి గారి పుస్తకం నుండి)

* * *

3

అంగుడు పొద్దు

-జి. సురమౌళి

"ఏమోయ్ మల్లయ్యా పట్నం బోయినవేమొ? ఎప్పుడస్తివి? ఏమేం జూసచ్చినవు? మీ సబలెట్ల జరిగె గింత జెప్పవ్?" పనిదీరి కూకున్న పటేలు మల్లయ్య నడిగిండు.

"ఏం జెప్పమంటవ్ పటేలయా, మా పెద్ద సబ జెప్పింరు. అబ్బ ఏం జనం ఏం జనం? ఓ పెద్ద తీరుతమోలె ఉన్నదనుకో"

"ఎంతసేపాయె నువ్వచ్చి, బుక్కెడంత సల్లపడే వత్తన్నవా?"

"ఇంటికోయి సల్లవడే వత్తాన్న బుక్కెడు, గింతగ్గిపుల్లుంటిత్తారు సుట్టేసుకుంట"

పటేలయ్య అగ్గిపుల్ల యియ్యంగనే సుట్టమీద అగ్గివెట్టుకొని, మోకాల్లకు రుమాలు జుట్టుక కచ్చీర్లకూకున్న మల్లయ్య సుట్టదాక్కుంట చెప్పుతాండు, తాను పట్నంల జూసివచ్చిన పెద్ద సబ సంగతి.

"నాలుగు రోజుల ముందుగనే నేనీ ఊల్లకెల్లి ఎల్లిపోయిన్నా? నా అసుంటోల్లు ఓ యాభైమం దచ్చింరు... మేమందరం గలిసో రెండెకరాల మైదానం సాపుజేసుట్ల దలిగినం. అన్లున్న మున్లు పల్లేరుగాయలు ఏరి, గడ్డిజెక్కి, ఊడ్చి ఆ మైదాన్ల ఓ పెద్ద పందిరేసినం.

పెద్దపెద్ద బొమ్మలు పటాలు పరదాలు గట్టి సర్గమోలిగె జేసిన మా మైదానాన్ని. ఇంతకు ముందాడ పందులు మేసేటియి. పందిర్లేసిన మోలె బంగలాల్లగూడ అంత సుకముండ దనిపించింది. సర్గమే అనుకో. రాత్రనక పగలనక, యాల్లపూట నిద్దర్లేక యాల్లక్కూడులేక పనిజేత్తే రేపు సబనంగ అన్ని తయారయిపోయినయి. ఆనాడు మాత్రం కంటికి కూరుకు రానిచ్చింరా? ఆగుల పంటుర్కి పర్రెల్దీయ మనిరి. ఎండకాలమాయె. అచ్చెటోల్లందరికి నీల్లెట్ల? ఇంజనపెట్టి పంపుల్లోని పర్రెల్లనుంచి పాకల్లకు నీల్లు దెస్తిమి. ఇగ సబనాడు ఆ పందిట్ల కూకుండి అల్లుజెప్పే మంచిమాటలేమన్న ఇందామంటె సాగనిచ్చింరా? అచ్చిన పెద్దపెద్ద దొరలు ఆగల్లకెల్లి పంపుల్లచ్చిన ఉడుకునీల్లు దాగెటోల్లు గాకపోయిరి. పెద్దపెద్ద కొత్త కడవలు దెచ్చి నీల్లునింపి పెట్టినం. ఓ నూరు కొత్త కడవలు నింపుదుం రోజు తెల్లారంగనె. ఇగ సబ మొదలయితదనంగ మాత్రం మమ్మొల్నందర్ని పనిటిసిపెట్టి ఆల్లతోని రమ్మన్నరు: ఊరవతలిదాంక మేమూ ఊల్లున్నోల్లు, ఆందరంగలిసి పోయినం. ఆయిన పేరేందో ఆ పెద్ద దొరచ్చిండు. ఆనాడు మన కచ్చీర్ల కాయిదం గొట్టలే? ఆ కాయిదంల ఉన్న దొర. ఆయిన్ని పందిట్లదాంక 'జై' 'జై' అనుకుంట దెచ్చినం. పందిట్లకాయినె అడుగుపెట్టంగనె మమ్ములను దోలుకొని అంటకాడికి దీసుకపోయిరి. ఆడ నీల్లు నింపుడు, ఇత్తార్లేసుడు, ఊడ్చుడు దీంతోనె సరిపాయె. ఒక్కమాట సబల జెప్పిందింటె ఒట్టు. రోజు ఎంతమంది దింటాండ్లా ఏమొ? అంతమంది యాడ్నుంచి అచ్చింరో ఏమొ? ఒక్కొక్క బంతికి మున్నూరుమందిదాంక లేత్తాండిరి. అసుంటియి పూటకు ఇరువయి బంతుల్లేపేటియి. బంతిక

కూకుండగనే ఇత్తార్లేసుడు; ఆల్లందరికీ నీల్లువోసుడు, అల్లు లేవంగనే ఆ ఇత్తార్లు దీసుడు. మల్లా ఇంకొగబంతి. ఇట్ల ఇరువయి బంతుల్లేసేటాల్లకు పొద్దంగు. మేం బుక్కెడు దిని లేస్తుం. సుట్ట ఓ బుక్క తాగుతుమో లేదొ మల్ల మొదటి బంతోల్లు ఇంకో పూటకు తయారవుదురు. ఇగెప్పుడు దీరాలె. అందరు రెండుపూటలు తినెటాల్లకు నాత్తిరి రెండు జాములౌ. ఇట్ల సబ జరిగిన మూడురోజులు పెద్దపెద్ద దొరలచ్చి మంచి మంచి మాటలు జెప్పుతాంరనేగాని, ఒక్క మాటిన్న పాపాన పోలేదు. అన్నందుకు ఆకరునాడు. అదేం సబనో రెండు జాముల్నాతిరికి మొదలుపెట్టింరు. ఆ నాత్తిరి వోదామన్నా పందిట్లకు పోనియ్యకపోయిరి. కట్టెపట్టుకొని ఎవడో సోపలకుపోయె పోరగాడు అడ్డగిచ్చె. లోపలికెల్లి ఎవరో ఉరికచ్చి నన్నాడజూసి, బల్లమీద జంపుకానాలు దులుపాల్నని నన్ను దోలుకపాయె. న్యాలమొ అన్యాలమొ జంపుకానాలు దులుపవోయినోన్ని ఇగాన్నే కూకున్న. మొట్టమొదలు ఎవలో ఒకాయినె, కన్ల కద్దాలు బెట్టుకున్నడు, హరిదాసోలిగె శెల్లాగప్పుకున్నడు; లేసి పుత్తకాలు రాసేటోల్లకని ఏమేమొ జెప్పిండు. పుత్తకాలల్ల దరిద్రుల కతలుండాల్నట. ఎవడు జదువతడు పటేలా? మరి మాకేమొ సదువే రాకపోయె. సదువచ్చినోల్లేమొ దరిద్రులు గాకపోయిరి. అయినా ఆయినె పుత్తకాలు రాసెటోల్లకు జెప్పిండు, ఇని ఆల్లు సప్పట్లుగొట్టింరు. నడుమ నాకెందుకు, ఆ మాటజెప్పి ఆయినె గూకుండగనె ఇగ పాటలు జదువుడు మొదలు పెట్టింరు. సుక్క వొడిసె దాంకా దెగలేదు. ఒక్కొక్కలే వత్తరు. ఒకటో రెండో పాటలో పద్దాలో జదువుతరు. దిగుతరు. దిగినోడు మల్ల ఎక్కడు. ఇట్ల తెల్లారగట్లదాక జదివినోడు మల్ల జదువకుండ జదివింరె పాటలు. నాత్తిరాయె ఏం పనిలేక పాయెనని పోయికూకున్న. తపుల, తాలం, ఆర్మోని, మద్దెల ఏది లేకుండగనె జదువుతాంరు. ఒగలో రాగంల జదివితె ఇంకోలింకో రాగంల జదివిరి. అయ్యన్ని ఆల్లుగట్టిన కయిత్తాలట. అయితే రాగంలేకుండ జదువాన్నా? మనూరు పొట్టిలింగడు కయిత్తం గడితె ఏం కమ్మగ జదువుతడు. తాళం లేకపోతే మానాయె. చేతులున్నయి గదా? చప్పట్లు గొడితె అరిగిపోతాయి? పాటంత అయిపోయినాంక అందరు గొడ్తరేమె చప్పట్లు? తాలం గలిసెటట్లు ఆల్లకు గొట్టరాదా?" ఎరుకలేని మల్లయ్య పటేలయ్య కేమన్న ఎరుకనేమొ అని అడిగిండు.

"కాదోయి పిచ్చిమల్లయ్య, అంతయి పోయిన మోలిగె చప్పట్లు గొడితె, అల్లు చదివింది మంచిగున్నదన్నట్లు". పట్నంపోయిన మల్లయ్యకు తెలువ జెప్పిండు పల్లెటూరి పటేలు. "గట్లనా?మరె అన్నిటికి గట్లనె కొట్టింరు, అన్ని మంచిగున్నయనేనా? ఏమొ అల్లుగొట్టిన కొద్ది నేనుగొట్టిన. దొమ్మరాట జూడంగ గొట్టినట్టు. తెల్లారగట్లదాక అట్లనే పాటలినుకుంటగూకున్న. ఇగ తెల్లారినమోలె అందరు ఎల్లిపోతాంరు. అందరికి బిస్తర్లు కట్టాలె. అల్ల బిస్తర్లన్ని లారీలల్లనింపి అల్లందరిని రేసనకు సాగదోలెదాంక నిద్దురవోలె. ఆల్లందరెల్లిపోంగనె ఆనాడు నాత్తిరిదాక పందిల్లుచ్చుట బెట్టింరు. ఒక్కపూటల అంతిచ్చిపెట్టినం. నాలుగు రోజులు కట్టపడి తయారుజేసిన పందిరి ఇచ్చుటకు దప్ప మాకెందకక్కరికచ్చినట్టు?" మల్లయ్యడిగిన ఈ పెద్దప్రశ్న, "వేడుక బొమ్మరిండ్లిసుకలో బాగొప్ప నిర్మించి' పటేలయ్య నీ పద్దెం జదివెటట్టు జేసింది. "ఏదో మనకోసం రజాకారోల్లను ఎదుర్కొని రాజ్జం సంపాయించిపెట్టి సబలు జేసుకుంటున్న పెద్దపెద్దగ సదువుకున్నోల్లకు మేం జేయగల్గినంత రెక్కలకట్టం జేత్తనే ఉన్నం. పనంత అయిపోయినమోలె నాలుగు జొన్న రొట్టెలు సద్దిగట్టిచ్చి సాగదోలింరు?" మల్లయ్య జెప్పిన సబ సంగతి పటేలయ్య బాగానే ఇన్నడు. కాని పటేలయ్య యినాలనుకున్నది, సబల జెప్పిన మాటల సంగతి, అది మల్లయ్య కేమెరుక? ఇంతలకె "ఏం పంతులుగారూ? అంతా బాగేనా?" అనుకుంటచ్చిండు ఆ వూరి అయ్యోరెంకయ్య. అయ్యోరెంకయ్యగూడ సబజూడవోయిండు పట్నం. మల్లయ్యంత ముందుగ పోలేదుగని, మల్లయ్యకంటె ముందుగనె వచ్చిండు. "ఎంకయ్య పంతుల్తోటి ఇయ్యాల్రేపు మాటే బంగారమై పోయింది మల్లయ్యా, పట్నాలకు పోతాండు సబలల్లదిరుగుతాండు. మన సంగతే మరచిపోతాండు". పటేలయ్య తాను ఎంకయ్య పంతులు కిచ్చిన దానాలన్ని

యాదికచ్చెటట్టున్నడు. "మీరుగూడా అలాగే అంటెట్ల పటేలుగారూ? మీ నీడన్నే మేం బతుకులు వెళ్ళబోసుకుంటు ఉంటిమి. మీరేంది మల్లయ్య ఏంది? మీరందరి క్షేమము మా బతుకు. మిమ్ములను మరచిపోతె ఎట్ల? నక్కవినయం జూపిచ్చుకుంటున్నరు అయ్యోరు. "ఏదో అట్లన్నగని, పట్నం సబకువోతివి సంగతులు జెప్పవు, మల్లయ్య నడుగుతె ఇంతసేపు ఏమేమో జెప్పిండు. ఆల్లు జెప్పిన మాటలు ఒక్కటి జెప్పలేదు". కోరికదీరని పటేలు ఎంకయ్య నడిగిండీమాటు.

"ఐతె అయ్యగారూ మీరుగూ డచ్చినారుంగ్రని పట్నం సబలకు?" ఊరోడు వచ్చి కలువకుండ పోతడా అనుకునే మల్లయ్య అడిగిండు. "ఆ ఆ నిన్నుగూడ జూచిన, నువ్వు నాకు మాకనుపడ్డవు. నువ్వే నన్ను జూళ్లేదు". అయ్యగారు మల్లయ్య మీదనే తప్పంత మోపాల్నని జూసిండు. "నేను సూడకుంటె సూడకపోతి, సూసినోల్లు మీరన్న పిలుత్తె మాట్లాడకపోదునా?" మల్లయ్యడిగిన సవాలుకు అయ్యోరెంకయ్య దగ్గర జవాబు లేదు. అయ్యోరెంకయ్య పాపం పట్నంల మల్లయ్యను మాట్లాడియ్యాలని మా అనుకున్నడు. కాని తనచుట్టున్న సోపతిగాన్లు నల్లబట్టలతోనున్న మల్లయ్యతోని మాట్లాడుతాంటే జూసి నవ్వుతరేమొ ననిపిచ్చి ఊరుకున్నడు. ఆ సంగతి మల్లయ్యకు జెప్పటానికి ఎంకయ్యకు నోరెట్లస్తది? ఎంకయ్య జవాబియ్యక పోయెటాల్లకు మల్లయ్యకు గొంత అనుమానమే అయింది. తనను తనూరి ఎంకయ్యనే చిన్నచూపు జూసిండనుకునెటాల్లకు మల్లయ్య కాడుండ బుద్దిగాలె. పొద్దంగుతంది. మల్లయ్యకు ఇంట్ల నాగండ్లు గట్ట జూసుకోవాలె. ఈడుంటె ఇగ ఎంకయ్య జెప్పే సంగతి ఇనాలె. పట్నం వేటికోసం బోయిండో ఆ సబల సంగతే. ఆడికిబోయినా అందని సబల సంగతి మల్లయ్య కీడెందుకు?

మల్లయ్య ఆన్నుంచెల్లిపోయిండు. పొద్దు అంగుతుంది తల్లి కడుపులకు ఎజ్జివడుకుంట.

(వట్టి కోట ఆళ్వారు స్వామి సంపాదకత్వంలో 1954 లో వెలువడిన "పరిసరాలు.. 1" - కథల సంకలనం నుండి)

✱ ✱ ✱

4

మారాజు

- గూడూరి సీతారాం

రంగడు బొంబాయికో యచ్చిండు. ఆడెప్పుడో బొంబాయిదాకా యెళ్ళకుంట ఉండడని చానామంది అనుకున్నరు. యెర్రి బాగులోడు - ఆ పిచ్చోడు బొంబాయి దాకా ఒక్కడే యెట్లా యెళ్ళిండా అనే తర్కాల పడ్డరు. గా నుడుమ అదేదో పెద్ద సోపాల సదువంతా సదువుకున్న దొరగారి పిల్లగాడు లష్కర్ బోయిండట. పాపం ఆయన సదువుకున్నోడే కాని పట్నం గిట్నం ఎన్నడూ తిరగలేదట. పొంగ సోపతిగాళ్ళుగా ఇంటికి పోవాల్నని పత్తా జెప్పింద్రంట. ఉట్టి నోటి మాట్నే సెప్పలేదట. ఓ కాయితం మీద రాసి కీసల వెట్టింద్రట. ఇగ ఆయన రైలెక్కిండు. అనుకున్న దగ్గర్నే దిగిండు.ఆ టేషన్ దాటంగనే పెద్ద సముద్రంల పడ్డట్టైంది. ఎటు వోవాల్నో దోసలేదు. రిక్ష బండ్లు, జట్కా బండ్లు ఇగ ఎన్నెన్నో కనిపించినయ్. రిక్షలోల్లు ఈయన సుట్టూ ఈగలోల్నె ముసురుకొని సేతులున్న సంచిని గుంజుకునుడు మొదలుపెట్టింద్రట. ఆ గడబిడల సేతుల రాసుకున్నది జేబుల కాయిదం ఉన్నది యాదికే రాలేదట. రాత్రికి రాత్రంతా యాష్ట కచ్చెదాకా తిరిగిండట. ఇగ తెల్లారినంక యాదికచ్చిందట. జేబుల కాయిదం, గంత సదువుకున్నోడే గట్ల కష్టపడితే ఇగ రంగని మాట సెప్పాల్నా!

అయ్య చచ్చిపోయినాంక రంగడే ఇంటికి యజమానైంటు. ఆనయ్య గప్పుడే సత్తడని యెవ్వళూఅనుకోలే. ఏదో మారసొంటిదచ్చింది. మూడు రోజులున్నడు. నాలుగోనాడు రంగనికి పెత్తనమచ్చింది. రంగడు అయ్య వోతే ఏడ్సిండో, నవ్విండో యెవ్వలకూ సరిగ్గా తెల్వదు. గానీ అయ్యాళ్ల కాటికి నిప్పంటించి బొళ్లున గుండంతా సెరువు జేసుకుని యేడ్సిండు. నెలరెన్నెళ్లు సంసారోలే బాకీలు వసూలు జేసుడు మొదలుపెట్టిండు. మొగుడువోయిన పికరులున్న రంగని తల్లి ఈని పన్లు జూసి కొంచెమంత అటీటు కూసుంది. ఇగ కొడుకు మంచోడైండని సంబరంలపడ్డది, రంగని తల్లి.

ఆనాడు రంగనితల్లి పొరుగూరికి ఏందో పనుండంగవోయింది. రంగడు గిదే మంచియాల్ల అనుకున్నడు. అయింత అవ్వ పెట్లార్ల దాసిన రూపాయలను ఎత్తుకొని అక్కింటికివోయి వత్తనని పెండ్లాముకు జెప్పి యెల్లిండు. రంగని పెండ్లాం నిజమేనని యెడ్డిదానోలె తలకాయ ఊపింది. రంగనితల్లి మూడుర్రోజుల్దాక ఎదిరిజూసింది. ఆరం రోజులైనా రంగని పత్తా మాసుకంతైనా తెల్వలేదు. ఇగ ఆఖరికి ఆని తల్లి, బిడ్డింటికివోయి అరుసుకుంది. ఆడొచ్చిన తెల్లారే ఇంటికి వోతనని యెల్లిపోయిండని బిడ్డ జెప్పింది. తల్లి గుండెల రాయివడ్డట్టైంది. నయమైనడనుకున్న కొడుకు మర్లా ఎల్లిపోయిండనంగనే తల్లి కడుపు సెరువైంది. రంగడు వోయినాడంటే ఏమనియ్యలే. కాని ఆడెక్కడ రైల్నుజూసి జడుసుకుని పడిపోయిండో అని తల్లి మనసు తల్లడిల్లిపోయింది.

రంగడు రైలుమీన వోయిండనంగనే, యాడాదికింద సిన్నాయిన్న కొడుకుతోని రంగడు బొంబాయి వస్తనని టేషన్‌కు వోతే, రైలు రాంగానే పిచ్చోనోలె కిందపడ్డట్టు యాదికచ్చింది రంగని తల్లికి. గంత గనం జడుసుకునే పోరడు సోపతిలేకుండ ఎట్లవోయిండోనని తల్లి పాణం గిలగిల తన్నుకున్నది.

ఇగ ఆని తల్లి ఇంటికచ్చి మంచం పట్టింది. కోడలిపోరి అంతకన్న ముందుగాల్నే సెప్పక సెయ్యక తల్లిగారింటి మొకాన ఎల్లిపోయింది.

రంగడు అక్కింటికాన్నుంచి సక్కంగా టేషన్ వోయిండు. అక్కడెవలన్న గురుతువడ్తరని బుజానేసుకున్న పంచె నెత్తిమీదకెళ్లి కప్పుకున్నడు. ఇగ రైలత్తదనంగా బంబాయికి టికటు కటాయించిండు. కట్టమీదికెళ్లి రైలత్తందనంగా రంగని పాణం ఆకాసానికి ముట్టింది. పక్కకున్నోన్ని యాడికి వోతవని పాణం అరసేతుల పెట్టుకొని అడిగితే ఆడేదో సెప్పిండు. ఇగ సప్పుడు సెయ్యకుండ కండ్లు మూసుకొని నిల్చుండు. కీ... అని కీకవెట్టింది రైలు. రంగడు గజ్జమన్నడు. గుండె దడదడ కొట్టుకున్నది. కాళ్లు సేతులు గజగజ వణుకుడు మొదలు వెట్టినయ్. పెయ్యంత ముచ్చెమటలు వోసినయ్. హటో... హటో... అనుకుంటా పోలీసోడొచ్చిండు. అవ్వనాన్నోయ్ అనుకుంట రంగడొక్క దుంకు దుంకిండు. చెంప చెడిల్లుమన్నది. ఆడు మంటా మంటా అనుకుంటా మొత్తుకుండు. రైలు కీ... అని కూత వెట్టింది. ఆడు కండ్లు సగం తెరిసిండు. ఇసిత్రం రంగడు కాళ్లతోని నడువకుండానే ముందుకోతుండు. రైలు చటాచటా వోతుంది. గప్పుడు, రంగడెంత పరిశానైండు. సుట్టూ చూసిండు. బాగా మందికూసున్నరు. నిలుసున్నరు. ఇగ పాణం దక్కింది. పికరు లేదనుకున్నడు. మీదేసుకున్న పంచెకోసం దేవులాడిండు. గంత మందిల యెక్కడ వడ్డదో, దొరకకనే పాయె పాపం!

ఉసూరుమంటూ గంతమంచి సెల్లవాయె అని యిసారపడుతూ, మొలకు వెట్టుకున్న రూపాయల్ని జూసుకున్నడు. తెల్లారింది. రంగడు నెలుసుండె నిదురపోయిండు. ఆడెప్పుడూ గంతే. మొద్దునిదుర. పెంటల పన్న నిదురపత్తదానికి. గప్పుడు సుట్టూ సానామంది కన్పియ్యలే. ఇగ అక్కన్నుంచి వోయి వో మూలకు సతికినట్టు కూసున్నడు.

బంబాయి ఎట్లున్నదో? ఎక్కడ దిగాల్నో?

చెంచల్‌గూడకు ఎట్లవోవాల్నో? దిగంగానే దగ్గరున్న రూపాయల్ను ఎట్ల దాసుకోవాల్నో అని ఆలోచన్ల పడ్డడు.

బంబాయిల దిగే యాళ్లకన్నా ఎవడన్న సోపతికాడు కలువకపోతడా అనుకున్నడు రంగడు. కాని ఆనికి ఒక్కడన్నా చెంచల్‌గూడకు వోయె సోపతిగాడు కనిపియ్యలే. ఇగ ఏం చేయాల్నని ఇచారంల వడ్డడు. పెద్దల్ను చంపుకున్నంత ఏడ్పొచ్చింది. వూర్కెనన్న ఉన్నూరు యిడిసిపెట్టి పరాయి రాజ్యంల కస్తినని బెంగటిల్లిండు. ఆలోచన్లనే దయ్యాలోలే వొర్రే చొంగులు.. యెన్క అన్నగాడన్నమాట లేవోవే యాది కచ్చినయి. ఆని తలకాయ గిర్రున తిరిగినట్టైంది. గిట్ల రంగడు ఏమేమొ అనుకుంటుండంగనే బంబాయి టేషనచ్చింది. రంగడు బిక్కుబిక్కుమనుకుంటా మెల్లంగ రైలు దిగిండు... అబ్బ గంతమందిల ఎటువోవాలె ఏంది? రంగనికేమి మనసున పట్టలేదు. తన పక్కకు కూసున్నాయనే వోతుంటే రంగడు ఆయన కాళ్లల్ల కాళ్లేసుకుంటపోయిండు. ఆయింతెట్లనో టేషన్ దాటిండు. ఇగ అవతల ఎటుపోవాలో. ఎవల్తో పోవాల్నో ఎవల్ని ఆడగాల్నో పల్లెటూరి రంగనికి వూర్లేసిపోయేంతమంది బొబ్బల్ల ఎటు తొవ్వగనపల్లె.

ఆవ్వేందో నడుత్తనే ఉన్నయ్. రంగడు మనుసులు తోలుతుంటే నడిసే మోటార్లను జూసిండు. కాని వుట్టిగనే ఆవిట్కి అవ్వే నడుత్తండంగ ఆని జన్మల ఎన్నడు సూల్లే ఇన్లె. ఇంతింత ఎత్తు ఘుడిమెలతో నడుత్తున్న ఆడోళ్లు, సేతులు సేతులు కలుపుకొని పోతున్న మొగోళ్లనూ సూత్తుంటే రంగడు ఇది బూమి కాదనుకున్నడు. సిన్నప్పుడు తాత సెప్పిన ఇంద్రలోకమో అదేందో అనుకున్నడు. అచ్చె పోయెటోళ్లనూ మోటార్లను ఇంక ఏంటేట్నో సూత్తూ బొమ్మెల్నే నిలుసున్నడు.

గింతట్లకే ఆయ్యవో దీపాలు ఎల్గినయ్. ఆనికి గప్పుడనిపించింది, అరే! పొద్దుతల్లి కడుపుల ఎప్పుడు వడ్డదో అని, ఇక్కడ తల్లి కడుపుల వడుతుందో లేదో అని అనుమానంల వడ్డడు. సెంద్రుడు కనిపియ్యనేలేదు. ఇయ్యాల్నే పున్నమని రంగనికి బాగా యాదికున్నది. ఇదేం ఇసిత్రలోకమో అనుకున్నడు. తనూరికి ఇక్కడికి ఎంతో కిందమీద కనిపించింది. తనూల్లో గిట్ల మనసుల్లేకుండనే ఆ బస్సులో అవ్వేందో నడిపేయడముందా? గిట్ల ఆడోళ్లు, మొగోళ్లు కలసి నడుస్తరా? గింతమంది గుముగూడుతరా? గట్టనే పొద్దుగూకదో ఏమో? సెంద్రుడు ఉండడో ఏమో అనుకున్నడు రంగడు. గిట్ల ఆలోచన్లపడి ఎటన్నా పోవాల్నని గూడ అనుకోలె.

రాత్రయింది. ఆకలైంది. ఏం తినాల్నో తెల్వలే. సిన్నపుడు ముసల్దాని దగ్గర తిన్న బూడాలు లడ్లు యాదికచ్చినయ్. రంగని మనసులో ఉవ్విళ్ళూరంగనే బూడాల వాసనొచ్చింది. ఎన్కకు తిర్గి సూసి ఏకానిచ్చి బూడాలు కొనుక్కొని తిని, ఇన్ని మంచినీళ్లు తాగిండు. రాత్రంతా జాగారం చేసి ఇసిత్రాలన్నీ సూసిండు. తెల్లారినంక టేషన్ దాటి నడిసిపోయిండు. చెంచలగూడ ఎక్కడని అడుగుదామనుకుండు గానీ ఎక్కడ జూసిన, అదేందో తురకం బాసల్నే మాట్లాడుకుంటుండ్రు. ఎక్కడ తెలగంల మాట్లాడెటోళ్లు రంగనికి కనిపియ్యనేలే. తిరిగిండు తిరిగిండు మళ్ల అయ్యవో దీపాలు ఎల్గెదాక తిరిగిండు. గా రాత్రి ఓ కొసకు తెలగంల మాట్లాడుకుంట ఇసుపేటు ఆట ఆడుకుంటుండ్రు కొంతమంది. రంగడు పిల్లిముందు ఎల్కోలె అళ్లదగ్గరికి పోయిండు. అళ్లంతా మీసాలు పెంచుకొని, అడ్డబట్టలు కట్టుకొని సేతుల బనీన్లు తొడుక్కొని ఉన్నరు. అళ్లను జూడంగనే పచ్చి దొంగలోల్నే అనిపించిండ్రు. ఒకసారి రంగని ఇంటెన్కన్న దొరగారింట్ల దొంగలు పడ్డపుడు, అళ్లండ్ల కెళ్లి ఒక్కన్ని పట్టుకున్నరు. ఆడు అచ్చంగా ఈళ్లోల్నే ఉన్నడు. అళ్లతో మాట్లాడితే దగ్గరున్న రూపాయల్ను గుంజుకుంట్రేమోనని భయపడ్డడు రంగడు. ఇగ మరి తెల్గోళ్లేమో మందుల కేత్తామన్నా కనిపియ్యకపోయిరి. రంగనికేమో తెల్గుకాక ఇంకో బాసనే రాపాయె. ఇగెట్లా మరి. ఆడు సిక్కుల పడ్డడు. ముందుకు జూత్తె నుయ్యి ఎన్కకు జూత్తె గొయ్యి, మరెట్లా అని యిచారంల పడ్డడు. ఇగెట్లైనన్నాయెనని తెగించిండు. ఆడచ్చిన సంగతి జెప్పిండు. అళ్లు ఏమనుకున్నారో ఏందో? చెంచల్గూడకు తోలుకపోతమన్నరు. తోలుకపోయినందుకు రెండు రూపాయలియ్యమన్నరు. రంగడు గంగెద్దోలె తలూపిండు. రంగనికి తెలివైనాంక జూత్తేమున్నది. ఒక్కరూపాయి లేకుండ గుంజుకున్నరు. లబోలబో మొత్తుకున్నడు. అంతట్లకే పహరా ఉషారనుకుంటా పోలీసచ్చిండు. రంగని పాణం గతుకుమంది. ఏడుత్తున్నోడల్లా సగం సచ్చినోల్లె కూసున్నడు. పోలీసోడు రంగని దగ్గరికచ్చి అదేందో బాసల తిడుతూ నాల్గంటించిండు. గప్పటికే గుండె గుబేల్ గుబేల్ మంది. ఆ ఇంటి పోలీసోడు కొట్టంగనే సచ్చినోని తరీకనే అయిపోయిండు. మాటా లేదు. ముచ్చెట లేదు. పోలీసోడేమో బాసలో తిడుతనే ఉన్నడు.

రంగడు కండ్లు తెరిసి జూసిండు పక్కకు సిన్నాయిన్న కొడుకు కనిపించిండు. లేసిపోయిన పాణం తిర్గచ్చింది రంగనికి. ఇగ బతుకు బాబోయ్ అనుకున్నడు. కొంచెం లేటైతే రంగడు మనోడు కాకుండా పోవు. పోలీసోడు పట్టుకపోతుంటే నేను జూసి యిడిపిచ్చుకచ్చినా అని అన్నగాడు ఆ వూరోళ్లతో సెప్పంగ ఇన్నడు. పోలీసులు పట్టుకపోయిండ్రనే మాట ఇనంగనే రంగనికి జరమందుకున్నది. ఆరం రోజుల్కా అచ్చిన జరం జార్నే లేదు. గా జరంలనే అన్నగాడు రంగన్ని ఇంటికి తీసుకచ్చిండు.

ఆనాడు రంగనింట్ల తీర్తం సాగింది. సీమల బారోలె వూళ్లోళ్లందరు అచ్చి జూసిండ్రు. రంగని తల్లి కంటికి మంటికి ఏకదారోలేడ్చింది. "నీ కొడుక్కేందవ్వ బతికి బయటపడ్డడు. మారాజు" చూడచ్చి నోల్లందరు గదే పాట పాడిండ్రు.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 1957 లో ప్రథమ ముద్రణ - "ఆనాటి కథ" శీర్షికతో 10-5-1999లో అదే పత్రికలో పునర్ ముద్రణ)

5

ఎన్నికలు

— డా॥ మలయశ్రీ

ఈ మధ్య జరిగిన మావూరి సర్పంచు ఎన్నికల వ్యవహారాన్ని తలచుకుంటే ఇప్పటికీ నవ్వు వస్తుంది నాకు. అదో విచిత్రమైన పరిణామం. (ఆ మార్పు దేశమంతటా రావాల్సి ఉంది. అప్పుడే ప్రజాస్వామ్యం అనే మాటకు సార్థక్యం, దేశానికి అభ్యుదయం సాధ్యం)

మా వూరు చిన్నదే కాని, దేనికైనా ఇక్కడ పోటీ మాత్రం పెద్దది. ఈ ఊరికి ఇద్దరు దొరలు. ఒకరు రావు, మరొకరు రెడ్డి. ఒక ఒరలో రెండుకత్తులు ఇముడవు. ఒక్క అడవిలో రెండు సింహాలుండవు! మాది అడవి కాదు, గ్రామం. ఇక్కడ జంతువులు కాదు ఉంటున్నది మనుషులు. అయినా, ఈ రెండు నరసింహాల కారణంగా మావూరి వాళ్ళు జంతువులుగా మారిపోతున్నారు. నిజానికి మార్చబడుతున్నారు.

రావుగారిది గతవైభవం. తాతలనాటి ఆస్తి క్రమంగా తరిగిపోతున్నది. అయినా పులి బక్కపడినా పలు చారలు సన్నబడవు అన్నట్లుంది ఆయన దర్జా. రెడ్డిగారు మామూలు రైతు. ఈయన తండ్రి రావుగారి గడీలో శేరి చేసేవారు. పేరు వారిది, ఊరు వీరిది. పటేలు పొట్టేలుగా మారాడు. క్రమంగా బలపడ్డాడు. ఈ రెడ్డి కొడుకు ఆ దొర కొడుకుతో పాటు బస్తీలో చదువుకున్నాడు. ఇప్పుడు దొరా అని పిలిపించుకుంటున్నాడు. కాదనే దమ్ము ఆ దొరకు లేదు. అతడు అంటే ఇతడు వింటాడు గనుకనా? కాలం మారుతున్నది. ఓడలు బండ్లు - బండ్లు ఓడలు ! ఇదంతా సరే, అది గతం ప్రస్తుతం రావుగారితో సర్పంచు పదవికే పోటీకి నిలిచాడు రెడ్డి పటేలు దొర. తరతరాల తమ వంశ చరిత్ర జ్ఞప్తికి వచ్చింది రావుగారికి. తమ కమతంలో పనిచేసి బతికి పెరిగిన కాపు కొడుకు తనతో పోటీకి నిలవడమా? అవమానం! ఎట్లైనా, ఎంత డబ్బు ఖర్చయినా సరే ఆ రెడ్డిని ఈ పోటీలో ఓడించి, గద్దెనెక్కి, గట్టిగా బుద్ధిచెప్పాలనుకున్నాడు రావు దొర.

శ్రామిక వర్గంలోని ఓ పెద్దజాతిని కూడగట్టుకున్నాడు దొర. రెడ్డి మాత్రం తక్కువ తిన్నాడా? కొత్త పెత్తనం! రావుకు పోటీగా ఇతడో కులం, కూలి, వర్గాన్ని సమకూర్చుకున్నాడు. ఒక రి ఓట్లు ఒకరు చీల్చడానికి డమ్మీ అభ్యర్థులను ఆ పోటీలో నిలిపారు సొంత ఖర్చులతో.

ఇక్కడికి బాగానే ఉంది. ఇద్దరికే పోటీ అయితే రావో రెడ్డో ఎవరో గెలిచి, గెలిచేవాడెవడో, ఓడేవాడెవడో తేలిపోయేది. వచ్చిన చిక్కల్లా మరొకడు పోటీకి నిలవడం. ఆ నిలిచినవాడు లేబర్ క్లాసు. గ్రాడ్యుయేట్ యువకుడు పై ఇద్దరికి చెందిన వాడు కాదు.

ధనవంతుల పన్నాగాలు ... చిరకాలం జరిగిన మోసం ... ఇంకానా ఇకపై చెల్లదు - అని ఊరిలోని శ్రామిక జాతుల వారినందరిని కూర్చోబెట్టి చెప్పాడు. అవును నిజమే అనిపించింది వారికి. తర

తరాలుగా సాగివస్తున్న కథ విధిరాతకానే కాదు ఇది కొందరు పెద్దలు తమ స్వార్థం కోసం, ప్రయోజనం కోసం సాగిస్తున్న - చేత అని వారికి అర్థమైంది.

కాని, వారికి ఒక్కటే బాధ, ఓట్ల సీజన్ వచ్చిందంటే పండుగ వచ్చినంత సంబరమాయే. తినటం తాగటం కొత్తబట్టలు కొనుక్కోవటం. అవి పోతాయంటే ఆ పేదలకు బాధగా ఉంది.

అది తప్పు నోటుకు ఓటును అమ్ముకోవద్దు. మంచి మనిషిని తెల్సి ఓటేసి మనం గెలిపించుకోవాలే. అది మన బాధ్యత. మంచోన్ని గెలిపిస్తే, మనకు మనూరికి మంచి చేస్తడు, చెడ్డోడు గెలిస్తే మనల మేస్తడు, ఊరిని ముంచేస్తడు.

అది నిజమే బాబు కాని అలవాటు పడిపోనాం,ఆశపడ్డాం- అయితే సరే, అని వారికే మంత్రోపదేశం చేశాడు.

ఇంకేం అటు రెడ్డి, ఇటు రావు పిలిచే మీటింగులకు వెళ్ళారు. విందులు గడిచారు. ఇచ్చింది పుచ్చుకున్నారు. పచ్చనాకులు పట్టి బాసలు చేశారు. ఇద్దరు ఎవరికి వారే గెలుస్తామనే ధీమాతో ఉన్నారు.ఓట్లు పడ్డాయి. లెక్కింపు జరుగుతున్నప్పుడు ఇద్దరు మీసాలు మెలేస్తూ అక్కడే కూర్చున్నారు.

రాజు స్కూల్ బిల్డింగ్‌లోపలికైనా రాలేదు. డిపాజిట్ దక్కదు వానికి, కొండలను గొర్రె పోతు ఢీకొన్నట్టు మాతో తలపడతాడా, అంగబలం, అర్థబలం దేనికైనా సమవుజ్జీ కావాలే అనుకున్నారు. రిజల్టు డిక్లేర్ చేసే సరికి ఇద్దరికి చెమటలు పట్టాయి. గేటు దగ్గరి నుంచి రాజుకు జై అంటూ పూల దండలు వేసి తీసుకొస్తున్నారు.

రిజల్ట్ షీట్ మీద సంతకాలు పెట్టి రెడ్డి, రావు ఎదురుగా వస్తున్న రాజును చూడలేక తలలు తిప్పుకొని వెళ్ళారు. రాజు నవ్వుతూ సంతకం చేశాడు. ఉప సర్పంచ్ ఎన్నిక కూడా జరిగింది.

ప్రజాస్వామ్యం ప్రజల కోసం ఏర్పడింది. ప్రజలు దీన్ని సద్వినియోగ పరచుకుంటేనే మంచి ఫలితాన్ని ఇస్తది. స్త్రీలకు రిజర్వేషన్ అంటే పాత సర్పంచులు తమ భార్యలనే నిలిపి గెలిపించుకున్నారు. ఎస్సీలకు రిజర్వేషన్ అంటే దొరలు తమ పాలేళ్ళ నిలిపి గెలిపించుకుంటున్నారు. ఇది ప్రజాస్వామ్యమనిపించుకోదు. ఈ రోజు ఇక్కడ జనం సాధించుకున్నది నిజమైన ప్రజాస్వామ్యం. ఇది ప్రజా విజయం.

నేను మీ వాన్ని, మీ మేలుకోసం ప్రయత్నిస్తా, దారి తప్పిన్నాడు నన్నైనా గద్దె నుంచి దించే హక్కు మీకుంది. ఆ ధైర్యం మీకు ఉండాలి అని ఆశిస్తూ, మీరు నాయందు చూపిన అభిమానానికి, సహాయానికి కృతజ్ఞతలు అర్పించుకుంటూ సెలవు తీసుకుంటున్నాను. మన ప్రభుత్వం ఏదైనా, దాని నినాదం ఏదైనా ప్రజాస్వామ్య ఓటింగ్ విధానానికి ప్రతీకగా నిలిచిన మా వూరి ప్రజలకు ఆ యువకునికి జోహారులర్పించుకున్నాను మనసులోనే...

(సత్యార్థి మాసపత్రిక 1977. పునర్ముద్రణ మార్గదర్శి పక్షపత్రిక మే 1999)

* * *

6

అడవి మనిషి

-అల్లం రాజయ్య

రోడ్డుకు కుడిప్రక్కన నేరేడు చెట్టుకింద అంతాకలిసి పది మందున్నారు. చెట్టుకింద తాటికమ్మల చిన్న గుడిశె. గోడలైతే లేవు...లోపల కట్టెలపొయ్యి, పొయ్యూదుతూ గడ్డపు సాయెబు, నాలుగైదు గాజుగ్లాసులు...ఓ మంచి నీల్లకుండ, పక్కన గిలేటుగ్లాసు పొయ్యి మీద గిలేటు పాత్రలో వానకాలపు వాగునీల్ల రంగులో ఉన్న 'చాయ్ మరుగుతోంది, బుగ్గలుబ్బించి ఊదుతూ సాయెబు మాటిమాటికి పొయ్యి చిదగ బొడుస్తున్నాడు... బూడిద నెరుసులు గడ్డం నిండా, ఆ మాటకొస్తే, పొయ్యి మీది గిన్నెలో, గుడిసంతా పడుతున్నాయి. గుడిసె ముందు తెగిపోయిన గడంచలో ఓ వ్యక్తిముఖం మాడ్చుకొని కూర్చున్నాడు...పిడికిలి మడచి బీడిమీద బీడి తాగుతున్నాడు...సాయెబు వేపు తొంగిచూస్తూ మాటిమాటకి "చాయ్" అని అరుస్తున్నాడు.

సాయెబు పిట్టలా నోరుతెరచి "వచ్చే...వచ్చే" నంటున్నాడు. అప్పటికి నాలుగు మార్లు వాళ్ళిద్దరు ఆ మాటలే అన్నారు. ఇంకా "చాయె" అయితే రాలేదు....

ఇంతలో బాగా పొట్టిగా ఉన్న మనిషి గడంచలో కూర్చున్నతని ముందటికొచ్చి నిల్చున్నాడు...

"దండాల్ బాంచెన్....ఎటోపోతండ్లు పటేలా ?"

గడంచలోని పటేల్ గడంచ కిర్రుమనంగ కదిలి దండంబెట్టిన వ్యక్తిని ఎగాదిగా చూసిండు...దండం బెట్టిన వ్యక్తి చాలా కురుచగా ఉన్నాడు. వయసెంతో చెప్పడం కష్టం...నెత్తికి పాతపంచె రుమాలు. ముఖంలో ఎన్నెన్నో ముడుతలు. పాచిపండ్లు. కొంచెం పెరిగిన గడ్డం. గడ్డంలో అక్కడక్కడ నరిసిన వెంట్రుకలు. కళ్ళుపూరేడు పిట్ట కళ్ళలా చిన్నగా ఉన్నా చాలా తేజుగా ఉన్నాయి...గుడ్డ బనీను తొడుక్కున్నాడు...కావిరంగు దొడ్డుదోతి చిన్న చిన్న చిరుగులు కనిపించకుండా జాగ్రత్తగా కట్టుకున్నాడు...కాళ్ళు కొంచెం పక్కలకు వంగిపోయిఉన్నాయి....

మడిమెలు బాగా వగిలి, చాలా రోజులనుండి "గుర్రంమూతి" రోగంతో బాధపడుతున్నట్టుంది...కాళ్ళకు ఉంగుటాల వంతుకు జనుము తాళ్ళు కట్టుకున్న చెప్పులు...కాళ్ళ మీద చాలా దుమ్ము పేరుకపోయి అతను చాలా దూరం నుండి నడిచి వచ్చినట్టుగా వున్నది... పేరు వీరయ్య.

గడంచలోని వ్యక్తి ముడుచుకున్న ముఖాన్ని సాయెబు వేపు తిప్పి ఎదుటివ్యక్తిని ఖాతర్ చెయ్యకుండా మరోమారు "చాయ్" అన్నాడు...ఇతని పేరు నారాయణ.

"వచ్చే...వచ్చే...." మళ్ళీ అదేమాట....

వీరయ్య చాలా దూరం నుండి నడచి రావడంతోటి కాళ్ళు పీకుతున్నాయేమో దుమ్ములో

కూలబడి పోయిండు. వీరయ్య నారాయణ నిర్లక్ష్యాన్ని గమనించనే లేదు.

"మోటరెప్పుడత్తది బాంచెన్...?"

సాయెబు గాజుగ్లాస్‌లో చాయ్‌తెచ్చి నారాయణ కిచ్చాడు. నారాయణ ఊదుకుంటూ తాగేసరికి ముఖం కొంచెం వికసించింది...

"బస్సెప్పుడత్తది బాంచెన్...?"

"పరమాత్ముని కెరుక...సవారాజైమవ్వ - ఎవ్వన్ని ఏమనెటట్టున్నది ? ఆనిట్టమచ్చినప్పుడు ఆడు తోలుకత్తడు...."

"తమరెక్కడిదాకా పోతండ్లు బాంచెన్....?

"అల్లుకు బోతంటె పిల్లి ఎదురయినట్లు - ఏడికి బోతేందిరా ?" నారాయణ కసురుకున్నాడు....

"నేను తాలుకాకు బోతున్న బాంచెన్.... పుట్టి బుద్దెరిగిన కాన్నుంచి బస్సెక్కలే బాంచెన్....

"ఓరినీయక్క ! ఏ జంగల్ల బుట్టినవ్‌రా ?"

వీరయ్య కొంచెం ముంగటికి జరిగిండు...

"అడవి మనుషులం బాంచెన్. ఎద్దుముడ్డి బొడుసుక బతికెటోల్లం నాగలి ఎలుగు నడుత్తందో, సలుగు నడుత్తందో ఎరక బాంచెన్...గీ బస్సుల సంగతి మాకే మెరుక బాంచెన్....?"

"సరెగని ఎటో సానాదూరమే పోతున్నట్టున్నది....?"

నారాయణకు బస్సచ్చేదాక వీరయ్యతో బాతాఖానీ కొట్టబుద్దయిుంద.

వీరయ్య రొండికున్న పొగాకు తీసి కొంచెం తుంచుకొని దవడ కేసుకున్నాడు...

"ఏం జెప్పాలె బాంచెన్...?" చెప్పాలా వద్దా అని కాసేపు విచారం చేశాడు వీరయ్య.

"జంగల్ల మనుషులకు అయి మూలలే మెరుక బాంచెన్... పచ్చులసోంటోల్లం పసురాలసోంటోల్లం సెట్ల సంగతెరికే. సేమ సంగతెరికే కని మనుషుల సంగతే ఎరికైతలేదు బాంచెన్...గప్పుడు మాకు గుట్టకింద రెండెకురాలనర సెలుకుండె బాంచెన్.. ఎప్పుడైనగ సెలుకల నువ్వులు, ఆయిందాలు తప్ప ఇంకేం బండలే బాంచెన్...మా నాయిన్న ఇంకా నాలుగెకరాలు పాలుకు దున్ని మమ్ముల సాదుకొచ్చిండు బాంచెన్...అయ్యవ్వకు నేనొక్కన్నే కొడుకును బాంచెన్... మా తాతకు మా నాయిన ఒక్కడే కొడుకు బాంచెన్ - మా అయ్య జచ్చినంక మా అవ్వ మమ్ములను బొచ్చెకు గట్టుకొని సాదుకొచ్చింది బాంచెన్... గది రాచ్చాసి బాంచెన్... ఉపాసముప్పిడి ఉండి కానుల గద్దల గొట్టిగ సెలుక దక్కిచ్చింది బాంచెన్ మా అవ్వ నేను మన్నుబుక్కి మన్నేర్గి గసెలుకల రాళ్ళు రప్పలేరినం బాంచెన్...మొట్లు మోరట్లు తవ్వేసినం...గెట్లు బలిపిచ్చినం...నాపెండ్లయినేడు తెల్లొన్న బోత్తె ఓనీ బాంచెనాతె సెప్పవశం గాదు కడుముంత లంత కంకులు బెట్టినయ్ బాంచెన్.. 'బిడ్డా ! బూదేవర మసలనెత్తుకున్నదని' మా యవ్వనన్ను అలాయిబలాయి దీసుకున్నది ఊరును మరిసి మా అవ్వ నాపెండ్లాం నేను సేండ్లనే ఉండి పోయినం బాంచెన్... పిట్ట ముట్టకుంట ఏదుగొట్ట కుంట అడవిపంది ఆసన బట్టకుంట కాపాడుకచ్చినం బాంచెన్...

అయితే ఆఖరుకేమయింది...ఎనిమిది దినాలు అంచిన నడుమెత్తకుంట కోతలు గొత్తే సేనుకడుపు నంబలి బొయ్యి దంగలేదుండ్లి...మెదమీన మెద, దీని కందులుగాల గూళ్ళేత్తె పడ్నాల్గు గూళ్ళుగుడి మెట్టుతీర్గ... మా యవ్వ పిచ్చిదై పోయి గూళ్ళసుట్టు ఆసుబోసినట్టు తిరిగింది" వీరయ్య గొంతు ఎందుకనో కొంచెం జీరగా విన్పించింది...

"గూళ్ళేసిన రెండోనాడు ఆడచ్చిండు బాంచెన్ - అని కండ్లు దిరిగిపోయినాయ్. నా సేను బందుకు ఆని సేను పదిహేను ఎకరాలు ఉన్నది బాంచెన్. గదంత గొడితె పది గూళ్ళు బల్లే బాంచెన్..అని కండ్లు సెదిరి బరాంచలే బాంచెన్...మొఖం మాడ్చుకొని ఇంటికి బోయిండు బాంచెన్...పోయినంక అని ఆరుబండ్లు పదిమంది పాలేరోల్లు, ఆడు, ఊళ్ళె పెద్ద మనుషులచ్చిండ్లు బాంచెన్....గందట్ల పట్వారి సుత అచ్చిండు బాంచెన్...మిల మిల సూడంగ సొప్ప బండ్లల్ల మొలుక్కున్నరు బాంచెన్...మా యవ్వ బండ్ల ముంగటికురికింది బాంచెన్ కనాలూడబీకింది బాంచెన్...దాన్ని ఆడు గొట్టిండు బాంచెన్... అది కోపమాసక మట్టి పెళ్ళలు ఇసిరింది బాంచెన్...దాన్ని నన్ను నా పెండ్లాన్నిమంచెగుంజలకు గట్టిసొప్పమెలక్క పోయిండు బాంచెన్..."

"చ్చొ...చ్చొ" నారాయణ చప్పరించాడు...

"ఆఖరుకు ఊళ్ళెకచ్చి ఆరంబడి జేత్తే తేలిందేందనుకున్నరు ! గభూమి వాని నంబర్లున్నదట. మా అయ్యను ఉత్తగనే దున్నుకొమ్మన్నడట...సరె ఎంటికలున్న కొప్పు ఎటు ముడిసినా సక్కంగనే ఉంటది. కోప్పడకుండ్లి బాంచెన్...ఊరోల్లంత ఉన్నోని పట్టు దాసరోడు తాళ్ళపట్టయ్యింది...మా అవ్వ మల్ల కోలుకోలే మట్టి పెళ్ళలు కొంగులేసుకొని తిరిగేది. అది పిచ్చిదైపోయింది బాంచెన్...నా అనువం గిట్లనే ఉన్నదనుకొని కయికిలో కూలో సేసుక బతికిన బాంచెన్... నా పెండ్లాం నేను చెరోకయికిలి సేసుకొని కడుపుకు దినంగ యాభై రూపాయలు దాసినం బాంచెన్...

ఎప్పటిమాట ! మా రామకిట్టు కడుపుల బడ్డప్పటి మాట. యాభై రూపాయలు కొంటబొయి పట్వారి సేతుల బోసిన బాంచెన్...పట్వారి ఏక్యాలిలున్నడో నెమలిసెట్టు గుడ్డం సూపెట్టిండు బాంచెన్... ఏం జెప్పాలే బాంచెన్...గగుడ్డంల అడవిపందులు పిల్లలుజేసినయ్ బాంచెన్ - గుడ్డం నిండా ఊడుగుకంప, పరికికంప, బలుసుకంప, కాలుబెట్ట సందు లేకుంటుండె బాంచెన్...గది కడుపుతో నున్నదని సుత సూడకుంట నీల్లు నిప్పులుదాగి సాపుజేసినం బాంచెన్...రాళ్ళు గుండ్లుతవ్వి పారేసిన...."

"సరే ! సరే ! మల్ల సెలుక జేసుకున్నవ్....పంట బాగా పండుతుందా ? " నారాయణకు మరింక వినబుద్ది కావడం లేదు...

"మా రామకిట్టు సచ్చినేడు బాంచెన్....నేను..."

"సేను మా బాగున్నదంటవ్"

"సరె బాంచెన్ గిదంతెందుకు గసేను సావుకర్సులకు, నా పెండ్లాం రోగంల బడితె ఇచ్చిన పైకానికి షావుకారి గుంజుకున్నడు బాంచెన్..."

"అయ్యయ్యో...." నారాయణ కంఠంలో కొంచెం ఎగతాళి...

"అయ్యా ! సేండ్లో సేండ్లని భూమో భూమని అంగలార్సిన. పుట్టిన నలుగురు పోరగండ్ల తీర్గనే రేవుకు తెచ్చుకున్న. సేండ్లుబోయిన యనుకున్న...సరెకట్టంల బుట్టికట్టంల బతికేటోల్లం గియ్యన్నిబోతే జనుకలే...ఆఖరుకు మా మల్లిసచ్చిన్నాడు సుత నేను జనకలే...కని బాంచెన్...." వీరయ్య

కంఠం పూడుకపోయింది...

"నీ బాంచెన్...నా కట్టం సుకం జెప్పుకుంటున్న మన్నించుండ్లి. సావంగా మిగిలినోడు మాసారయ్య ఆనికింకా మీసం కట్టే సరింగ మొలువలే బాంచెన్... సాపు జేసుకున్న బూములుబోయినప్పుడు నా అదురుట్టం గింతే అనుకున్న - పెండ్లాం బోయినప్పుడు దానికి ఆకు సింపేసిండ్లనుకున్న... కింది పెదవు మీనెత్తకుంట - కడుపుల దుఃఖాన్ని కడుపుల్నే ఉంచుకున్న...నేను పుట్టి బుద్దెరిగిన కాన్నుంచి ఆసినిత్తని ఎవల్ని మాటనెరుగలే. నేను లంగను గాదు. లపంగను గాదు, దొంగను గాదు మా కొడుకు సారయ్య ఎడ్లు బూమి తప్ప మనుషులమర్మం ఎరికలేనోడు. కడుపు కాలినోల్లు, బాంచెగాళ్ళు పంగాలు బెట్టిండ్లు...అద్దుబిడ్డా ! నువ్వెటుబోకు నీకు ఎనుకా ముందు ఏమెర్కలేదని ఎటుబోకుంట సూసుకుంటచ్చిన...సంగాలచ్చినంక మావూళ్ళె పెద్దోల్ల నడుములు నక్కుల కిరిగినయ్...గకొట్లాటల తమరికేం జెప్పాలె బాంచెన్ !... ఊళ్ళె నుంచి పెద్దోల్లు ఎల్లిపోయి ఎములోల్ల దోలిచ్చిండ్లు. ఆళ్ళచ్చి ఎర్రిలేసిన కుక్కలోలె కనిపిచ్చినోన్నల్ల కరిసిండ్లు బాంచెన్ !.... గుడిసెలు కూలగొట్టిండ్లు. కుండలు పలుగ్గొట్టిండ్లు కోడిపిల్లల పట్టుకపోయిండ్లు - పడుసు ఆడి పోరగండ్ల పట్టుకపోయిండ్లు - మొగ పోరగండ్ల పట్టుకపోయిండ్లు బాంచెన్...మా సారయ్యను సుత పట్టుకుపోయిండ్లు బాంచెన్...గిప్పుడు రెక్కలు దెగిన పచ్చితీర్గ ఒంటిగాన్నయిపోయిన బాంచెన్...జంగల్ల బతికినోన్ని తాలూకాకు బోయి ఏదన్న సేయాలని పోతన్న బాంచెన్..." వీరయ్య పీక్కుపోయిన చెంపల మీదుగుండా రెండు కన్నీటిబొట్లు.

నారాయణ ఎందుకనో మళ్ళీ ముఖం మాడ్చుకున్నాడు... సాయెబు గుడిసెలోపల ఏదో కూనిరాగం తీస్తున్నాడు... ఆపాట విన్నతరువాత నారాయణ ముఖం ఇంకింత ముడుచుకపోయింది.

వీరయ్య లేచి రోడ్డుమీద దూరం తూర్పుగా నడచి నేరేడు చెట్టునీడ పడని చోటు నుండి ఎడంచెయ్యి నుదురుకడ్డం బెట్టుకొని సూర్యున్ని చూశాడు...ఏదో గొణుగుతు మళ్ళీ వెనక్కి వచ్చాడు...నేరడు చెట్టు మొదట్లో కునికిపాట్లు పడుతున్న ముసలమ్మ దగ్గర కూర్చున్నాడు. ముసలమ్మకు కొంచెం దూరంలో ముసలమ్మ మనుమడు, అతని భార్య ఏదో చెప్పుకొని నవ్వుతున్నారు...

"ఏ వూరు బోతున్నవే ముసలవ్వ !"

ముసలమ్మ కళ్ళు తెరచి వీరయ్యను చూసింది. రవికలో నుండి నశ్యం డబ్బాతీసి నశ్యం ఎగబీల్చింది. దాని ముక్కుకు నశ్యం రెండువేపులా అంటిఉన్నది...

"నా మనుమడు తీసుకపోతండు బిడ్డా ! ఆడు దచ్చన్న రాజ్జేన కొలువు జేత్తండు, కాలం మంచిగ రాలే కొడుకా ! కాలేర్ల మీనికి ఎగబడిపోతండ్లు"...ముసలవ్వ దవడలు తాకులాడు తుండగా, చెవులకు నూలు దారంతోకట్టుకున్న సెపుకాయలు ఊగుతుండగా చాలా చెప్పింది...

"నేను తాలుకాకు బోతన్న, పుట్టి బుద్దెరిగినకాన్నుంచి..." ముసలవ్వ ఊకొడుతుండగా మళ్ళీ మొత్తం కతంతా చెప్పుకొచ్చాడు వీరయ్య. ముసలవ్వ మధ్య మధ్య కళ్ళొత్తుకుంట ఎమినోళ్ల తిడుతూ విన్నది...

"కట్టం పుటుకే కొడుకా నీది...ఆళ్ళకేం బొయ్యే కాలం! దునియపురాగ సెడిపోయింది బిడ్డ. బట్టగాల్సి మీనేసే కాలం...నాకు సమధానం బిడ్డా ! "అడుతని నెత్తి బుడుతడు గొడితె బుడుతని నెత్తి బోడోడు గొట్టిండట..." ఆళ్ళకు దగ్గ మిండెలు తయారయ్యిండ్లన్నమాట...ఇగో ముసల్ది గిట్ల జెప్పిందని ఎనుక దిట్టినా మంచిదే...ఊరంత ఒక్కటయినప్పుడు మనం గండ్ల కలువాలె అచ్చేటిది గురుతు జేసుకొని తప్పించుకొవాలె - మనకు బురదడ్డమత్తె ఏం జేత్తం - బండేసుక దాటిపొతం..." ముసలవ్వ ఇలాగా

చాలాచాలా చెప్పింది.

వీరయ్య ఈసారి హోటల్ గుడిశె సాయెబు దగ్గరికి నడిచాడు. నోరు తెరచి ఏదోచెప్పబోయాడు...

"ముందుగాల గీ చాయ్ తాగు..."సాయెబు...

"నా దగ్గెర..."

"ఊకెనే పోసిన, తాగు..."

వీరయ్య నమ్మలేనట్టుగా చూశాడు...

"మీది పోతారం గాదు..."

ఔనన్నట్లుగా తలూపాడు వీరయ్య...

"నాకంతెరికె - ముందుగాల చాయ్‌తాగు..."

"చచ్చేంబోవు...గట్టోనివే తాగు..."

తలరుమాలు ఊడబీక్కొని గ్లాసును పట్టుకొని ఊదుకుంటూ తాగాడు...

అంతలోకే ...బస్సు వచ్చింది

ఉన్న పదిమందిని బస్సులో కుక్కాడు కండక్టరు...సాయెబు బస్సు దాకా వచ్చి...

"ఇగో ఈరయ్యన్నా ! మున్సోసాబ్ కచ్చీరుకుబో అక్కన్నే అన్ని సంగతులు తెలుత్తయి...." అని జెప్పాడు...

వీరయ్య చేతులు జోడించి సాయెబుకు దండం బెట్టాడు...బస్సు కదిలింది. సాయెబు మరల ఏదో పాట గొనుగుతూ గుడిసెవేపు నడిచాడు.

బస్సులో కూడా వీరయ్య అందరిని వాళ్ళ పేర్లు, ఊర్లు అడిగి తెలుసుకున్నాడు. తనలాగ కనిపించిన ఒకరిద్దరికి, వాళ్ళడుగకున్నా, తన సంగతి చెప్పుకొచ్చాడు...కొందరు "చ్చొచ్చొ..." అన్నారు మరి కొందరు "అయ్యయో,,అన్నారు...వీరయ్యకెందుకో ఎందరికి చెప్పినా, ఎందరు సానుభూతి తెలిపినా, తృప్తి కలుగలేదు...

వీరయ్య తాలుకాలో బస్సుదిగి కోర్టుకు దారి అడుగుతూ కోర్టు చేరేసరికి కోర్టుముందు చాలా మంది కనిపించారు...చెట్లనీడకు కొందరు కునికిపాట్లు పడుతున్నారు. మరి కొందరు ఏవేవో ముచ్చెట్లు చెప్పుకుంటున్నారు... తన లాంటి వాళ్ళు చాలామంది అక్కడ కూర్చుండటం చూచి వీరయ్య ఆశ్చర్యపడ్డాడు. తన లాంటి వ్యక్తిని ఒకన్ని అడిగి జడ్జీ కూర్చుండే గది తెలుసుకున్నాడు.

సరాసరి లోపలికి పోబోతున్న వీరయ్యను కోర్టుజవాను ఆపాడు.

"సానా దూరం నుంచచ్చినయ్యో ! నా ఉన్నోక్క కొడుకును పోలీసోల్లు పట్టుకచ్చిండ్లయ్యా !' అంటూ రెండు చేతులు జోడించాడు.

"అకీలును బెట్టుకోవాలె"నని కసిరాడు...జవాను.

వీరయ్య చాలా సేపు బ్రతిమాలాడు, కోర్టు జవాను వీరయ్యను నెట్టుతూ "కొండయ్య హాజరే ..." అని గట్టిగా మొత్తుకున్నాడు.

వీరయ్య చేసేదేమీలేక మళ్ళీ చెట్టుకిందికొచ్చాడు...మనుసంత కోళ్ళు తవ్విన పెంటతీర్గుంది...కాసేపు అటిటూ తిరిగాడు...ఇద్దరి ముగ్గురిని అడిగాడు...

మళ్ళీ కోర్టుజవానువేపు నడిచాడు...లోపలికి తొంగిచూసాడు...బట్టతల గుమ్మడి పండులాంటి ముసలి మున్సోసాబ్ ఏదో అంటున్నాడు. జవాను మళ్ళీ వీరయ్యను వెనక్కినెట్టాడు...

వీరయ్య అలా నాలుగైదుసార్లు తిరిగి విసిగిపోయాడు...కోర్టు జవాను ఎందుకో అవతలి గదిలోనికి పోయాడు, వీరయ్య టక్కున లోపలికి నడిచాడు. చెక్క బల్లముందు కూర్చున్న నల్లకోట్ల వకీల్లు కొందరు ఆశ్చర్యపడ్డారు. కొందరు హేళనగా నవ్వారు...

వీరయ్య వాళ్ళను ఖాతరు చేయకుండా జడ్జీ ముంగటికి నడిచి రెండు చేతులెత్తి మొక్కాడు.

"నీ బాంచెన్ దొర ! సానా దూరం నుంచచ్చిన, జంగల్లబుట్టినోన్ని, ఎందునెర్క లేనోన్ని ! ...'

"ఆడర్...ఆడర్...." జడ్జీ కర్రసుత్తితో బల్లమీద కొట్టుతూ...

వకీలు ఏదో చెప్పుతున్నాడు, వీరయ్య తొట్రుపడకుండ...

"నాలుగు పారీలు నేను కాస్తు జేసుకున్న బూములు గుంజుకున్నరు బాంచెను... అళ్ళపాపాన అళ్ళేపోతరని ఊకున్న బాంచెన్ మొన్న సంగపోల్లచ్చినంక నాబూమి నాకిచ్చిండ్లు బాంచెను...అఖరుకు దక్కిన ఇప్పగుడ్డం బాంచెన్...మావూరి దొరదెంకపోయిండు బాంచెన్ పోలీసోల్ల తోలిచ్చిండు బాంచెను. ఊరునంత సత్తెనాశిడము జేసిండ్లు బాంచెను...నా అఖరుకొడుకు పసిపోరన్ని పట్టుకచ్చిండ్లు బాంచెను...దరమ కుర్చిల కూకున్నోల్లు గి అన్నాయెం ఇసారం జేసి నా కొడుకును ఇడిపియ్యాలె బాంచెన్, కొండంత ఆశ బెట్టుకొని తమరి దగ్గరికచ్చిన బాంచెను" మళ్ళీ వంగి జడ్జికి మొక్కాడు.

జడ్జి బెల్లు కొట్టాడు. జవాను పరుగెత్తు కొచ్చి వీరయ్యను పట్టుకొన్నాడు. వీరయ్య ఇంకా ఏదో చెప్పుతూనే ఉన్నాడు...

"ఇది కోర్టు ! నువ్వు చెప్పేదంత పోలీసుస్టేషన్‌లో చెప్పుకోవాలె అర్థమయిందా ?" నల్లకోటు వకీలు ఒకాయన...

"ఎక్కడి బాస్టర్డ్ వీడు..." ఇంకో వకీలు...

"జంతువులాగున్నాడు..." ఇంకొక్క భారీకాయం లాయరు

జవాను వీరయ్యను బరబర బయటకు ఈడ్చుకుపోయాడు...

వీరయ్య ముఖం ఎర్రబడింది. కణతల దగ్గర నరాలు పొడుచుకొచ్చాయి. కాసేపు చెట్టుకింద కూర్చుండి ఆలోచన చేశాడు. చివరకు లేచి అక్కడ నిలబడ్డ తెల్లబట్టలతన్ని పోలీస్‌స్టేషన్ దారడిగాడు.

వీరయ్య పోలీస్టేషన్‌లోనికి అడుగుబెట్టే సరికి డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ బూట్లు టక్‌టక్ లాడించుకుంటూ వచ్చి... గిటేడికి పటేలా అని హాస్యమాడాడు.

"అమీన్ దొరున్నడా బాంచెన్..."

"ఏందెచ్చినవ్ ?..."

"నీ బాంచెన్...నా కొడుకును...."

"నకురాల్ సెయ్యక్ నడూ..." కానిస్టేబుల్

"ఆనేదో " లోపలి నుండి... పోలీసు తప్పుకున్నాడు...

వీరయ్య గద్దకండ్ల అమీనుకు వంగి వంగి దండం బెట్టాడు రుమాలు తీసుకొని రెండు చేతుల్లో పెట్టుకొని...

"అయ్యా ! బాంచెన్ - గరీబోల్ల ఓకంటసూడాలె బాంచెన్....నా బూములు గుంజుకున్న డు ...నా కొడుకును..."

"బూముల సంగతి గిక్కడగాదు, ఇగో, ఇటుచూడు, ఎడంచెయ్యి బాజు కన్పిత్తందే గక్కడికినడూ ! గక్కడ తాసీల్ దారుంటడు, గక్కడ చెప్పుకో..."

వీరయ్య ఏం మాట్లాడక ముందే కానిస్టేబుల్ మెడలమీద కర్రేసి బయటకు నడిపించుకొచ్చాడు...

వీరయ్య ఎడంసెయ్యి వేపున తాసీల్ ఆఫీసుకు నడిచాడు...అక్కడున్న జవాను చేతులో రెండు రూపాయలు బెట్టికాళ్ళు మొక్కి కడుపుల తలబెట్టి గద్దువ బట్టుకొని, తాసీల్‌దారుముందుకు నడిచాడు... తాసీల్‌దారు నున్నగా నూనెబుడ్డీ తీరుగున్నాడు.

"అయ్యా ! దరుమ దొరలు తమరన్న కలుగజేసుకోవాలె - బీదోల్లు మన్నయి పోతండ్లు బాంచెను...నా బూములు గుంజుకున్నరు..."

"నీ పట్టా బూములా ?"

"పట్టానోకాదో నాకేమెరుక బాంచెన్...నేను కాస్తుజేత్తన్నంత పడింతరం పట్వారి దొరకు తాసీల్లు గట్టిన..."

"నంబర్లేందో ఎరికలేదు బాంచెన్ - నా పెండ్లయిన ఏడాది మా వూరి రాజేశ్వరరావు దొర నాకోసిన సేను తన నంబర్లున్నదని జొన్నసొప్ప మెలుక్కపోయిండు బాంచెన్..."

"అయితే కోర్టుకుపో !...." మరింక మాట్లాడడానికి ఏమిలేదన్నట్టు బెల్ నొక్కాడు. ఇందాక రెండు రూపాయలు తీసుకున్న జవాను వీరయ్యను బయటికి పట్టుకపోయాడు...

వీరయ్య తాసీలాఫీసు మెట్లుదిగి రావిచెట్టు కింద నిలబడి కాండ్రకిచ్చి తాసీలాఫీసు వేపు ఉమ్మేశాడు...

"లంగలు దొంగలు !...." గొణుక్కుంటూ కోర్టువేపు నడకసాగించాడు...కోర్టు దగ్గరికి చేరేసరికి పొద్దు వంగిపోయింది...చాలా మంది కోర్టుముందటున్న హోటల్ గుడిసెకాడ చేరిపోయారు... వీరయ్యకు కడుపులో ఎలుకలు తిరుగుతున్నాయి.

నోరెండుక పోయింది...ఏదన్న తింటే బావుండుననుకున్నాడు. కాని ఏది తినడానికి మనసొప్పలేదు...హోటలతన్ని నీల్లడిగితే, కసిరి గాజుగ్లాసులో నీల్లిచ్చాడు. అవి ఏ మూలకు సరిపోలే...మరల అడగడం ఇష్టంలేక కొంచెము దూరంలో వున్న మర్రిచెట్టు మొదట్లో కూర్చున్నాడు...ఊడలు దిగిన మర్రినిచూస్తే, ఎందుకో అతనికి వాళ్ళ ఊరి రాజేశ్వర్‌రావు దొర గుర్తుకొచ్చాడు...వెనువెంటనే కొడుకు సారయ్య కండ్లల్లో మెదిలాడు. అతని కాళ్ళదగ్గర కుక్కొకటి ముంగటి కాళ్ళమీన తలబెట్టుకొని కునుకుతీస్తున్నది...

"ఏం బతుకులు కుక్క బతుకులు...!" వీరయ్య గొణుగుతూనే మళ్ళీ కతంతా కుక్కకు చెప్పుకొచ్చాడు. కుక్క విన్నదో లేదో తెలియదుగాని వీరయ్య గొణగడంతో లేచి అతని కాల్లు మురికి చూసింది...

ఏంజేయాలో ఎంత ఆలోచించినా వీరయ్యకు అంతుబట్టడం లేదు. ఇంతలోకే బర్రున పోలీసువ్యాను వచ్చి ఆగింది...అందులో చాలమంది అరుస్తున్నారు...

"దున్నే వానికే భూమిదక్కాలి !"... "పోలీసు జులుం నశించాలి!"...

వీరయ్య బెదిరిపోయి వ్యాను దగ్గరికి పరుగెత్తుకొచ్చాడు, ఆ అరుపులకు కోర్టుహాల్లోని లాయర్లంతా బయటకు వురికొచ్చి మెడలు రిక్కించి చూస్తున్నారు...కాకి బట్టల అమీన్ లాఠీతిప్పుతూ ఏదో మొరుగుతున్నాడు...అమీన్‌ను ఎవరు ఖాతరు చేయలేదు. హోటల్ దగ్గరి జనం వ్యానుచుట్టూ చేరి వింత చూస్తున్నారు...

ఆశ్చర్యంగా చూస్తున్న వీరయ్య దృష్టి వ్యానులో ఒకని మీద నిలిచిపోయింది...

"సారయ్యా !" వీరయ్య ఆనందం పట్టలేక అరిచాడు..కాని ఆ అరుపు వీరయ్యనే దాటలేదు... వీరయ్య కొడుకు ఫెఢీపెఢీన నినాదాలిస్తున్నాడు. అందరు అందుకుంటున్నారు... వీరయ్య పక్కకు నిలబడి నతనితో "ఆడు నా కొడుకే...."అన్నాడు పక్కతను పట్టించుకోలేదు.

ఇంతలో అక్కడికి తెల్లపైజామా, చొక్కా వేసుకున్నతడు, నల్లకోటు లాయరు వచ్చారు. వాళ్ళు నినాదాలాపి వ్యాను దిగారు...వీరయ్య ముందుకు వచ్చాడు. సారయ్య తన తండ్రిని చూసి చిన్నగా నవ్వాడు...కాని వీరయ్య నవ్వలేదు...సారయ్య నెత్తికి కట్టుకట్టున్నది....ఎవరికో తన తండ్రిని చూపించాడు. ఆ ఎవరో వీరయ్యకు నమస్కారం చేశాడు...వీరయ్య తత్తరపడ్డాడు...

వీరయ్య నోరు తెరిచేసరికే, లాయరు ముందునడువగా ఏదో పాటపాడుతూ కోర్టుహాల్లోకి నడిచారు, అందరూ. వీరయ్యకిటికీ చువ్వల్లో నుండి లోపలికి చూశాడు... జడ్జి గుమ్మడిపండు ముఖం వాడిపోయింది...గుడ్లు మిటకరిస్తూ ఏదో కీచు గొంతుతో అరుస్తున్నాడు. అప్పటికే జవాను రెండుసార్లు జడ్జికి మంచి నీళ్ళిచ్చాడు...నల్ల కోటు వకీలు జడ్జికి ఏవోకాయితాలందించాడు. జడ్జి కిందామీదా చూసి బరబర ఏదో గీకేశాడు...

అందరూ బయటకొచ్చారు. పోలీసువ్యాను ఖాళీగా వెలవెల పోయింది...సారయ్య తండ్రిని కలుసుకున్నాడు. తండ్రిని తీసుకుపోయి ఇందాకటి పైజామా అతనికి చూపించాడు... అతను నమస్కారం చేశాడు...

"నీ కొడుకును బేల్ మీద విడిపించినం...చాలా దూరం నుంచి చాలా కష్టపడి వచ్చారనుకుంటాను..."

"నా బూమి..." వీరయ్య తన దుఃఖాన్నంతా చెప్పుకొచ్చాడు.

ఇందాకటి మర్రిచెట్టు కిందికి తీసకపోయి వీరయ్య చెప్పేదంతా ఓపికగా విన్నాడు...

"సూడు ! ఈరన్న ! మనకు మంచి రోజులొస్తాయి...మన కష్టాలకు కారణాలు తెలుసుకున్నాం ! నిలదీసి అడుగుతున్నాం... వాళ్ళు కొండలాంటి వాళ్ళే. ఎనుకట మాగురువు ఒక చిన్న పిట్టకత చెప్పిండు...ఓ ముసలోనికి కొండవతల మంచి బూమున్నదట. బూమి సాగుచేసుకోవాలంటే కొండెక్కి మళ్ళీదిగిపోవాలె...ఎక్కేవరకే యాతన. ఇంకేం పనిజేత్తడు ?...అయితే ఈ ముసలయ్య ఒకనాడు కొండనే తవ్విపారేద్దామనుకొని పని మొదలుపెట్టాడట. ఆ దారంట పోతున్న ఒక పెద్దమనిషి విస్తుపోయి "ఒరే మూర్ఖుడా ! గిదేం పనిరా !!" అన్నడట ముసలోడు నవ్వి "కొండను తవ్వుతున్నానన్నడట....అతను నవ్వి..."కొండను తవ్వే మూర్ఖున్ని నిన్నొక్కన్నే చూసిన, నువ్వు తవ్వితేనే కొండ అక్కడ లేకుంటయి పోతదా ? " అన్నడట. ఆ ముసలయ్య "ఈ కొండను తవ్వంది నాకు బూమి పంటనియ్యదు...గీ కొండ ఉన్నంతే ఉంటదా ? పెరుగుతదా ? పెరుగది...నేనుబోతే నా కొడుకు నా కొడుకుభోతే నా మనుమడు నా మనుమడోతే...ఎప్పటికైనా గీ కొండను తవ్వి పారేత్తం" అన్నడట...ముసలయ్య పట్టుదలచూసి దేవుని మనసు కరిగింది. ఇద్దరు దేవదూతలను పంపినాడట దేవదూతలు తమ రెక్కల మీద కొండను తీసి బయట పారేశారట. నీ కొడుకూ మేము ఆ ముసలాయనలాంటివాళ్ళం సంగపోళ్ళం - పార్టీ వాళ్ళం - మాకు దేవుళ్ళంటే మీరే - మీరే మాకు దేవుళ్ళు - ఎప్పటికైనా మీ మనసు కరిగించగలిగితే మనం భూస్వాములను గెలువగలుతాం "

వీరయ్య అతిశ్రద్ధగా విన్నాడు అతని కెందుకో ఆనందం పట్టరాకుండా ఉంది...

కాసేపు ఆమాట ఈ మాట మాట్లాడి కొడుకు సారయ్యను తీసుకొని ఊరికి ప్రయాణమయ్యాడు...

మార్గంలో సారయ్యకు వీరయ్య ఈ విధంగా చెప్పాడు.

"ఒరే సారలీ ! మనల్ని గానేటోడెవ్వడు లేడు, ఇన్నవా బిడ్డా ? నువ్వు 'అద్దు మొర్రో' అన్నా, మళ్ళా పోలీసోల్లు పట్టుకత్తరు...ఆళ్ళు దొర బంట్లే...అట్టిగెందుకు దెబ్బలు బడాలే ? అట్టిగబడ్డా పచ్చిగబడ్డా ! నాకే దెర్కలే, నేను సచ్చవంతునన్నా, అందరితోని నిన్ను పట్టుకత్తరు...సావంగ మిగిలినవ్ నువ్వొక్కనివి...సంగపోల్ల ఇడువకు...నేను కచ్చీర్ల జూసినగదా ! మీరంటె అందరికి దప్పులు గొడ్తన్నయ్...ఇయ్యాల్లరేపు దండం దాసెండ్లు బెడితె "బాంచోతు మాకలవుడా" అంటరు...దుడ్డుబట్టినవో నీకే దండం బెడుతరు...జెసుకకు..మల్లెప్పుడు పోలీసోల్లకు దొరుకకు...మనోల్లను మరువకు..."

ఇల్లు చేరుకునేదాక కనీసం పదిసార్లన్నా ఈ మాటలు చెప్పాడు వీరయ్య...తండ్రి చెప్పిన మాటలకు తలూపాడు...సారయ్య.

ఆ రాత్రి వీరయ్య గొణుగుతూ పొగాకు నములుతూ, నిద్రపోకుండా ఎక్కడెక్కడో తిరిగాడు..."ముసలివాడు - కొండ కథ"ను ఇంకా బాగా ఎలా చెప్పాలో గునాయించుకున్నాడు...

-1978

(భూమి - అల్లంరాజయ్య కథలు (1982) నుండి)

* * *

7

ఈ తరం కథ

– రేగులపాటి కిషన్‌రావు

అతని పేరు భుజంగరావు. అతడావూరిలో వున్న పెద్ద ధనవంతులలో ఒకడు. అతడు నేర్పుగా ఒకరికొకరికి తగవులు పెట్టించి మధ్యవర్తిగా వుండి ఇరుపక్షాల వారి వద్ద డబ్బు తీసుకొని తీర్పు చెప్తాడు. సబ్‌ఇన్‌స్పెక్టర్లతో, లాయర్లతో, బ్లాక్ ప్రెసిడెంట్లతో స్నేహం చేస్తూ పరపతిని, ప్రయోజనాన్ని పొందుతూ వుంటాడు.

నరసింహరావు, భుజంగరావు అన్నదమ్ములు కాకపోయినా ఆస్తి కలిగివుండుటలో, మాటల చాతుర్యంలో, డబ్బు సంపాదనలో, ఠీవి ప్రదర్శించుటలో అన్నదమ్ములవలె కనిపిస్తారు. ఎప్పుడోగాని ఇద్దరు కలిసి మాట్లాడుకోరు. అలాగని వాళ్ళిద్దరి మధ్య భేదాభిప్రాయం వుందని చెప్పడానికి వీలులేదు. ఇద్దరూ కలుసుకోవడం తటస్థించి నప్పుడు చిన్నగా నవ్వుకుంటారు. చేతులు కలుపుకుంటారు. ఆప్యాయత ప్రదర్శించుకుంటూ మాట్లాడుకుంటారు, అలాగని వాళ్ళిద్దరి మధ్య ఆప్యాయత వుందని చెప్పడానికీ వీలులేదు.

భుజంగరావుకు కుక్కలంటే చాలా ఇష్టం. సింహాల్లా కనిపించే పెద్ద కుక్కలంటే మరీ మరీ ఇష్టం. కుక్కలు తనకు రక్షణగా వుంటాయని వాటివల్ల తన హోదా పెరుగుతుందని అతని ఉద్దేశం. కొన్నాళ్ల క్రితం అతని ఇంట్లో వున్న కుక్కల్లోకెల్ల పెద్దకుక్క ఓ కోడిని కొరికేసి తినేసింది. ఆనాటి నుండి ఆ కుక్కను గొలుసుతో కట్టివేస్తున్నాడు.గొలుసుతో వుండే ఆ కుక్క తన పరిసరాల్లోకి కోళ్ళు వచ్చినప్పుడు వాటిపై దుముకడానికి వాటిని చంపేసి తినడానికి ప్రయత్నిస్తుంది. చాలా సందర్భాల్లో కోళ్లు దూరంగా పరుగెత్తి దాని ప్రయత్నాన్ని విఫలం చేస్తాయి. అప్పుడు ఆ కుక్క గొలుసును కూడా తెంపుకోడానికి ప్రయత్నిస్తుంది. అలా చేసిన ప్రయత్నంలో అది ఓసారి విజయం సాధించింది. మెడకున్న గొలుసు తెగిపోగానే అది ఓ కోడిని కొరికేసి తినేసింది. మరో కోడిని చంపి దాని తలను నమిలి తింటుండగా భుజంగరావు అక్కడకు వచ్చాడు. అతడు కోపంతో చూస్తూ బిగ్గరగా టైగర్ అన్నాడు.అతని పిలుపు వినబడగానే అది అతని వద్దకు వచ్చి వినయంగా నిలబడింది. కొట్టాలనుకున్న భుజంగరావు దాని వినయం చూసి కొట్టలేకపోయాడు. తెగిపోయిన ఆ గొలుసును అతికించి మళ్లీ దానిని కట్టేశాడు.

ఆ కుక్క భుజంగరావు ఇంటికి వచ్చిన తొలి రోజుల్లో భుజంగరావును కూడా కరవబోయింది. అతనికి కుక్కలను లొంగదీసుకునే విధానం తెలుసు. అతడు కొద్దిరోజుల్లోనే సింహం లాంటి ఆ కుక్కను లొంగదీసుకున్నాడు.

ఆరోజు మధ్యాహ్నం ఇంటిముందున్న పందిరిగుంజకు కుక్కను కట్టేసి భుజంగరావు గదిలో పడుకున్నాడు. ఎందువల్లనోగానీ కొద్ది రోజుల నుండి దానిని ఇంటిముందే కట్టివేస్తున్నాడు. ఆరోజే ఠీవిగల ఓ కోడిపుంజు పురుగులను ఏరుకొని తింటూ కుక్కదగ్గరకు వచ్చేసింది. కుక్కకు ఆ పుంజును తినాలన్న కోరిక కలిగింది. వెంటనే అది నోరు తెరచి ముందుకాళ్లు ఎగరవేసి దుమికింది. పౌరుషముగల ఆ కోడిపుంజు ఎంతమాత్రం భయపడలేదు. ఒక అడుగు కూడా వెనుకకు వేయలేదు. కుక్క మరోసారి

కోడివైపు ఆశగా చూస్తూ నోరు తెరచి దుమికింది.

ఎన్నో కోడిపుంజులను పందెములో ఓడించిన ఆ కోడిపుంజు ఎగిరి కుక్కను తన్నింది. అది అలా తన్నినప్పుడు దాని కాలిగోళ్లు కుక్క ముఖాన్ని గాయపరిచాయి. కుక్కకు కోపం హెచ్చింది. తన శక్తినంతా వినియోగించి దుమికింది. తెగిపోతున్న ఆ పాతగొలుసు మరోసారి తెగిపోయింది. ఎన్నోకోళ్ళను తన్నిపడగొట్టిన ఆ కోడిపుంజు మరోసారి కుక్కను తన్నబోయింది. అడవిలో ఎన్నో జంతువులను వేటాడిన ఆ కుక్క కోడి మెడను కొరికేసింది. కోడి మొండెం ఎగరసాగింది. చిమ్ముకొని వస్తున్న రక్తం నలువైపుల పడసాగింది. కుక్క కోడి తలను నమిలి మ్రింగుతూ ఎగురుతున్న కోడి మొండెమును వినోదంగా చూడసాగింది. ఆ కోడిపుంజు నరసింహారావుది. అది ఎన్నో పందెములలో నెగ్గి అతనికి ఎంతో డబ్బు సమకూర్చిపెట్టింది. అతని పరువును పెంపుచేసింది.

మొండెం కొంతసేపు ఎగిరిన తర్వాత నేలమీద పడి చలనరహితంగా వుండిపోయింది. అప్పుడాకుక్క కోడి శరీరాన్ని చీల్చివేస్తూ మాంసం తినసాగింది. సిగరెటు డబ్బా కొనితేవడానికి వెళ్ళిన పనిపిల్లవాడు అరగంట గడచినా రాకపోవడం వల్ల నరసింహారావు లేచి వీధిలోకి వచ్చాడు. తన పందెపుకోడిని కుక్క చంపేసిందని కొద్ది క్షణాలలో గ్రహించాడతడు. కుక్క మీద కొండంత కోపం వచ్చేసింది. దాని తల తీసెయ్యాలని కాళ్లు విరిచెయ్యాలని కడుపు చీరెయ్యాలని ఇంకా ఏదో ఏదో చెయ్యాలని అనుకున్నాడు. కానీ సింహం లాంటి ఆ కుక్కను ఏమీ చెయ్యలేక భుజంగరావు అంటూ పెద్దగా కేకేశాడు.

ఇంతలో పనిపిల్లవాడు సిగరెటు డబ్బా పట్టుకొని పరుగెత్తి వచ్చాడు. "ఇంత ఆలస్య మయిందేమిట్రా" విసుగ్గా అన్నాడాయన.

"నేను వెళ్లేసరికి కోమటాయన అన్నం తింటున్నాడండి. అందువల్ల..."

"అది సరేగాని వెళ్ళి భుజంగరావు దొరను రమ్మను." పనిపిల్లవాడు భుజంగరావు ఇంటివైపు వెళ్ళబోతుండగా భుజంగరావు వీధిలోకి వచ్చేశాడు.చంపబడిన కోడిని దాని మాంసాన్ని తింటున్న కుక్కను, గద్దెమీద కూర్చుండి తనను పిలిచిన నరసింహారావును చూచి జరిగింది గ్రహించాడు. భుజంగరావు ముఖముపై కోపం ప్రదర్శిస్తూ టైగర్ అంటూ అరిచాడు. మాంసం తింటున్న కుక్క తినడం మానేసి వెళ్ళియజమాని కాళ్ల దగ్గర కూర్చుంది. భుజంగరావు కాలి చెప్పును ఊడదీసి కుక్కను కొట్టసాగాడు. అది దెబ్బలు తింటూ కూడా అతని చుట్టు తిరగసాగింది. నాలుగైదు దెబ్బలు కొట్టాక "పో లోపలికి" అని అరిచాడు. కుక్క ఇంట్లోకి వెళ్ళిపోయింది.

గద్దెపై కూర్చున్న నరసింహారావు భుజంగరావు వైపే దీక్షగా చూడసాగాడు. భుజంగరావు చంపబడిన కోడిని పట్టుకొని నరసింహారావు వద్దకు వచ్చి బాధనిండిన కంఠస్వరంతో అన్నాడు. "నేను కుక్కను కట్టేసే వుంచాను. కాని అది ఎలాగో గొలుసు తెంపుకొని మీ కోడిని కొరికేసింది. ఏది ఏమైనా నా కుక్కవలన జరగరానిది జరిగిపోయింది.. చనిపోయిన ఈ కోడిని చూస్తువుంటే బాధగావుంది. పౌరుషం గల ఈ కోడి నా కుక్కవలన చనిపోయినందుకు మరీ మరీ బాధగా వుంది. ఒక వీరుడు చనిపోతే దేశానికి నష్టమని మనం ఎలా భావిస్తామో ఈ కోడిపుంజు వీరుడు చనిపోవడం వల్ల కూడా తీరని నష్టం జరిగిందని నేను భావిస్తున్నాను.స్వర్గస్థుడైన ఈ కోడివీరునికి బదులుగా ఎన్ని కోళ్ళను ఇవ్వమంటే అన్ని ఇస్తాను. కోళ్లు అవసరం లేదన్నచో మీరడిగినంత డబ్బు ఇస్తాను."

భుజంగరావు తన కుక్క తప్పును ఒప్పుకొని బాధపడుతున్నందుకు నరసింహారావుకు గర్వంగా వుంది. భుజంగరావు తన వద్దకు రావడం ఎంతో గర్వంగా వుంది. అతడు గర్వాన్ని మనసులో దాచుకొని బాధను ముఖముపై ప్రదర్శిస్తూ అన్నాడు. "ఈ కోడి ఎన్నో కోళ్లను ఓడించి నాకు డబ్బును ప్రతిష్టను సంపాదించి పెట్టింది. దీనికి బదులుగా మీరెన్ని కోళ్లు ఇచ్చిననూ నాకు తృప్తి కలుగదు. ఈ పందెపు కోడి

విలువ ఇంత అని చెప్పుట నాకు ఇష్టం లేదు. ఈ కోడి శవానికి మీరెంత ఇవ్వదలుచుకుంటే అంత ఇవ్వండి". భుజంగరావు ఇంట్లోకి వచ్చి కోడిని గంపకింద పడేసి రెండు వందలు తీసుకపోయి నరసింహారావుకు ఇచ్చివచ్చాడు.

ఎన్నోకోళ్లను జయించిన కోడి వీరున్ని తన కుక్క చంపేసింది. పౌరుషంగల కోడి మాంసం తిను అవకాశం తన కుక్కకు లభించింది. తనతో తగవు పెట్టుకొనుటకు ఇష్టపడని నరసిహారావు తను ఇచ్చినంత డబ్బు పుచ్చుకొని ఊర్కున్నాడేకాని ఎదురు మాట్లాడలేదు. ఇది తనకు గర్వకారణమని భుజంగరావు భావించాడు. నిజానికి ఎంతో ముదుసలిదైపోయిన ఈ కోడిని అంగట్లో అమ్మదలచినచో ఎవ్వరూ రెండు వందలు ఇచ్చికొనలేరు. తప్పులో చిక్కుకొనిన భుజంగరావు తనకు లొంగిపోయి రెండు వందలు ఇచ్చాడని నరసింహారావు భావించాడు.

* * *

వీరయ్య మూడవ తరగతిలో మంచి మార్కులతో పాసయ్యాడు. అతడు నాల్గవ తరగతి కూడా చదవాలనుకున్నాడు. కాని ఆ వేసవి సెలవుల్లోనే పాలేరు పనిచేస్తున్న అతని తండ్రి పక్షవాతంతో చనిపోయాడు. తాను బ్రతుకుతూ మరో ఇద్దరిని పోషించగలిగిన తండ్రి మరణించాక వీరయ్య చదువు మానేసి పనిచెయ్యక తప్పలేదు. అతడో చిన్న రైతు వద్ద ఎడ్లను కాయడానికి పాలేరుగా కుదిరాడు. అతనికి పాటలు పాడడమంటే ఎంతో ఇష్టం. పాటపాడుతూ ఆనందించడం అతనికి అలవాటు.

ఓరోజు సాయంత్రం పాటపాడుతూ ఎడ్లను కొట్టుకొని ఇంటికి వస్తున్నాడు. ఆనాడు భుజంగరావు కుక్క గొలుసు తెంపుకొని వీధిలోకి వచ్చింది. ఎడ్లవెనుక వస్తున్న వీరయ్య ఎడ్లను అదిలిస్తూ పాటపాడుతూ చేతిలో వున్న కట్టెను క్రమబద్ధంగా వూపుతున్నాడు. ఇంతలో అతని వద్దకు కుక్క వచ్చింది. అతడు అదేమీ గమనించ కుండా కట్టెను వూపుతూనే వున్నాడు. అలా ఊపుతున్న కట్టె ఓసారి కుక్క ముక్కుకు తాకింది. కుక్క చెంగున ఎగిరి వీరయ్య కాలును కొరికింది. అతడు కట్టెతో కుక్కను కొట్టాడు. అప్పుడాకుక్క మరింత కోపంతో అతని చెయ్యిని కొరికింది.

వీధిలో నడుస్తున్న ఆడవాళ్లు భయపడి కేకలు వేశారు ఆ కేకలు విని భుజంగరావు వీధిలోకి వచ్చాడు. కరుస్తున్న కుక్కను చూశాడు. వీరయ్య శరీరం నుండి కారుతున్న రక్తాన్ని చూశాడు. "టైగర్" అంటూ కేకపెట్టాడు. కుక్క భుజంగరావు వద్దకు పరుగెత్తి వచ్చింది. అతడు కుక్కను వెంటబెట్టుకొని ఇంట్లోకి వెళ్లాడు. అతడు తిరిగి వీధిలోకి రాలేదు. వీరయ్యను చూడలేదు.

ఆ రోజు తన కుక్కవల్ల కోడి చనిపోయినందుకు నరసింహారావు వద్దకు వెళ్లి బాధను వ్యక్తపరిచాడు. నష్టపరిహారం చెల్లించాడు. ఈ రోజు తన కుక్క కరువగా వీరయ్య శరీరం నిండా గాయాలయ్యాయి. రక్తం కారుతూవుంది. అయినా అతడు వీరయ్య దిక్కుతొంగి చూడలేదు.

ఈ వార్త తెలిసి వీరయ్య తల్లి పరుగెత్తి వచ్చింది. కొడుకు శరీరం నుండి కారుతున్న రక్తాన్ని చూచి వలవల ఏడ్చింది. "తొందరగా డాక్టర్ వద్దకు తీసుకపో. లేకపోతే ప్రమాదం. కరీంనగర్‌లో అయితే పెద్ద ఆసుపత్రి వుంది. అక్కడికి తీసుకవెళ్తే బాగుంటుంది. మా బండి ఇంటిముందే వుంది. తీసుకపో" అన్నాడు పరమేశ్వరయ్య. అతడు జాలిగుండె కలవాడు. ఎవరికి ఏ ఆపదవచ్చినా తనకు చేతనైన సహాయం చేసి తృప్తి పొందుతాడు.

వీరయ్య, అతని తల్లి, వాళ్ళ పక్కింటాయన బండిలో బయలుదేరారు.

వీరయ్యను కరీంనగర్ ఆసుపత్రికి చేర్చక ముందే ఇంటికి తేవలసి వచ్చింది.

(కథాంజలి మాసపత్రిక - డిసెంబరు 1981)

(ఈ తరం కథలు - రేగులపాటి కిషన్‌రావు - (1983) నుండి)

8

ఎట్టి

-డా॥ బి. దామోదర రావు

"నీయవ్వ! పొద్దుగాల్నే రమ్మన్నడట దొరెందుకో" అనుకుంట ఒక చేత్తో కట్టెపట్టుకొని మరోచేత్తో పైపంచె మీదేసుకొని ఊళ్ళెకొచ్చిండు రాజడు.

నడిఊర్లె కచేరి దగ్గర్నే కనిపించిండు దొర. మిగిలిన సుంకరోళ్ళందరికి పనులు చెప్పవట్టె. దగ్గరికి పోయి 'దండం పెట్టున్న బాంచెను' అన్నడు రాజడు. దొర చూపులు ఇటు తిరిగినయి. కండ్లు చింత నిప్పులైనయి. "ఏందిరా లమ్డికే నెత్తి తిరుగుతుందా ఏంది! మస్కుల్నే రమ్మంటే పొద్దెక్కినంక వచ్చినవు, పెండ్లాం రానియ్య లేదా ఎందిరో" అన్నడు.

రాజడికి కొత్తగా పెండ్లయింది. పెండ్లికి దొర అప్పిచ్చిండు. పెండ్లయి దొర దగ్గరికి దండం పెడ్తామని అచ్చినప్పుడే దొర రాజినెట్లో చూసిండు. గది యాది కొచ్చి బుగులైంది రాజనికి.

"ఏందిరా మాట్లాడవు, బెల్లం గొట్టిన రాయోలె గట్ల బీరిపోయి నిలవడ్తివి, నేనేం చెప్పిన, ఊరవతల బిచ్చగాళ్ల తాన చాపలు వుంటే అన్ని పట్టుకరా సమజయిందా" అనుకుంట తానుకూర్చున్న గద్దెదిగి, నోట్లో పండ్లపుల్ల వేసుకొని గడిలోకి పోయిండు దొర.

రాజనికి, మనసున పడ్తలేదు. గా బిచ్చపోళ్ళు అడుక్కు తినేటోళ్ళు గాళ్ళతాన, ఎట్ల తేవాలే, గాని తప్పేటట్లు లేదు అని మనసుల అనుకుంట ఊరి బయటకొచ్చిండు.

అక్కడక్కడ కలిపి పది, పదిహేను గుడిసెలున్నయి. వాళ్ళంతా ఊరూరు తిరిగే బిచ్చగాళ్ళు. చాపలల్లి అమ్ముకొని బతుకుతారు.

గుడిసెముందు చాప అల్లుతూ, కూచున్నడు పోచయ్య. వాడి మనసంతా గుడిసెలోని కొడుకు మీదే ఉంది. ఈ చాప అల్లితె దీంతో కలిపి నాలుగు చాపలైతయి వాట్ని అమ్మి పోరనికి సూది మందిప్పియాలే అనుకుంటుండు. 'గా సర్కారు దవాకాన్ల మందులు పోసే టోనికాడ్కించి అందరు ఆశగ సూసిన్రు, నర్సమ్మ చాకు పైసలిడిగింది. అన్ని కలిపి పది రూపాయలన్న కావాలె తన తాడ, రెండు రూప్రాయలున్నయి, ఊర్లె దొర లింట్ల లగ్గమని తెల్సింది. గాల్లకు గీచాపలమ్మితే, పైసలస్తయి అనుకున్నడు. ఒకసారి చాపల్దిక్కు చూసిండు. గట్టిగా పట్టుపడ్తె గంటలయితయి అనుకున్నడు.

"ఏం, రా ! పోచయ్య దొరతోలిండు" అన్న రాజడి మాటలతో ఈ లోకంలోకి వచ్చిండు

ఏం సమజయిలేదు పోచయ్యకు, రాజడి మొఖం చూచిండు ఎందుకన్నట్టు

చిన్నదొర్సాని పెండ్లికి మీతాడ ఇంటికి అయిదు సాపలు తీసుకరమ్మన్నడు దొర, ఈడున్నోలంతా

యిస్తున్నరు, నువ్వు కూడా ఇయ్యాలి బిడ్డా అన్నడు రాజడు తానే దొరయినట్టు దర్జాగా. రాజడు అక్కడున్న బండమీద కూచున్నడు ఇచ్చెదాక కదలనన్నట్టు, చుట్ట ముట్టిచ్చిండు.

పోచయ్య గుండెలోరాయి పడ్డట్టయింది తన పోరన్ని ఎవరో ఎత్తుకపోతున్నట్లు అనిపించింది అందుకే ఏమైతే అదైయిందని "నాతాడ లేవు రాజన్నా ! గీ చాపనే అమ్ముకొని పోరనికి మందు పోయించాలే, గానికి మూడ్రోజుల కొద్ది జరం రావట్టె" అన్నాడు పోచయ్య.

రాజడు కోపంగా చూచిండు, "గంతేనంటవ దొరపని సుమా, ఏమనుకుంటున్నవో" అన్నడు రాజడు తానే దొరయినట్లు చూస్తూ లేచిండు.

"కాల్లు మొక్కుతని సెప్పు, బాంచెనయితనని సెప్పు రాజన్న పోరడు మందు లేక సత్తడు సుమా, పోరడు బతుకుతే ఐదుగాదు పది సాపలిత్తనని సెప్పు" అన్నడు, భయం గుండె లోతుల్లో నిండుకుంది. పక్కవాళ్ళిచ్చిన చాపలు తీసుకొని రాజడు వెళ్ళిపోయిండు. రాజవ్వ లోపల్నుండి వచ్చింది ఇంతసేపు వాళ్ళ మాటలు విన్నది. "దోరూరుకుంటడ గిట్లన్నవు" అంది పోచయ్య చేతికి ఈత కమ్మలందిస్తూ.

"మల్లేంచేద్దామే, అందరు పోంగ మిగిలినోడు మన ఇస్తారి, గీడు కూడసత్తుంటే చూద్దామా' అన్నాడు తలకిందికి దించుకొని తన పని తాను చూచుకుంట.

రాజికి ఏడుపొచ్చింది. దేముడా నా పోరన్ని సల్లగా సూడమని మొక్కింది.

"దొర రమ్మంటుండు" అంటూ మళ్ళీ వచ్చిండు రాజడు. వారితో పాటు ఇంకిద్దరు సుంకరోళ్ళచ్చిన్రు. ఇంట్లకు పోయి మూడుచాపలు తెచ్చిన్రు, బయట పోచయ్య చేతిలోపూర్తయితున్న చాప గుంజుకున్నరు. రాజి ఏడుస్తూ రాజని కాళ్ళపై పడ్డది "ఆ చాపలు తీసుకపోకే రాజన్నా" అంటూ

"దొరతో చెప్పుకుందురా గదేందో" అంటూ కాళ్ళను విదిలించుకున్నడు రాజడు

పోరడు జరంతో మూలుగుతున్నడు అవ్వా అవ్వా అంటూ

రాజిని పోరని దగ్గరే ఉండమని పోచయ్య వెళ్ళిపోయిండు వచ్చిన మనుషులతో

"ఏంరా ! మస్తెక్కినాదిరా ! గాడిద కొడుకా, బద్మాష్ చాపలుండగనే లేవంటవ్, సువ్వర్‌కే, ఎందుకియ్యలే" అంటూ దొర పోచయ్యను చూచి గద్దెదిగిండు. కచ్చేరి కాడ జనమంతా మూగిన్రు. పెద్దొరడుగుతే, చాపలియ్య అని అన్న పోచయ్యను చూడాలని ఊరంతా వచ్చింది.

"నీ బాంచెను దొర, నీగులాపోన్ని దొర నీ కాళ్ళు మొక్కుత నా తాడ ఉన్నయే గీ చాపలు. గీట్ని అమ్ముతనే నాకూటికి నా పోరని మందులకు అయితయి దొర. లేకుంటే నా పోరడు సత్తడు దొర' ' అంటూ దొరరెండు కాళ్ళు పట్టుకున్నడు పోచయ్య.

"బద్మాష్, నకురాలు చేయవట్టివి, మనిషివి తోల్తే లెవ్వంటవు. నాకే లెవ్వంటవు లంజకొడుకా! మీకు కావురం పట్టింది" అంటూ దొర పోచయ్య జట్టుపట్టి చెంపలపై పేడీలుమని కొట్టిండు. పోచయ్య ఏనుకకు ఇరుసుకపడ్డడు.

"ఈ గాడ్దికొడుకుని, ఈడిగుడిసెపీకి గీ ఊరినుండి ఎల్లగొట్టుండ్రి. గట్లయితే గీడిమస్తి దిగుతది ' అనుకుంట మోటుమాటలు తిడ్తూ వెళ్ళిపోయిండు దొర.

పోచయ్యను సింహం విడిచిన చిట్టెలుకను చూచినట్టు చూచిన్రు జనం. "పొద్దెక్కే వరకు గుడిసెగిడిసె ఇడిసెల్లిపోకుంటే దొర పానం తీత్తడు" అన్నడు రాజడు. ఇంటి మొఖం పట్టిండు పోచయ్య.

పొద్దిగూకినంక ఊర్లేకు పెండ్లోళ్ళు వచ్చిన్రు. ఊర్ల ఉషారుగున్నరు. ఊరవతల బడికాడ చాపలు పరిచిన్రు. దొర అల్లునికి ఎదుర్కోళ్లు అయితన్నయి.

పోచయ్య ఇంట్లో దీపం ఆరిపోయింది, వాని పొరడు ఇస్తారి అన్ని వదిలిపెట్టిండు.

రాజి గుడిసెనంతా విప్పి కట్టగా కట్టింది. పోచయ్య పోరని శవాన్ని భుజంమీద ఏసుకున్నడు. నెత్తిమీద ఓ మూటపెట్టుకున్నడు. చుట్టు మిగతా గుడిసెలోల్లు, కులపోల్లు కూడ మందలిస్తలేరు, గిట్లగే ఉంటదిలోకం అనుకున్నడు పోచయ్య. అయినా, రాజి గుడిసెకట్టల్ని కావడికి కట్టి ఎద్దుమీద వేసింది. తనోళ్ళతో సెప్పింది.

మొగపెళ్ళి వాళ్ళ బరాత్ మొదలైంది. పరచిన చాపలు తొక్కుకుంట అందరు లేసిన్రు.

పోచయ్య చాపపై దొర అడుగులు అతని ఛాతీపై నడుస్తున్నట్టు. పోచయ్య దీనంగా నడుస్తున్నాడు. ఛూ ! ఏం బతుకిది, ఏం మనుసులు అని ఆలోచిస్తున్నడు. ఊరు దాటిన్రు, ఊరి పొలిమేర దాటినంక పోరన్ని బొందపెట్టిన్రు.

"ఏడికి పోదాం" అడిగింది రాజి ఏడుపునాపుకుంట.

కరువు తీరా ఏడ్చిండు పోచయ్య.

రాజీ ఏడ్చింది.

"ఏడికి పోదామే ! ఎట్టిలేని ఏట్లోకి ఛూ గీ లోకం పాడుగాను" అనుకుంట లేచిండు పోచయ్య.

మయూరి సచిత్ర వార పత్రిక

("సింగిడి" డా॥ బి. దామోదర రావు కథలు 1993 నుండి)

* * *

9

ఇల్లు

-తుమ్మేటి రఘోత్తంరెడ్డి

"పొద్దు పొడుపూ... మెరుపు తీగా...

పొయ్యేటి మేనత్తకూతురా..."

దూరంగా ఉన్న బొగ్గుగని కార్మికుల గుడిశెల్లోంచి ఎవరో ఇంకా గ్రామ జీవితాన్ని మరువని కార్మికుడు కాబోలు ! ఒక జానపద గీతం పాడుతున్నడు. ఆ రాత్రి గుడిశెముందు మంచంలో వెల్లకిలా పండుకున్న నారాయణకు మనసంతా వికలమైంది.

పెళ్ళై ఆర్నెళ్ళైనా కాపురానికి తీసుకురాని తన భార్య యాదికచ్చింది. ఈ విషయంలో పట్టీపట్టనట్టుగ ప్రవర్తిస్తున్న తల్లీతండ్రి మీద చెప్పరాని కోపం వచ్చింది.

మంచంలోంచి విసురుగా లేచి వీధిలోకి నడిచాడు.

పాట విన్పిస్తూనే వుంది. అవటానికి ఆపాట బావామరదళ్ల సరసగీతమే

అయినా జీవితం తాలూకు విషాదమేదో ఆపాటగాని గొంతులో అంతర్లీనంగా ధ్వనిస్తోంది.

నారాయణ మంచంలోంచి కోపంగా లేచిపోయిన సంగతి అన్నం తింటున్న సూరమ్మ చూసింది. మొగని మీద తగని కోపం వచ్చింది. కంచంలోకి అన్నం ఆటుమూటుగా కలుపుతూ -

"అతారే లేని సుతారి ఏడూళ్ళిండ్లకు గోడలు పెడుతనన్నడట ! గట్లనే వున్నది నీ శాత్రం" అన్నది సూరమ్మ అందాక భర్త చెప్పిన మాటలు విని కోపం తెచ్చుకొని.

వీరయ్య అన్నం తిని బ్రేవ్‌మని చెయ్యి కడుక్కుంటూ -

"నీయక్క నాలుగు రోజులాగరాదు ! సూసుకుంటుండంగనే ఎసొంటిల్లుకడుతనో ! అన్నడు దాని మీద సూరమ్మ గయ్...మని లేచింది. "మాట మాట్లాడితే నడుమ గదెందుకత్తది ? నీయక్కట ! అక్క... నా పేరు బాతాల పోశెట్టి, మూడెడ్లు, ముప్పయ్యార్ దొడ్లు అన్నట్లు గదే పాటగని అది కట్టంది లేదు పెయింది లేదాయె ! నువ్వు కట్టే వరకు అసలాడ సింగరేణి కంపినే లేసిపోద్ది" (బొగ్గు కంపెని) అనుకుంట తిన్న కంచాలు తీసుకుని బయటకు వచ్చి గుడిశె వెనక దిక్కుపోయింది. అడవిదంతె పొరుక తడకల మీద నుంచి అవల దిక్కు నీళ్ళుపోసింది. తడికెల అవల చీకట్లోంచి ఒక మానవాకారం చేత్తో చెంబు పట్టుకొని సణుక్కుంట దూరంగా పోయింది. సూర్యమ్మకు ఆ స్థితి చూడగానే నవ్వు వచ్చింది. మరోసారి అయితే ఎంత తిట్టిపోసేదో ? కంచాలు అట్ల చేత్తో పట్టుకొని చప్పుడు కాకుంట నవ్వింది. నవ్వుతూ నవ్వుతూనే.

"దీనింట్ల పీనుగెల్ల ! జాగేడదొరుక లేదో ?" అని "బతుకులు పాడుగాను ఎంత అద్వాన్నమయిపోయినయ్ ? అరిసెయ్యెట్ట జాగ లేకుంటాయె" అన్నది కంచాలు కడుక్కుంట. సూరమ్మ యింకా చాలా అనుకుంది. బాయి పనోళ్ళ బతుకుల గురించి రోజు అనుకొన్నట్టే అనుకొని నిట్టూర్చింది. తిరిగి యింట్లకు వస్తుంటే బజారు నుంచి కొడుకు నారాయణ తిరిగొచ్చి పందిరికింద మంచంల 'అటు మూటు'గ పండుకున్నడు. సూరమ్మ కొడుకు వాలకం చూసి మళ్ళ నిట్టూర్చింది. గుడిశెలోపల కిరోసిన్ దీపం గుడ్డిగా వెలుగుతోంది. పాత నులుక మంచంలో కూర్చుని మోదుగాకు చుట్ట చుట్టుకుంటున్న భర్తను చూసి 'యింత' కోపం తెచ్చుకున్నది. చేతిలో కంచాలు విసురగ పెట్టేసి మంచం దగ్గరికి వచ్చి,

"ఎన్నిసార్లు జెప్పినా దున్నపోతు మీద వాన గురిసినట్టేనాయె! గటుపోరని దిక్కుసూడు. నీకు తిండెట్ల పెయిన బడ్తాంది ? అదెపాయె ఓనూరో యాబయోపోనియ్ ఏన్నన్న యిల్లు కిరాయికి తీసుకొమ్మని చెప్పినా యినక పోతివి లగ్గమంట చేసి ఆర్నెల్లాయెగని యిదువారకు తీసుక పెయింది లేదని' మీ యియ్యపురాలు ఆవాడ నుంచి యీవాడకు యినచ్చేటట్టు అంటాంది, ఎవరికెనా నీకు ?' అన్నది సూరమ్మ లోగొంతుతో.

" నా తండ్లాటంత మిలమిల సూసుకుంట ఎట్లన బుద్ధయితదే నీకు ?"

"మా తండ్లాడ్తనవ్ !" మూతి తిప్పింది సూరమ్మ !

"నా తిప్పలు నీ కెమెరుకలే...మరి తీసుకచ్చుకొమ్మని చెప్పకపోయినవ్...మనం గా పందిరి కింద పన్నా తెల్లారుద్ది" అన్నాడు చుట్ట కొరుకుతూ.

"శనివారం బాయిలు బందేనాయె. పొయ్యి కోడల్ను తీసుకురారాదు బిడ్డా అంటె సప్పుడు లేదు సరిలేదు అదేదో నువ్వే చెప్పు" అన్నది సూరమ్మ. వీరయ్య లేచి దర్వాజలోంచి బయటకు సూసిండు. ఎదురుగుడిశెవాళ్ళు అంటించిన బొగ్గు పొయ్యి వెలుగు తడికె సందులోంచి మంచంల పడుకున్న నారాయణ ముఖం మీద ఎర్రగా పడుతోంది. చాలాసేపు కొడుకును సూసిండు. ఏదో ఆలోచనల్ల వడి నిలబడిపోయిండు.

తండ్రికొడుకు లిద్దరు సెవెనింక్లైన్ (7వ నెంబరు బొగ్గుగని)లో పనిచేస్తున్నారు. తండ్రి కోల్‌ఫిల్లర్, కొడుకు బదిలి ఫిల్లర్‌గ (టెంపరరీ కోల్‌ఫిల్లర్) పని చేస్తున్నారు. తండ్రితో పనిచేసే జలాల్ తన పిల్లి గెడ్డాన్ని సవరించుకుంటు అప్పుడప్పుడు ఆ విషయం గురించే చాలా చమత్కారంగా. 'పులి కడుపున పులి కోల్‌ఫిల్లర్ కడుపున బదిలీ ఫిల్లర్" అని నవ్వుతడు.

నారాయణ పదో తరగతి దాకా చదివిండు. 'గని' పనిలోచేరి కొంతకాలమే అయింది. కాబట్టి ఆరోగ్యంగనే వున్నడు. పైగా యీడుమీదున్న మనిషి. వీరయ్య అట్ల నిలబడి కొడుకును చూస్తూవుంటే నారాయణ మాత్రం పోయిన ఎండాకాలంలో పెండ్లి చేసుకున్న తన భార్య గురించి ఆలోచిస్తూన్నడు. భార్య అంటే సుజాత. సుజాతకూ తనకు పెండ్లయి ఆరునెలలు అయింది. అదే మురికిపేటలో ఆ చివర రేకులషెడ్డు తన మామది. పెండ్లి అయినంక చాలా సార్లు అటుపోతూనో యిటు పోతూనో చూసుకొని ముసిముసిగ నవ్వుకునేటోళ్ళు. వాళ్ళ సరసం ముసిముసినవ్వులతోనే సరిపెట్టుకోవలసి వచ్చేది. లోపట లోపట నారాయణ బాగా బాధపడేవాడు. పెండ్లి అయి యింతకాలం అయినా భార్యను తీసుకురానందుకు అదో తరీఖ మొఖం చిన్న బుచ్చుకొనెటోడు. తీసుకొస్తే మాత్రం ఏం లాభం ? ఒకే ఒక్క గుడిశె. పోని పక్కనరెండు సిమెంటు రేకులుకొని షెడ్డుతీరుగ వేద్దామంటె అరిచెయ్యి వెడల్పు జాగా కూడా లేదు. అవుతలిక. ఇవుతలికి. పోవాలంటెనే ఎంతో దూరం బొవాలె. ఆపాటికె ఆనికి గోచిలోనే

పడుతుంది ! అంత దూరం మరి !

నారాయణ మంచంలో అటూయిటూ అసంతృప్తిగా కదిలిండు. ఆ కదలికలో సహజంగ ఆ వయస్సులో మరో మనిషి పొందుకోసం న్యాయమైన ఆరాటం వున్నది. అది నెరవేరడం లేదని అసంతృప్తి వున్నది.

చిన్న గుడిశె మీద, కన్నవాళ్ళ మీద ఒక్కోసారి కోపం వస్తుంది. సరిగ్గా అదే కోపం ఇప్పుడు వచ్చింది. వీరయ్య ఆలోచనల్ని ఆపేసుకుని మంచం పక్కకు నడిచిండు. మీద నీడపడటంతో కొద్దిగా తలతప్పి చూసిండు. చూసి అలక్ష్యంగా అటు తిరిగి పడుకున్నడు నారాయణ. వీరయ్యకు ఎట్ల చెప్పడమో తోచలేదు.

పైన పందిరి కట్టెను ఆసరాగ పట్టుకొని నారాయణను వుద్దేశించి

"అవ్వ పొద్దట్నుంచే చెప్తాందట ! పోయి పొల్లను తీసుకచ్చకోరాదు బిడ్డా" అన్నడు. నారాయణ మంచంల నుంచి చివ్వున లేచిండు. లేచి చెప్పులు తొడుక్కచ్చుకోని బయట వీధిలోకి వచ్చిండు. వీధి సన్నగా వున్నది, చెత్తగా వున్నది. మురుగుకాల్వలతో బురదగా వున్నది. అయినా దబదబ నడిచిపోతున్నడు. కొద్దిదూరంలోనే వున్న 'కోల్‌స్క్రీనింగ్' ప్లాట్‌ఫారమ్‌లోంచి దడదడ బొగ్గు పెళ్ళలు బంకర్లలో పడుతున్న చప్పుడు వినబడుతుంది. ఎదురుగా గోదావరి ఒడ్డుకు కొద్ది దూరం వున్న పవర్‌హౌజ్ పొగగొట్టాల్లోంచి నల్లనిపొగ బుసబుస పైకి చిమ్ముతోంది. నారాయణ యిరుకు సందులోంచి చిన్న వీధిలోకి వచ్చిండు. వీధిలో జనసంచారం రోజులాగే జోరుగ వున్నది. వచ్చేపోయేవారితో సందడిగ వున్నది. పాలిపోయిన వెన్నెల వెలుగులో సన్నని దుమ్ము లేస్తున్నది. మామూలుగ అలవాటు తప్పని పందులు, కుక్కలు, గొడ్డులు, ఆ వీధుల్లో, వీధుల్లోని గుడిశెల చుట్టు తిరుగుతున్నయి. నారాయణకు ఒకామె ఎదురైంది. ఆమె నెత్తిమీద గంపనిండ సామానున్నది. ఆమె ముఖం మాత్రం హుషారుగున్నది. "నీతల పండు పలుగ, కనబడ్తనేలెవ్వు" అని మోటు పరాశిక మాడింది నారాయణతో. నారాయణకు ఆమె వరుసకు వదిన అవుతుంది. మరోసారి అయితే "నీ అసోంటళ్ళను ఎంతమందిని యీ సేతుల్తోని అవుతల పారేత్తనో వదినా" అనేవాడు. కాని సరసర పోనేపోయిండు. "పిలగానికి ఏమొ పుట్టింది" అనుకుని సందు తిరిగిపోయిందామె. నారాయణ కొద్దిదూరం నడిచి ఒక పాన్‌షాప్ ముందున్న చెక్క బేంచీపై కూర్చున్నడు. షాప్‌లో పెట్రోమాక్స్‌లైటు వేడిగా వెలుగుతున్నది. షాపుల కూర్చున్న దొడ్డుమొఖపాయినె పత్రిక పట్టుకొని పరపర విసురుకుంటు.

"ఏం సంగతి తమ్ముడూ ?" అని అడిగాడు.

"పాన్ కట్టు".

"ఎన్నడూ లేంది యిదేం బుద్దిరో ? ఏం పాన్‌గట్టాలె"

"ఏదో ఒకటి"

"అదేందిరో పోరి మీద అలిగినవా"పరాశిక మాడిండు షాప్ అతను. నారాయణ తన వెనుక ఎవరో నిలబడ్డట్టు ఆయెసరికి వెనుకకు తిరిగి సూసిండు. చూసి ముఖం చిట్లించిండు.

"పొమ్మని అంటెనే గిట్ల వురికత్త వేంది బిడ్డా ? " అన్నడు నిమ్మళంగ వీరయ్య.

"వురికిరాక ఏం జెయ్యాలె ?" మాటలు తయారుచేసి పెట్టుకున్నట్టు అన్నాడు నారాయణ.

"అదిగాదు బిడ్డా రేపు పొద్దున పోతే సాయంత్రం తీసుకొని రావచ్చు గద" వీరయ్య మాట పూర్తిగాక ముందే లేచి నిలబడి -

"తీసుకచ్చుకొని ఎవల మంచం కింద పండవెట్టాలె" అన్నడు, అని పాన్ అందుకుని యింటిముఖం పట్టిండు. వీరయ్య ప్రాణం వుస్సురన్నది. షాపువాలా తండ్రీ, కొడుకుల సంభాషణ విని "వీరన్నా ! కొద్దిసేపు అట్ల బెంచిమీద కూసో, లక్ష్మి రాజం వస్తడు" అని చెప్పి ఎవరో వస్తే పత్రికలు అమ్ముకోవడంలో మునిగిండు.

వీరయ్యకు కొడుకు అన్నమాటలు యాదొచ్చినయి. వాడన్నమాటల్లో తప్పేం వున్నది అనుకున్నడు. ఆ వయస్సు అటువంటిది. ఆ వయసులో తాను సూరమ్మ కలిసి ఎల్లె టూర్లో గడిపిన వైనం యాదికొచ్చింది. "చీ చీ ఒక్క కొడుకు, పెండ్లంట చేస్తే ఓ గుడిశె కట్టియ్యకపోతి" అని విచారపడ్డడు. తన అశక్తత మీద అసహ్యం వేసింది. "నీ తల్లి ! యిన్నేండ్లు బాయిపని చేసినా ఒక కోటరు (క్వార్టర్) కూడ యియ్యకపాయె కంపిని" అని బయటికే అనుకున్నడు. ఎట్లన్నజేసి పోరనికి ఓ గుడిశెకట్టాలె. రెప్పొద్దున బాయికాడ చెప్పాలె వీలైతే లచ్చిరాజంకు కూడ చెప్పాలె. వాళ్ళు అయితేనే కస యాడనన్న జాగజూసి గుడిశె నిలబడెటట్టు చూస్తారు. నా వొక్కన్నుంచి ఆయెపనిగాదు మారి, యింకా ఆగుతె పోరడు తెర్లయితడు" అనుకుంట కూర్చున్నడు.

"ఏం పెద్దయ్యా...తేరిపార కూసున్నవు ?"

"తమ్ముడింట్లనే వున్నడా ?" అని వీరయ్యను వుద్దేశించి ఎవరో అడిగిండ్రు. వీరయ్య తలెత్తి వచ్చిన మనిషి దిక్కు చూసిండు. బాగా పరిచయం వున్న మనిషి. అమ్మోరు మచ్చల మొఖం. బక్కమనిషి. అంతలోనే షాపతను కలుగచేసుకుంటూ నీ కోసమే కూసున్నడు" అని చెప్పిండు. 'అట్లనా' అని చేతిలో వున్న వరుకుసంచి బెంచిపై పెట్టి విషయం చెప్పమని ఆసక్తిగా అడిగిండు లక్ష్మిరాజం. వీరయ్య క్రితం దాకా జరిగిన తన యింటి సంగతి చెప్పిండు. అంతా విన్న తరువాత,

"పెద్దయ్యా ఇది గుడిశె గుడిశె భాగోతమే ! నీ తీరుగనే శానమంది చెప్తాండ్రు, ఏదో ఒకటి చెయ్యాలె. రైలు కట్టావల కంపిని ఖాలిజాగ బోలెడున్నది. కొద్దిగ ధైర్యం జేస్తూ సూత్తి మనెటాళ్ళకు తలోగుడిశె ఏసుకోవచ్చు" అన్నడు లక్ష్మిరాజం.

"మాయ్యగాదు బాంచెను. అదేదో జెరజెప్పన అయెటట్టు సూడు" అని లక్ష్మిరాజంను ప్రాధేయ పూర్వకంగ చెయ్యి పట్టుకొన్నడు. చెయ్యి విడిపించుకొని రెప్పొద్దున బాయికాడ మనోళ్ళందరికి చెప్తాం. అందరికి ఇదే యిబ్బంది గద. అదిగాక ఈ గుడిశెల్ల ఒక్క బాయి కార్మికులు లేరుగద. ఏదో రోజు మనకు వీలు అయినప్పుడు గుడిశెల్ల అందర్ని కలుసుకుందాం. అయితే ఈ విషయం బయటికి తెలుసుడు మంచిగాదు. రెండు మూడు రోజుల్ల ఏదో ఒకటి తెలుస్తదిగని నువ్వేం పికర్ పెట్టుకోకు" అని వరుకుసంచి తీసుకొని పోతుంటే వీరయ్య మళ్ళీ దీనంగ అన్నడు. "గా రంధి వాత్తె నాకు నిమ్మళం బిడ్డా !"అన్నడు. "నేను తమ్మునితో చెప్తలేవె, అలుగుతె అయితయా పనులు ముందుబడి చెయ్యాలెగని. నీకేం రంధి అక్కర్లేదు నారాయణను ఓసారి కలువుమను" అని మరెవరో కలిస్తే మాట్లాడుకుంట పోయిండు. వీరయ్య కొంచెం నిమ్మళంగ యింటిదారి పట్టిండు.

2

ఉదయం ఏడుగంటలకు పదినిమిషాలు ముందుగానే ఏడుగంటల సైరన్ ఏడ్చినట్లు కూసింది.

చీమల్లాగున సరసరలాడుతూ, సైకిల్ గంటలు గణగణ లాడిస్తూ డ్యూటీలకు పోతున్నరు కార్మికులు. రోడ్డుమీదబొగ్గు ట్రాన్స్‌పోర్ట్ చేసే లారీలు చాలా వేగంగా బొగ్గు దుమ్ములేపుకుంటు పరుగెత్తుతున్నయి. సైకిల్ మోటార్లు యింకా పెద్ద అధికార్లు, అన్నీ కలిసి ఆ రోడ్డంత చాలా సందడిగ వురుకులు పరుగుల మీద వున్నది. అటువంటి లారీ రోడ్డుకు, రైల్వే లైనుకు మధ్య అరకిలో మీటరు పొడుగునా నిన్నటిదాకా ఖాలీగ కన్పించిన జాగాలో యీరోజు కన్పిస్తున్న గుడిశెల్ని చూస్తూ ముగ్ధులైపోతున్నరు కార్మికులు. నుదుర్లు ముడిచి ముడిచి చూస్తూపోతున్నరు అధికార్లు. ఎంతలేదన్నా అయిదువందల పైచిలుకు గుడిశెలు. అవన్ని తాత్కాలికంగ వేసుకున్నవేనని చూసేవాల్ళు చూడంగనే అనుకుంటున్నరు. వెదురు బొంగులతో, తడికలతో తెల్లారేసరికల్లా గుడిశెలు లేచి కూర్చున్నయి, తలుపులు గోడలు పై కప్పులు అన్నీ కంక తడుకలే. కొంతమంది కార్మికులు మాత్రం "యిదంత ప్లాను ప్రకారమే జరిగుంటది" అని తీర్మానించుకున్నరు. యీ ఖాళీజాగాలో గుడిశెలు వేసుకోవడం చూసిన కాలరీ కార్మికులు కొందరు మరునాడు తెల్లారెసరికల్లా ఖాళీగవున్న కంపిని భూముల్ని తలాయింత హద్దురాళ్ళు పాతియిండ్లకోసం ఆపేసుకున్నరు.

నారాయణకు మూడోవరుసలో అయిదోయిల్లు వచ్చింది. సుజాతను తీసుకవచ్చిండు. ఒక్కొక్క గుడిశెలో ఒక్కొక్క చిన్న సంసారం అంతా దాదాపు పడుచువాళ్ళే ! వాళ్ళలో ఒకటే సంతోషం, ఏదో సాధించామని తృప్తి ఆ కొత్త గుడిశెల ప్రాంతమంత వెదురువాసన వేస్తూ అదోరకంగా బాగున్నది. అంతా ఆ గుడిశెకు యీ గుడిశెకు ఆసుగొయ్యల తీరుగ హడావుడి చేస్తున్నారు. ఓ వారం రోజులు గడిచినయి. నారాయణ ఇంటికి, అటు అత్తగారు యిటు అవ్వగారు వచ్చి మంచి చెడు కనుక్కపోతున్నరు. యిద్దరు వియ్యపురాళ్ళ మధ్య మంచి సఖ్యత కూడ కుదిరిందిప్పుడు. నారాయణ వారంరోజుల్లో నాలుగురోజులు సెలవు పెట్టిండు. భార్యతో కలిసి మూడు సినిమాలు చూసిండు. యింట్లోకి కావాల్సిన సామాను కొనుక్కోమని తన జీతంలోంచి కూడ కొంత కొడుక్కే యిచ్చిండు వీరయ్య. రెండు వందల రూపాయలు గుడిశెక్కావలసిన కంక బొంగులు, తడికెలు వగైరాకు ఖర్చుఅయినవి. యింకా బాగానే మిగిలింది. యింట్లోకి కొంత సామాను కొనుక్కున్నడు. మిగిలిన దాంట్లోంచి పది రూపాయలు గుడిశెల కమిటీకి సంతోషంగ లెక్క ప్రకారం యిచ్చుకున్నడు. ఆ విధంగ సుజాతతో కలిసి మహదానందంగ గడుపుతున్నాడు నారాయణ. యిక కష్టం తీరిందని అనుకున్నరు. కొన్నాళ్ళకి నాలుగుగోడలు లేపుకొని పైన నాలుగు సిమెంటు రేకులు వేసుకుంటె చింత తీరుద్దని తలపోసిండ్రు. గుడిశె వెనుక నాటవలసిన బంతిచెట్ల గురించి సుజాత ఆలోచించింది. కాని కార్మికులు ఒకటి తలిస్తె మేనేజిమెంటు మరోటి తలిచె !

3

వాళ్ళ ఆనందాన్ని నింపుక పోవుటానికి ఒకనాటి తెల్లవారుజామున పదిలారీలు, వందమంది సాయుధులైన పోలీసులు, రెండు వందల మంది కంపెని వాచ్‌మన్ను, పోలీస్ యిన్స్పెక్టరు, కంపెని వాచ్‌మెన్ యిన్స్పెక్టర్ వచ్చి దిగిండ్రు. అమీన్ దిగుతూనే లారీకర్ర అటూయిటూ తిప్పుకుంట గుడిశెల ముందుకు వచ్చిండు. వూహించిన పరిణామం గనుక చాలామంది కార్మికులు బెదరలేదు. అప్పటికే గుడిశెల్లోని ఆడామగా వీధుల్లోకి వచ్చిండ్రు.

అమీన్ నారాయణ గుడిశెముందు కచ్చి ఆగిండు. తడుకమీద కర్రతో ఓదెబ్బ వేసిండు. నారాయణ గుడిశె లోపల్నుంచి రయ్...మని బయటకు వచ్చిండు. సుజాత కూడ గలుమల నిలబడి చూస్నున్నది.

"ఏంరా ? గుడిశెలు ఎవల్నడిగి వేసుకున్నరా ?" పెద్ద జమీందారు తీరుగ అడిగిండు అమీన్.

"కంపెని జాగేనయె ! కంపిన్ల పన్జేసెటోళ్ళమేనాయె ఎవళ్ళడుగుడేంది" నారాయణ జవాబుల వినయం లేదని కోపంగ చూసిండు అమీన్.

"కావన్నంటె మేం జి.యమ్.ను అడుగుతమ్ గని గుడిశెలు పీకుటానికి వీల్లేదు" జబర్దస్తిగ పిల్లికండ్ల కార్మికుడొకడు ముందుకచ్చిండు. ఆ కండ్ల దిక్కు గుర్రుగ చూసిండు అమీన్. చూసి ఒకడుగు ముందుకువేసి,

"అంతా మీ యిష్టమైతే నడుమ మే మెందుకురా..." అన్నాడు.

"గుడిశెలు పీకుతరా ! పీకించాలా" ఒక పోలీసు ముందు కచ్చిండు.

"నీకేమైతాందయ్యా...లావూ...ఏమో మీ తాత పెరట్ల ఏసుకున్నట్టు మాట్లాడ్తానవ్ ?" గదమాయించినట్లు ఓదెమ్మ అన్నది.

"చూసి రమ్మంటె కాల్చుకచ్చినట్లు, వీళ్ళ జులుమేందండి" పోలీసు వెనక్కి తగ్గిండు. "తెచ్చిపెట్టుకున్న ధైర్యం జూడు" అని ఒకడన్నడు మరొకనితో మెల్లగ.

"పీకి పారేసుటానికి ఏసుకోలేదు" జారుతున్న పిల్లలను ఎగదోసుకుంట ఒకామె ముందుకచ్చింది.

"అసలు పోలీసులకు గిదింతోని ఏమి సంబంధం ?" పాయింటు లాగింది బెల్లంపల్లి లచ్చమ్మ.

"అసలా గుడిశెలు వేయించిదెవరు ?" అన్నడు అమీన్ చిరాకుగ

"ఎవరెందుకు వేయించుతరయ్యా ? కడుపు నొచ్చెటోడు వోమ బుక్కుతడుగని" కొమురయ్య మందిల కెల్లి ముందుకచ్చి అన్నడు.

"బాగ తింటె కడుపునొస్తది బిడ్డా ! గుడిశెలెవలు ఏయించింగ్రో, పేర్లు చెప్పు" అమీన్.

"మళ్ళ గట్లనే అడ్డుతావేందయ ?వుండటానికి జాగలేక మేం అందరం కలిసే ఏసుకున్నాం. దానిమీద తఖర్దమ్ చేస్తే ఎట్లనయ." అని గాజులు గలగల లాడుతుంటె పిల్లవాన్ని పొదివి పట్టుకొని ఒక లంబడి స్త్రీ అన్నది.

ఆమె చంకల వున్న చిన్నపిల్లవాడు అమీన్ మొఖం మీద గొర్రె కొమ్ముల తీరుగవున్న మీసాలు కదులుతుంటే చాలా తమాషగ చూస్తున్నాడు. అమీన్ కొమురయ్య దగ్గరికి వచ్చి భుజంమీద లాఠీ ఆనించి.

"లావు లావు మాట్లాడుతున్నవు లీడరువా బిడ్డ ? గుడిశెలు ఏయించింది ఎవర్రా ? చెప్పు బిడ్డ నీకేం భయం లేదు." అన్నడు చిన్నగ లాఠీతో కొడుతూ.

"ఏమో దొంగన్ జేసినట్టు జేస్తున్నావ్ ముందీ కట్టె తియ్..."అన్నాడు కొమురయ్య చీదరించుకున్నట్టుగ.

"యిట్లయితే ఏడ చెప్తర్ బేవకూఫ్ ! లోపలలేసి తంతె చెప్తరు." అనుకుంట వెనక్కు తిరిగి వీన్ని పట్టుకోండి అని చెప్పిండు. కొమురయ్య భార్య కొమురయ్యను వెనక్కుతోసి ఆమె ముందుకచ్చింది. కొమురయ్య తప్పించుకో చూస్తునానడని అనుమానించిన పోలీసు మందిలోంచి ముందుకు పొబోయిండు.

ముసలోని చేతికట్టే కాళ్ళల్ల యిరికి పోలీసు బొక్కబోర్లపడ్డడు. లోపలున్న పోలీసులు పడిపోయిన పోలీసు దగ్గరికి రాబోయింగ్రు, అంతే...గడబిడ మొదలైంది. నూకేసుకునుడు, దొబ్బేసుకునుడు, తిట్టుకునుడు దాక వచ్చింది. లాఠీలు కార్మికుల మీద యిష్టం వచ్చినట్టు పడ్డయి. పిల్లలు ఏడుస్తంటె కొంతమంది స్త్రీలు శాపనార్థాలకు దిగింగ్రు, అపురూపంగ కట్టుకున్న పిట్టగూళ్ళ వంటి గుడిశెల్ని వాచ్‌మన్లు పీక్కొని లారీల్లో వేసుకుంటుంటె వాళ్ళ గుండెల్ని ఎవరో చేత్తో పెకిలించినట్టు అయింది. వాళ్ళకు. వాళ్ళ నెత్తురు పొంగింది. పిడికిల్లు బిగుసుకుపోయినయి. అటునుంచి తుపాకులు పేలినయి యిటునుంచి రాళ్ళు పడ్డయి.వురుకులు పరుగులు పెడబొబ్బలు మొదలైనయి. నిముషాల మీద కార్మిక జనం పుట్ట బెదిరినట్టు వురికింగ్రు. యిరువై మంది కార్మికుల్ని, ఏడుగురు స్త్రీలను యిద్దరు పిల్లలతో సహా అరెస్టు చేశారు. అరగంటలో అయిదువందల గుడిశెల్ని పీకి పది లారీలలో వేసుకొని కంపెని మెయిన్ స్టోర్‌కు పోయింగ్రు. మళ్ళ ఎప్పటితీరుగనేఆ ప్రదేశం వెలవెలబోయింది. దెబ్బలు తిన్న కార్మిక జనం పాత గుడిశెల దిక్కు వురికింగ్రు. చంద్రి ఏడ్చుకుంట అవ్వగారింటికి పోయింది. రోడ్డుపై లారీలు రైల్వే, లైన్లపై వ్యాగెన్లు బొగ్గ నింపుకొని ఏమీ ఎరగనట్టు పోతేనే వున్నాయి. ఆ రోజంత గుడిశెల్లో వుద్రిక్తత చోటుచేసుకున్నది.

4

డ్యూటీలకు పోతున్నపుడు, బొగ్గు బాయిలకు దిగి పనిచేస్తున్నపుడు తిరిగి వస్తున్నపుడు ఒకరికొకరు గుసగుసలు మొదలు బెట్టింగ్రు. లక్ష్మిరాజం, బాలయ్యవంటి కార్మికులు మళ్ళ గుడిశె గుడిశెకు తిరుగుతున్నారు.

వేయి విధాల నచ్చచెప్తున్నారు. సందుగొందుల్ల పోలీసుల జీబులు గూడ వురుకుతనే వున్నయి. కాళ్ళకు బలపాలు కట్టుకున్నట్టు తిరిగి కార్మికుల్ని, మిగతా గుడిశెల కమిటీ మెంబర్లని కుప్పేసింగ్రు. దూరంగా వీధులన్ని కావలిగాంగ్రతో వున్నయి. మసక వెన్నెట్ల మాటలు మొదలైనయి. లక్ష్మిరాజం పక్క గుడిశెల నుంచి కొంచెం బయటకు వచ్చిండు. కార్మికుల నుద్దేశించి "...మనం అనుకున్నట్టుగనే గుడిశెలు ఏసుకున్నం గని తొత్తు యూనియన్ల మద్దతుతో పోలీసుల సాయంతో కంపెనిమన గుడిశెలు పీకించింది. యిదంత మీకెరుకే. సమయం మంచిగ లేదు. తొందరగ మనం మాట్లాడుకోవాలె అందుకని మల్లమనం ఏం జేస్తే మంచిగుంటదో మీకు తోసింది మీరు చెప్పండి ?"

"ఏం జేసుడేంది, నీయక్క బాయిలు బందువెడ్తె తెలుస్తది తడాఖ" గుంపుల్నించి రాయి విసిర్నట్టు ఒక కార్మికుడన్నడు. ఒకాయన కోపంగ లేసి పొగాకును తుపుక్కున వుమ్మి -

"అనుటానికేంది ? ఎన్నైన అనవచ్చు, కని వూకె బాయిలు బందు పెడ్తె కలుత్తాది ?" అన్నడు.

"మరేం జేసుడయ్యా ?" సందు పండ్లల్ల పుల్లకుచ్చుకుంట ఒక కార్మికుడు. "అరెస్టు చేసినోళ్ళను యిడిపియ్యాలెముందు" వెనుకనుంచి ఎవరో ! దాని మీద ఓ ముసలాయిన కసురుకుని లేచి నిలబడి "ఏదో ఒకటి చెయ్యాలె, వాల్లను యిడిపిచ్చుడు మల్ల గుడిశెలు నిలబడెటట్లు చూసుడు రొండు ఒక్క పనితోనే కావాలె" అని కూసున్నడు.

"కలెక్టరుకు చెప్తె?" ఒకడు. "పాముపగైతే తోక సుట్టమా ఏంది ?" మరో కార్మికుడు.

"మరి కోర్టుల కేసుబెడ్తె !" అనుమానంగనే ఇస్మాయిల్ సనిగిండు. అందరు గయ్‌మని లేచింగ్రు.

"ఏందని కోర్టు కెక్కుతవ్ ?"

"కోర్టంటె మాటలా ?"

"వేయిలకు వెయిలు పైసలు గావాలె"

" ఆ పతి పడంగ మంత్రసాని దగ్గరికి తోలిత్తె అంబాడంగ అచ్చినట్టు అయిద్ది"

"కోడి కోసం కోర్టుకుబోతె కొంప అమ్ముడు బోయిందట ఎనుకట"

"కోర్టులు గీర్టులు జాన్తానహీ !" దూదేకుల సాయెబు.

"సేత్తె మనమే ఏదో ఒకటి సెయ్యాలెగని ఒగని మీద ఆశపడద్దు". అని మరో మనిషి సలహా!

"అనుకునేదేదో జెప్పన అనుకోండ్రి, మళ్ళ పోలీసులత్తె కొట్టుకోలు మొత్తుకోల్లు" అన్నది ఒకామె..."పోలీసులంటె మీ ఆడోళ్ళకు లడలడాంటది.

"ఔపిలగా - మొన్న వురికినోళ్ళంత ఆడోళ్ళే" అన్నది అదే స్త్రీ. కొద్ది సేపు అటూ యిటూ చర్చించుకున్న ఘీదట అందరి అభిప్రాయాలు కనుక్కున్న మీదట లక్ష్మిరాజం తన అభిప్రాయం చెప్పిండు. చెప్పి అందరి దిక్కు పరిశీలనగ చూసిండు. అందరు సంతృప్తిగ తల లాడించిండ్రు. అనుకున్నదాన్ని ఆచరణలో పెట్టడం ఆ రాత్రికి రాత్రే మొదలు పెట్టిండ్రు.

5

తెల్లవారింది. బొగ్గు బావులు యధాప్రకారం నడుస్తున్నయి. వాటి నడకల గురించి రాతకోతలు చూసే కంపిని జనరల్ మేనేజరు కార్యాలయం ముందు వుద్యోగులు మాత్రం చిన్న చిన్న వాహనాల్తో నిలిచి పోవాల్సి వచ్చింది ! కంపిని గుమస్తాలందరు విచిత్రంగా చూస్తున్నరు. కార్యాలయం చుట్టువున్న విశాలమైన ఆవరణలోని వేపచెట్ల కింద, రేకుల షెడ్లకింద, కార్యాలయం వరండాలోపల ఒక చోటేమిటి ? సందులేకుండ కార్మికులు సంసారాలతో దిగిండ్రు.

ఆడవాళ్ళు నిమ్మళంగ పొయ్యిలు అంటించుకుంట ముచ్చట్లు బెట్టుకుంటున్రు. గడెంచెల్లో కొందరు కార్మికులు నిర్రంధిగ నిద్రపోతున్నరు. పసిపాపలు ఏడుస్తుంటె ముసలివారు సముదాయిస్తున్నరు.

వెనకగా కంపెని జి.ఎం.కారు వచ్చి ఆగింది. వాచ్‌మన్ బితుకు బితుకు మని చూస్తూ శాల్యూట్ కొట్టిండు. జి.ఎం. ముందుకుచూసి కనుబొమ్మలు ముడివేసిండు. ఆయనకు నాలుగు రోజుల క్రితం గుడిశెలు పీకేయించిన సంగతి జ్ఞాపకం వచ్చింది. అట్ల జ్ఞాపకం వచ్చే సరికి ఆయన ముఖం రకరకాల భావాలు రంగులు మారుతోన్నట్టు....

1983

("భూమిక" కథా సంకలనం (1991) నుండి)

* * *

10

చిగురుటాకు

-కె.వి. నరేందర్

"మీ ఆయన నక్సలైటట కదా !"

సినిమా టికెట్ క్యూలో నిల్చున్న సుజాత ఆ మాటకి ఉలిక్కిపడింది. సుజాత వెనగ్గా నిల్చుని ఆ మాటన్నావిడ వైపు తిరిగి చూసింది. ఆడవాళ్ళు ఎవరి ముచ్చట్లలో వారున్నారు. అప్పటికింకా బుకింగ్ మొదలవలేదు.

"మొదట పార్ట్ టైం లెక్చరర్ అట కదా !" అంది ఆవిడే.

సుజాతకు ఏమనాలో తెలీలేదు. చిరాగ్గా ఉన్నా ఊ...అంది. సుజాత కళ్ళలో ఆవిడ ఏదో వెతుకుతున్నట్టుగా చూసింది.

"మేం ఈ మధ్యే కొత్తగా మీ స్ట్రీట్‌కి వచ్చాం. మీ ప్రక్కింటావిడ చెప్తే విన్నాను. ఆయన ఈ మధ్యే ఏడేళ్ళ తర్వాత యు.జి (అండర్‌గ్రౌండ్) నుంచి బయటికొచ్చి మీతో కాపురం చేస్తున్నాడని చెప్పింది. ఈ ఏడేళ్ళలో మీ సంసారం బాగా చితికిపోయిందని తెలీడానికి మీ ఇల్లుని చూస్తేనే తెలుస్తుంది..." ఆవిడ అప్యాయంగానే అంటుందో, అయ్యోపాపం అన్నట్టుగా అంటుందో సుజాతకు అర్థం కాలేదు. కానీ...ఎక్కడో గుండెల్ని నులిపెడుతున్న బాధ.

చాలా రోజుల తర్వాత సిన్మాకొచ్చింది. ఆడవాళ్ళకు గేటు దగ్గర కుంకుమ భరిణలు కూడా ఇస్తున్న సిన్మా అది. సుజాత సగటు తెలుగు పడుచు. పదో తరగతి పాసవ్వగానే విశ్వనాధంకిచ్చి పెళ్ళి చేసారు తల్లిదండ్రులు. విశ్వనాధం పెళ్ళయ్యే నాటికి యూనివర్శిటీలో ఎమ్మే పాలిటిక్స్ చదువుతున్నాడు. విద్యార్థి రాజకీయాల్లో యూనివర్శిటీలో మంచిపేరు సంపాదించుకున్న విశ్వనాధం ఎమ్మే కాగానే ఉద్యోగం వేటలో పడ్డాడు. అప్పటికే ఏడాది గడిచిపోయింది. సుజాతకు అబ్బాయి పుట్టాడు. ఒక బిడ్డకు తండ్రవగానే ఏ మగాడైనా మరింత సంపాదనలో పడతాడు. కానీ విశ్వనాధంలో ఈ సమాజం పట్ల ఏవగింపు మొదలైంది. బిడ్డ వచ్చిన ఘడియతో నైనా ఉద్యోగ మొస్తుందని ఎదురుచూసింది సుజాత, ఎవరో గడ్డపాయన పుస్తకాలు విపరీతంగా చదువుతున్న విశ్వనాధాన్ని... మీరింత చదివినా మీ కెందుకు ఉద్యోగం రావట్లేదండీ అని అమాయకంగా అడిగిన రోజుల్లో నవ్వేవాడు. తరువాత ఒక మిత్రుడు పెట్టిన జూనియర్ కాలేజీలో పార్ట్‌టైం లెక్చరర్‌గా చేరాడు. మొదటి నెల జీతంతో ఏవేవో తెస్తాడని ఊహించుకున్న సుజాతకి నిరాశే ఎదురైంది. విశ్వనాధం ఆ డబ్బుతో అన్నీ పుస్తకాలే కొనుక్కొని రావటం చిరాకేసింది.

బాబుకి కనీసం పాలడబ్బా అయినా తేనందుకు మొదటిసారి గొడవపడింది. ఉద్యోగమొచ్చినా పుస్తకాలెందుకని వాదించింది సుజాత. కానీ ఆ పుస్తకాలు విశ్వనాధం ఆలోచనా ధోరణిని మారుస్తున్నాయని సుజాతకు అర్థంకాలేదు. అతడేదో కొంచెం దూరమవుతున్నట్టు భావించుకొని బాధపడేది. అలాంటప్పుడే విశ్వనాథాన్ని ప్రయివేట్ కాలేజీ యాజమాన్యం ఉద్యోగంలోంచి తీసేసింది. విశ్వనాధం నవ్వుకున్నాడు. కానీ సుజాత బావురుమంది. తెలివైన భర్తను తొలగించిన కాలేజీలో స్టూడెంట్లు పాసుకారని శాపనార్థాలు పెట్టింది. ఎందుకు తొలగించారన్న ప్రశ్నకు విశ్వనాధం ఏవో కారణాలు చెప్పాడు.

ఆ తర్వాత కొంత కాలనికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. జీవితం ఇక స్థిర పడిందనుకుంది

సుజాత. కాని అతని తిరుగుళ్ళు తిరిగాయి. ఎప్పుడు ఏ ఊరికి వెళ్ళుతాడో తెలియదు. ఊళ్లో వున్నప్పటికీ ఎప్పుడో రాత్రికి ఇల్లు చేరేవాడు. ఓ రోజు అనుకోని సంఘటన జరిగింది. సుజాత జీవితాన్ని దుర్భరంగా మార్చేసిన సంఘటన.

రాత్రి ఎనిమిది గంటల సమయంలో విశ్వనాథం ఇంటిముందు పోలీస్ జీపాగింది. అది గమనించి విశ్వనాథం చీకట్లోకి పారిపోయాడు. పోలీసుల్ని చూసిన సుజాత బాబుని హత్తుకుని భయంగా నిల్చుంది. సుజాతని ప్రక్కకి తోసి విశ్వనాథం కోసం ఇల్లంతా గాలించారు. రోజూ చదివే పుస్తకాల్ని బూతులు తిడుతూ నిప్పంటించారు. అడ్డుకోబోయిన సుజాత మీద బలమైన లాఠీదెబ్బ...ఆ తర్వాత మరో దెబ్బ...చంకలో బాబు ఏడ్పు...అరగంట సేపు రణరంగమే అయింది. చీకట్లోకి వెళ్ళిన విశ్వనాథం మళ్ళీ ఇంట్లోకి రాలేదు. సుజాతకి విషయంతెలిసి గుండెలవిసేలా ఏడ్చింది.

ఇది ఏడేళ్ళ కిందటి సంఘటన.

ఈ ఏడేళ్ళలో సుజాత ఎన్నోసార్లు లాఠీ దెబ్బలు తింది. పోలీసులు ఒక్కసారిగా విరుచుకుపడే వారు. బాబుని కొట్టేవారు రాజీపడుతూ బీడీలు చేస్తూ బతకటం నేర్చుకుంది. బీడీల కట్టలు వేసుకునేటప్పుడు కంపెనీలో అంతా ప్రత్యేకంగా చూసేవారు. ఇంటికొచ్చి మౌనంగా ఏడ్చేది. తన చేతిలో ఏదో మారణాయుధమున్నంత దూరంగా ఉండేవాళ్ళు వాడలోని ఆడవాళ్ళంతా! పోలీసులొచ్చి భీభత్సం చేసినప్పుడు కూడా ఓదార్చడానికి ఎవరూ వచ్చేవాళ్ళు కాదు. ఓదారిస్తే... సానుభూతిపరులట !! (వాళ్ళ భర్తలు చెప్పి ఉంటారు)

ఆడబిడ్డల ముందు, తోటి కోడళ్ళ ముందు తన బతుకొక శిధిలస్వప్నం కావటమే ఆమె భరించలేక పోయేది. చిన్న ఆడబిడ్డ భర్త నాలుగేళ్ళ తర్వాత మస్కట్ నుంచి వస్తున్నాడంటే ఇల్లంతా పండగ జరుపుకున్నారు రెండు రోజులు. ఆ రెండురోజులైతే సుజాత మనసు విశ్వనాథం కోసం విపరీతంగా పలవరించింది. ఏ బంధువులింట్లో ఎలాంటి ఫంక్షన్ జరిగినా సుజాతనంతా విస్మయంగా చూసేవారు. ఆ చూపులే సుజాతనెక్కడికీ వెళ్ళనిచ్చేవి కావు. బాబుని స్కూల్లో చేర్పించాక విశ్వనాథం వెళ్ళిపోయిన ప్రభావం బాబు మీద రకరకాలుగా పడటం మొదలైంది.

ఓసారి పిస్తోలు బొమ్మని స్కూలుకి పట్టుకెళ్ళినందుకు టీచర్లంతా "మీనాన్న పంపాడట్రా" అంటూ నవ్వారు. ఇంటికొచ్చాక బాబు వేసిన ప్రశ్నలకి సుజాత చాలాసార్లు జవాబు తెలీక ఏడ్చింది. ఇలా ఏడేళ్ళ తర్వాత జనజీవితంలో కల్సిపోవడానికి ప్రభుత్వం వెసులు బాటు కల్పించడంతో ఓ అర్థరాత్రి ఇంటిముందు జీపాగింది.

శబ్దం విన్న సుజాత బాబుని మరింత గట్టిగా హత్తుకుని భయంగా చూసింది. మొదట తలుపు కొట్టిన చప్పుడు...ఆ వెంటనే... 'అక్కా'... అని పిలుపు. తీయడానికి సంశయించింది.

"అక్కా...విశ్వనాథం వచ్చాడు" క్షణంపాటు గుండె పులకరించినా...గతంలో పోలీసులు తలుపుతీసే వరకూ ఇలాగే బుకాయించిన సంగతి గుర్తొచ్చి ఒళ్ళు జలదరించింది.

"అక్కా...విశ్వనాథం వచ్చాడు" మరోసారి పిలుపు. ధైర్యం కూడగట్టుకొని తలుపు తీసింది. నిజమే... ఆయనే...ఆయన... ఎంత మారిపోయారు ?? ఆయన వెంట మరో ఇద్దరు.

ఆయన కళ్ళల్లో కూడా నీళ్ళు !! బాబు నిద్రలోంచి లేచి వచ్చి భయంగా చూస్తున్నాడు. విశ్వనాథం గొంతులో దుఃఖం పొర్లింది. సుజాత గుండెకు గండిపడింది. బావురుమని మీదపడి ఏడ్చింది. మూడో తరగతి చదువుతున్న బాబుకి వాళ్ళనాన్నని పరిచయం చేసింది. ఈ దౌర్భాగ్యం ఎవరికీ రాకూడదేమో ?

అరగంట తర్వాత వెంటవచ్చిన విప్లవరచయిత, విప్లవగాయకుడు జీపులో వెళ్ళిపోయారు. మర్నాడు సుజాత వాడలో గర్వంగా తిరిగింది. అయినా విచిత్రస్థితి.

ఎవరూ తన సంతోషానికి మద్దతు పలికినట్టు కన్పించలేదు. విశ్వనాథానికి ప్రభుత్వం తిరిగి పాత ఉద్యోగమివ్వటంతో బంధువులు అప్పుడప్పుడు రావడం మొదలెట్టారు. సుజాత మళ్ళీ మనిషి

నైనంత ఆనందంగా ఉంది.

అప్పుడే 'బెల్'మోగటంతో క్యూలో చలనం వచ్చింది. సుజాత ఆలోచనల్లోంచి తేరుకుని ఒక టిక్కెట్ తీసుకొని బయటపడింది. వెనుకావిడ కూడా నాలుగు టిక్కెట్లతో రాగానే భర్త పిల్లలు ఎదురొచ్చారు. ఆమె సుజాతవైపు చూసింది. ఆ చూపులో "మీ ఆయన రాలేదే" అన్న అర్థం ! సుజాత మనసు మరోసారి చివుక్కుమంది. సిన్మాకు రమ్మని అడిగితే ఆ సిన్మాలు నాకిష్టముండవు అంటాడు. తనిష్టం కోసమైనా రావాలనుకోడు ! షాపింగ్‌కెళ్దామంటే నువ్వెళ్ళు అంటూ డబ్బులిస్తాడు. ఇలాంటి విషయాల్లోనే సుజాత విపరీతంగా బాధపడేది. ఆ బాధ కాస్తా కోపంగా మారుతోందిప్పుడు...

అస్తవ్యస్తమైన ఆలోచనల్లోనే సుజాత సిన్మా చూసింది. సిన్మా అయిపోయి ఇంటివైపు నడక ప్రారంభించింది. సగం దూరం వచ్చాక పక్కనుంచి వేగంగా స్కూటర్ వెళ్ళింది. స్కూటర్ మీద థియేటర్ దగ్గర మాట్లాడినావిడ, భర్త పిల్లలు.

జీవితంలో ఒక్కసారైనా ఆయన స్కూటర్ నడిపితే వెనగ్గా కూచోని తిరగాలనే ఉబికి వచ్చిన కోరిక...ఆ కోరిక చుట్టూ పొగలా కమ్ముకుంటున్న నిర్లిప్తత...

ఇంటికెళ్ళేసరికి విశ్వనాథంతోపాటు మరో అయిదుగురు వ్యక్తులున్నారు. బాబు బడినించి అప్పుడే వచ్చి నోట్స్ రాసుకుంటున్నాడు.

విశ్వనాథం టీ పెట్టమనటంతో సుజాత వంటింట్లోకి వెళ్ళింది. ముందు గదిలోంచి వాళ్ళ మాటలు విన్పిస్తున్నాయి.

రష్యా... తిరుగుబాటు... పోరాటం...మార్క్స్... ప్రపంచకమ్యూనిస్టులపై ప్రభావం...

ఆ గదిలో రష్యాలో జరిగిన మార్పుల మీద తీవ్రమైన చర్చ జరుగుతోంది.

ఆ పదాలు వింటున్న సుజాత మళ్ళీ చిగురుటాకులా వణికింది.

బాధగా కణతలు రుద్దకుంటుంటే పైకప్పు నుంచి మట్టిపెళ్ళ పడింది. శిథిలావస్థలో ఉన్న ఇల్లుని దీనంగా చూసింది.

"వీళ్ళు ఈ పూట ఇక్కడే తింటారు" అన్నాడు విశ్వనాథం.

అమాటతో సుజాతను నిస్సత్తువ ఆవరించింది. సినీమా చూసి అంత దూరయుంచా నడిచి వస్తే... ఏమిటి ఈ మనిషి...? పెళ్లయి ఇన్నేళ్ళయినా అర్థం కాని మనిషి..

ఆయన సమాజపరంగా ఏమైనా సాధించాడేమో... కానీ...

కుటుంబపరంగా ఏం సాధించారు ? ఇలాంటివాళ్ళు పెళ్లెందుకు చేసుకొంటారో...

సుజాత ఇప్పుడు మనసుతో పోరాటం చేస్తోంది.

సహచర్యంతో కూడా విశ్వనాథం ఆలోచనల్ని చేరుకోలేని సుజాత ఆలోచనలు సుజాతవి. తమ ఇంటికి కొద్ది దూరంలో ఉన్న వేపచెట్టు క్రింద ఇద్దరు అపరిచిత వ్యక్తులు తచ్చాడుతుండడం మూడు రోజుల్నించి గమనిస్తోంది. సుజాత జీపు శబ్దాలు విన్నా... అపరిచిత వ్యక్తులు ఇంటి ముందు కనిపించినా చిగురుటాకులా వణుకుతోంది.

ఇంతలో ముందు గదిలోంచి ఓ వ్యక్తి పాట అందుకున్నాడు. ముందు కూడా ఇలాంటి చర్చలు సమావేశాలు, పాటలు, గోష్టులు ఇంట్లో జరిగేవి. స్థిమితపడి ఏడాదికూడా కాలేదు. మళ్లా ఏడేళ్ళక్రింది చరిత్ర పునరావృతమౌతే...??

ఒకతాగుబోతును కట్టుకొన్నా ... ఇంత నరకయాతన అరణ్యరోదన ఉండదేమో ? అందులోనూ ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ ... సుజాత ఆలోచనల్లో ఉండగానే పాట పూర్తయింది.

"సుజాతా... ఇంకా వంట కాలేదా ?" ఆయన తన ప్రక్కన ఎప్పుడు ఇంత ఆనందంగా ఉండరు. ఇంట్లో కనీస అవసరాలు చూడని వ్యక్తి సమాజం గురించి కలలు కనడం... సుజాత విసుక్కుంది.

ఎవరైన తన బంధుమిత్రులు వచ్చినప్పుడు "అదేంటో సుజాతా... మీ ఆయన గవర్నమెంట్ ఉద్యోగి. అయినా కనీసం కలర్ టివి, ఫ్రిజ్, కూలర్, రేడియో ఏవీలేవు. మేమైతే కంప్యూటర్ కూడా కొనాలనుకుంటున్నాము." అంటూ ఎగతాళిగా మాట్లాడినప్పుడల్లా... బాధేసేది. ఎప్పుడైనా విశ్వనాథాన్ని అడిగితే... బూర్జువా. భూస్వామ్య వ్యవస్థ, పేదరికం, సామ్రాజ్యవాదం, సోషలిజం, కమ్యూనిజం, దారిద్రరేఖకు దిగువ ఉన్న ప్రజలు, దళితులు, పీడితులు అంటూ గంటల తరబడి ఉపన్యాసం దంచుతాడు. ఆరువైవేల చిట్టీ ఎత్తి ఈ మధ్య రెండు పుస్తకాలు అచ్చువేశాడు. ఆ రోజు ఆయనతో పెద్దగా గొడవ పడింది. అయినా ఏనలేదు... అన్యమనస్కంగానే వంట చేసింది సుజాత.

వాళ్ళు తిని వెళ్ళిపోయాక ముందు గదిలోకి వచ్చింది సుజాత. కొంచెం ధైర్యం తెచ్చుకొని విశ్వనాథాన్ని అడిగింది. "మళ్ళీ ఆ పాటలేంటి... ఈ సమావేశాలేంటి ? ఈ మధ్య మళ్ళీ ఎవరెవరో కొత్త మనుషులు మన ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. మళ్ళీ మునుపటి పరిస్థితులు మాత్రం తీసుకురాకండి. అలాంటి వాళ్ళు ఇంకా అండర్‌గ్రౌండులోనే ఉండాల్సింది. పెండ్లి చేసుకోకుండానే ఉండాల్సింది."

"ఇప్పుడేం జరిగిందనీ కనీసం మాట్లాడడం కూడా మాట్లాడుకోకూడదా?" అన్నాడు విశ్వనాథం కొంచెం ఆవేశంగా.

ఆ మాటకి సుజాతలో అసహనం పెరిగింది. గంటసేపు పరస్పరం అరుచుకున్నారు.

"కట్టుకున్నదానికి మానసికంగా కనీస భద్రత ఇవ్వనప్పుడు... మీరు చేస్తున్నది సంసారం అనే కంటే చాకిరి చేయించుకోవటం అంటేనే మంచిది. ఇంట్లో పొంగి పొర్లే కన్నీటిని గమనించకుండా సమాజం గురించి కలలుగనే మీలాంటి వాళ్ళ కామెర్లకు చచ్చేదాక మందులుండవేమో ? ఆ ఏడేళ్ళు ఎలా బ్రతికామో... మీకు ఏమైనా తెలుసా? నావాళ్ళు... నావాళ్ళు.. అనే మీ వాళ్ళు ఈ ఏడేళ్ళలో నన్ను కనీసం పలకరించడానికైనా రాలేదేం? ఎలా బ్రతుకుతున్నారని అడిగినవాళ్ళు లేరేం? మీ పిల్లల గురించి పట్టించుకోలేదేం? మీ స్నేహితులు, మీ ఉద్యమమిత్రులు వాళ్ళ కుటుంబాన్ని వదిలేశారా? వాళ్ళ ఇండ్లల్లో రేడియో, టివీ, ఫ్రిజ్ అన్ని ఉన్నాయిగా ?"

మరుసటి రోజు ఉదయమే పిల్లలతో సహా సుజాత తల్లిగారింటికి వెళ్ళిపోయింది. మూడవరోజు విశ్వనాథం అత్తవారింటికి బయలుదేరాడు. ఆరోజు రాత్రి అతనికోసం అర్ధరాత్రి పోలీసులు తాళాలు పగులగొట్టి ఇల్లంతా వెతికారు. ఎక్కడో ఎవరో పోలీసుల్ని హతమార్చారట అందుకు ప్రతీకారంగా విశ్వనాథం కోసం...

అత్తవారింట్లో ఉన్న విశ్వనాథం బ్రతికి పోయాడు. తనవాళ్ళు అనుకున్న ఎవ్వరు తన పై మళ్ళీ మొదలైన దాడుల్ని ఖండించలేదు. సుజాత విశ్వనాథం మిత్రుల్ని అపహాస్యం చేసింది. తాను భయంతో వణికిపోయింది. విశ్వనాథం మళ్ళీ ఏదో చెప్పబోయాడు.

"ఇక నాకు ఏమి చెప్పకండి"

సుజాత ఏడుస్తోంది...

(శ్యామలక్కకు అభిమానంతో...)

(ఉదయం దిన పత్రిక 5-6-93)

* * *

11

స్మృతి

-బి.ఎస్. రాములు

"వెనుకటి ప్రేమలు యిపుడు లేవు. వెనుకటి కాలం మల్లరాదు. ఆ ప్రేమలేవేరు. ఇపుడు భయం లేదు. భక్తి లేదు. అంతా ఆజాద్ అయిపోయింది. ఎక్కడ జూడు స్వార్థం. ఈ అవినీతి పోవాలంటే మిలటరీ గవర్నమెంటు రావాలె... మొన్న కరెంటు మోటరు కాలిపోయింది. ఇంకో ట్రాన్స్‌ఫారం వెయ్యిమంటె ఒక్కొక్కడు..."

అరగంట నుండి అంజయ్య అదే పనిగా అరుస్తూనే ఉన్నాడు... అది తాగిన మైకమో... లోకజ్ఞానమో...అర్థంకాక అతని ఎదురుగా ఉన్న అక్కలు, చెల్లెండ్లు, బావలు అవునంటూ తలలూపుతున్నారు. అంజయ్య భార్య బిగకట్టిన గోచి చీరతో చెవులనిండా సొమ్ములతో వడ్డిస్తోంది.

కొక్కుల మల్లేశంకు అవన్నీ చెవిలో మైకుపెట్టినట్లు వినపడుతూనే ఉన్నాయి. అంజయ్య మాటలు కల్లుమత్తులా అతని హృదయంలో మెల్లమెల్లగా దిగబడుతున్నాయి. కలుగజేసుకుందామా అని అయిదారుసార్లు అనుకుని మర్యాదగా ఉండదని నోరుమూసుకున్నాడు. అయితే క్షణక్షణానికి ఆ చర్చ శృతి మించుతోంది.

కొండగట్టు తాళ్ళల్ల చెట్టుకింద ఆదివారం సెలవురోజు పిక్నిక్‌కంటూ వస్తే... ఇక్కడా ప్రశాంతంగా ఉండనీయని చర్చ...ఛ...ఛ... మల్లేశంకు అసహనంగా ఉంది. ఆ చర్చ ఎంతకు తెగుతదో సమజైతలేదు. చూసిచూసి కల్లువంచే గౌడ లేచిపోయాడు..."నేను గవాల్లకు కల్లు వంచి మల్లస్త... వచ్చి బాగసేపాయె' ' అంటూ అంజయ్యకు బాధేసినట్టుంది. "ఈ సార, బీరు, బ్రాండి బందైనవోల్లె గౌడులకు ఎక్కడలేని గిరాకైపోయింది... గింతమందికి గంతగనం కల్లు ఎట్ల వస్తున్నదో..." అని గొణిగాడు.

మల్లేశం వద్దనుకుంటూనే మళ్ళీ అటుకేసి చూశాడు. ఈ వనంలో చెట్టుకు అటువైపు వాళ్ళు, ఇటువైపు వీళ్ళు. అందరి విస్తార్లలో మాంసం, చికెన్, అలిచెంత గుడాలు (గుగ్గిల్లు) ఆడవాళ్ళ ముందు కల్లుగ్లాసులు. మగవాళ్ళు మర్రి ఆకుతో కల్లు దమ్ము పట్టి (తాగి) మాంసం గుడాల మీద పడ్డారు. పిల్లలు కూడా గ్లాసుల్తో కొద్దికొద్దిగా కల్లు రుచి చూస్తున్నారు.

సెలవు రోజు రాగానే ఆ ప్రాంతాల్లో వందలాది కుటుంబాలు కొండగట్టుకు పిక్నిక్‌కు బయల్దేరుతాయి. సైకిళ్ళు మొదలుకొని మారుతి కార్లదాకా కొలువుదీరినట్టు అడివీ, పొలాలూ అంతా కోలహలంగా ఉంటాయి. ఎవరి వంట వారిది. ఎవరి జీవితం వారిది. చర్చల్లో ఎవరి ప్రపంచం వారిది...వంటల్లో ఎవరి తాహతు వారిది. వచ్చే బంధువుల్లో ఎవరి పీలువారిది.

మల్లేశం కూడా అంజయ్య కుటుంబం లాగే విడిది చేశాడు.. అలాగే మటనూ,

చికెనూ...అలిచెంత గుడాలు...అయితే కొంచెం తేడా. వీళ్లపక్కన రెండు స్కూటర్లు... అలవాట్లలోనూ కొంచెం తేడా. మల్లేశం బృందం ఆకుతో కల్లుదమ్ము పట్టే సంస్కృతి నుండి దూరమైనట్టున్నారు. ఆకుతో కల్లు తాగితే ఇపుడు వారికి స్వరం తప్పుతుంది. గ్లాసుల్తో తాగడం వారికి అలవాటైపోయింది.

మల్లేశం చిన్నకూతురు స్వప్న డాడీ కల్లు నింపిస్తున్నకొద్దీ గ్లాసులు వరుసగా యిచ్చి వస్తూ ఖాళీగ్లాసులు చేరవేస్తున్నది. కల్లుకుండ పక్కన మల్లేశం అమృతం పక్కన కుదురుగా ప్రేమగా దానికే అంకితమైపోయిన దేవదానవుల ప్రతీకలా నిండుగా కూర్చున్నాడు...అతన్ని అక్కడ చూస్తే కొక్కుల మల్లేశంసారు అని పిలిచే బదులు కల్లుకుండల మల్లేశంసారు అని యింటిపేరు మార్చేస్తారు. ఆయన బొర్ర కల్లుకుండతో నువ్వు పెద్దా నేను పెద్దా అని పోటీపడుతోంది... రెండు పండ్లూడిన దవడల్తో సియ్యల్తో మల్లేశం తల్లి కొక్కుల దుబ్బక్క కుస్తీ పడుతోంది.

"అమ్మా... మన యిండ్లల్ల గీ 'బగార' (పలావు) అన్నం ఎనుకట ఉండేదానే..." మల్లేశం తల్లిని కదిలించాడు. అంజయ్యకు అమ్మతో పరోక్షంగా జవాబు చెప్పించాలని కావచ్చు... దుబ్బక్క వేదాంతంలోకి వెళ్ళింది.

"ఎనుకట మనిండ్లల్ల ఏం ఉండేది బిడ్డ. పడుగు సరి చేసుటానికి కాసిన గంజి అంబలి దాగి బతికిన ఎడ్డికాలం. మా నాయన్న చెప్తుండె...ఎనుకట అన్నం దొరుకక రేగడిమట్టి తిన్నరట...మంచిగ బతుకుడంటె మక్క గట్క (సంకటి)నే పరమానందం అన్నట్టు....గా ఎనుకటి కాలం గుర్తు చేయకు బిడ్డా...పటేండ్లు, పట్వారీలు, దొరలు ఎంత గోస పోసుకున్నరో నీకేం ఎరుకరా....వాల్లకు కోరిన తీరుగ బట్టలన్ని సొంతంగ నూలు కొనుక్కచ్చి నేసి యియ్యాలె...పైసలు అడుగవశమా...పబ్బతివట్టి (రెండు చేతుల్తో దండంపెట్టి) వంగి వంగి నిలబడాలె...నోటితోటి అడిగేది లేదు...అడుగుతె కతమేనాయె...ముప్పయి రూపాయల బాకికి మూడేండ్లు ముడ్డిసుట్టు దిప్పుకుందురు..."

"అత్తా మరిగా అంజన్న... గట్ల ఎనుకటి కాలమే మంచిగుండె అంటుంటె ఒక్క మాటనవు...' ' దుబ్బవ్వ చిన్నల్లుడు కస్తూరి రాజేశం ఒసుగు (మరికొంచెం కలుపుడు) వేశాడు.

కల్లు వడ్డన ఆ రౌండు పూర్తిచేసి స్వప్న తన విస్తరి ముందు కూర్చుంది. గ్లాసుతో కల్లు చప్పరిస్తూ సియ్యలు కొరుకుతూ నానమ్మకేసి ఆసక్తిగా చూస్తోంది. లౌక్యం తెల్సిన దుబ్బక్కకు కోడి తప్పిపోతే కోడి మీద పెట్టె ఎన్నిదిట్టాలో తెల్సు..."ఇక్కడికి కొట్లాట పెట్టుకునుటానికి వచ్చినమా అల్లుడా...' ' అంటూ ప్రారంభించింది.

"వాల్లతోని మనకేందే స్వప్నా...వాల్లు ఎవుసం చేయించుకునే గుడేటి కాపోల్లున్నట్టున్నరు. ఆల్ల నగలు చీరె కట్టిన తీరు, కొంగు వేసిన తీరు చూస్తుంటే తలుస్తలేదా...మందితోని ఎనుకట ఎట్టికి పని చేయించుకొని బతికి యిపుడు పనిచెయ్యక సెడిపోయిన గాడ్దులు గట్లనే అంటరు... ఎనుకటి కాలం మంచిగుండె అని...వాల్ల లగ్గాలకు, పండుగలకు, పబ్బాలకు ఊర్లోల్లంత ఎగపడి 'ఎట్టి' జేస్తే ఎనుకట ఎంత ప్రేమ...పల్లెలల్ల అని బడాయిలు చెప్పుకునుటానికేంది బిడ్డా...ఎట్టి జేసినోల్ల నడుగుతె తెలుస్తది. అది బాధకు చేసిన్రో, ప్రేమకు చేసిన్రో.... గీ అన్నలు వచ్చినంక అల్కగ అయింది."

"నానమ్మా చీరె కట్టుడు, నగలు చూసి ఎవలది ఏ కులమో ఎట్ల చెప్పవస్తదే..." స్వప్న ఆసక్తిగా అడిగింది.

"ఎనుకటి మనుషులు గట్ల ఉందురు... ఇప్పుడు అందరు ఒక్క తీరుగనే గడ్తున్నరు..." "అమ్మా... ఎనుకట బతుకమ్మ పండుగులు మంచిగ చేస్తురట గదనే..." దుబ్బవ్వ చిన్న కూతురు...

కస్తూరి సరోజ కల్లుగ్లాసు ఖాళీచేసి అడిగింది.

"మంచిగ అంటె మంచిగనే చేస్తురు. ఊర్లోల్లందరు గల్సి దొరల, పట్వారి పటేలు యిండ్లల్ల బతుకమ్మలు తీసుకొని ఆడుటానికి పోవాలె...అన్లకెల్లి మంచిగ కనపడ్డోల్లను వాల్లు ఎపుడు యింటికి పిలిసి పట్టె మంచం ఎక్కుమంటరో తెలువది... గొడ్ల కొట్టంలనో, పెరట్ల మంచెల కాడనో...ఎక్కడికి గుంజుకపోతరో తెల్వది...మంచి చీరె కట్టుకోను భయం...ఎవని కంట్లె మన్నుపడుతదో...తెలువది...నన్ను గట్ల చిన్నదొర గుంజిండని... ఓ రాత్రి పొలం నుంచి రాంగ మీ నాయిన్న మా అన్నగాడు, తమ్ముడు గల్సి పొట్టుపొట్టు తోమి, పురుసోల్లు (పురీషాలు)వడివెట్టి చెయ్యి యిరుగ్గొట్టి ఆ ఊరు యిడిసిపెట్టి యిపుడున్న ఊర్లెకు బతుకచ్చినం...ఎనుకట గట్ల సాగిచ్చుకున్నోల్లకు ఇపుడు కాలం చెడిపోయిందనిపియ్యదా..."

"ఎనుకట ఏమున్నది బిడ్డా...ఆల్లకు ఇపుడు అగ్గువకు కూలికి మనుషులు దొరుకుతలేరని బాధ...యాడాదికి యిన్ని మక్కలు జొన్నలు పారవోస్తె సాకల్లు, మంగల్లు, శాల్లోల్లు, వడ్లోల్లు అన్ని పనులు చేసే కాలంపాయె... మాలోల్లు, మాదిగోల్లు అరబ్బు దేశాలకు పోయి సంపాయించుకరావట్టిరి...ఆడోల్లు బీడీలు చెయ్యవట్టిరి. ముప్పయి రూపాలిస్తమన్నా పొలం పనికి వోకపోయిరి...అందరు తెల్లబట్టలేసుకొని తెల్లగ బతుకవట్టిరి...యివన్ని జూసి ఎందుకు కండ్లుమండై బిడ్డా... ఎనుకటి ఎడ్డికాలం గాకపాయె...అరె తొరెయి అంటె మర్రవడవట్టిరి. గీ అన్నలచ్చినంక అందరి పెద్దరికాలు పాయె...అందరు ఆజాదైపోయిన్రు అని అంటె అనరా బిడ్డా... ఎట్టి జేయించుకొని కాలు మీద కాలేసుకొని బతికినోల్లకు ఎనుకటి కాలమే మంచిగుండకపోతె...ఏది మంచిగుంటది బిడ్డా..."దుబ్బవ్వకు కల్లు నిషా ఎక్కుతుంటె ధైర్యంగా గొంతు విచ్చుకుంటోంది. ఎక్కడి జ్ఞాపకాల్లో కడుపులోంచి దేవుకొస్తున్నాయి.

"బిడ్డా.. ఎనుకట గిట్ల మాంసం తిందామంటె ఎల్లకపోవు...రోగమచ్చిన గొర్రెలు సచ్చిపోతే అగ్గువకు కొనుక్కవస్తురు...సచ్చిన గొర్లకు సంకలు గొట్టెర శాలీడు...అని పేరు బదునాం జేసిన్రు... ఎవలు మెచ్చని చీరెలు దోతులు అమ్మక మీదవడితే కట్టుకోక తప్పుతదా...దాంతోని సాలె సంకటం గోసిల యిరుకుటం అని ఎక్కిరిస్తురు...మనం నేసిన బట్టలు గట్టుకొని మననే పేరునాల జేస్తురు. ఇయ్యాలంటె మిల్లులచ్చినయి. ఎనుకటి రోజుల నుంచి సిన్నోల్లు, పెద్దోల్లు అందరు కట్టింది ఎవల బట్ట. నాగరీకం నేర్పిన మనకే పేరునాల వెట్టి ఎక్కిరిచ్చిన కాలం అది...తీరొక్క బట్ట నేసింది మన కులపోల్లు గాదా...బట్టల్లే మనుసుల్ను ఎడ్డి మనుసులనరా..."

"ఎనుకట ఏమున్నదిర...ముప్పయి ఏండ్ల కిందటిదాకా కూడా దేనికైనా ఎడ్లబండే గతి. మనకు ఎవుసం లేకపాయె. ఎడ్లబండి మనకెక్కడిది. ఎక్కడికన్న జాతర పోవాలంటె ఎడ్లబండి కిరాయకు అడుగుతె ఎక్కడలేని ధరచెప్పిరి... ఎవుసపు ఎడ్ల బండి కిరాయకు కట్టమనిరి...నువ్వు కడుపుల పడ్డప్పుడు గిట్లనే కొండగట్టు ఆంజనేయస్వామికి మొక్కుకున్నం. నేను నీల్లు పోసుకుని ఉంటి. అయిదోనెల...కొండగట్టుకు కచ్చురం కట్టుమంటే ఎవలు కట్టకపోయిరి...కోడిపుంజు, సామాను మోసుకోని అందరం ఒక రోజంత నడుసుకుంట ఓ రాత్రికి యిక్కడికి చేరినం... మీ అక్క నడువరాక..మీ నాయిన్న భుజం మీద ఎత్తుకుని నడిసిండు...కాల్లన్ని పీక్కపోయె...తెల్లారి మల్ల గుట్టెక్కి దిగేటాల్లకు పిక్కలువాయె...ఏందిన్నం కొడుకా...ఇపుడేమో స్కూటర్లమీద రావట్టిమి...సామాను దీస్కోని బస్సుల రావట్టిమి...అన్ని గ్రైండర్ల దంచుకొని రుబ్బుకొని వచ్చి గంటలోపల వంటచేస్తిమి...ఆ కాలంల...గిన్నితీర్ల వంటలెక్కడ వచ్చురా....చింతపండు చారు తీరుగ ధన్యాలపొడి యింత కారం ముద్దవేసి ఉడికిస్తే పులుసును ఊదుకుంట తిందుంటిమి... ఇపుడు జూడు...కొండగట్టు మీదికి కూడా రోడ్డేసిరి బస్సులు, స్కూటర్లు రావట్టె...

"అపుడు రాత్రుల్లు ఎంత భయమయ్యేటిదో...గీ కరెంటు ఎక్కడిదిర...పొద్దుగూకుతె చీకటిపడె.

అయిందపు (ఆముదాల) నూనెతోని దీపంతల యింత దీపం ఎలిగిచ్చుకొని గట్కుతిని పంటె మల్ల తెల్లారెదాక.....ఎన్ని దోమలురా...అప్పుడు...మీ నాయన్న మగ్గంనేసి నేసి అదే వోతది తియ్యి అనుకుంట గదే సలిజరంతోటే సచ్చిపాయె...నీకన్న ముందు పుట్టిన బిడ్డ మూడేండ్లకే పోషమ్మ (మశూచి) అయి సచ్చిపాయె... మా అయ్య పల్లెలు తిరిగి బట్టలు ఉద్దెరమీద యిచ్చిరాంగ చీకట్ల పురుగు (పాము) కుట్టిసచ్చె...గప్పుడు గిన్ని మందులు గింతమంది డాక్టర్లు ఎక్కడున్నర్రా... ఏదో పేడు (పుల్ల) కుచ్చుకున్నదనుకొని మా అయ్య అట్లనే నడుసుకుంట యింటికచ్చి నురుసులు (నురుగులు) కక్కిసచ్చె...మంత్రం ఏయించుటానికి కూడా టైం లేకపాయె..

"మా సెల్లె బాలెంత రోగం వచ్చి ధనుర్వాతంతోని కొట్టుకొని కొట్టుకొని పానమిడిసె...ఏందిన్న నాకు కడుపు నొప్పేనాయె ఓ...తక్కలి ఆకు ఎల్లిపాయకారం దంచుకుని ముద్దలు మింగుడు దప్ప నాగోస చూసినోల్లెవలురా..యాల్లకు కండెలు సుట్టి అందియ్యకపోతే ల్యాకబద్ద వట్టి మీ నాయిన్న నాలగ్గం జేసు...గొడ్డును కొట్టినట్టు కొడ్తుండె... ఆ పడుగు సరిచేసుటానికి గంజి అడుక్కరమ్మను. అల్లు పొంగనే పోస్తరా...ఏదో పనిచెప్పిరి... ముచ్చటవెట్టిరి...మీ నాయిన్న ఇంతసేపు ఎవుల దగ్గర పన్నువు లంజే...అనె సికెంటికలు వట్టి ఎట్ల కొట్టుతుండె...భగవంతుడా...గా కట్టాలు పగోల్లకు కూడవద్దు.

"ఎన్నని ఏగిచ్చినర...నిన్ను సదివిచ్చుటానికి ఎంత కష్టమైందిర...బడి లేనప్పుడల్ల మగ్గం నేయిమంటె నువు ఆటకోయిలతనం జేస్తే... నీ మీద ఎన్ని ల్యాకబద్దలు (పడుగు పేకల మధ్య వాడే వెదురుబద్దలు) యిరిగినయో... నీకు యాదికి ఉన్నాదిర..."

"మీ నాయిన్న ఉన్నపుడు సుకపడలే...పోయినంక సుకపడలే...గీ బీడీలు చేసుడంట వచ్చినంక కొంచెం నయమైంది...లేకపోతే మన శాలోల్లంత ఆకలికి సచ్చిపోదురు కొడుకా...బొంబాయి బీవండిల ఎంతమందికని సొంచెల్లల్ల పనిదొరుకుతదిర...పోరగాన్లను పట్టుకొని నేను ఇక్కడ మీ నాయిన్న ఒక్కడు అక్కడ...బొంబాయిల పొట్టకు దినుకుంట కడుపు గట్టుకొని యిన్ని పైసలు పంపిస్తే...గీకాడికి అచ్చింది...ఎన్ని కష్టాలు పడితె నువ్వు ఎదిగినవుర...

"సదువైనంక ఉత్తగనే తిరిగితివి...బీడీలు చెయ్యిరా అంటే నీ పానం వంగకపాయె...దుకాన్ల జీతముంటివి గని బీడీలు చేయకపోతివి...ఏదోగా ఆపతి మల్లన్న జాబుల నూట యిరవై రూపాయలకు నౌకరి దొరికె..."

"ఆపతి మల్లన్న కాదత్తా...హోప్ ఎ మిలియన్ జాబు అనే స్కీము కింద పందొమ్మిది వందల డెబ్బయి మూడుల హెచ్సిసరీన్ అనెటాయన గవర్నర్ పరిపాలనున్నప్పుడు అయిదు లక్షల ఉద్యోగాలు అని పెట్టిండు..." కస్తూరి రాజేశం సవరించాడు...

"ఏదో అల్లుడా...అదేదో నాలిక తిరుగకపాయె...గానౌకరిచ్చి గుట్టలల్ల పల్లెల పొంట ఏస్తే...నేను ఎంత ఏడ్సిన్ననుకున్నవు...మంతెని మాదేవుపూర్ దాటిపోవాలె...కాని రాజ్యం అది...ఎందుకు బిడ్డా గంత దూరం వద్దని ఏడ్సిన...ఏమో...దొరలెసొంటోల్లో...దొంగలు ఎసొంటోల్లో....ఎవలు కండ్లల్ల మన్నువోసు కుంటరో...వానకాలంల అటు చిక్కువడితె మల్ల ఎండలు ముదిరెదాక ఆ వూర్లెకెల్లి ఎటు పొరాక పోవు...చుట్టు వాగులు, బురదలు..ఈడు..ఏంది నీయవ...అది మన కరీంనగర్ జిల్లానేనాయె...నేనేమన్న బొంబాయి పోతున్నానె...అని ఆడు జనుప చెయి సంచిల బట్టలు పెట్టుకొని వండుకోను రెండు గిన్నెలు ఏసుకొని పాయె...అక్కడ నాలుగేండ్లు చేసి జగిత్యాల తాలూకాకు తబాదిలా (బదిలీ) చేయించుకున్నంక బతుకు తిరమాయె...అప్పటిదాకా ఈ కోడలు...నేను సంసారమే జెయ్యపోనని యిడుపు కాగితం కోసం కులంల పంచాయితే వెట్టిచ్చే... మీ మామపోయి నేను ఒక్కదాన్ని ఆ పంచాయతులన్ని ఏగిస్తి...కుల

పెద్దలకు కల్లుపోయించి పోయించి దీని పంచాయతులకు నా మెడల గుండ్లు (బంగారు గుండ్లు) అమ్మితి...

"ఇపుడు... ఎవలు సుకపడ్తన్నరే..కోడలా...మేం గంతగనం కష్టపడితె నువ్వు నీ మొగుడు నీ పిల్లగాన్లు సుకపడుతున్నరు...ఇపుడు స్వప్నను నెలకు నూరు ఫీజులిచ్చుకుంట ఇంగ్లీషు మీడియంల సదివియ్యవడ్తిరి...ఇప్పుడు నా కొడుక్కు నెలకు అయిదు వేలు వస్తున్నయి. ఎనుకట ఏమున్నదే కోడలా...ఇరువై నంబరు (దొడ్డు ముతక) చీరెలే గతి...అరవై నంబరు (సన్నపు చీర) చీరెలు అపుడు ఎంతమంది కట్టిన్రు...ఇపుడు అందరు అరవై నెంబరు, నూటిరువై నెంబరు చీరలు...ఇంకా ఏంటెంటియో చీరెలు...ఎనుకట గివన్ని ఎక్కడియే కోడలా..."

"అల్లు గుర్తుపడ్తలేరుగని...గీ అంజయ్య నాయిన్ననేరా... గప్పుడు ఎనుకట కొండగట్టుకు కచ్చురం కట్టుమంటె కట్టలేదు... ఈ అంజయ్య అమ్మమ్మ గారింటికాడ పెరిగిండు...వాల్ల అవ్వలు యిద్దరే. మేనమామలు లేకుండిరి. అల్ల తాత పోయినవోల్లె...అంజయ్య అవ్వ అందర్ని తల్లిగారింటికే బయల్దేరదీసింది. అక్కన్నే భూమిజాగలు మంచిగ ఉన్నయని...ఉన్న ఊరుల అమ్ముకొని ఊరిడిసి పోయిన్రు...అటెన్క అయిదేండ్లకు మనం ఆ ఊర్లెకెల్ల ఎల్లి (బయల్దేరి) వచ్చినం...

"అయినా ఆల్లకేమైందిరా...రెండు కరెంటు మోటార్లచ్చినై. కెనాలు కాల్వ కింద రెండు పంటల భూములు...వాల్లు గూడ స్కూటర్ల మీద తిరుగుతున్నరు..ఎనుకటి తీర్గ ఏమన్న యాతాలు (ఏతం) పోస్తున్నరా...మోటగొడ్తున్నరా...స్టాటర్ ఒత్తి పురుసత్ (తీరిక)గ ఆపని ఈ పని చేసుకుంటరు...సిన్నప్పుడు నీ అంత ఉన్నప్పుడు ఎంత కర్రెగ ఉండె అంజయ్య. ఇపుడు జూడు...నీడ పట్టున ఉండుకుంట ఎంత తెల్లవడ్డరో...మల్ల ఎనకటి కాలమే మంచిగుంటదంటరు...ఎద్దుగుద్ద పొడుసుకొని బతికిన ఎనుకటి కాలం తీరుగనే ఉన్నదా గిప్పుడు...మొన్న సప్న పుట్టినరోజుకు దాని దోస్తులు...మన సుట్టాలు ఎంతమంది వచ్చిన్రు...ఎనుకట లగ్గాలకు కూడా గింతమంది రాకపోదురు...ఏ కులపోల్ల లగ్గంకు ఆ కులపోల్లే వస్తురు. ఇపుడు... కులపోల్ల కన్నా దోస్తులే ఎక్కువస్తున్రు... ఎనుకట రాజులు కూడ గింత మందికి భోజనాలు పెట్టిన్రో లేదో...పెండ్లిల్ల ఎంతమంది...ఎంత సంబ్రం...ఎనుకట. మీరు యిరవై యైదు మంది మేం యిరవై అయిదు మంది అని పెండ్లికి వచ్చెటోల్లను కరారు చేసుకుందురు. కచ్చురాలకు ఎడ్ల గడ్డివెయ్యాలె...అని కొట్లాటలవుతుండె...వడ్డనకాడ కులం తప్పు తీస్తురు..."

కల్లు తాగుతూనే ఉన్నారు. గుడాలు మాంసం చికెన్ పొట్టలో పడుతూనే ఉన్నాయి. ముచ్చట్లు నడుస్తూనే ఉన్నాయి. దుబ్బక్క మరింత వేదాంతంలో పడిపోయింది. అటు అంజయ్య ఏదో నరుకుతూనే ఉన్నాడు... ఆ చర్చలు వింటే మేధావులు మూర్ఛపోవాల్సిందే..స్వప్నకు పిల్లలకు అదంతా స్వప్న సందేశంలా ఆసక్తిగా ఉంది...సకుటుంబంగా పిక్నిక్ రావడంలో ఉండే సౌకర్యమే యిది. హృదయాలు విచ్చుకుంటాయి. పిల్లలు పెద్దలు తమ చరిత్రను సంస్కృతిని తమకు తెలియకుండానే తెల్సుకొని ఒంటబట్టించుకుంటారు.

✻ ✻ ✻

కొక్కుల దుబ్బక్కకు కడుపునొప్పి కోసం ఆపరేషన్ అయి ఆసుపత్రిలో ఉంది. కోడలు సపర్యలు చేస్తోంది. ఇద్దరికి క్యారియర్ తీసుకొని మధ్యాహ్నం బయల్దేరాడు మల్లేశం. ట్రాఫిక్ జాం అయిపోయింది. ఏమైందో చూద్దామని స్కూటర్‌ను నెట్టుకుంటూ ముందుకు కదిలాడు. లోవోల్టేజి వల్ల కరెంటు పంపు సెట్లుకాలిపోతున్నాయని, గిట్టుబాటు ధరలు కావాలని ఎవరో అరుస్తున్నారు.ఎక్కడో చూసినట్టు గుర్తొచ్చింది. కొండగట్టు కాడ ఒకే చెట్టు కింద... అంజయ్య .

ట్రాఫిక్ జాం అయిపోయి రెండు గంటలైంది. పోలీసులు లాఠీచార్జ్ చేయడానికి వెనకా ముందాడుతున్నారు. మల్లేశం ఏదో అందామనుకునే లోపలే అదే మాట ఎవరో అననే అన్నారు.

"అంతా భయం లేకుండైపోయింది. రోడ్డుమీద తాత జాగీరున్నట్టు ఇదేం కథ...ఛ, ఛ...మిలటరీ ప్రభుత్వం వస్తేగానీ తిక్కకుదరది."

అంజయ్యకు ఆ మాటలు ఎక్కడ తాకాలో అక్కడతాకాయి. అటుకేసి తీక్షణంగా చూశాడు. "అనండయ్యా అనండి...రైతే దేశానికి వెన్నెముక అంటారు...మమ్ముల కాల్చిచంపటానికి మిలిట్రీ ప్రభుత్వం కావాలంటరు".

"నువ్వే కోరితివి గదయ్యా మిలట్రి ప్రభుత్వం" అని మల్లేశం అనబోయి నోరు మూసుకున్నాడు. వెనక్కి తిరిగి సందుల్లోబడి ఆసుపత్రి చేరుకొని క్యారియర్ యిచ్చేసి బడికి పరిగెత్తాడు...

స్టాఫ్‌రూంలో మొండయ్య శాస్త్రి వెనకటి కాలమే గొప్ప అని ఏదేదో కోస్తున్నాడు... వేదకాలంలోనే..." అంటూ ఏదో కోయబోయాడు. "బ్రాహ్మలు కూడా ఎడ్లు

కోసుకుతిన్నారు. యజ్ఞయాగాలన్నీ గవ్వే" అని పూరించాడు మల్లేశం. దాంతో పెద్ద వాగ్వాదమే అయింది. "మీరు ఎన్ని చెప్పండి. వెనుకటికన్నా...సమాజం యిపుడే బాగుంది. నా పూర్వీకుల జీవితం కన్నా నేనిపుడు గెల్చుకున్న ఈ జీవితమే నాకు బాగుంది..." మల్లేశం వాదన ముందు మొండయ్య శాస్త్రి అవాక్కయిపోయాడు.

బడి వదిలాక సాయంత్రం స్వప్నను తీసుకుని మల్లేశం ఆసుపత్రి కెళ్ళాడు తల్లి కోసం...ఆసుపత్రి నిండా జనం. అంజయ్యకు లాఠీఛార్జీ తొక్కిసలాటలో చేయి విరిగింది. కట్టుకట్టారు. పరామర్శించడంకోసం జనమే జనం...విలేఖరులు...ఎమ్మెల్లే....తోసుకొని వెళ్ళాడు మల్లేశం..."ఎమాయె ఈ కాలంల ప్రేమలు తక్కువంటివి" అని అడుగుదామనుకుని నోరు మూసుకున్నాడు మల్లేశం. డాడిని వదిలించుకొని స్వప్న అంజయ్య బెడ్‌ప్రక్కన చేరింది. "ఏమైంది అంకుల్". "ఆరోజు కొండగట్టు కాడ కల్సినం, గుర్తున్నదా అంకుల్....". అంతమందిలో అంజయ్య కంట కన్నీరు...అవి కన్నీరో, ఆనందభాష్పాలో.

23-3-1997
ఆదివారం ఆంధ్రజ్యోతి
పద్మపీఠం మాసపత్రిక 1998.

("స్మృతి" - బి.ఎస్. రాములు కథలు (1998) సంపుటి నుండి)

* * *

12

ఎంగిలిచేత్తో...

-కాలువ మల్లయ్య

నాతకాని దుబ్బమ్మ కాళ్లనిండా దుబ్బ...ముఖం నిండా దుబ్బ... నెరసిన వెంట్రుకల నిండా దుబ్బ... చేతుల్నిండా దుబ్బ...

చేటెడు చెరిగి శుభ్రం చేస్తే పిడికెడు వడ్లు కూడా రావడం లేదు.

మాసికలేసి కట్టుకున్న చీర నిండా దుబ్బుంది. చిరుగులు పడ్డ జాకెట్టూ దుబ్బమయమై వుంది. తల వెంట్రుకల్నుంచికాలి గోరు వరకు ఆమె శరీరమంతా దుబ్బే.. దుబ్బమ్మ పేరుకు తగ్గట్టు దుమ్మే ఆకారమన్నట్టుగా వుంది.

ఆమె కళ్ళు, డొక్కలోపలికి పోయున్నాయి. కాళ్ళు కట్టెపుల్లల్లా వున్నాయి. చీపురు పుల్లల్లా వున్న చేతుల్లో చీపురు, చేటున్నాయి. ఆమె నడుముకో పాత గుడ్డుంది. తలకు తుండుగుడ్డుంది.

పట్ట పగలు మధ్యాహ్నపు టెండ మాదండిగా వుంది. చెట్టుకొమ్మ కూడా ఊగడం లేదు. ముఖంపై నుండి కారుతున్న చెమటను కొంగుతో తుడుచుకుంటూ ఊరి బయటున్న కల్లాల దగ్గరి కొచ్చింది దుబ్బమ్మ. అప్పుడే కల్లం లేపుకొని వడ్లు తీసుకెళ్ళిన రాంరెడ్డి పటేలు కల్లంలో నిల్చుంది. చేట క్రింద పెట్టింది. చేతిలో ఉన్న చీపురుతో కల్లం ఊడ్వడం మొదలెట్టింది. ఎండ మండిపోతోంది. కల్లం ఊడుస్తుంటే లేస్తున్న దుమ్ము నోట్లోకి, ముక్కులోకి పోతోంది. కళ్లమంతా ఊడ్చి దుమ్ము, ధూళితో పాటు నామమాత్రంగా వచ్చిన వరిధాన్యాన్ని కుప్పజేసింది.

కల్లం చుట్టుపక్కలకున్న మట్టిని, దుమ్మును ఊడ్చుకొచ్చి కల్లంలో కుప్పబోసింది. ఇప్పుడామె శరీరం మరింత దుబ్బమయమై దుమ్ముకే ప్రతి రూపంలా ఉంది. దుమ్ము నోట్లోకెళ్ళి ఊపిరాడక దగ్గొచ్చింది. దుబ్బమ్మకు కళ్ కళ్ మని దగ్గింది. ఉమ్మితోపాటు నల్లగా బయటకొచ్చిన దుమ్మును తుపుక్కున మ్మేసింది. ముక్కులోంచి కారుతున్న చీమిడిని గట్టిగా చీది పారేసింది. చీమిడితో పాటు దుమ్ము బయటకొచ్చింది. కుప్పగా పోస్తున్న దుమ్మును చేతిలోకి తీసుకుంది. పరీక్షగా చూసింది వైరాగ్యంగా నవ్వుకుంది.

కల్లం దగ్గరకు పోతున్న కాపు రాజమ్మ అక్కడాగింది. "గాదుబ్బల వడ్లెల్లుతయని కుప్పజేసినావే...?" అంది.

"ఏంచెయ్యాలె పటేలవ్వ ? నా పనే గిదాయె' అంది దుబ్బమ్మ.

"గీపన్జేసి బతుకుతావ్ ?" వ్యంగ్యంగా అంది రాజమ్మ.

"చిన్నప్పట్నుంచి గీ పన్జేసుకుంటేనే బతుకు తున్న గాదు పటేలవ్వ నాకు వేరే ఏం పనస్తది

సెప్పు ?"

"నిజమే కని గిప్పుడు కల్లాలల్ల వడ్లెవ్వలిడ్సి పెడ్తంగ్రు ? ఆ దుబ్బంత పొతం జెత్తె నీకు చారెడిత్తులు దొరుకుతె ఎక్కో" అని వెళ్ళిపోతోంది రాజమ్మ.

"అవు రాజవ్వ ! మరి గిట్లెందుకైతందో తెల్వుత్తలేదు" అని దుమ్మును చేటలోకి తీసుకుంది దుబ్బమ్మ.

కొంచెం కొంచెంగా కొమ్మలూగడం చూసి గాలి వస్తుందని తూర్పారబట్టడం మొదలెట్టింది.

రాళ్ళు, వడ్లగింజలు కుప్పగా పడుతుంటే దుమ్ము, గడ్డి, చెత్తంతా గాలికి కొట్టుకుపోతోంది. కొద్ది సేపట్లో కుప్పంతా తూర్పారబట్టడం అయిపోయింది.

రాశిగా మిగిలిన రాళ్ళను, వడ్లను చేటలోకి తీసుకొని అందులోంచి వడ్లను వేరు చేయడానికి చెరగడం మొదలు పెట్టింది దుబ్బమ్మ. పెద్ద పెద్ద రాళ్లనేరేస్తోంది. మట్టి బెడ్డలను తీసిపారేస్తోంది. చేటెడు చెరిగి శుభ్రం చేస్తే అందులోంచి పిడికెడు వడ్లు కూడా రావడం లేదు. నడుముకు కట్టుకొనున్నబట్ట విప్పి కల్లంలో పరిచి చెరుగగా వచ్చిన వడ్లను అందులోపోస్తోంది.

రాశిని చెరుగుతనే వుంది దుబ్బమ్మ.

నిన్న దినమంత ఎండలో తిరిగి మూడు నాలుగు కల్లాలూడుత్తె మానెడిత్తులన్న రాలే... ఇయ్యాల్లే పాటత్తయో ?" తనలో తాను గొణుక్కుంటూ పని చేస్తోంది.

కల్లం పూర్తిగా ఊడ్చుకపోతంగ్రు. కల్లం అంచులకు గూడ వడ్లిత్తులు పడనిత్తలేరు. ఇగ నా అసొంటోల్ల కేం దొరుకుతయి ? గొణుక్కుంటూ పని చేస్తోంది.

మనుషులు గిట్లెందుకై పోతంగ్రు ? కల్లంల పిడికెడన్ని అడ్లుంచుతేం బాయె. పురాగ అన్యాలాని కచ్చింది చేతిలో కొచ్చిన బెడ్డను తీసిపారేస్తూ అనుకుంది.

మునుపు ఒక్క కల్లం ఊడ్చుకుంటే కుంచెడు వడ్లు దొరికేటియి. ఇప్పుడు మూడు నాలుగు కల్లాలూడ్సినామానెడు (1/4 కుంచం) కంటెక్కో దొరుకుతలెవ్వు.

ఇయ్యాల్ల మరీ గోరంగుంది. కల్లమంత ఊడ్తె దుబ్బంత చెరుగుతె సోలెడున్న ఎల్లెటట్లు లేవు.

చేటలో మిగిలిన పిడికెడు వడ్లను గుడ్డలో పోస్తూ అనుకుంది దుబ్బమ్మ.

నీయవ్వ ఊడ్సి, ఊడ్సి, చెరిగి, చెరిగి నారెక్కలు గుంజుతున్నాయి. ఏదో శాత్రం జెప్పినట్లు "గట్టుక్కట్టెలు మోసినట్టే ఐతంది నాపని."

"లొటపెట పెదవులకు నక్కొసపడ్డట్టు గీ దుబ్బల వడ్లెల్లుతయా ? అంత మూతుల్నాకెటోల్లు తయారైంగ్రు." మట్టి చేతుల్లో తీసుకుంటూ అనుకుంది గొణుక్కుంటూ చెరుగుతోంది.

"బ్రహ్మంగారు మునుపే చెప్పిండు. ఎంపలి చెట్లకు నిచ్చెన్లేసెటోల్లు పుడుతరని... అయినె సెప్పిన యన్ని నిజమే ఐ తున్నయి." చెరగడం పూర్తి చేస్తూ అనుకుంది దుబ్బమ్మ.

గుడ్డ పేలికలో వున్న వడ్లలోకి చేయి పెట్టింది. అంతగొడితే సొలెడు గావు. కల్లంల ముత్తెమన్ని

వడ్లిడ్సి పెడితేంది ? గింత దరిద్రమా ? గొణుక్కుంటూ ఓ గుడ్డన ముల్లె గట్టింది. తను చెరిగిన మట్టి, రాళ్ళ దిక్కు చూసింది. తన శరీరం దిక్కు చూసుకుంది. గుడ్డ, చీపురు, చేట చేతిలోకి తీసుకొని నిల్చుంది. మరో కల్లంలోకి పోవాలనుకుంటుంది.

పొద్దొంగుతుంది. ఎండ తీవ్రత కొద్దిగా తగ్గింది. చుట్టు పక్కల కల్లాల్లో ఎడ్లతో బంతులు కట్టి నడిపిస్తున్నారు. బాగ దూపైతంది. నీళ్ళుదాగాలె అనుకొని దగ్గర్లో ఉన్న ఒర్రెదిక్కు నడుస్తుంది దుబ్బమ్మ. ఒర్రె చేరుకోగానే గుడ్డ, చీపురు, చేట ఒడ్డుపై పెట్టి ఒర్రెలోకి దిగింది. చెలిమలో ఊరుతున్న నీళ్లను దోసిలితో తీసుకొని తాగుతుంది. ఐదారు దోసిళ్ళ నీళ్ళు తాగింది.

తియ్యగున్నయి నీళ్ళు, అమృతం లెక్కున్నయి. ఎండకాలంల ఏం లేకున్నా సల్లటి నీళ్ళు దొరుకాలె అనుకుంది. మరో రెండు దోసిళ్ళ నీళ్ళు తాగి లేచినిల్చుంది. ఒర్రెను, ఈ చెలిమెనునా చిన్నప్పటి కెల్లి చూత్తున్న. ఇండ్లనీల్లు పచ్చిపాలొలుంటయి. అనుకుంటూ పైకొచ్చింది.

చీపురు, గుడ్డ, చేట చేతుల్లో పట్టుకొని కల్లాల దగ్గరికొచ్చింది.

"ఎమాయేనే దుబ్బి ? ఏ పాటి దొరికినయడ్లు ?" కల్లంలో వడ్లరాశి దగ్గర కూర్చొనున్న కాపు పోషాలడుగగానే నిల్చుంది.

"దుబ్బ దొరికినయి. రాశికి రాశి మన్ను చెరుగుతె ఇగో గీ అడ్లు దొరికినయి" వడ్లను చూపెడుతూ అంది దుబ్బమ్మ.

"ఎంత జేసినా ఏట్లెకే పోయినట్టుగా నట్టె. మాకు బాగ పంటలు పండుతున్నయని కల్లంల విడ్సిపెడ్తామె ?" అన్నాడు పోసాలు.

"ఏం పండుతలెవ్వా ? మునుపటి కంటె తక్కో పంటత్తందా ? అయినా మిమ్ములనెవ్వలిడ్సి పెట్టుమంటంగ్రు పటేల ? అయింత నాలుగిత్తులు గూడ గాలంబట్టి ఏరుకపొంగ్రి. లేకుంటె కల్లాలను సిమెంటు జేయించుంగ్రి. ఒక్కిత్తు గూడపోదు" అంటూ అక్కన్నుంచి వెళ్ళిపోయింది దుబ్బమ్మ.

కొన్ని కల్లాల్లో బంతులు కొడుతున్నారు. కొందరు అలుగం వెన్ను పొడుస్తున్నారు. రెండు మూడు చోట్ల తూర్పారబడుతున్నారు.

"వచ్చినవా దొర్సాని. రా...రా... కల్లం లేవక ముందే చీపురు పట్టుకొనవచ్చినవా ?" అంది రత్తమ్మ దుబ్బమ్మను చూసి.

"ఏంది పటేలవ్వ ? మొకమంతెట్లనో పెడ్తివేంది ?" అంది దుబ్బమ్మ.

"కల్లలంకే చీపురు పట్టుకోనత్తివి. మాకు వూడ్సినట్టుగాదా ?"

"బరుకతుంటాదె మాకు?" అంది రత్తమ్మ.

"మేమత్తె బరుకతుండదట ? మీరు కల్లంల అప్పకండెడన్ని వడ్లిడ్సిపెడ్తంగ్రుగదా ! మాకేం బరకతుంది మరి ?" కల్లంలో కూర్చొని అంది దుబ్బమ్మ.

"మాకేం మిగుల్తున్నయే మరి ? రెక్కలు ముక్కలు సేసుకుంట బొర్లుతున్నమా ? ఇంటింట రాజులమంత దుబ్బల దుబ్బెపజ్జేత్తన్నమా ? నీకు తెలువదా ఏవుసాల సంగతి ? మాకు కైకిలన్న పడుతున్నాదె ?" అంది రత్తమ్మ.

"అవు పటేలవ్వ. అంత పాడు కాలాని కచ్చింది. పంటలు పండుతలెవ్వంటనా పటేలవ్వ మరి ? పండినా, పండకున్నా మనుషులు గోరంగ తయారైతంద్రు. మంచిగ పంట పండుతె మాత్రం కల్లంల సొరెడిత్తులిడ్సి పెడ్తంద్రా ? పండినాగంతే...పండకున్నా గంతే. మనుషులకు పైసలమీన భమెక్కో ఐతంది. ఒకల్నొగలు సూడకుంటైతంద్రు" అంది దుబ్బమ్మ.

"నువ్వన్నది నిజమేనే దుబ్బి! రోజురోజుకు కట్టెకోత కాలమత్తంది. ఒగల్నొగలు తినే కాలమత్తంది" అంది రత్తమ్మ.

"మునుపు అంత మంచిగనే ఉందని చెప్పుత లేనుగని రత్తవ్వ ఊరోల్లంత ఒగలనొగలు పట్టించుకునెటోల్లు. ఒగల కాపతత్తె ఇంకొగలు సాయపడెటోల్లు...దొరలు గిట్ట సాగిచ్చుకున్నా...ఊరోల్లంత ఒక్క కుటుంబమోలె ఉండెటోల్లు...గిప్పుడు ఒగల నొగలుకానుతంద్రా ? ఒగల బిసాయిదొగల కుందా ? గవ్వేదో షేర్లట అచ్చినంక ఊళ్ళె పైసే పుడుతలేపాయె" అంది దుబ్బమ్మ.

"నువ్వన్నది నువ్వద్దేనేదుబ్బి" అంది రత్తమ్మ.

"కాదు పటేలవ్వ ! మునుపు నేను బాగ తిన్ననని అంట లేనుగని నా పనితోని పొట్టకైతె సావులేకుండె, ఏ కల్లం నూకినా కుంచెడన్ని వడ్లు దొరికేటియి. ఎవ్వలింటికి సుట్టమచ్చినా బంగారమోలె అరుసుకునెటోల్లు. కాపుదనపోల్లింటికి మా అసొంటోల్లు పోతే వట్టి చేతుల్తోని పంపియ్యకపోదురు. పనిపాటలోల్లకు కుండలగల దింత పెట్టెటోల్లు. అడుక్కునెటోల్లకు లేదనకుంట శక్తికొద్దిచ్చెటోల్లు. పండుగలప్పుడు ఇంటింటికి ఎంత మంది తిరిగెటోల్లు ? ఉన్నోల్లుగాని, లేనోల్లుగాని ఎవ్వలన్న కసురుకునేటోల్లా ? అన్నము, అప్పాలే సెటోల్లు. ఉన్నదాంట్ల దింత పనిపాటలోల్లకు తప్పకుండ దానం చేసేటోల్లు. శారతికాల్లు, మిత్తిరయ్యోర్లు, మందెచ్చులోల్లు. చిందుబాగోతులోల్లు, కాటిపాపలోల్లు, గిట్ల ఎంతోమంది ఊరుమీద బతికెటోల్లు, గిప్పుడు గాల్లందర్నెవ్వలన్న కాన్తంద్రా పటేలవ్వ ?" అంది దుబ్బమ్మ.

"ఏందే దుబ్బమ్మ దొర్సాని ? ఏమో బాగ చెప్పుతున్నవేంది ? బుదురకిచ్చిపటేలవ్వ దగ్గర వడ్లు దొబ్బిపోదామని సూత్తన్నవా ?" కల్లంలో బండి విడుస్తూ అన్నాడు వెంకట్రెడ్డి.

"అబ్బో ! పటెలవ్వ గంతెడ్డిదేం గాదులే పటేల ! పటేలవ్వ సొరెడిత్తులు పెడ్తనన్నా మీరు పెట్టనిచ్చెటట్టున్నారా ? పనిపాటలోల్లకు గూడ పెట్టకుంట బేంకులేసుకోంద్రి, బాగ సంపాయించుచుంద్రి" అంటూ లేచి నిల్చుంది దుబ్బమ్మ.

"మా దగ్గరేడియే పైసలు ? బేంకులు మాకే మెరుక ? అప్పులు గాకుంటె సాలు" అన్నాడు వెంకట్రెడ్డి.

"మీ గురించి కాదు పటేల ? కని అందరు సంపాదన కెగవడ్డరు. మునుపు ఏ తోట్లకు పోయినా కూరగాయలిచ్చెటోల్లు గిప్పుడవ్వి అమ్ముకుంటంద్రు."

"ఎప్పటి కాలమప్పుడు తియ్యి. మరి కైకిలోల్లు మునుపు ఎన్ని గంటలైన పనిజెయ్యకపోదురా ? మరిప్పుడు టైములు్చాత్తలేరా ? నాలుగైదు గంటలకంటెక్కో పన్జేత్తంద్రా ?" అన్నాడు వెంకట్రెడ్డి.

అవునంది దుబ్బమ్మ.

"కొన్ని నీళ్ళు పొయ్యి పటేలవ్వ" అంది.

చెట్టు నీడకున్న ఇత్తడి చెంబులున్న నీళ్ళను దుబ్బమ్మ చేతిలోకి వంచింది రత్నమ్మ.

"పొయ్యత్త పటేల, పోత పటేలవ్వ" నీళ్ళు తాగడం పూర్తి చేసి అంది దుబ్బమ్మ.

"పొద్దు పోతంది పో. ఇంకో కల్ల మూడ్చుకుంటె తవ్వెడన్ని వడ్లు దొరుకతయి రాజీరు షావుకారి కల్లం లేచింది పో" అన్నాడు వెంకట్రెడ్డి.

"ఇక గా కల్లంలేం దొరుకుతయి పటేల ? కాపుదన్నపోల్ల కల్లాల్లనే గిన్ని వడ్లు దొరికినయంటె షావుకారి కల్లంలేం దొరుకుతది చెప్పు ?"

రాత్రయ్యే వరకు మరో రెండు కల్లాలూడ్చి, తూర్పారబట్టి చెరిగింది.

పొద్దంత దుబ్బల స్నానమాడి పన్జేత్తె దొరికిన వడ్లు గివిమూడు సోల్ల మీద పిరికెడన్నేతయేమొ ? తనలో తాననుకుంది దుబ్బమ్మ.

'ఇంటికి పొయ్యి పెయ్యి కడుక్కోవాలె. చల్లగుంది' ఊరి దిక్కు నడుస్తూతనలో తానను కుంటోంది. దుబ్బమ్మ.

ఆలోచిస్తూ ఊళ్ళోకి నడుస్తున్న దుబ్బమ్మకు ఊళ్ళో ఏవో మార్పులొస్తున్నట్టు తోస్తోంది. కల్లాల్లో మునుపడిలా ధాన్యముంచకపోవడానికి కారణం పంట పడడమో, పండకపోవడమో కాదని పిస్తుందామెకు. అందుక్కారణం మరేదో ఉందనిపిస్తుందామెకు. మనుషుల స్వభావాల్లోనే మార్పు వస్తున్నట్టు తోస్తుందామెకు. మనిషి డబ్బుకిస్తున్న విలువ మరి దేనికీ ఇవ్వడం లేదనిపిస్తోంది. ఊళ్ళోకి ఏదో ప్రవేశిస్తున్నట్లని పిస్తుందామెకు.

బాగా ఆలోచిస్తూ నడుస్తున్న దుబ్బమ్మకు ఎంగిలి చేత్తో కాకిని కొట్టని తనం ఊళ్ళోకి ప్రవేశిస్తున్నట్లు తోస్తోంది.

"అవు. నిజమే ఎంగిలి పెయ్యితోని గూడకాకిని కొట్టనోల్లు రోజురోజు కెక్కో ఐతంద్రూల్లె" తనలో తాను గొణుక్కున్నట్టనుకుంటూ భారంగా అడుగులేస్తూ తన గుడిసె చేరుకుంది దుబ్బమ్మ.

(మయూరి సచిత్ర వారపత్రిక 12-2-1994)

* * *

13

గూడు - నిట్టాడు

-గూడూరు అమరావతి

ఒళ్ళంతా చెమటలు పట్టాయి. అయినా లెక్కచేయకుండా చంకలో గంపతో ఉరుకుతోంది లక్ష్మి. కాస్త ఆలస్యం అయితే కంపెనీలో బీడీలు తీసుకుంటాడో లేదో అన్న భయం.

కంపెనీకాడ చాలామంది కార్మికులున్నారు. వాళ్ళను చూసి చాలమందే వున్నారు హమ్మయ్యా! అని దమ్మార్చుకుంటూ అడుగులేస్తోంది లక్ష్మి.

ఆమెను చూసి అమ్మలక్కలు గుసగుసలాడుతున్నారు. విషయమేమిటో లక్ష్మికి అర్థమైపోయింది. లక్ష్మి మొహం నెత్తురు పిండి వెలిసిపోయినట్టుగా మారింది. బీడీల కట్టలు చాటలో పేర్చి యజమాని ముందుంచింది.

"ఏం తల్లీ, మూతులు సరిగా రాలేదు. మనస్సు ఎక్కడుంది. ఇప్పుడే మనస్సును ఎక్కడికీ పోనీయకు" అంటూ బీడీలు చెక్ చేస్తూ వెటకారం చేస్తున్నాడు యజమాని.

అక్కడ వున్న స్త్రీలు గొల్లున నవ్వారు. లక్ష్మి అందరి వేపు ఓసారి చూసింది. నా సాటి ఆడవాళ్ళే నన్ను చూసింది. నాసాటి ఆడవాళ్ళే నన్ను చూడంగనే యిరగబడి ఎందుకు నవ్వుతున్నారు. ఆ చూపులలోని అర్థం... చిన్నగ తలదించుకొంది లక్ష్మి.

వెటకారమాడే ఈ కంపెనీ యజమాని బతుకు ఎవరికి తెలియదు. బీడీల మూతులు తోకలు సరిగా రాలేదని చాలామంది బీడీలు లెక్కలోకి రాయడు. ఆ బీడీలను భార్యతో కట్టలు కట్టించి మళ్ళీ మంచి బీడీల్లో కలుపుకుంటాడు. అతని లైసెన్సులో యిరవై మందికి తక్కువే అయినా వందమంది బీడీ కార్మికులున్నారు. చుట్టుపక్కల ఊర్లవాళ్ళు కూడా చేస్తారు. ప్రతి పగారుకు (పేమెంటుకు) ఒక్కొక్కరికి పదినుండి యాభయి వరకు తక్కువిస్తాడు. లెక్క తెలియనివాళ్ళైతే ఊరుకుంటారు. తెల్సినవాల్లు అడిగితే వాల్లను తిప్పుకొని చివరకు రోషంతో పడేస్తాడు. కాదువోదు అంటే ఆకు వేయనంటాడు.

అతను ఈ వూరికొచ్చినపుడు అతని భార్య మూడు అతుకుల చీరతో గడిపిన సంసారం. ఇప్పుడు అతనికి ఊరి భూస్వాముల అండ, కాంగ్రెస్ వాళ్ళ మద్దతుతో వున్నాడు. ఓ స్కూటర్ తన బీడీలు సేల్ చేసుకోవడానికి సొంతంగా ఒక ఆటో. పక్కనే వున్న టౌన్లో ప్లాట్లు కొన్నాడు. పట్టుమగ్గాలు అబ్బో యిపుడు యీ వూరునే కొనగలడు.

లక్ష్మి నీరసంగా గోడకు ఒరిగింది. కళ్ళు మూసుకుంది. అతని మాటలు వాల్ల నవ్వులు... మనస్సులో మెదులుతున్నాయి. ఇలాంటి యింట్లో ఎందుకు పుట్టించావురా దేవుడా...ఈ పేదరికాన్ని ఆసరా చేసికొని ఎన్ని రకాలుగా ఆడుకొంటుంది ఈ లోకం. గబగబా ఆకు. తంబాకు తీసుకొని యింటికొచ్చి కత్తిరించాల్సిన ఆకు అక్కడే వదిలేసి మంచంలో ఒరిగిపోయింది లక్ష్మి తన గతి యిట్లా ఎందుకైందో ఆలోచిస్తోంది.

నాయిన్న తనతోపాటు అవ్వను (తల్లిని) తమను కూడా దేశం (భీవండి) తీసుకొనిపోతే ఈ రోజు తమకు యింత అవమానం జరిగేది కాదు. నలుగురు పిల్లలం. కష్టపడేది నాయిన్న ఒక్కడే. తనకు ఊహ తెల్సిన నుండి నాయిన్న తమతో కలసి నెలరోజులు ఎన్నడు గడుపలేదు. నాయిన్న ఏడాదికోసారి వస్తాడు. ఒక్కడి కష్టార్జితంపై అందరు బతకాల. అక్కడ దేశంలో (భీవండిలో) అన్నీ కొనాల. నెలకు వెయ్యి రూపాయల కంటె ఎక్కువ సంపాదించలేదు. చుక్కలంటే ధరలు. ఆ సంపాదన సంసారాన్ని ఎంతవరకు గుంజుతుంది. బట్ట, పొట్టతోపాటు యింటి కిరాయి కట్టాలి. ఇక్కడైతే ఏ గుడిసెలో వున్నా ఏం తిన్నా గడిచిపోతుంది. ఊర్లో వుంటే చాలా ఖర్చు తగ్గుతుంది. నాలుగు రాల్లు కూడబెట్టాలంటే ఈ ఎడబాటు తప్పదు.

అందుకే అందర్నీ వదిలేసి నాయిన్న ఒక్కడే దేశం పోతాడు. తమ యింటిపక్క మల్లయ్య తాత తమ కులంవాడే. ఎప్పుడూ తమ యింటికాన్నే వుండేవాడు. అతనికి కొడుకులు కోడండ్లు మనుషులు, మనుమరాల్లు వున్నారు. యాభయి ఏళ్ళకు వుంటాడేమో. అతని భార్యపోయి పదేండ్లవుతోంది. అతని వద్ద వున్న డబ్బును మిత్తికి యిచ్చుకొని ఆ వడ్డీతో బతుకుతాడు. ఈ రోజుల్లో కల్లు తాగడం మామూలే. అవ్వను తనతో కూసోబెట్టుకొని కల్లు తాగేవాడు. తాను అవ్వతోనే వుండేది. అపుడప్పుడు తనకు కూడా కల్లు యిచ్చేవాడు.

ఈ అవకాశం వాల్లను యింకా దగ్గరకు చేర్చిందేమో. అలా గంటలు గంటలు గడిపేవాల్లు. ఈ తతంగం అంతా నాయినమ్మ చూసీ చూడనట్టు వుండేది. ఒక్కోసారి "ఏమే...సారవ్వా మల్లయ్య వచ్చి చానాశేపు వుండిపాయె. ఏమాటో తెల్సుకపో" అంటూ బయటకు వెళ్ళిపోయేది.

ఒకసారి తనకు లీలగా వినబడింది. మల్లయ్య తాత అవ్వతో అంటున్నాడు "నీ మొగడు ఏడాదికోసారి వచ్చిపోతడు. నీ ఆలనపాలన వాడేం చూస్తడు. నాతో వుంటే యింకా బాగా సుకపడ్తవు. రేపు నీ మొగడు వచ్చి అడిగితే తెగేసి చెప్పు"

"ఏమనీ" అమాయకంగా అడిగింది అవ్వ.

"నేను మల్లయ్య మామతో బతుకుతా అని చెప్పు" అని అన్నాడు తాత. మల్లయ్య తాతను నిలదీసే ధైర్యం తనకు లేకపోయింది తాను చిన్నపిల్ల.

నాయిన వచ్చినంక కూడా అవ్వ మల్లయ్య తాతతోనే ఎక్కువ సమయం గడిపింది. వారం రోజుల తర్వాత కూడా ఏ మార్పూ లేదు. నాయిన అవ్వను మందలించాడు. అవ్వ ఆ అవకాశం కోసమే చూస్తున్నదో ఏమో.

"నేను మల్లయ్య మామతోనే బతుకుత" ఎలాంటి బెరకు లేకుండా అనేసింది అవ్వ.

"నీకేం పొయ్యేకాలమే. పిల్లలకు పిల్లలు పెరుగుతున్నరు. పిచ్చి పిచ్చి ఆలోచనలు యిడ్చిపెట్టు. ఈసారి అందరం కల్సే దేశం పోదాం" అన్నాడు నాయిన.

"నేను ఎక్కడికి రాను. అతనితోనే ఉంట" అంటూ కచ్చితంగా చెప్పేసింది అవ్వ. దాంతో నాయిన మొత్తుకున్నాడు. "వాడు నా పెండ్లానికి మరుగుమందు పెట్టిండు. నా సంసారంలో చిచ్చుపెట్టిండు. ఇద్దరు ఆడపోరగాన్లు పెండ్లికి ఎదుగుతున్నరు. తల్లి గిసొంటిదని తెల్సినంక ఎవడు చేసుకొంటడు" అంటూ లబోదిబోమన్నాడు.

అప్పటిదాకా గుసగుసలాడిన వాల్లు యిపుడు బయటకే అనేస్తున్నారు. అమ్మలక్కలంత ఆశ్చర్యపోయి ఓ ఉపాయం చేశారు.

నీకు నిజంగనే వాడు మందు పెట్టినట్టున్నడు. మాడమీద కొన్ని ఎంటుకలు కొరిగించి

నిమ్మకాయలు కోసి రుద్దితే నీ రోగం దెబ్బకు దెంకపోతది అన్నారు.

అవ్వ అసలే వినలేదు. నాయిన మరో యిద్దరు పెద్దమనుషులను తీసుకువచ్చి అడిగించాడు.

"రాజమ్మా...మా క్కూడ మందు పెట్టుడు మీద నమ్మకం లేదు. కాని నీ మొగని తృప్తి కోసం ఊరోల్ల నమ్మకం కోసం మాడ మీద ఎంటుకలు తీసి నిమ్మకాయలు రుద్దుకో. అందరి అనుమానం తీరుతుంది" అని అడిగారు.

దాంతో అవ్వ తన ప్రేమంతా ఆ వెంట్రుకల్లోనే వున్నట్టు ఆ ప్రేమకు దూరమవుతానేమో అన్నట్టు విలవిలాడింది. మా బంధాన్ని దూరం చేయవద్దు అన్నట్టు తన రెండు చేతులు మాడమీద వేసి అదిమి పట్టుకొంది.

నాయిన కుల పెద్దమనుషులను కూడేసి అడిగించాడు. ఆ పంచాయతీకి అక్కాబావా కొడుకుతో సహా వచ్చారు. చిన్నాయినలు కూడా వచ్చారు.

"చెప్పు రాజమ్మ. పిల్లలూ...భర్తా...సంసారం వదిలేసి వానితో లేసిపోతనంటవు. అంతేనా..."

అవ్వ ఏం మాట్లాడలేదు.

"అట్ల గాకపోతే సంసారం తెర్లు చేసుకోకు పాలూ పటువా రెండూ కాపాడుకో" రెండర్థాలతో మరో పెద్దమనిషి అన్నాడు.

అవ్వ నాయినతో వుండడానికి హరికీసుకు (ససేమిరా అంటూ) ఒప్పుకోలేదు. ఆడమగ పిల్లాపీచు ఊరంతా ఆ వింత చూడ్డానికి వచ్చారు. ఒకరిద్దరు ఆడవాల్లైతే ఓ...లం...నువ్వు వీడితో పోతే ఇద్దరు పోరగాన్లు ఇంకా పెండ్లికున్నరు. వాల్ల బతుకు ఏంగావాల్నే. వాల్లను ఎవడు చేసుకుంటడు అంటూ బండలు ఎత్తిమీద వేయబోయి పక్కకు ఎత్తేశారు. పెద్ద చిన్నాయిన అవ్వను రెండు మూడు కొట్టాడు.

అక్కా బావ అందరు అడిగిచూశారు. ఏ సమాధానం లేదు. అవ్వకు నేనంటే ఎంతో యిష్టం. అవ్వ అంటే నాక్కూడా అంతే. నేనంటే కరుగుతదని అనుకున్నాను. కాని అవ్వ మల్లయ్య తాతతోనే నిర్ణయించుకున్నట్టుంది. మౌనంగా వుండిపోయింది. పెద్దమనుషులకు యిక కలిపి ఉంచడం సాధ్యంకాదని తేలిపోయింది. ఇక వ్యవహారంలోకి వచ్చారు.

"మల్లన్నా...మరేం సంగతే. మాకు నోరే ఆడుతలేదు. నలుగురికి చెప్పాల్సినోనివి మాతోని చెప్పించుకోవడ్తివి. వానికి యిద్దరు ఆడిపోరగాన్లుండిరి. వాల్లను ఎవడు చేసుకుంటడు. రాజన్న పక్క ఎడబాపితివి...మరెట్ల..." అన్నాడో పెద్దమనిషి

గదే వచ్చింది గోస మరో పెద్దమనిషి అన్నాడు.

"గట్లడుగుని బాంచెన్... కాల్లు మొక్కుత. నా కొడుకు కుడువంటే పడుగంటడు వాన్ని పిచ్చోన్ని చేసి ఆడుకుంటున్రు" అంటూ నాయినమ్మ ఆ పెద్దమనుషుల కాల్ల మీదపడ్డది.

"అట్లాగే పెద్దవ్వా...అడుగుతనే ఉంటిని. సమస్యలంటూ పుట్టినంక పరిష్కారం లేకుంట పోతదా..." అంటూ నాయినమ్మను లేవదీశాడు పెద్దమనిషి.

"కష్టమో...నిష్టూరమో...కట్నం కొంచెం ఎక్కువ తక్కువ పారేస్తె ఎవడన్న చేసుకుంటడు" మరో పెద్దమనిషి అన్నాడు.

"అది నిజమేగని. రాజన్న దగ్గర ఏమున్నయి. సంకలావడితెకార్జాలు కనపడుతయి" నాయినమ్మ అన్నది

"నువ్వు గావరగాకే పెద్దవ్వా... జరుగుతాంటే సూడు" అన్నాడో పెద్దమనిషి.

"ఎమాయెనే మల్లన్నా ! అన్నీ మేమే అనుకోవడితిమి. నువ్వు సప్పుడు చేయవేందే" మరో పెద్దమనిషి అడిగాడు.

నాదేం ఉన్నది మీరు ఎట్ల జెప్పుతె అట్ల వింట ఆన్నాడు మల్లయ్య

"ఇద్దరు ఆడపిల్లలున్నరు వాల్లిద్దరి పెండ్లిల్ల కోసం నువ్వు నలభై వేలు యిస్తే యిపుడే వాల్ల పేరు మీద ఏదన్న బ్యాంకుల డిపాజిట్ చేస్తమే..."

ఆ మాటకు మల్లయ్య వియ్యంకుడు కొమరయ్య కలిగించుకొన్నాడు.

"గవన్ని ఇతని దగ్గర ఎల్లయి. అయిదో పదో అంటే ఎట్లనో తిప్పలవడుతడు గానీ. గన్ని పైసలు ఆయన్నుంచి కావు".

కాసేపు వాదాలు జరిగాయి. చివరకు చెరి పదివేల చొప్పున యిరవై వేలు మల్లయ్య తాత నాయిన్నకు ఇచ్చేటట్టు చేశారు. కొంత డబ్బు యిచ్చారు. మిగతా మొత్తం కోసం ఇంత పాలం చెక్కవుంటే నాయిన్న పేర మల్లయ్య చేత కాయిదం రాయించారు పెద్దమనుషులు. మల్లయ్య కొడుకులకు ఎంత కోపం బాధ కలిగినా తండ్రి మీద మమకారమో పెద్దమనుషుల్ని ఏమీ అనలేకో చూస్తూ ఉండిపోయారు.

లక్ష్మి ఆలోచనలను చెదరగొడ్తూ నాయినమ్మ పోషవ్వ అరుస్తోంది.

"ఎమాయెనె లచ్చిమీ. మీ అవ్వను సూడవోతె గట్లాయె. మీరు గిట్ల జెయ్యవడితిరి. ఎక్కడి పని అక్కడ పారేసి పంటె బువ్వకెట్ల వస్తదే. కట్నంకు ఎట్లత్తయే పైసలు. లేకపోతే మీరు గూడ మీ అవ్వతీర్గ ఎవలనైన తీసుకొని లేసిప్రోని"

నాయినమ్మ అట్లా అరవడం మామూలే. అక్కడ కంపెనోడు, ఆడోల్లు తన బతుకు జూసి నవ్వుతుంటే జరిగిందానికి బాధపడుతుంటే ఈ ముసలిదాని అర్సుడొకటి అనుకొని అరిచింది లక్ష్మి.

"ఓ ముసలిదానా ! ఎందుకు ఒర్రు తున్నవట్ల. నీ కొడుకు జెయ్యవట్టే యిదంత అయింది. ఏండ్ల కేండ్లు యిడ్సిపెట్టి దేశంపోతే అవ్వ గట్ల జేసింది. సంపాదన అనుకుంట దాని మంచిచెడ్డలు నాయిన్న ఎన్నడన్న పట్టిచ్చుకున్నడా. అయినా ఎంతోమంది తప్పులు చేసిన్రు. దేవతలే తప్పు చేసిన్రు అవ్వదేంది. మల్లోసారి మా అవ్వనుగాని, మమ్ములగాని మాట అన్నవంటె నీ నాలుక గుంజి కోసిపారేస్త...ఏమనుకుంటన్నవో...ఇరవై ఏండ్ల నుండి నాయిన దేశంపోతనే ఉండె. నాయిన కూడ అక్కడ తప్పు చేస్తలేడని నమ్మకం ఏంది. ముసలిదానా ఒర్రకు..."

"వాడు మొగోడే ! లంజికానా. వాడు రోజుకు యిరవై గోడలు దుంకినా లోకం ఏమనదే" నాయినమ్మ రెట్టించిన గొంతుతో అరిచింది.

"ఏందే ముసలిదానా - ఇంకా వొర్రుతానవు. మొగోడే మనిషిగని. ఆడిది మనిషి కాద...అవ్వకు కూడా మనస్సూ కోరిక వుండదానే అంటూ ఆకు కత్తిరించే కత్తెర తీసికొని నీ నాలుక కత్తిరిస్తాగు" అంటూ ముందుకు ఉరికింది లక్ష్మి. నాయినమ్మ చేతికర్ర ఎత్తింది. అంతలో తండ్రి రావడంతో వెనక్కి తగ్గింది లక్ష్మి. ఒక్కసారిగా కోపం పోయి దుఃఖం పెల్లుబికింది.

"నాయినా ! నీతోటి మమ్ముల గూడ దేశం తీస్కపోయే. బయట మంది బాధ ఇంట్ల నాయినమ్మ ఒర్రుడు" ఏడ్చుకుంటూ అంది లక్ష్మి.

రాజయ్య ఆ మాట పట్టించుకోనట్టు యింట్లోకి పోయాడు. రోజూ అతనికి అవమానాలతో తలపగిలిపోతోంది. ఈ బతుకు యిట్లా ఎందుకు మారిపోయింది. ఇట్లా ఎందుకు జరిగింది. లోపం

ఎక్కడుంది. తాను తన భార్యతో ఎక్కువకాలం గడుపలేకపోయినా దేశం విడిచి వచ్చి ఇంటికాడ ఉన్నన్ని రోజులు ఆమెను తాను ఎంతో ప్రేమగా చూసుకున్నాడు. మరి యింతకన్నా ఏం చేయాలి ? తాను పనిచేసే పవర్‌లూం యజమాని భీవండిలో యీ యిరవై ఏళ్లల్లో పవర్‌లూమ్సు పెంచి మరో కంపెనీ పెట్టాడు. తానేమో చేసి చేసి తన భార్యను కూడా పోగొట్టుకున్నాడు. వాడు కూలి ఎక్కువ యిచ్చి ఉంటే భార్యాపిల్లలం అందరం అక్కన్నే బతికేవాల్లం కాదా. తనకు తన భార్యను దూరం చేసింది ఆ మాస్టర్ వీవర్ కాదా... కిందికి వేసిన తలను బాధతో పైకెత్తాడు రాజయ్య. పిల్లలు పుట్టక ముందు ప్రేమగా సారవ్వతో కల్సి దిగిన ఫోటో గోడకు వేలాడుతోంది. చేతిలోకి తీసుకున్నాడు. కళ్ళల్లో నీల్ళు తిరిగాయి. తన రెండు చేతులను ఆ ఫోటో మీద పెట్టి భార్య ఫోటోను తడిమాడు. అతడి కంటినీరు ఆ ఫోటో మీద పడి ఆమె ముఖం యింకా తేజ్ (వెలుగు)గా కనపడింది. ఆనాటి తీపిగుర్తులు యిపుడే పొందుతున్న అనుభూతి.

"ఎందుకే నన్ను ఒంటరిగాన్ని చేసిపోయినవు. ఇప్పటికైనా నా బాధను బతుకును ఆలోచించి యింటికి రావే. ఇంటికి రావడానికి ఆ దేవుడు నీకు కాల్లు యిస్తలేడ..." ఫోటోను ఎదకు అదుముకుని ఎక్కిఎక్కి ఏడుస్తున్నాడు రాజయ్య

రాజయ్యపడే బాధను చూసి నాయినమ్మ కొడుకును పట్టుకొని ఏడ్చింది. లక్ష్మి కూడా కుమిలికుమిలి ఏడ్చింది. ఎవరి మనసులో వాళ్ళు సారవ్వ మళ్ళీ యింటికి రావాలని ఆ దేవుడికి దండం పెట్టుకుంటున్నారు.

తల్లిదండ్రుల ప్రేమకు దూరమై ఆడపిల్లలు వాల్ల చేతులు వాల్లే కాల్చుకుంటూ వంట చేసుకొంటున్నారు. నాయనమ్మ వాల్లను ప్రతి నిమిషం కనిపెట్టుకొని వుంటుంది. ఆమె అనుమతి లేకుండా గడప దాటడానికి వీలులేదు. సమాజం వాల్లను ఓ పంజరంలో పెట్టేసింది.

బీడీల శాటతో లక్ష్మి లత దగ్గరకు వచ్చింది. లతకు తెల్సు లక్ష్మి అటు సమాజానికి యిటు తల్లి ప్రేమకు దూరమై టీబీ పేషెంటులా మారిందని.

"లక్ష్మీ ! అన్నం తినడం లేదా. టీబీ పేషెంటు తీరైనవు"

"అవునక్కా ! నాకు టీబీ వుందని. చెల్లెకు పెండ్లి జేసి నాయిన పెండ్లి చేసుకుంటడట. నన్ను ఎవడు చేసుకోడట. మా అవ్వ వుంటే ఇట్ల అనేవాల్లా !" అంటూ నవ్వి ఆ తర్వాత ఏడ్చేసింది లక్ష్మి. లత అనునయించింది.

"లతక్కా! ఎంత మంది తప్పులు చేస్తలేరు. భూలోకంలో అన్ని దొరుకుతయిగని కన్నతల్లి దొరుకుతదా. అవ్వ నాకు కండ్లల్ల కనిపిస్తున్నది. అవ్వ సిరిసిల్ల కాడ ఉన్నట్టు తెల్సింది. కని నాయినమ్మను చూస్తే పెద్దపులిని చూసినట్టు భయమైతాంది. అయినా దవాఖానకు పోతాన అని చెప్పి పోయి అవ్వను చూసివచ్చిన. రాంగ చెల్లెకు నాకు ఓ లంగా జాకెట్ బియ్యం మిరుపకాయలు ఓ రెండు వందల రూపాయలిచ్చింది. అక్కాబావ కూడ అవ్వ దగ్గరకు పోయినారట. అవ్వ వాల్లకు ఓ చీరె తువ్వాలు పెట్టి కొన్ని పైసలు యిచ్చిందట". తల్లిని చూసిన ఆనందాన్ని ఒక్కసారిగా వెల్లగక్కింది లక్ష్మి.

లత సంతోషంగా అడిగింది "మరి మంచిగున్నదా మీ అవ్వ?"

"ఏం మంచిగా అక్కా ! నల్లకట్టె తీరైంది. మల్లయ్య తాత సాతనైతలేదని పనికి పోతలేడట అవ్వనే కూలినాలి చేసి వాన్ని సాదుతున్నది. గిట్లయితే ఎట్ల ! అని అవ్వ అంటే నేను నా కొడుకుల దగ్గరికి పోత. నువ్వు ని సంసారానికి పో అంటూ బెదిరిస్తున్నడట. నన్ను సూడంగనే నా మీదపడి ఏడ్చింది అవ్వ పక్క యింట్ల వాల్లు అందరు వచ్చిను. ఎవరు ఈ పిల్ల అని అడిగితే మా వూరు. మా పక్కింటోల్ల పిల్ల

అని చెప్పింది. అట్ల చెప్పేటప్పుడు అవ్వ నోరు తడబడింది".

"మరి. మీరు పోతనే ఉంటిరి. వస్తనే ఉంటిరి. బట్టలు పైసలు సరుకులు పెట్టె తెచ్చుకుంటనే ఉంటిరి. మరి మీ యింటికి రమ్మనకపోయిన్రు".

"మా అవ్వ రావాలని ఇంట్ల అందరికీ మనసులున్నది. కానీ లోకానికే భయపడుతున్నరు. అవ్వనే ఓ రాత్రి వచ్చి పెద్దమనుషులను కలసి యింటికాన్నే ఉంట అని చెప్తే ఎంత మంచిగుండు. కాకపోతే మల్లోసారి అందరు చెవులు కొరుక్కుంటరు. నాయినకు, నాయినమ్మకు గూడ అవ్వనే యింటికొస్తే మంచిగుండు అని ఉన్నది. కాని పెద్దమనుషులను కలుసుటానికి అవ్వకు ధైర్యం చాలుతలేదు".

"మీ నాయినకు మీ అవ్వ మేనమామ బిడ్డేనాయె. మీ నాయినగూడ ఓసారి పోయి అవ్వను కలిసివస్తె వస్తదేమో" అంది లత.

కొన్నాళ్ళకు లక్ష్మికి ఎక్కడి నుండో సంబంధం వచ్చింది. పదహారు వేలిస్తే ఆ పిల్లమెడలో పసుపుతాడు కట్టడానికి ఒప్పుకున్నాడు ఆ పిల్లగాడు. లక్ష్మి మొహంలో ఆనందం పొంగిపొరలుతున్నా తల్లి లేని బాధ కనపడుతూనే వుంది. కనీసం తాళికట్టే సమయానికి వచ్చి అవ్వ యిన్ని అక్షింతలు వేసిపోయినా బాగుండేది. పట్టుమని పదిహేను రోజులు కూడలేదు. దేవుని గుడిలో చేయాలని మాట్లాడుకున్నారు. అవ్వ బాపతు పైసలు యింకా సర్పంచుదగ్గర్నే వున్నాయి. ఒక్క పైస లేకుండ అంతా ముందుగాల ముట్టచెప్తెనే తాళికడ్తానన్నాడు పిల్లగాడు.

వారం రోజులు సర్పంచు యింటిచుట్టు తిరుగంగ తిరుగంగ యిచ్చాడు. అవి తీసుకపోయి పిల్లగాని తరపు వాల్లకు యిచ్చివచ్చారు. పెండ్లి పత్రికలు కొట్టించి దగ్గరివాల్లకే పంపాడు రాజయ్య...పెద్దగా చేయడం తనకు చాతకాదు కాబట్టి.

* * *

ఆ వూరు రోడ్డు మట్టి రోడ్డు కావడం వల్ల మిట్టలు వంపులు వున్నాయి. బస్సు లోపల ఎంత మంది వున్నారో బస్సు మీద అంతమంది వున్నారు. నిండు పొద్దుల మనిషిలా బస్సు వచ్చి ఆగింది. జనమంత ఎక్కాలని ఎగబడుతున్నారు.

"ఆగున్రవ్వా ! దిగెటోల్లు చానమందున్నరు. వాల్లు దిగినంగ ఎక్కున్రి" అని అరిచాడు కండక్టరు. ఒక్కొక్కరు దిగుతున్నారు. ఎక్కేజనం ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఎవ్వరికీ నోటమాట రాలేదు. అందరు వెనుకకు జరిగారు. చేతిలో ఓ పెద్దసంచి. ఎడమ చేతిలో ఓ బుట్ట. సారవ్వ బస్సు దిగి ఇంటివైపు నడుస్తోంది.

మల్లయ్య వియ్యంకుడు కొమురయ్య జరూరుగా పెద్దమనుషుల దగ్గరికి పోయి విషయాన్ని చెప్పి సారవ్వకు ఎదురుగా వచ్చి అడిగాడు.

"ఆగు. ఎక్కడికి వత్తావవు..."

"నా యింటికి"

"నీ యిల్లు ఎక్కడుంది."

"నా యిల్లు ఎక్కడున్నదో నీకు తెలువదా !"

"తెలుసు. కాని ఆ యింట్లకు నువు పోవుటానికి వీల్లేదు."

"అదే ? ఎందుకు ?"

చుట్టూ చేరిన అమ్మలక్కలు ఆ వింత చూస్తున్నారు. ఓపిక లేనివాళ్ళు సారవ్వపై విరుచుక పడ్డారు. "పోయినదానివి పోక మల్ల సిగ్గులేక ఎందుకచ్చినవు" ఓ గొంతు.

"వానితో కులకటం అయిపోయింది" వచ్చింది మరో గొంతు.

"సంసారాన్ని పాపింది చాలక మల్లచ్చినావు" మగ గొంతు.

ఇట్లా మనిషో మాట అంటూ సారవ్వను చుట్టముట్టారు.

"ఆడిదాన్నినమ్మద్దు. నమ్మితే సంసారాలు నాశినమవుడేకాదు. పానాలకు ముప్పత్తది" మరొకడు.

సారవ్వ సహనం చచ్చినదానిలా మారింది.

"ఏమయ్యో మల్రెడ్డి పటేలా ! నువు గూడ నా తీరు పోయిపోయి రాలేదా లావు మాట్లాడు తున్నవు" వెనుకకు తిరిగి అంది మళ్ళీ

"ఎంకవ్వా - నీక్కు యింటి అల్లుడు ఉండంగ బిడ్డ దగ్గరకు పరాయి మొగోన్ని పంపినవు అది తప్పు కాదా. మల్లక్కా నీకు చేసుకున్న మొగడుండంగ మరొకన్ని యింట్ల పెట్టుకొని యిద్దరు మొగల ముద్దుల పెండ్లాం తీరుగ బతుకుతలేదా? అది తప్పు కాదా. పురాణాలల్ల ద్రౌపతి చేయలేదా. వాల్లత్త కుంతి చేయలేదా. ఇట్ల ఎంతమంది చేయలేదు. వాల్లను ఏం జేసిన్రు. మీదికెల్లి పూజ చేత్తలేమా!

ఏమయ్యా ! ఆడిదాన్ని నమ్మితే పానాలే పోతయా ! సంసారం పాడైంది మల్లయ్యది కాదు - నీది కాదు. నాది. ఆడది చాల విశ్వాసంగ మెదులుతుంది. మీ మాయమాటలు నమ్మి ఎంతటి మూర్ఖున్నయినా నమ్ముతుంది. దాన్ని ఆసరా చేసుకొని అవసరం తీరినాక వదులుతారు. లేకపోతే సీతకు అగ్నిపరీక్ష పెట్టినపుడు - రామునికి కూడ ఎందుకు పెట్టలేదని అడిగి సీత నన్ను శంకించే హక్కు నీకెక్కడిది అని ఇద్దరం ఒంటిగనే గడిపినంగదా అని అంటె ఎంత మంచిగుండేది.

అసలు - ఎవల ఆలోచన వాల్లది. ఇంకొకరికి ఏం అవసరం. మీకు నేను అడ్డం వత్తానన ? ఏమైన అడుగుతె నా మొగుడు అడుగుతడు. అక్కడ సమాధానం చెప్పుకుంట" అంది సారవ్వ రోషంతో.

"సరేగని, నీ మొగుడు మల్లన్న దగ్గర తీసుకున్న యిరువై వేల సంగతి ఎట్ల?"

"అవి యిస్త. అతని వల్ల నేను, నా సంసారం చాలా నష్టపోయిన. నా సమయాన్ని, నా పరువును నాకు సమకూర్చినంక యిస్త. అవి యిస్తే పోయిన నామానం నా యింటి గౌరవం తిరిగి వస్తదా ! నా పిల్లలకు దూరమై బతికిన - ఆ బాధను మీరేమైన పంచుకున్నర ? అతన్ని ఎంత కష్టపడి యింతకాలం సాదిన్నో మీకేమన్న ఎరికేనా ? అవన్ని తిరిగి నాకు యిస్తే తప్పకుండ అతని పైసలు అతనికిస్త." కింద పెట్టిన బరువులు చేతిలోకి తీసుకుంది సారవ్వ అందరు పక్కకు జరిగారు.

సారవ్వ ఇంటికి వచ్చేసరికి గుడికాడికి బయలు దేరడానికి పెళ్ళి ట్రాక్టరు రెడీగావుంది. తల్లిని చూసిన లక్ష్మి ఒక్క గంతులో వచ్చి తల్లిని అందుకొని బోరున ఏడ్చింది. సారవ్వ బిడ్డను వొడిలోకి తీసుకొనివోదార్చింది. రాజయ్య, నాయినమ్మ వాల్ల మొహాలు ఆనందంతో వికసించాయి. ట్రాక్టరు సారవ్వను ఎక్కించుకొని దేవాలయానికి వెళ్ళిపోయింది.

21-12-1997

ఆదివారం ఆంధ్రజ్యోతి

* * *

14

జవాబుల్లేని ప్రశ్నలు

-ముదిగంటి సుజాతారెడ్డి

చీకటి పడ్తున్నది. సాయిలు బాయికాడి నుంచి వచ్చాడు. సోలుతూ వస్తున్న అతన్ని చూసి యాదమ్మ -

"తాగొచ్చింద ? ఏంది ? ఇంక పొద్దుగూకనన్న లేదు !" అనుకుంది.

ఆరోజు యాదమ్మ భర్త సాయిలుతో బాయికాడికి పోలేదు. ఇంట్లోనే వుంది.

సాయిలు సోలుతూ వచ్చి వాకిట్లో వున్న నులకమంచం మీద దభీమని పడిపోయాడు.

"ఏమైందయ్యా ?" పరేషానయి ఉరికి యాదమ్మ భర్తను దగ్గరగా చూసింది.

సాయిలు నోట్లో నుంచి నురుగులు వస్తున్నాయి.

"పురుగు ముట్టింద ఏంది ? మంత్రకాడు లింగన్నను తీస్కరా పోరా !" అని యాదమ్మ పెద్దకొడుకు వీరయ్యను తొందరపెట్టి తరిమింది.

"లింగన్నను నీతోటే తీసుకొని రారా ! ఒస్తవా ! అంటె ఒదిలిపెట్టి రాకు. నీ ఎంటబెట్టుకుని రా! బేగరా నాయిన !" అని యాదమ్మ మళ్ళ మళ్ళ చెప్పి తోలింది వీరయ్యను.

వీరయ్య లింగన్న ఇంటివైపు ఉరికాడు ఎక్కడ ఆగకుంట.

లింగన్న విషయం విని వెంటనే ఉరుక్కుంటు వచ్చాడు. సాయిలును దగ్గరగా వెళ్ళి చూసాడు

"యాదవ్వ ! ఇది పురుగు గాదు. సాయన్న పురుగుల మందు తాగిండు. జల్ది కక్కవోయించు! బిరాన అవుసలి నారయ్యను పిల్వు" అన్నాడు లింగన్న.

"వీరన్న ! పోరా ! ఉరుకు ! అవుసలి నారయ్యకు ఇసయం చెప్పి బిరాన పిల్సుకరా పో !" అంది యాదమ్మ కొడుకుతో.

చంటి పోరడు యాదమ్మ చంకలో కూర్చొని ఆమె రొమ్మును రెండు చేతులతో పట్టుకొని నోట్లో పెట్టుకొని పాలు తాగుతున్నాడు. అక్కడేమైతున్నదో ఆర్నెల్ల నాగయ్యకేం తెలియడం లేదు. రొమ్ములోంచి పాలు రాకపోయేసరికి రొమ్మును గుంజి గుంజి కొరుకుతన్నాడు.

"గిడెక్కడి పోరడే ! నా పెయిల రగ్తమంత పీలుస్తుండు, పొద్దంత గిదే పనా ! పూతనను సంపినట్లు సంపెటట్లున్నడు !" అంది ఏడుస్తూ యాదమ్మ.

ఎడపిల్ల నీలమ్మ రెండేండ్ల నర్ధంది. యాదమ్మ చింగులు పట్టుకొని వెంట వెంట తిరుగుతున్నది. కాళ్ళల్లో పడుతున్న ఆ పిల్లను రెక్కపట్టి ఈడ్చుకొని పోయి దూరంగా మరో కుక్కి మంచంలో కూలేసింది యాదమ్మ. చంకలోని నాగయ్యను నీలమ్మ చేతుల్లో పెట్టింది. ఆ పిల్ల తమ్ముని వదలకుండ రెండు

చేతులతో పట్టుకొని బొమ్మలాగా కూర్చుండిపోయింది.

యాదమ్మ భర్త దగ్గరి కురికింది. ఆమెకు ఏడ్పు ఆగడం లేదు. కళ్ళ పొంటి నీల్లు జలపాతంలా కారుతున్నాయి. "గిట్ల పుర్గు మందెందుకు తాగితివయ్య ! పత్తిపంట పాడుకాను ! నాశనగాలానికె పత్తి యేసినమో ఏందో ? పత్తి చేతికొచ్చే యేలకు పురుగుపట్టి కాయలన్నీ తెల్లగా పగిలిపోయే బదులు పొక్కలు బడ్డయి. గా పుర్గులకు మందు కొడ్దమంటె పైసల్లేవాయె. మందు తేకపోతివి. ఇగ నువ్వు తాగెటందుకు పుర్గుమందు ఎక్కడ్నుంచి దొరికిందయ్యొ ! గా డబ్బిల అడ్గుబొడ్గు ఏమైన వుంటె గదేమైన తాగిండొ ఏందో ! గట్ల పుర్గుమందెందుకు తాగితివయ్య ! అయ్యొ నాయినో ! ఎంత పని చేస్తివయ్యొ !' ' అని పెద్దగా శోకాలు పెడ్తు యాదమ్మ ఏడ్వసాగింది.

యాదమ్మ చుట్టూ చుట్టు పక్కల వాళ్లంతా పోగయ్యారు. సాయిలు మంచం చుట్టూ గుమిగూడారు. ఇంక శానామంది కూలిపోయిన ఇంట ప్రహరీగోడ పక్కన గుంపులు గుంపులుగా నిలబడి వున్నారు.

ఇంతలో అవుసలి నారయ్య బిరబిర వచ్చాడు. ఆ ఊర్లో ఇట్లానే పురుగుమందు తాగినోళ్ళ నెందరినో ఆడాళ్ళను మగాళ్ళను నారయ్య రక్షించాడు.

"గసుంటు జర్గండి. కూసంత గాలి తగలనియ్యండి !" అంటూనే అవుసలి నారయ్య అందరినీ తోసుకుంటు సాయిలుకు దగ్గరిగా వెళ్ళాడు. ఏడుస్తున్న యాదమ్మవైపు చూసి -

"యాదమ్మ ! గింత చింతపండు చిలుంపట్టిన గిన్నెలు గిలాసలు గాని పాత పైసలు గాని వుంటె తీస్కరా పో ! జల్ది తేపో !" అన్నాడు.

యాదమ్మ దిక్కులు చూసింది ఎటు తోచక. ఇంతలో యాదమ్మ పెద్ద యారాలు నర్సమ్మ ముందుకు వచ్చి -

"ఇగో నారన్న చింతపండు అన్నీ తయారుపెట్టిన తీస్కో" అంది నర్సమ్మ. ఇంటి చుట్టుపక్కల వాళ్ళు లచ్చి, రాములమ్మ, శంకరమ్మలు వచ్చి యాదమ్మకు దగ్గరగా చేరారు.

అవుసలి నారయ్య డాక్టరీ చదువలేదు. గాని ఆ ఊళ్ళోవాళ్ళకు ఆయన డాక్టరే ! ప్రాణదాత! ఏదొచ్చినా ఆయన దగ్గరికే ఉరుకుతారు. ఊళ్ళో దవాఖానా గాని లేదు. నారయ్య ఏవో కొన్ని మందుగోలీలు ఇంజక్షన్లు ఇచ్చి వైద్యం నడపిస్తున్నాడు. ఊళ్ళోవాళ్ళు ఏదో తమ దగ్గరున్నయి తమకు తోచినన్ని పైసలిస్తుంటారు. అవుసలి నారయ్య చిన్నచిన్న కమ్మలు, మెట్టెలు కడియాలు వంటి ఏవోకొన్ని నగలు చేస్తాడు. ఆ వృత్తిపోగా ఈ వైద్యం మీది అభిరుచితో దాన్ని నడుపుతున్నాడు.

చిలుంపట్టి మూలపడేసిన గిన్నెలు గిలాసలు కడిగిన నీళ్ళల్లో చింతపండు పులుసు పిసికాడు నారయ్య.నోట్లో పోద్దామని సాయిలు దవడలు పట్టుకొని ఒత్తిపట్టి నోరు తెరిపించబోయాడు. కాని నోరు తెరుచుకోలేదు. దవడలు కట్టెచరుచుకపోయినయి. చేతులు కాళ్ళు పట్టుకొని చూసాడు నారయ్య. చల్లబడి వున్నాయి.

"లాభంలేదు యాదమ్మా ! అంతా అయిపోయింది !" అన్నాడు నారయ్య.

"ఏంది ? అయిపోయింద ? గట్లంటె పానం పోయింద ?" యాదమ్మ ఏడ్పు ఆపి నిర్ఘాంతపోయింది. తేరుకొని భర్త శవం మీదపడిపోయి శోకాలు పెట్టింది.

"గిట్లెందుకు చేసినవయ్యొ ! అప్పు అప్పు అని మనాది పెట్టుకుంటె గింతపని చేస్తవనుకోలెదు నాయినో ! ఎంత పనయిపాయనయ్యో ! గక్కడికి అంటనే వున్ననయ్యో ! అప్పు అప్పు అని మనాది

పెట్టుకోకుమని. మల్లమల్ల సెప్తినిగదయ్య ! బతుకుంటె అన్ని అప్పులు రెక్కల కట్టం మీద ఒక్క ఏడాదిలో తీర్సుకుందం ! అంటిని గదయ్యో ! కాలం కల్సిరాకపోతె కూలిపని సేసుకొని అప్పు తీర్సుకుందం! అని మొత్తుకుంటనే వున్న నాయినో ! గింతల్నే గింతపని సేసిపోయిండురో ! అయ్యో నాయనో ! నా మీద బారం పెట్టి నీదారి నువ్వు సూసుకుంటివయ్యో ! నాకేమి చెప్పి పోయినవయ్యో ! నాకిదంత అప్పజెప్పి పోయినవ ? నాయినో ! పుర్గుల మందు నోట్ల పోసుకుంటుంటె గీ పోరలయిన యాదికి రాలేద నీకయో ! గింతపని ఎట్ల జేస్తివయ్యో ! గంత ధైర్యమెక్కడ్నుంచి ఒచ్చిందయ్యో నీకు ! బతుకంటే లేని జూసుకుంట రయ్యొ ! నువ్వేమొ అన్ని కట్టాలు ఒదిలించుకొని పోతివి నాకేం జెప్పి పోవైతి వయ్యొ ! నన్ను గీ పోరగాల్లను దిక్కులేనోల్లను సేసిపోయినావయ్యొ ! మమ్ముల్ని అన్నాలం చేసిపోతివి గదయ్యొ !" అని నెత్తిమీద చాతిమీద చేతుల్తో చరుచుకుంటు ఏడ్చింది యాదమ్మ. చుట్టూ నిలబడ్డ వాళ్ళందరూ కన్నీళ్ళు పెట్టుకున్నారు. ముక్కు చీదుతూ పైట కొంగులతో కన్నీళ్ళు తుడుచుకున్నారు.

యాదమ్మ యారాలు నర్సమ్మ యాదమ్మను దగ్గరికి తీసుకుంది.

"గిట్ల ఎంతసేపని ఏడుస్తవ్ యాదక్క ! కొద్ది గూరుకొ ! ఆడు నిన్ను నీ పోరగాల్లను యాది జేసుకుంటె గింతపని చేసెటోడు కాదు ! గింత అన్నాలం పని చేసెటోడు కాదు ! ఆడికి అంతా అప్పె కండ్ల బడ్డది. పురుగు తగిలిన పత్తిచేనే కండ్లబడ్డది. బాయికాడ కూసొని ఏమి సోంచాయించిండో ఏందో ? ముందలున్న డబ్బల నుంచి గింత పుర్గుమందు తాగిండు. దాంతోటి కట్టాలన్ని తీరుతయను కున్నడు ! గంతే ! ఆనికి గప్పుడు ఎవరు యాదికి రాలేదు. యాదికొస్తె గట్లెందుకు సేస్తడు !" అని అంటూ నర్సమ్మ యాదమ్మను సముదాయించడానికి ప్రయత్నించింది. యాదమ్మ ఆ మాటలేవీ వినడం లేదు. ఆమె మనస్సు గత సంవత్సరం మీదికి పోయింది. ఆమె దుఃఖం ఉప్పొంగి వచ్చింది.

"నర్సక్కా ! నిరుడు నిరుపసేను ఏస్తె పంటమంచిగనే సేతికొచ్చింది. సేసిన కట్టానికి పెట్టిన పెట్టుబడికి పంట మంచిగనే పండింది గద అని సంబరపడ్డం గాని నిరుపకాయలకు అంగట్ల ధర పల్కలేదాయె ! నీళ్ళు పోసి తడిపి తెచ్చినవ్ బే ! అని అంగట్ల సావుకారు అడ్డికి

పావుసేరు లెక్కగట్టి పైసలిచ్చిండు. నిరుపసేను కోసం ఇత్తనాలని పురుగుల మందని బలంమందని అప్పు సేసిండు ! మిరుపకాయలమ్మితె ఒచ్చిన పైసలుగా సెంద్రమౌలి కాడ సేసిన అప్పుకు ఒడ్డికాడికి సరి పోయినయి. గింత రెక్కలు ముక్కల్చేసుకుంటె మాకు పోరలకు నోట్లోకి గింత కూడుకుమిగులదాయె ! గదాంతోటే గప్పుడే గాయన మనాది పెట్టుకుండు. అక్కా! గప్పట్నుంచె ఎట్లనో అయిండు" ఏడుస్తూ యాదమ్మ జ్ఞాపకం చేసుకుంటూ చెప్పింది.

"గా అప్పు మనాదితోనె గింతపని చేసిండు సెల్లె ! సెంద్రమౌలి కాడ తెచ్చిన అప్పె గింత మోసం చేసింది. గాయనేమొ శానా వడ్డీకట్టె. గా వడ్డీ కట్టెటందుకె పాయె పైసలన్ని. పంట పండినా నిరుడు లాభం లేకపాయె ! గిప్పుడు అప్పు సేసె గిట్లాయె. గదే మనాది పాలయిండు సాయిలన్న ! మరి నాకెరికె !" అంది నర్సమ్మ. యాదమ్మ నర్సమ్మ వక్షస్థలంలో తలదూర్చి బోరుమని ఏడ్చింది.

"ఊకో తల్లి ! గింత గంత కట్టం కాదు నీది ! బగవంతుడికి దయ వుంటె గింతయితద ? సెప్పు ! నాయెం ఈ భూమ్మీద వుంటె గీ సాయన్న కట్టమంత గిట్ల అయితద ?" అంది లచ్చి. యాదమ్మ నెత్తిమీద చెయ్యేసి నిమిరిందామె సముదాయిస్తు.

"నిరుడు సేసిన అప్పు తీరుస్తననే మల్ల అప్పు సేసిండు లచ్చక్క!" అంది తలెత్తి యాదమ్మ. యేడ్చి యేడ్చి పైటకొంగుతో తుడుచుకొని తుడుచుకొని యాదమ్మ కళ్ళు వుబ్బిపోయాయి.

"నాకెరికే తల్లి ! మావోడే గద సెప్పిండు సాయిలన్నకు. పంట ఇత్తనాల కోసం పుర్గు మందు

కోసం బలం మందులకోసం బేంకు అప్పు ఇస్తున్నదని సెప్పితేనే గద సాయిలన్న పోయి బేంకుల అప్పు తీస్కుండు ! గా పైసల్నుంచే సెంద్రమౌలి అప్పు కడ్తనని సూసిండు గాని కట్టెటందుకు ఎక్కడ మిగిలినయి పైసలు ! నాకంత ఎరికేనే యాదమ్మ ! ఏం జేస్తం మన చేతుల్ల వుంద ఏమైన సెప్పు ? అడిగింది లచ్చి.

"బేంకుల అప్పు తెస్తే పైసలెక్కడ మిగిలినయి లచ్చక్క ! మిరపకాయలకు అంగట్ల దర పల్కదని ఈయేడు అందరేస్తున్నరని పత్తియేసె. నాయినో ! గా పత్తి ఇత్తనాలు గన్ని పైసలు పెట్టి పక్క ఊర్ల కొనుక్కొస్తె గవ్వి మొదుగాల తెచ్చినయి మొల్వనె మొల్వవాయె ! నాయినో ! ఏం జేస్తం అదురట్టం గట్లాయె !" అని ఏడుస్తున్న యాదమ్మను రాములమ్మ శంకరమ్మలు ఆమెకు చెరోపక్కన చేరి సముదాయించబోయారు. వాళ్ళను చూసి యాదమ్మ దుఃఖం మరింత ఎక్కువయింది.

"రాములమ్మ ! నువ్వు ఇన్నవ్ గద ! అచ్చమైన సర్కారోల్లు అమ్మే ఇత్తనాలు తెమ్మని నీ పెనిమిటి పుల్లన్న సెప్తైనె గద పోయి కొత్త ఇత్తనాలు తెచ్చి మల్ల నాగలితో దున్ని యేసిండు ! అప్పుల సగం ఇత్తనాలకె పాయె. ఇంట్లకు గిన్ని ఒడ్లగింజలు పట్టుకొచ్చిండ అంతె ! ఇగ సెంద్రమౌలి అప్పు ఎక్కడ కడ్తడు అక్కో ! నువ్వే సెప్పు !" యాదమ్మ దీనంగా రాములమ్మ వైపు చూస్తు అంది.

యాదమ్మ చుట్టూ చేరిన వాళ్ళకు దుఃఖం ఆగడం లేదు.

"గంతల్నె పత్తిసేను తలెత్తె ! గప్పట్నుంచె బలం ఎరువులని తెచ్చి యేస్తనె వుండె పుర్గు మందులని కొనుక్కొచ్చి కొడ్తనె వుండె ! ఇగ సెంద్రమౌలి కాడ అప్పు గట్లనె మిగిలిపాయె ! గిప్పుడు బేంకు అప్పు సేసె ! ఇంకో దిక్కు పత్తి కాయలన్ని పుర్గుబట్టి పాయె ! మల్ల మందుతెచ్చి గొడ్తమంటె సేతిలో ఒక్కపైస లేదాయె ! కొట్టకపోతె పంట సేతికొచ్చెటట్టు లేదాయె ! గీ కొట్టుమిటాట్టతోనె అక్కో ! మీ అన్న గింత పని సేసిండు !" అని యాదమ్మ రాములమ్మ ఒడిలో ఒరిగిపోయింది ఏడుస్తు. అక్కడా ఆమెకు ఊరట కలగలేదు. వెంటనే రాములమ్మ ఒడిలోంచి లేచి యాదమ్మ చాతి మీద అరచేతులతో కొట్టుకుంటు పెద్దగా ఏడ్చింది.

యాదమ్మ రెండు చేతులు పట్టుకొని నర్సమ్మ తన గుండెల మీదికి తీసుకొని వెన్ను నిమిరింది. "గదె మోసం తెచ్చిందె అవ్వ ! గిన్ని తీరుల అప్పు ఆయె. ఇంకో దిక్కు పంట సేతి కొచ్చెటట్టు కండ్లబడలేదు ! గందుకే సాయన్న గంత పనిచేసిండు ! ఆయనకాయన మారాజు అయిండు. నిన్ను నీ పిల్లల్ని దిక్కులేనోల్లను సేసిండు. ఎన్క ముందు ఆలోశన లేక గింతపని సేసిండు. నువ్వెట్ల బతుకుతవ్ అని ! పిల్లల్నెట్ల సాదుతవ్ అని ఏమైన ఆలోశన సేసిండ ?" అంది నర్సమ్మ.

నర్సమ్మ మాటలకు యాదమ్మ దుఃఖం కట్టలు తెంచుకొని ప్రవహించింది.

"నర్సక్క ! నేను గీ పోరలు ఆగమైపోతరనయిన అనుకోదాయె ! గింత పనిచేసి పోయిండు ! గిప్పుడు నేనెట్ల బతకాలె సెప్పు అక్క !" ఏడ్చింది యాదమ్మ.

నేలమీద వున్న దుమ్మును పిడికిళ్ళతో తీసుకొని నెత్తిమీద చల్లుకొని పిచ్చిదానిలా బోరుమని ఏడ్చింది. అది చూసి నర్సమ్మ వెక్కివెక్కి ఏడ్చింది.

"యాదమ్మ ! నువ్వు గిట్ల ఏడిస్తె పిల్లలేమైతరు సెప్పు ! ధైర్నం తెచ్చుకో! సెల్లె !" అని నర్సమ్మ యాదమ్మను దగ్గరికి తీసుకుంది.

అక్కడ తల్లికెదురుగా నిల్చున్న పెద్దకొడుకు వీరయ్య దిగాలుపడి ఏడుస్తున్న తల్లివైపు కనురెప్ప వెయ్యకుండ చూస్తున్నాడు. వాడి ఒంటిమీద చిరిగిన నిక్కరు అంగి వున్నాయి. వాడి పక్కనే నిలబడి వున్న వాడి తమ్ముడు వెంకన్న ఒంటి మీద అంగి ఒక్కటె చాలీ చాలనిది వుంది.నిక్కరు లేనేలేదు. ఇక

వాడి పక్కన నిలబడి వున్న వాడి చెల్లెలు భద్రమ్మ ఆరేళ్ళది పేగులు పేగులైన ఫ్రాకు వేసుకుంది. దాని పక్కనే నిలబడివున్న నాలుగేళ్ళ మంగమ్మ బరిబాతల ముర్కికై ఎన్నాళ్ళ నుంచో నూనె లేక ఎర్రబడిన తలవెంట్రుకలతో నిలబడి గుడ్లప్పగించి తల్లివైపు చూస్తున్నది. వాళ్లందరికి తండ్రి ఏం చేసాడో తెలియడం లేదు. తండ్రి ఇక ఈ లోకంలో లేడని వీరయ్య మాత్రం గ్రహించాడు. అందరు ఆకలితో కడుపు లీడుసుకపోయి వున్నారు.

దీపం పెట్టంగనే తండ్రి వస్తాడు. తండ్రి రాగానే అన్నం పెడ్తనన్నది తల్లి. ఇంతవరకు వాళ్ళు తిన్నారా లేదా అని అరుసుకునే వాళ్ళే లేరు. ఆకలితో వాళ్ళ కళ్ళు తేలిపోతున్నాయి.

ఆర్గురు పిల్లలైరి ! మోపెడన్ని అప్పులాయె ! ఇగ యాదమ్మ గీ సంసారమెట్ల ఈదుకొస్తుందో ఏమో ? అనే ప్రశ్నలతో చుట్టూ నిల్చున్న వాళ్ళ హృదయాలు ద్రవించిపోతున్నాయి. అందరి హృదయాల్లో వున్న సందేహాన్నే లచ్చమ్మ వెలిబుచ్చింది.

"ఎట్ల నెగుల్కొస్తవో ఏందో యాదక్క ! గీ పిల్లల్తో గీ అప్పుల్తో ఏం జేస్తవో నీ సేతిలోనె వుంది ! ఆడైతె గీ బందాలన్ని ఒదలించుకొని పోయిండు. ఆడు మా రాజే ! గాని నీ బతుకేమైతదో ! గీ పిల్లల బతుకులేమైతయో అనుకున్నడ ? గింతయిన ఆలోశించిండ" అని యాదమ్మ గదమ పట్టుకొని ఊరడించే ప్రయత్నం చేసింది.

"నువ్వే జెప్పు లచ్చక్క ! నేనేం జేయాలె ! గింత పని జేస్తడని కలల్నయిన అనుకోలేదు. ఏం బుద్ధి పుట్టిందో గా బాయి కాడ పొద్దున్నే పోయిండు. పగటాల బువ్వకు రాకపోతె వీరయ్య తోటి పంపిన గది తిన్నడో లేదో ఎరుకలేదు. గీ పని చేస్కొని పొద్దుగూకంగ ఇంటికొచ్చిండు ! పత్తి సేను ముందల కూసొని కూసొని ఏమి సోంచాయించిండో ఏందో గింతపని జేసిండు !" అంది యాదమ్మ. ఆమె గొంతులో నిస్సహాయత ధ్వనించింది.

అరచేతుల్తో గుద్దుకొని యాదమ్మ నెత్తి బొడుసులు కట్టింది. చాతి మీద కొంగులేదు. చాతంతా ఎర్రబడింది. రైక చినిగిపోయింది. నెత్తిమీద వెంట్రుకలన్నీ చెల్లాచెదరయ్యాయి. కళ్ళు ఎర్రబడి ఎర్రగుల్మాల పువ్వుల లెక్క అయినయి. గొంతు బొంగురుబోయింది. నిస్సహాయంగా యాదమ్మ చుట్టూ వున్న అందరివైపు చూసింది.

నర్సక్క ! నువ్వె జెప్పు నేనేం జేయాలె ? గీ పోరగాల్ల నెట్ల సాదాలె ! గీ ఎవసాయం ఎట్ల నడపాలె ! ఐదెకరాల చెలక బోరు ఇంజను గవన్ని నా ఒక్కదానికి అప్పజెప్పిండు. తన దారి తను చూస్కుండు ! గీ అప్పులన్ని మెడకుబడ్డయి ఎట్ల తీర్సాలె ! నువ్వే జెప్పు నర్సక్క నేనేం జేద్దును లచ్చక్క నువ్వయిన జెప్పవే ! నాతోటి ఒక మాట అంటె నేనేమంటనని సూడదాయె ! ఓ నాయినో ! అందరి ముందల నన్ను నవ్వులపాలు జేసి పోయిండు. శంకరక్క ! నేనెట్ల గీ సంసారాన్ని నెగ్గుకొస్తనో నువ్వే జెప్పవే ! నాయినో ! నేనేం జేయాలె ! నేనెక్కడికి పోను ? " అంటూ యాదమ్మ బోరుబోరుమని ఏడ్చింది. ఆమె దుఃఖానికి అవధుల్లేకుండా పోయాయి. ఆమె అడిగే ప్రశ్నలకు జవాబులు ఎవరి దగ్గరా లేవు !

(విసుర్రాయి - ముదిగంటి సుజాతారెడ్డి కథలు (1998) నుండి)

* * *

15

బాంధవ్యాలు

-పంజాల జగన్నాథం

ఆ రోజులు వేరు. అపుడు మా ఇల్లు ఎంతో ఆనందంగ అహ్లాదంగ పిల్లాపాపలతో కళకళ లాడుతూ ఉండేది. అనూహ్యమైన విషాద సంఘటన అనంతరం కొన్నాళ్లకు మా ఊరు వెళుతున్నాను. మానేరు తీరాన మా ఊరు. ఊరికి పశ్చిమాన ఎత్తైన కొండలు, చెట్లు, చేమలు మిగతా మూడు దిశల్లో పంట పొలాలు, చేన్లు, చెలకలు, పచ్చని పైర్లు, ప్రకృతి ఒడినిండా పచ్చదనాలే. మా ఊరు వెళ్ళడానికి నా మనస్సు ఏ మాత్రం అంగీకరించకపోయినా కన్నతల్లి కన్నమిన్నగా చూసుకొన్న నానమ్మపైగల ప్రేమపాశం నన్ను లాక్కెళ్లుతోంది. ఊరు దగ్గరవుతున్న కొద్దీ నానమ్మను, నాన్నను చూడాలన్న ఉత్సాహం అధికమవుతోంది. నానమ్మ పెద్దన్నయ్య దగ్గర ఉంటోంది.

బస్సుదిగాక మా ఊరికి ఐదు కిలోమీటర్లు నడవాలి. ఈతవనం గుండా నడిచివెళ్లి ఆ తర్వాత వాగు, తాటితోపు దాటితే మా ఊరు. వాగు ఆవలి ఒడ్డుకు చేరుకున్నానోలేదో ఆ పరిసర ప్రాంతాలు నన్ను పలకరిస్తున్నాయి. బాల్య జ్ఞాపకాలు ఎన్నో నన్ను వెంటాడుతున్నాయి. వాగుఒడ్డు మీద ఓ చోటికి రాగానే నా గుండె బరువెక్కింది. నీళ్లు కళ్లల్లో గిర్రున తిరిగాయి. అది మా అమ్మను కాల్చిన చోటు అమ్మ కాలిన కమురువాసన, దాని తాలూకు జ్ఞాపకాల శకలాలు అట్టడుగున నా గుండెల్లో అప్పుడప్పుడు కదులుతూనే ఉన్నాయి.

ఊరు ప్రవేశంలోనే కాలువ. దాన్ని దాటి ఊళ్లోకి ప్రవేశించాను. దారిలో కొందరు నన్ను గుర్తుపట్టి "ఫలానా అబ్బాయివి గదటోయ్" అని పలకరించారు. కొందరు ఆశ్చర్యంగా చూస్తూ యథాలాపంగా వెళ్ళిపోయారు. ఊరి చివరలోనే తాతలనాటి ఓ పెద్ద చింతచెట్టు. ఆ పక్కనే సున్నపుగానుగ, ఎరుకల వాళ్ల గుడిసెలు, హరిజనకాలని ఉన్నాయి. దారంట మురుగుకాలువలు అక్కడక్కడ పందులు, కుక్కలు తచ్చాడుతున్నాయి. పెంటను కెళ్లగించి తల్లికోడి అందిస్తూన్న పురుగుల్ని కోడిపిల్లలు తింటున్నాయి. పశువుల కాపర్లు బర్లను, మేకల్ని చెలకలోకి తోలుకెళుతున్నారు. అక్కడక్కడ మేకలు ముందు కాళ్లను పైకెత్తి చెట్లఆకులను తింటూ వెళుతున్నాయి. ఇల్లు చేరేసరికి ఎలాంటి ఉపద్రవం చూడాల్సి వస్తుందోనని గుబులుగానే ఉంది.

...ఇంట్లో అడుగుపెడుతూనే తమ్ముడు ఎదురయ్యాడు. నన్ను చూసిన వాడి ఆనందానికి అవధుల్లేవు. ఎప్పుడు తిన్నాడో ఏమో వాడి ముఖం పీక్కుపోయి ఉంది. నెమ్మదిగా కుక్కి మంచంలోని నానమ్మ దగ్గరకు వెళ్లాను. ఛిప్పిర్లి తల్ల, శుష్కించిన శరీరం, మాసిన గుడ్డలతో చింపిరిబొంతలో ముడుచుకు పడుకుంది. మంచం కింద ఉమ్మి వేయడానికి ఓ లోటా పెట్టి ఉంది.

దగ్గరగా వెళ్ళి అవ్వా అని బిగ్గరగా పిలిచాను. స్వరాన్ని గుర్తుపట్టినట్టుంది. శక్తినంతా కూడదీసుకొని లేవడానికి ప్రయత్నించింది. నేను ఆసరా పట్టుకొని లేపి నాకానించుకొని కూర్చోబెట్టాను.

కంటినజరు తగ్గింది కాబోలు చెయ్యి నొసలు కడ్డంగా పెట్టుకొని పరీక్షగా చూస్తూ జిగిలేని తన చేతులతో నా ఒళ్లంతా తడిమింది. నానమ్మ కళ్లల్లో తెలియని ఆనందం కనబడుతోంది. నన్ను ఏర్పాటు చేసినట్టుంది. నువ్వా బిడ్డా పట్నం నుంచి ఎప్పుడొచ్చినవ్ అడిగింది నానమ్మ. ఎన్నో గజాల లోతుగల నూతినుండి వచ్చిన స్వరంలా ఉంది. నానమ్మ పరిస్థితి చూస్తోంటే నాగుండె తరుక్కుపోతోంది. నా రాకతో నానమ్మకు ఎన్నాళ్లనుండో దాగిఉన్న దుఃఖం ఉబికి కట్టలు తెంచుకున్నట్టుంది. "ఎంత కట్టగాలం వచ్చెరా కొడుకా, నన్నెపుడు కొంచబోతవురా దేవుడా" శోకాలు తీయసాగింది. అవ్వను ఎంతోకష్టం మీద ఊరడించానే తప్ప నా హృదయాంతరాల్లో సుడులు తిరుగుతున్న దుఃఖాన్ని ఎవరు ఓదార్చగలరు.

...వాలు కుర్చీలో సర్వం కోల్పోయి రెక్కలు తెగిన విహంగంలా విలవిల్లాడుతూ జీవచ్ఛవంలా మాకోసమే బ్రతుకుతున్న నాన్న అగుపించాడు. స్వాభిమానం, వ్యక్తిత్వం, కోపతాపాలు అన్నింటిని గాలిలో వదిలేసి కేవలం మా మనుగడ కొరకు బ్రతుకుపోరు సల్పుతున్న మొండిమనిషి. అమ్మ బతికున్నంత కాలం మడిమతిప్పని యోధుడు. మా జీవితాలకు ఓగమ్యమంటూ ఏర్పడేవరకు తన బతుకును సాగదీస్తున్నట్టుగా ఆయన కళ్లల్లో కనబడే నిర్లిప్తత, నిరాసక్తత చెప్పకనే చెబుతున్నాయి. నారాక ఆయనకు క్షణికానందాన్నే కల్గించింది. నాన్ననిస్తేజంగా నావైపు వస్తూ "ఏరా అబ్బాయి అంతా బాగేనా ? ప్రయాణం ఎట్లాసాగింది ?" అన్న నాన్న పలకరింపుతో నా కళ్లల్లో నీళ్ళు ఉబికాయి. తన దర్పం, ఠీవి అన్నీ పోయాయి. ఆయన ముఖంలో ఎన్నో ముడతలు. ఒక్కొక్కముడత ఎన్నో అనుభవాలకు ప్రతీక. ఒకప్పటి ఆయన గతం దేదీప్యమానంగా వెలిగింది...

* * *

ఊళ్లో నాన్న ఓ పెద్దమనిషి. ఇరువయి ఎకరాల భూమి కల్గి ఉన్న ఆసామి. తగవు తీర్పులకి, సలహా సంప్రదింపులకి ఊరిప్రజలు, చుట్టు పక్కల గ్రామాలవాళ్లు నాన్న దగ్గరకు వచ్చేవాళ్లు. వ్యవసాయ కూలీల పట్ల దయతో వ్యవహరించేవాడు. ఆయనది అదో తరహా వ్యక్తిత్వం. ఏదైనా వ్యవహారం వస్తే తనమాటే నెగ్గాలనుకొనే మనస్తత్వం ఆయనది. కోపం, మొండితనం కలబోసుకున్న వ్యక్తి. ఊళ్లో వాళ్ల సమస్యలు, తగవులు ఎందరివో, ఎన్నో తీర్చినా తన ఇంట్లోని సమస్యకు పరిష్కారం కనుక్కోలేని పరాజితుడు.

...పెద్దొదిన మా ఇంట్లో అదోరకమైన మనిషి. పెద్దన్నయ్య ఆవిడ గీచిన గీతదాటే వాడుకాదు. ఆయన ఓ గవర్నమెంటు ఉద్యోగి. మొదట్లో తమ జీతం డబ్బులు ఇంట్లో యిచ్చేవాడు. కొంతకాలానికి అన్నావదినల మధ్య ఏం జరిగిందోకాని ఇంట్లో డబ్బులు ఇవ్వడం మానేశాడు. వ్యవసాయ ఫలసాయాన్ని మాత్రం యధేచ్ఛగా వాడుకోసాగాడు. ఉమ్మడి కుటుంబంలో ఆర్థికపరమైన అనేక సమస్యలు, బాధ్యతలతో సతమతమవుతోన్న నాన్నకు ఇది మింగుడుపడలేదు. ప్రవృత్తిరీత్యా పట్టుదల గల మనిషి అయిన నాన్న అన్నయ్యతో "ఇంట్లోకి డబ్బులు ఇవ్వలేనపుడు ధాన్యం వాడుకోడానికి వీల్లేదని" నిక్కచ్చిగా చెప్పాడు. దానితో పెద్దన్నయ్య రెచ్చిపోయి శివమెత్తిన వాడిలా "పిత్రార్జితమైన ప్రతిదాంట్లో నాకు వాటా ఉంది. దాన్ని కాదనే హక్కు ఎవరికీ లేదు. ఎవడడ్డం వస్తాడో చూస్తా" అంటూ ఉద్వేగంగా కేకలేశాడు. నాన్న అహం దెబ్బతింది. చేష్టలుడిగి అలాగే నిర్ఘాంతపోయాడు.

...అన్నయ్య ఆ సమాయనికేదో వాగాడే తప్ప నాన్నను ఎదిరించినందుకు తప్పు చేసినవాడిలా అంతర్మథనం చెందసాగాడు. ఎప్పటికప్పుడు వదిన అన్నయ్యను ప్రేరేపిస్తూనే ఉంది. అన్నయ్య మనస్సుపూర్తిగా మారిపోయింది. ఇంటిల్లిపాదిపై మనస్సు విరిచేసుకున్నాడు. నాన్నపై కారాలు, మిరియాలు నూరసాగాడు. ఇంతవరకు కేవలం ప్రేక్షకపాత్ర మాత్రమే పోషించిన అమ్మ కుటుంబంలో మారుతున్న

పరిణామాల్ని చూసి మనస్సు తట్టుకోలేకపోయింది.

"బిడ్డా పెళ్లి కావలసిన చెల్లెండ్లు, సదువుకోవలసిన తమ్ముళ్లున్నారు. వాళ్లంతా చిన్నోళ్లు ఒక్క మీ నాయిన్న సంపాదనతో గివన్నీ జరుగుతాయా నువ్వా పెద్దోడివి. గొంత సంపాదిస్తున్నవాయె. మీ నాయిన్న తర్వాత నువ్వేగదరా కొడుకా ఈ సంసారానికి దిక్కు". అని అమ్మ చెప్పినపుడు అన్నయ్య ఉలుకూ, పలుకూ లేకుండా మౌనంగా ఉన్నాడే తప్ప సమాధానమేమీ ఇవ్వలేదు.

మధ్యలో వదిన కల్పించుకొని " నామొగుని సంపాదనంతా గీ ఇంటికే ఖర్చుజేస్తే నా పిల్లల గతేంగాను ? వాళ్లను వాగుల దోలన్నా ? బాగనేసాలు జెప్పుకొత్తున్నవ్" శాపనార్థాలు పెట్టిన రీతిలో అభినయిస్తూ రుసరుసలతో ఇంట్లోకి వెళ్లింది వదిన.

భర్తకు నచ్చచెప్పలేక, కొడుకుని, కోడలిని సముదాయించ లేక అమ్మ వాళ్ల మధ్య నలిగిపోయింది. భర్త మొండితనాన్ని, కొడుకుస్వార్థాన్ని ఏ విధంగానూ తగ్గించలేకపోయింది. అమ్మ ఎంతో గుండె కోతను అనుభవించసాగింది. ఎంతయినా కన్నపేగు. నాన్నకు తెలియకుండా అమ్మ అన్నయ్యకు ధాన్యం, తోటలోని కూరగాయలు సరఫరా చేయసాగింది. ఓరోజు ఆ తతంగం నాన్న కంటబడింది. ఉగ్రుడైపోయిన నాన్న "ఒసేవ్ నీకెంబోయే కాలమే వాడంత స్వార్థపరుడైనపుడు నువ్వెందుకే వాడికి దొంగచాటుగా ధాన్యంబోస్తావ్" అంటూ అమ్మపై కేకలేశాడు.

"వాడు మన కడుపున పుట్టినోడే. ఇంతకాలం జేసినోడు వాడు తిన్నాకనే చిన్నోళ్లు" అంటూ అమ్మ నాన్నను సముదాయించటానికి ప్రయత్నించింది. ఆ మాటలేవి నాన్న చెవికెక్కలేదు.

ఓరోజు పనిమీద కరీంనగర్ వెళుతున్నానని ఉదయమే ఇట్లొంచి బయలుదేరాడు నాన్న. కొద్దిసేపటికే బస్సు దొరకలేదని ఇంటికి తిరిగొచ్చాడు. నాన్న వచ్చేసరికి అమ్మ గుమ్మిలోని వడ్లన్నీ ఎండుగబోసింది.

అది చూసిన నాన్న కోపంతో "ఏందే గింత ఎండుగ బోసినవ్" అంటూ అరిచాడు.

"గిర్నీ బట్టించడానికి"

"ఇప్పుడు గిన్ని వడ్లెందుకే?"

"పెద్దోడికి బియ్యం..." అంటూ తటపటాయించింది అమ్మ.

"లం.... ఆనాటినుంచి సూత్తున్నా. సాటుమాటుగా ఉన్నదంతా నీ చెల్లెండ్లకు, తమ్ముళ్లకు బెట్టుకుంట ఇల్లంతా గుల్లజేసినవ్. గిప్పుడు రెక్కలొచ్చిన పెద్దోడు గూడా గట్ల జేత్తుంటే నీకు బుద్ధిలేక కొడుకు అని తోడిపెడుతున్నావా?" అంటూ అమ్మను పెడీపెడీమని కొట్టాడు. కన్నకడుపు ప్రేమ అమ్మది. అమ్మ తల్లడిల్లిపోయింది.

అమ్మను నానా దుర్భాషలాడాడు నాన్న. ఆనాటి నాన్న రౌద్రరూపం తలుచుకుంటేనే ఇప్పటికీ గుండెల్లో భయం, జుగుప్స కలుగుతున్నాయి. సున్నిత మనస్కురాలైన మా అమ్మ మానసికంగా ఎంతో కుమిలిపోయింది. మౌనంగా రోదించింది. ఆత్మాభిమానం గల అమ్మ తెల్లారేసరికల్లా పెరటిబావిలో శవమై తేలింది. అమ్మ అలా చేస్తుందని ఎవరమూ అనుకోలేదు.

ఆ హఠాత్ సంఘటనతో ఇంటిల్లిపాది అగాధంలో పడిపోయారు. అంతర్గత స్పర్ధలవల్ల అంతరాంతరాలలో చెలరేగిన పెను తుఫాను దెబ్బకు చలించని వారెవరుంటారు. ఇల్లంతా స్మశాన

నిశ్శబ్దం. అమ్మ స్మృతులు ఒక్కొక్కరిని తొలిచివేస్తున్నాయి. నాన్న మూర్ఖత్వపు పట్టుదలే తనని అధః పాతాళానికి తొక్కింది. అమ్మ చావుతో ఆయన మొదలునరికిన చెట్టు అయ్యాడు.

అమ్మ తదనంతరం ఇంటి పరిస్థితులు పూర్తిగామారిపోయాయి. పెద్దన్నయ్య పక్క ఊళ్లో ఉద్యోగం చేస్తూ వ్యవసాయం చూసుకుంటున్నాడు. రెండో అన్నయ్య పట్నంలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. పక్కటౌనులో నా డిగ్రీ చదువులు కొనసాగుతున్నాయి. తమ్ముడు పెద్దన్నయ్యతోనే ఉంటూ మా ఊళ్లోనే చదువుకుంటున్నాడు. తను సెలవుల్లో అప్పుడప్పుడు తమ్ముణ్ణి, నానమ్మను చూడ్డానికి వస్తూ ఉండేవాణ్ణి. సెలవురోజుల్లో పొలంపనులు కూడా చూస్తూ ఉండేవాణ్ణి. నేను ఊరికి వెళితే మా తమ్ముడికి పండుగే. వాడికి నావద్దే చనువు ఎక్కువ. వదిన భోజనాల వడ్డింపులో చూపించిన వివక్షత తమ్ముడు నాతో చెప్పినపుడు నా గుండె తడి అయ్యేది.

అమ్మ లేనిలోటు ఏమిటో నాన్నకు క్రమక్రమంగా బోధపడసాగింది. కుటుంబంలో, సంఘంలో తనస్థానమేమిటో తన విలువేమిటో తెలుస్తోంది. జీవితమ్మీద విరక్తి కల్గిన నాన్న కేవలం తమ్ముణ్ణి, నన్ను చూసుకుంటూ కాలాన్ని నిర్లిప్తంగా వెళ్లదీస్తున్నాడు. గీతకార్మిక నాయకుడిగా వాళ్ల సమస్యల పరిష్కారం కొరకు నాన్న పక్కనున్న టౌనుకు వెళ్తూ రెండు, మూడు రోజులకో పర్యాయం మా ఊరు వస్తూ ఉండేవాడు.

ఓ రోజు మధ్యాహ్నం టౌను నుండి నాన్న ఇంటికి వచ్చేసరికి ఇంటిముందు వసారాలో అరుగుమీద కూర్చొని స్నేహితునితో మాట్లాడుతున్నాను. రావడంతోటే నాన్న "భోంచేశావా" అని నన్నడిగాడు.

"లేదు నాన్న ఇప్పుడే పొలం నుండి వచ్చాను. దోస్తు కబుర్లు చెబుతోంటే వింటూ ఉన్నాను' అన్నాను నేను. అప్పుడు సమయం పగలు ఒంటిగంటవుతోంది.

నా సమాధానంతో నాన్న నిశ్చేష్టుడైపోయాడు. తనను తాను తమాయించుకొని "ఏంటమ్మా పిల్లవాడికి అన్నం బెట్టలేదా ? టైమెంతయిందో తెలుసా ?" అడిగాడు నాన్న వదినను. ఆ స్వరంలో దైన్యం తప్ప దర్పం లేదు.

"నీ పిల్లాడికంటె నా పిల్లలు ఇంకా పసివాళ్లు. వాళ్లు కూడా భోంచేయలేదు." మూతిని మూడు వంకరలు తిప్పుతూ నిష్టూరంగా సమాధానమిచ్చింది వదిన. ఖిన్నుడైపోయాడు నాన్న.

మా భవిష్యత్తు గురించి ఓ దృఢ నిశ్చయానికి వచ్చిన నాన్న నన్ను, తమ్ముణ్ణి తనతో టౌనుకు తీసుకెళ్లిపోయాడు. అక్కడే కాపురం అప్పటినుండి మా ఊరితో మాకు సంబంధాలు చాలా తగ్గిపోయాయి. నాన్న మా వాటాకొచ్చిన భూముల్ని కౌలుకిచ్చాడు. అప్పుడప్పుడు నాన్న ఊరికెళ్లి నానమ్మను చూసివస్తూ ఉండేవాడు.

నాన్న ఊరికెళ్లినప్పుడల్లా ఈ ముదనష్టపు ముసలిది నా గండాన దాపురించింది. అని నాన్న వినేటట్లు వదిన సూటిపోటి మాటలు అంటూ ఉండేదట. ఆ మాటల ఈటెలు నాన్న గుండెల్ని ఎన్ని తూట్లుబొడిచాయో. తన తల్లిని టౌనుకు తీసుకపోయి సవరించలేని అసహాయస్థితి నాన్నది.

* * *

మేము టౌనులోని చదువులు పూర్తి చేసుకొని పై చదువులకు పట్నం వెళ్లాక వృద్ధాప్యపు దశలో నాన్న ఊళ్లోని పెద్దన్నయ్య పంచన చేరకతప్పలేదు. కాటికి కాళ్లు చాచిన నానమ్మను [illegible] మంచంలోనే

"ఈ ముసల్ది నాగండాన బడ్డది ఎన్నడు బోతదో దీనికి జెయ్యలేకసత్తున్నా" నా రాకను గమనించి వదిన అన్న ఈసడింపు మాటలకు నామనస్సు చివుక్కుమంది.

ఏనుగులాంటి నాన్న పీనుగులా అయిపోయాడు. కళ్లల్లో వత్తులేసుకొని కొండకు ఎదురుచూస్తున్నట్లు నాకొరకే ఎదురుచూస్తున్నాడు. వదిన నిష్ఠూరాలకి నాన్న ఎన్నిమార్లు పస్తులున్నాడో ఆయన వాలకమే చెబుతోంది.

నేనొచ్చానని తెలిసి నా చిన్ననాటి స్నేహితులు ఉత్సాహంతో నన్ను పలకరించడానికి వచ్చారు.

"ఏరా కిట్టూ ! చాల మారావురా" అంటూ ఒకరు.

"ఒరేయి కిట్టూ ! పాంట్, బుషర్ట్ వేసుకొంటే అచ్చం ఆఫీసరులా ఉన్నావురా" అని ఇకొకడు.

అందరూ నా చుట్టూ మూగి వింతగా చూడసాగారు. వాళ్ళ మొహాల్లో ఆనందం తొనికిసలాడుతోంది.

"ఏరా నువ్వు చేసిన సహాయం మరువలేనురా, పట్నం నుండి నువ్వు పంపిన పుస్తకాలు, నోట్సుతో నేను ఎమ్.ఏ. పాసయ్యాను" అని స్నేహితుడు వెంకన్న నా చేతులు పట్టుకొని అన్నపుడు వాడికళ్లలోని కృతజ్ఞతాభావం నన్ను కదిలించి వేసింది. స్నేహితుల మధ్య ఆత్మీయతల అనుబంధాలే తప్ప రుణానుబంధాలుండవు. అని నేను చెబితే వాడి కళ్ళల్లో ఆనందబాష్పాలు పెల్లుబికాయి.

నా చుట్టూ ఉన్న స్నేహితుల్ని చూస్తుంటే అడుక్కు చేరిన బాల్యస్మృతుల అలలు పైకెగిసి రాసాగాయి. చెట్లకింద చిర్రగోనె, గోలీల ఆటలు, వాగుకయ్యల్లో స్నానాలు, బావుల్లో ఈతలు, గాలాలతో చేపలు పట్టడం, కంచుట్లో కారం, నీకునాకు దూరం అంటూ వానముసుర్లో ఆడె ఆటలు, రాత్రిపూట గ్రామ పంచాయతీ రేడియోలో మీరు కోరినపాటలు వినడం, రావి చెట్టు కింద ఊరి రాజకీయాలు, దయ్యాల కబుర్లు, జాజిరి ఆడటం, పీరీల పండుగకి ఆసోయిదూల ఆడటం ఒకటేమిటి ఎన్నో మధురస్మృతులు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. స్నేహితుల్ని గుడిశె హోటల్‌కు తీసుకెళ్లి టీ తాగించాక వాళ్లు వెళ్లిపోయారు. ఓ గ్లాస్‌లో టీ పట్టుకెళ్లి నానమ్మకు తాగించాను. లొట్టలు పోయిన నానమ్మ కళ్లు మిలమిలకొట్టుకోసాగాయి.

పల్లె జీవితానికి, పట్నపు జీవితానికి ఎంతో తేడా. పల్లెల్లో నిష్కపటమైన ప్రేమ, నిష్కల్మషమైన మనస్సులు, ఎంతో ఆత్మీయతా. కాని పట్నంలో చుట్టూతా మనుషులే. ప్రతి మనిషి చుట్టూ కంచెలు. త్వరగా సౌఖ్యం పొందే మార్గాలు కావాలి. అందుకోసం పరిచయాలు, పార్టీలు, మాస్కులు, అభినయాలు, అవకాశవాదం. అక్కడ ఎవరికి ఎవరి హృదయంతో పని ఉండదు. అనురాగం, అనుబంధాలు ఉండవు. బంధాలు, బాంధవ్యాలు అంతా కృత్రిమమే. ఎవరిని చూసినా డబ్బు వేట. పేదోడు పొట్ట నింపుకోడానికి. ఉన్నోడు స్వర్గ సుఖాలు అనుభవించడానికి.

ఊళ్లో బాల్యమిత్రులు నాపట్ల చూపిన ప్రేమ, ఆదరణ, మా ఇంట్లోని పరిస్థితులు రెండూ విభిన్నమైన కోణాల్లో ఉన్నాయి. నా పిచ్చి ఆలోచనగాకపోతే ఊరేమిటి, పట్నం మేమిటి అంతా మనుషులే. మనషుల మనస్సుల్లో మమతలు ఉండాలే తప్ప హృదయస్పందన లేని కరచాలనము ఎవడికి కావాలి. ఇంతకాలం పట్నంలోని యాంత్రిక పరమైన వాతావరణంలో సహజంగానే తను బిగుసుకుపోయాడు. అమ్మ ఆత్మహత్య దుర్ఘటనతో చిన్నాభిన్నమైన కుటుంబం, దెబ్బతిన్న అంతర్గత కుటుంబ సంబంధాలు. చిద్రాలుపడ్డ తన హృదయం ఎంతోకాలానికి గాని కోలుకోలేకపోయాయి. గ్రామాల్లో కూడా ఉమ్మడి

కుటుంబ వ్యవస్థ కలుషితమైంది. విచ్ఛిన్నమైంది. అందుకు మా కుటుంబమే తార్కాణం. తండ్రీ కొడుకూ. తల్లీ బిడ్డా, అన్నా చెల్లీ, అక్కా తమ్ముడూ అన్నీ ఉపరితల సంబంధాలే. అసలు సమాజమే ఓ వైరుధ్యాల పుట్ట.మనుషులకంటె పుస్తకాల్లో నాకు కొంత ఉపశాంతి లభించింది. అవి మనస్సుతో పలకరిస్తాయి. హృదయంతో మాట్లాడుతాయి. వంచన చెయ్యవు. తనో అభాగ్యజీవి. తన జీవితంలో ఎన్నో ఖాళీలు. బాల్యంలో తల్లిప్రేమ కోల్పోయిన ఖాళీ. చల్లని పల్లె ఒడికి దూరమైన ఖాళీ. భార్య పిల్లలతో నేను ఆ ఖాళీని భర్తీ చేసుకోగలనేమో కాని నాన్న జీవితంలో ఏర్పడ్డ ఖాళీ ఎవరూ పూడ్చలేనిది.

నాన్న ఎప్పుడూ, ఎందుకు అందరికి భిన్నంగా కన్పించేవాడో నా కిప్పటికీ బోధపడలేదు. ఏ ఒక్కరి తోను వ్యక్తిగతంగా తగవులేదు. అయినా ఎవరితోను కలసినట్టుండే వాడుకాదు. మనిషి నిజమైన స్నేహాన్ని అన్వేషిస్తాడు. సరియైన స్నేహం దొరక్కనాన్న విపరీతమైన వెతుకులాటలో ఉన్నట్లుగా అగుపించేవాడు. ఆ వెతుకులాటలో భాగంగా సాహిత్యం చదవడం, రేడియో వినడం, టివి చూడ్డంలాంటి ఆసక్తులను పెట్టుకునేవాడు. వెనుకా ముందూ ఎవరూలేరని భరింపరాని ఒంటరితనంతో బాధపడేవాడు. ఒంటరిగా నిలబడ్డ మనిషిగా ఇతరులెందరికో ఆక్షేపణ అభ్యంతరం. దాని పర్యవసానంగా స్నేహితులకు కరువయ్యాడు. ఇంట్లో పెద్దన్నయ్య జీవితకాలంపాటు నాన్నతో ఘర్షణ పడ్డాడు.

ఆర్థికపరమైన అంశాలతో కుటుంబంలో గాఢంగా పెనవేసుకున్న బాంధవ్యాలు ధ్వంసం కాకూడదు. బంధాలు, అనుబంధాలు అవి నిరంతరం ప్రేమపాశంతో దృఢంగా బంధించబడాలి. ఆ రాత్రి నాన్న నా పక్కనే పడుకున్నాడు. తన గతానుభవాలెన్నో కథలు కథలుగా చెప్పాడు. అమ్మను ఎంత కష్టపెట్టిందీ చెప్పుకొంటూ బాధపడ్డాడు. నాన్న భౌతికంగా, మానసికంగా ఎన్నో చేదు అనుభవాల్ని చవిచూశాడు. ఆయన శారీరకంగా, మానసికంగా ఎంతో అలసిపోయాడు. నిద్రలోకి ఎప్పుడు జారిపోయానో నాకే తెలియదు. తెల్లారేసరికల్లా చూస్తే నిశ్చలమైన ఆయన తల నా ఎదపై వాలి ఉంది. నా దుఃఖానికి అవధుల్లేవు. సుదూరమైన జీవనయాత్రలో అలసిపోయిన నాన్న పశ్చత్తాప హృదయంతో తన తప్పును క్షమించమని శాంతిని అన్వేషిస్తూ అమ్మ సన్నిధిలోకి వెళ్ళిపోయాడు.

* * *

నాన్న పెద్దకర్మలయ్యాయి. జ్ఞాపకాల మడతల్లో హృదయం ద్రవీభూతమవుతున్నది. అమ్మ అనురాగం, అందరిని ప్రేమించిన అమ్మ... అమ్మ తదనంతరం మా మనుగడ కోసం అంకితం చేసిన నాన్న జీవితం...

నన్ను తీసుకపోకుండా నా వాళ్లను తీసుకపోతున్నవేంది దేవుడా? నన్నెప్పుడు తీసుకపోతావు అంటూ నానమ్మ ఏడ్చిఏడ్చి నీరసపడిపోయింది.

నానమ్మను తీసుకొని భారంగా టౌన్ చేరాను. హాస్పిటల్లో చేర్పించాను. వారం రోజుల్లో నానమ్మ కట్టెల్లో కట్టె అయిపోయింది.

...ఇప్పుడా వూరితో సంబంధాలు తెగిపోయాయి. ఆ వూరు కనపడకుండా పోయింది. మానేర్ డ్యాంలో మునిగిపోయింది. ఆనాటి స్నేహితులు, బంధువులు చెల్లాచెదురయ్యారు. జ్ఞాపకాలు కూడా రంగువెలసి పోతున్నాయి. ఇప్పుడా వూరు అనుబంధాలు మా పిల్లలకు చెప్తుంటే కథల్లోలా వుంటాయి. అప్పుడప్పుడు "నాన్నా! మన తాతయ్య ఊరు చూపించవూ" అని పిల్లలు అడుగుతారు. ఆ వూరు ఎక్కడుందని చూపెంచను. జ్ఞాపకాల్లో తప్ప.

(ప్రజాశక్తి దిన పత్రిక 11-7-1999)

* * *

16

పాలమీగడ

- కొక్కుల పద్మావతి

సాయంత్రం పక్షులు గూట్లోకి చేరేవేళ. పశువులు ఇంటిదారి పట్టాయి. పొద్దున్ననగా కూలిపనికి పోయినవాళ్ళు, కార్మికులు, కర్షకులు, ఆఫీసుల్లో పనిచేసినవాల్లు, బడి పిల్లలు ఇంటిముఖం పట్టారు. రోడ్డంతా రద్దీగా ఉంది. ఆకాశంలో నల్లని మేఘాలు అలుముకున్నాయి. ఇపుడో ఇంకా సేపటికో వాన వచ్చేట్టుంది.

సావిత్రమ్మ గారు వసారాలో కాలుగాలిన పిల్లిలా అటూయిటూ పచార్లు చేస్తున్నారు. ఆమెకు ఏమీ తోచడం లేదు. మనస్సు చాలా ఆందోళనకరంగా ఉంది. ఏదో కీడు శంకిస్తున్నది. ఏమై ఉంటుదబ్బా అని మనసులోనే మదనపడుతున్నారు. కారణం ఆమెకున్న ఒక్కగానొక్క మనుమరాలు.

ఆమె పేరు శాంతి. నాలుగో తరగతి చదువుతున్నది. ఆమె వయస్సు పదేళ్ళు. ఆమె ఎర్రగా బొద్దుగా ముద్దబంతి పువ్వులా ఉంటుంది. గుండ్రని ముఖం, చక్రాల్లాంటి కళ్ళు, ఎర్రని పెదవులు చూడముచ్చటగా ఉంటుంది.

ఈరోజు స్కూలు వదిలి గంట అవుతున్నా ఆమె ఇంటికి రాకపోయేసరికి అమ్మమ్మ ప్రాణం ప్రాణంలో లేదు. ఆకాశంలో నల్లని మేఘాలు కమ్ముకున్నందువల్ల వాతావరణం చీకటిగా ఉంది. ఏ నిమిషాన వర్షం కురుస్తుందో చెప్పడం కష్టం. అమ్మమ్మకు ఆందోళన అధికమైంది. ఆమె గాభరాగా కళ్ళు పెద్దవి చేసి చూడసాగారు. బుజ్జి వచ్చిన జాడ లేదు.

అమ్మమ్మ శాంతిని బుజ్జి అని పిలుస్తారు. సన్నగా వాన మొదలైంది. అమ్మమ్మ గాభరాగా పక్కింటికి వెళ్ళి వాళ్ళ అబ్బాయిని బుజ్జి వాళ్ళ స్నేహితురాలు ఇంటికి పంపింది. ఆమె ఎక్కడా కనిపించలేదని అబ్బాయి తిరిగివచ్చాడు. సావిత్రమ్మ గారి మనస్సు పరిపరి విధాల ఆలోచిస్తూ ఉన్నది. అసలే రోజులు బాగోలేవు. అందంగా ఉందని అమ్మాయిని ఎవరైనా ఎత్తుకుపోయారా... లేక ఏమైనా ప్రమాదం... ఆలోచించలేకపోతోంది. ఆమెకు భయంతో పాటు దు:ఖం ముంచుకు వస్తోంది.

పొద్దున్ననగా బడికి పోయిన పిల్ల ఇంతవరకు రాలేదు. అమ్మమ్మ చూస్తూనే ఉంది. చూస్తుండగానే చీకటి చిక్కపడుతోంది. సన్నగా పడుతున్న వర్షం వేగం పుంజుకుంది. పెద్దపెద్ద చినుకులతో ఉరుములు, మెరుపులతో వాన కురుస్తున్నది. హోరున గాలి వీస్తున్నది. మధ్యమధ్యలో రాళ్ళు పడుతున్నవి. వానజోరు పెరగడం చేత జల్లులు ఇంట్లోకి వస్తూన్నవి. రాళ్ళుకూడా యింట్లోకి వస్తున్నవి. ఇక చేసేదేమీ లేక అమ్మమ్మ అరుగుమీద ఓ చోట కూలబడ్డారు. అమెకు దు:ఖం ఆగడంలేదు. ఏడుస్తూనే వేయి దేవుళ్ళకు మొక్కుకున్నారు. భగవంతుడా మా పాపకు ఏమీ జరగకూడదు. అది క్షేమంగా ఇల్లు చేరాలి. నీకు తలనీలాలు ఇస్తాను స్వామీ అని ఏడుకొండల వానికి దండం పెట్టుకున్నారు.

కాసేపట్లో దు:ఖం పోయి కోపం వస్తున్నది. ఆ కోపంలో అమె ఏమేమో తిట్టుకుంటున్నారు.

తనలోతానే గొనుక్కుంటున్నారు. ఓవేపు భయం, ఓవేపు దు:ఖంతో మిళితమైన కోపం ఆవేశం ఆగడం లేదు. ఏం చేయాలో తోచడం లేదు.

సరిగ్గా గంటసేపు ఆగకుండా ఏకధారగా కుండపోతగా వర్షం కురిసి వెలసింది. బయట మట్టి వాసన వస్తున్నది. పక్కింటి పిల్లలు, ఆ వాడలోని పిల్లలు వానలో పడ్డ రాళ్ళను ఏరి తింటున్నారు. సాయంత్రం ఏడవుతోంది. వాతావరణం చల్లబడింది. ఆకాశం తేటతెల్లగా కనపడుతున్నది. ఒక్కొక్క చినుకే పడుతున్నది.

అమ్మమ్మ మళ్ళీ రోడ్డు వంక చూస్తున్నారు. ఆమె చేతులు పిసుక్కుంటున్నారు. ఎలా.... ఏం చేయాలి... ఇక లాభం లేదనుకుని చేతిలో కర్ర పుచ్చుకుని ఆమె తెల్సిన వాళ్ళ యిళ్లకు పోయి వచ్చారు. ప్రతి ఇంట్లో మా యింటికి రాలేదండి, మా యింటికి రాలేదని సమాధానం. నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ యింటి ముఖం పట్టారు.

అమ్మమ్మ యిలా అడుగుపెట్టారో లేదో.... శాంతి (బుజ్జి) ప్రత్యక్షం. ఇక చూడాలి. అమ్మమ్మ కోపం తారాస్థాయికి చేరుకుంది. అప్పటినుండి ఉన్న భయం, దు:ఖం, బాధ అన్నీ మరిచి ఏకధాటిగా తిట్టడం ప్రారంభించారు. అవి ప్రేమతో తిడుతున్న తిట్లు. శాంతి చక్రాల్లాంటి కళ్ళను అటూయిటూ తిప్పుకుంటూ గుర్రున చూస్తున్నది. ఆమె వేసుకున్న లంగా జాకెట్ పూర్తిగా తడిసిపోయినందువల్ల వెంట్రుకల చివరినుండి నీళ్ళు బొట్లు బొట్లుగా రాలుతున్నాయి. ఆమె లంగాలో యింకా రాళ్ళు ఉన్నాయేమో రెండు చేతులు పైకి పట్టుకొని గజగజ వణుకుతూ నిలబడి ఉంది.

కోపంగా ఆమె ముఖాన తువ్వాలు పడేసి అమ్మమ్మ తిడుతూనే ఉన్నారు. "కాళ్ళు నొప్పెట్టెదాకా ఎన్ని యిళ్ళు తిరిగాను. ఎక్కడ చచ్చావే బడి వదలగానే ఇంటికి రాకూడదా. వెతికి వెతికి ప్రాణం పోయింది" అని గట్టిగా తిడుతూనే ఉన్నారు.

శాంతి తగ్గించిన స్వరంతో "అమ్మమ్మా నేనెక్కడికి వెళ్ళలేదు. ఇక్కడే ఉన్నాను" అన్నది. మన యింటి చూరు కింద నిలబడి వానరాళ్ళు ఏరుకొని తిన్నాను. నువ్వు చూస్తే తిడతావని అక్కడే ఉన్నాను అన్నది. అమ్మమ్మ బయటకు వెళ్ళగానే పిల్లిలాగా యింట్లోకి దూరింది.

సావిత్రమ్మకు కోపం ఆగడం లేదు. రేపు నీకు జలుబు చేసి జ్వరం వస్తే నేనేమి చేయాలి. పుడుతూనే నా బిడ్డను పొట్టన పెట్టుకున్నావు, నువ్వు దాపురించావు. ముదనష్టపుదానా, నష్టజాతకురాలా అని ఆవేశంలో ఒళ్ళు తెలియకుండా తిడుతున్నారు.

శాంతి చూసిచూసి ఒకే ఒక్క మాట అన్నది. "అమ్మమ్మ ఒక మాట చెప్పనా?" అమ్మమ్మ అలాగే చూస్తున్నది. ఏంటే అన్నది. "పాలకన్న పాలమీగడని జాగ్రత్తగా కాపాడాలి అమ్మమ్మా" అన్నది.

అమ్మమ్మ అలాగే నోరు వెళ్ళబెట్టారు. అవాక్కయి చూస్తుండిపోయారు. ఇంత చిన్ని బుర్రకు ఇంతపెద్ద మాట ఎలా తట్టింది ఆమె ఊహించలేకపోయారు. కాసేపటికి గాని అమ్మమ్మ తేరుకోలేదు. తేరుకున్నాక బుజ్జిని అమాంతంగా అక్కున చేర్చుకున్నారు. గుండెలకు అదుముకున్నారు. "నా పాలమీగడవే నువ్వు" అని నిన్ను ఎప్పటికి తిట్టనే అని తల నిమురుతూ కన్నీరు కార్చారు.

1997

(సామాజిక సమాచార "మార్గదర్శి" పక్ష పత్రిక ఏప్రిల్ 1999 సంచిక నుండి)

* * *

17

సంశయం

— బెజ్జారపు వినోద్‌కుమార్

హరిణిని పెళ్ళి చేసుకున్నప్పుడు ఈ సమస్య గురించి నేను ఏ మాత్రం ఆలోచించలేదు. పెళ్ళి తరువాత ఇప్పటివరకు కూడా ఈ సమస్య ఇంత తీవ్రమైనదని తెలిసి రాలేదు.

అంతా విన్నాక ఎవరికైనా మా ఈ సమస్య మరీ చిన్నదిగా, సిల్లీగా అనిపించవచ్చు...కానీ ఈ సమస్యతో మేం అనుభవించిన క్షోభ అంతా ఇంతా కాదు. ఏ సమస్య తీవ్రతనైనా, అది వ్యక్తి మనుగడను శాసించే స్థాయినిబట్టే నిర్ణయించాల్సి ఉంటుందని నా అభిప్రాయం. ఇక సమస్య తీవ్రతను బట్టి క్షోభ పడడం జరుగుతుందా? లేక క్షోభను అనుభవించిన స్థాయిని బట్టి సమస్య తీవ్రతను నిర్ధారించాలా అనేది మాత్రం నాకు తెలీదు.

అత్త వారిల్లు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని, పెళ్ళి అయ్యాక తిరుగు ప్రయాణంలో వధూవరులిద్దరూ కబుర్ల ద్వారా చాలా దగ్గరైపోతారని చాలా మంది అంటుంటారు.

హరిణి వాళ్ళ ఊరు సిర్పూర్ కాగజ్‌నగర్. మా ఊరికి సుమారు 160 కిలోమీటర్ల దూరం పెళ్ళయ్యాక తిరుగు ప్రయాణంలో కిటికి గుండా హరిణి ముఖాన్ని తాకుతూ వస్తున్న గాలి నన్ను వివశుణ్ణి చేస్తున్నా ఇద్దరం కబుర్లలో పడిపోయాం. నాకు ఇటుపక్క కూచొన్న మా చిన్నమ్మ కూతురు ఎంతయాతన పడిందో... ఇప్పుడు తలుచుకుంటే జాలేస్తుంది.

నాలుగ్గంటల ప్రయాణం తరువాత జగిత్యాల దాటుతూంటే ఆ చీకట్లో నా చెవిలో గుసగుసగా అంది హరిణి "కనీసం ఒక సంవత్సరం వరకూ పిల్లలు వద్దు" అని.

అలా ఆమె గుసగుసగా అన్నప్పుడు కర్ణభేరిని తాకిన వేడి ఊపిరి మనోహస్త్రాలను పట్టుకు-ని చేట్టపట్టాలేసుకుంటూ పరవశాల పాటలు పాడింది.

అలా మేం తీసుకున్న నిర్ణయం మా సబ్ కాన్షస్‌లోని కోరిక ముందర ఎంత తేలికైనదో పదో రోజున గాని తెలిసి రాలేదు. పదో రోజున హరిణితో అన్నాను.

"సంవత్సరం కాలం మరీ ఎక్కువేమో... ఆర్నెల్లకి తగ్గిద్దామా?" మారిన ఆ నిర్ణయం కూడా మరో నెలా పదిహేను రోజుల తరువాత మరింత మార్పు చెందింది.

"ఆర్నెల్లు కాదుగాని నెలన్నర చాల్లే"! అనుకున్నామిద్దరమూ. ఫలితమే ఒకే కాలెండర్ ఇయర్‌లో పెళ్ళి మరియు పాప

పాప పుట్టిన ఇన్ని రోజులకు మొదలయిందా సమస్య. ఏదో ఒక నిర్ణయానికి రావడమనేది పరిష్కారాన్ని చూపి సమస్యను అంతమొందిస్తుంది. మరి ఏ నిర్ణయమూ తీసుకోలేకపోవడమే ఒక సమస్య అయినప్పుడో..? నాకేర్పడిన సమస్య అదే.

* * *

"చైనా ప్రభుత్వం మొదటి సంతానానికి మాత్రమే బాధ్యత వహిస్తుందట" త్రికరుణ టీచర్‌తో అన్నాను స్కూల్లో

ఏమీ మాట్లాడలేదామె. తిరిగి నేనే అన్నాను.

"నా ఈ టీచర్ జాబ్‌తో ఒక్కరి కన్నా ఎక్కువ మందిని సంతృప్తికరంగా పోషించగలనా? ఐమీన్ ఏ లోటూ లేకుండా"

"మీరెంత మంది సార్?" లంచ్ బాక్స్ విప్పుతూ అంది త్రికరుణా టీచర్.

"మేము ఆరుగురం ప్లస్ ఒక చెల్లెలు- మొత్తం ఏడుగురం".

"మీ నాన్నగారేం చేసేవారు?"

"టీచర్"

"ప్రస్తుతం మీరెంతమంది ఉద్యోగాలు చేస్తున్నారు?"

"తమ్ముడు మినహా అందరం"

"మీరెన్నో వారు?"

"అయిదు"

"ఇంకొకర్ని కనకుండా మీ పాపకోసం మీరేదో గొప్పత్యాగం చేస్తున్నారని తెగ ఫీలయిపోతు-న్నారు గానీ పాప భవిష్యత్తు కోసం - అనే ముసుగులో అంతర్లీనంగా మీరు మీ సుఖాల్ని కోల్పోకుండా ఉండడానికి ప్రయత్నిస్తున్నారు". ఆమె అతిమామూలుగానే అన్నా, నాకు మాత్రం ముఖం మీద చరిచినట్లుగా అనిపించింది.

ఆమె ఆలోచనలు తార్కికంగా ఉంటాయి. అందుకే ఎప్పుడూ ఆమెదే పైచేయి అవుతుంది.

"అంటే మీ ఉద్దేశం మా నాన్నగారిలా ఏడుగుర్ని కనమనా?"

"అలా అని నేనన్నానా? మీరు ఒక్క పాపకే బర్త్-కంట్రోల్ ఆపరేషన్ చేయించుకుంటానంటే నేనలా అన్నాను" అంది

* * *

సందిగ్ధంతో కాలం వేగంగా గడిచిపోతుంది. కాని సందిగ్ధం తొలగిపోయే వరకూ మనసుకు ప్రశాంతత చేకూరదు.

ఇవాళ త్రికరుణను నేను అడిగిన ప్రశ్నే సరిగ్గా ఆర్నెల్ల క్రితం హరిణి నన్ను అడిగింది.

"మన ఈ ఆదాయంతో ఏ లోటూ లేకుండా ఎంత మందిని కని, పోషించగలం?"

"ఒక్కరిని" బాగా ఆలోచించి చెప్పాను.

"నేననేది అదే... ఒక్కరితోనే సరిపెట్టుకున్నామనుకోండి పాప గురించి బెంగే ఉండదు. మనం కూడబెట్టే ప్రతిపైసా ప్రతి వస్తువు పాపదే అవుతుంది. మన జీవితాలే పాప సొంతమవుతాయి."

"కానీ పెరిగాక ఉన్న ఒక్క పాపా మనల్ని పట్టించుకోలేదనుకో" ఊరికే అడిగానామెను క వ్విస్తున్నట్లు

"మనరాత బాగోలేకపోతే పది మందిని కన్నా ఎవరూ పట్టించుకోకపోవచ్చు ఎంత మందిని చూడడంలేదు" సీరియస్ గానే బదులిచ్చింది హరిణి

హరిణి నాకెప్పుడూ విచిత్రంగానే కనిపిస్తుంది. ఇప్పటి పరిస్థితుల్ని ఇంత వాస్తవికంగా, హే-తుబద్ధంగా ఆలోచిస్తున్న ఈమె భవిష్యత్తును మాత్రం అదృష్టానికి తలరాతకూ వదిలేస్తోంది.

ఆ రోజు హరిణి వాళ్ళ అమ్మా నాన్నా వచ్చారు.

వచ్చిన కొద్దిసేపటికే వాళ్ళ అమ్మ అడిగిన ప్రశ్న "ఏంటే ఏమైనా విశేషమా?"అని. కొన్ని రోజులుగా చాలామంది హరిణిని అడుగుతున్న ప్రశ్నే అది.

"ఎందుకమ్మా ఒక పాప చాలదా?" అంది హరిణి. మాట పూర్తి కాకుండానే అదిరి పడ్డారు వాళ్ళమ్మగారు.

* * *

త్రికరుణ టీచర్ మాటలు నాపైన చాలా ప్రభావాన్ని చూపాయి. స్కూటర్ మీద ఇంటికి బయల్దేరినా ఆలోచనలు మాత్రం అలా సాగుతూనే ఉండసాగాయి.

పిల్లల్ని కనడం వెనుకా, వారిని ప్రేమగా చూడడం వెనుకా అంతర్లీనంగా అభద్రతా భావనే ఉందా? నేను దానికి అతీతంగా భవిష్యత్తు గురించికాక వర్తమానం గురించే ఆలోచిస్తున్నానా?

ఒక్క పాపకే ఆపరేషన్ చేయించుకోవాలన్న నా బలీయమైన కోరిక వెనకాల సమాజం తాలూకు ప్రమేయం ఏ మేరకుందా అని ఆలోచించసాగాను.

మా నాన్న తన జీతాన్ని, జీవితాన్ని సంపూర్ణంగా మాకే కేటాయించాడు. స్కూటర్, ఫ్రిజ్, కూలర్, వాషర్, టి.వి.లు కాదు కదా కనీసం ఒక డొక్కు సైకిల్ కూడా మా నాన్నకు లేకపోయేది. ఆ కాలంలో వాటిని ఎవరూ అడగలేదు. పట్టించుకోలేదు.

కాని ఇప్పుడో.. వస్తువులతోనే స్టేటస్... ఏ వస్తువు లేకున్నా తక్కువే... ఏ వస్తువు తక్కువయినా సమాజంలో చులకనే... అందుకే... ఆడంబరాలన్నీ అవసరాలైపోయాయి కాబట్టే మా నాన్న ఏడుగుర్ని పోషించడానికి సరిపడ్డ సంపాదన, నాకు ఒక్క పాపను పోషించడానికే సరిపోతోంది. ఒక తరానికి, మరో తరానికి మధ్యనున్న ఈ కాలంలో సమాజం మనిషికి ఇన్ని అనవసరమైన అవసరాల్ని ఎలా సృష్టించింది?

మా నాన్న మా మీద చేసిన ఖర్చు నేను ఇప్పుడీ వస్తువులపైన చేస్తున్నాను. అంటే సమాజంలో త్వరత్వరగా వస్తున్న మార్పు జీవమున్న మనుషుల కన్నా నిర్జీవ పదార్థాల ప్రాముఖ్యాన్నే పెంచుతున్నాయి... అదీ విపరీతంగా.

చాలా చేదుగా అనిపించిది ఆ ఆలోచన.

ఆలోచిస్తున్న కొద్దీ త్రికరుణ టీచర్ మాటల్లోని వాస్తవం కొద్ది కొద్దిగా అవగతమవసాగింది. మా పాపను గొప్పగా పెంచాలన్న నా ఆలోచన వెనకాల సమాజం వెనుక వెర్రిగా పరుగులు తీస్తున్న నా తాపత్రయమూ, పలాయనత్వమూ ఉన్నాయా?

ఇంతగా ఆలోచించినా నేను నా కుటుంబాన్ని ఒక పాపకు మించి పెంచడానికి ఇష్టపడడం

లేదు. కాకపోతే నాలోని సందిగ్ధం మళ్ళీ మొదటికొచ్చింది.

అయితే అనుకోని రెండు సంఘటనలు నన్ను ఈ సందిగ్ధావస్థలోంచి బయటకులాగి, నన్నో స్థిరమైన నిర్ణయం తీసుకునేలా చేశాయి.

ఆలోచనల్లో ఉండగానే ఇల్లు వచ్చేసింది. నేను వచ్చేసరికి హరిణి వాషింగ్ మెషిన్‌లోంచి బట్టలుతీసి ఆరేస్తోంది.

"మమ్మూగాడు లేడా?" అడిగాను. రాగానే పాపతో కాసేపు ఆడుకోవడం అలవాటు.

"లేదు."

"ఎటెళ్లింది?"

"బయటికి... పిల్లలతో ఆడుకోవడానికి"

నేనీమధ్యన చాలా గమనిస్తున్నాను. పాప ఇంటిలో వెలితిగా ఫీలవుతోంది. పాపతో నేను చాలాసేపు గడుపుతున్నా, నేను పాపస్థాయికి దిగివచ్చి చిన్నపిల్లాడిలా ఆడకుంటున్నా పాప నాలో చిన్నపిల్లాడిని చూడడం లేదు.

తనతోటి పిల్లలతో ఆడుకోవడానికి బయటకు వెళ్తే నాకేం బాధలేదు కాని ఇంట్లో వెలితిగా ఫీలవడమే భరించలేనిది.

ఎప్పుడైనా పాపవెళ్ళేది పక్క సందులో ఉండే రామేశంగారింటికి. వారికి ముగ్గురు పిల్లలు. వాళ్లతోనే ఆడుకుంటుంది. పిలిస్తే మటుకు అయిష్టంగా వస్తుంది. వాళ్లు ముగ్గురూ ఒకటయ్యి ఎన్నోసార్లు ఏడిపించినా మళ్ళీ అక్కడికి వెళ్లడానికే ఇష్టపడుతుంది.

రోజంతా స్కూల్‌కు వెళ్ళి వచ్చిన పాప సాయంకాలం కూడా ఇంట్లో గడపకపోవడం మాకు వెలితిగా అనిపించసాగింది.

"పోనీ వాళ్ల పిల్లల్నే ఇటు రమ్మందాం" అంది హరిణి ఓ రోజు. నాకీ ఆలోచన బాగానే అనిపించిది. కాని ఎంత ప్రయత్నించినా, వాళ్ళు ఒకటి రెండ్రోజులు వచ్చినా మళ్ళీ రావడం మానేశారు. కారణమేమిటో ఆలోచించాను. వాళ్లకి ఆడుకోవడానికి మా పాపే అవసరం లేదు. కాని మా పాపకు మాత్రం ఆడుకోవాలంటే అక్కడికి వెళ్ళక తప్పదు.

ఉండబట్టలేక నేనే రామేశంగారింటికి వెళ్ళి పాపను బలవంతంగా తీసుకొచ్చాను. అతి కష్టమ్మీద వచ్చింది పాప అయిష్టంగా.

"పాప బాల్యాన్ని మనం దోచేసుకోవడం లేదు కదా?" నిద్రపోతున్న పాప ముంగురుల్ని సవరిస్తూ అన్నానా రాత్రి.

బెడ్‌లాంప్ వెలుగులోనే అయినా హరిణి కళ్ళలోని దిగులును గమనించగలిగాను నేను.

* * *

ఎవరో రాజకీయ పార్టీవారు ఏదో కారణంగా బంద్ చేయడంతో స్కూల్ వదిలేశారు. స్టాఫంతా ఎక్కడికక్కడ గ్రూపులుగా మారి కబుర్లలో పడిపోయారు.

లైబ్రరీ రూమ్‌లో కూచుని ఏదో రాసుకుంటున్న నా వద్దకి పాన్ నములుకుంటూ వచ్చాడు పరమేశం సార్.

"ఏమండీ ఒక్క పాపే చాలనుకుంటున్నారట కదా" అన్నాడు. త్రికరుణ టీచర్‌పై కోపమొచ్చింది.

"చెప్పకూడదు గానీ కీడెంచి మేలెంచాలి సుమా ఉన్న ఒక్కళ్లకి ఏదైనా జరగరానిది జరిగితే ముసలితనంలో ఎవరు చూసుకుంటారు?" అన్నాడు మళ్ళీ.

మూర్తీభవించిన స్వార్థంలా కనిపించాడాయన ఆ క్షణాన. పిల్లల్ని కనడాన్ని వ్యాపారంలా భావిస్తున్న ఆయన ధోరణికి మొహమ్మీద ఉమ్మేయాలనిపించింది గానీ తమాయించుకున్నాను.

"కరక్టేనండీ మీ ముందుచూపునకు జోహార్లు. ఇప్పుడున్న మీ నలుగురు పిల్లల్లో ముగ్గురు చచ్చిపోయినా మీకేం బాధలేదు. మిగిలిన వాడు మిమ్మల్ని హాయిగా చూస్తాడు" అన్నాను.

ఆ మాటలను అన్నాక అతని మొహంలోని మారిన భావాల్ని కొద్దిసేపు అలాగే చూస్తుండిపోవాలనిపించింది. కానీ ఉన్న కొద్ది క్షణాలు గిజగిజా గింజుకుని గదిలోంచి పారిపోయాడు.

పరమేశం లాంటి వాళ్ళందర్నీ వరుసబెట్టి కాల్చేస్తే గానీ ఈ సమాజం కాస్తంతైనా బాగుపడదు అనుకుంటూ త్రికరణతో కాసేపు మాట్లాడి ఇంటికి బయల్దేరాను.

స్కూటర్ అప్రయత్నంగా చెల్లెలి ఇంటివైపుకు లాక్కెళ్ళింది.

మా చెల్లెలికీ నాకూ మధ్యన తేడా రెండేళ్ళే అయినా దాని ముందర నేను మరీ చిన్న పిల్లాడిలా అనిపిస్తానిప్పుడు. ఏ కాస్త డిస్టర్బ్ అయినా చెల్లె దగ్గరికే వెళతాను . అమ్మ తాను వెళ్ళిపోతూ నాకోసం మిగిల్చిన తన రూపమది.

ఏంట్రా మరీ మూడీగా ఉన్నావు ? అంది కాఫీ అందిస్తూ.

మౌనంగా వుండిపోయాను.

టైటానిక్ చూసావా ? అంది తనే తిరిగి

చూసాను.

నీకు గుర్తుందా ? నువ్వు ఏడో తరగతి చదివేప్పుడు ఇంగ్లీష్ టెక్స్ట్‌బుక్‌లో టైటానిక్ పాఠం విన్చొచ్చి నాకు చెబితే ఆ రాత్రి మనిద్దరమూ నిద్దురపోకుండా ఎంత ముచ్చట్లాడుకున్నామో ? ఎంతగా భయపడినామో ...?

ఎలా మర్చిపోతాను నేను. మనిషి జీవితంలో అద్భుతమైన స్థితిబాల్యమే కదా. ఆ రోజు రాతిరి దుప్పటి నిండా కప్పుకుంటే చాలు నీళ్ళలో మునిగిపోయి ఊపిరాడన్నట్లు ఉక్కిరిబిక్కిరయ్యాను. చలికాలమే అయినా దుప్పటి కప్పుకోకుండానే పడుకున్నామిరువురమూ.

టైటానిక్ సినిమా ఇంత ఖర్చుతో ఇంతగొప్పగా తీసినా ఇప్పుడు సినిమా చూసినప్పుడు కలిగిన ఫీలింగ్ కన్నా చిన్నప్పుడు రాత్రంతా చెల్లెలితో ముచ్చటిస్తూ పొందినప్పటి అనుభూతే మహాద్భుతంగా అనిపించింది నాకు.

టైటానిక్ విషయంతోపాటే ఎన్నెన్నో గుర్తుకు రాసాగాయి నాకు

చెల్లిలితో కలిసి ఆడుకున్న ఆటలు, అమ్మ తిట్లను సైతం లెక్కచేయకుండా ఎగరడం. ఎన్నో రకాల ఆటలు అనుకరణాలు...ఎన్నెన్నో సుందర దృశ్యాలు మనోయవనికపైన ప్రదర్శితమై మనసు తేలికై పోయింది.

చెల్లలు చైనీస్ చక్కర్ బోర్డ్ తేవడానికి లోనికి వెళ్ళింది

మళ్ళీ నాకు నా సమస్య గుర్తు వచ్చింది.

సంసారాన్ని ప్లాన్ ప్రకారం నడుపుకుపోవడం సరే... కాని అనుభూతుల్ని కూడా ప్లాన్ ప్రకారమే పొందడం నేర్పి ఈ సమాజం ఎంతటి ద్రోహం చేసింది.

పెళ్ళయిన కొద్ది రోజలకే హరిణితో కలిసి వేరు కాపురం పెట్టిన రోజులు గుర్తొచ్చాయి.

పాతకాలం దాంపత్యాల్లో భార్యాభర్తలు ఉమ్మడి కుటుంబాల కారణంగా ఏకాంత రాహిత్యంతో భాదపడినా దొరికిన ఏకాంతాన్ని గొప్పగా అనుభవించేవారు. ఎందుకంటే ఉమ్మడి కుటుంబాల్లో కుటుంబ భాద్యత పెద్దవాళ్ళు స్వీకరించడం వల్ల కాపురం మొదట్లో బాధ్యతలు ఉండేవి కావు.

కాని ఇప్పుడు చిన్న కుటుంబాలు ఏర్పడ్డాక బాధ్యతలతోనే కాపురం మొదలవుతోంది. పాత తరం వాళ్ళలో కన్న ఇప్పటి దంపతుల మధ్యన అటాచ్‌మెంట్ ఎక్కువ స్థాయిలో పెరిగిందని వాస్తవమే అయినా కాపురం మొదట్లోనే ఏర్పడే బాధ్యతలతో జీవితం ప్లాన్ ప్రకారం గడపడం నేర్చి అనుభూతుల్ని కూడా అదేరకంగా పొందే యంత్రంలా తయారయ్యాడా...?

పిల్లల్ని కనడమనే ఒక అద్భుతమైన అనుభూతిని పొందడానికి కూడా ఎంతటి ఆలోచనలు? ఎంతటి జాగ్రత్తలు? ఎన్ని పథకాలు?

"నాకో చిన్న అనుమానం" అన్నాను చెల్లెలు రాగానే.

"ఏంట్రా ?"

"మనం మన జీవితాల్ని ఇంత సౌకర్యవంతంగా మార్చుకున్నాం కదా. ఈ సౌకర్యం కోసం మన అమ్మానాన్నలు ఎందుకు ప్రయత్నించలేదు?"

"ప్రయత్నించి ఉంటే నువ్వూ నేనూ పుట్టి ఉండేవాళ్ళమే కాదు" అంది గలగల నవ్వుతూ.

చెల్లెలు నవ్వితే అచ్చు అమ్మ నవ్వినట్లే ఉంటుంది.

"మనం ఇంత చిన్న కుటుంబపోషణకోసం ఇంతగా సతమతమై పోతున్నాం కదా. అమ్మా నాన్నలు అంతపెద్ద కుటుంబ పోషణలో ఏనాడైనా ఒత్తిడికి లోనైనట్లు అనిపించిందా ?"

"లేదు"

"మరేంటి కారణం.." ఉత్సుకతతో అడిగాను ముందుకు వంగి

"నాటి సమాజం మనిషి యొక్క నిరాడంబరతను ఆదరించింది. అందుకే తక్కువ ఆదాయంలోనూ అంత పెద్ద సంసారం హాయిగా గడిచిపోయింది. అప్పుడు మన ఏరియా మొత్తానికి రామారవు పటేల్ తమ్ముడు కొన్న జావా బండి ఒక్కటే ఉండేది. దానినే అందరూ ఎంతోవింతగా చూసేవారు. కాని అది కొంటేనే జీవితం అని అపడు ఎవరైన అన్నారా ఇప్పటి పరిస్థితి చూస్తున్నావుగా...శాస్త్ర సంకేతిక పరంగా మనిషి సాధిస్తున్న అభివృద్ధి ఆర్థికపరంగా మనిషిపైన తీవ్రమైన ఒత్తిడి కలుగజేసి జీవితాన్ని ఎంత అతలాకుతలం చేస్తోందో"

కాసేపుండీ ఇంటికి బయలుదేరాను.

స్కూటర్ నడుపుతున్నానే గాని మనసులో ఏదో అస్పష్టచిత్రం. హరిణితో గడిపే కాలానికి, చెల్లెలితో గడిపే కాలానికి మధ్యన చాలా వైరుధ్యం కనిపిస్తుంది నాకు. రెండు ఎలాంటి లోపమూ లేనంత గొప్పవే కాని ఏదో తేడా...చెల్లి, భార్య అనే బాహ్యబంధాల మూలంగా వచ్చిన తేడా కాదది. మరేదో... మరేదో...

చిక్కులు పడిన దారాలు వేటికవి విడివడి అంతలోనే మళ్ళీ చిక్కుపడుతున్నట్లు మేఘమాల

ఆకారాన్ని నిర్ధారించుకునే లోపలే మరో ఆకారంలోకి మారిపోయినట్లు...

ఆలోచనల్లోనే ఇల్లు వచ్చేసింది.

స్కూటర్ స్టాండ్‌వేసి లోపలికి వెళ్ళేసరికల్లా ఇంట్లో హరిణి, వినయా ఇద్దరు కూచుని మాట్లాడుకుంటున్నారు. వినయ మా ఫ్రెండ్ భార్య.

పలకరింపులయ్యాక లోపలికెళ్లి రీడింగ్ రూమ్‌లో కూచున్నాను. వాళ్ళిద్దరి మాటలు నాకు స్పష్టంగా వినబుడుతున్నాయి.

"ఏంటీ ఇంకా విశేషమేమీ లేదా?"

నాకు చాలా వింతగా అనిపించిది. అసలు ప్రతి ఒక్కరూ మాతో కచ్చితంగా, చర్చించేంత ముఖ్య విషయమా ఇది. వీళ్లకు ఎదుటివారి జీవితాల మీదున్న క్యూరియాసిటీ తమ జీవితాల మీద ఉండదెందుకో!

ప్రస్తుతం నన్ను వేధిస్తున్న సమస్యా అదే కాబట్టి నా చెవులు అసంకల్పితంగా వారి మాటల్నే వినసాగాయి.

"ఏమీ వద్దనుకుంటున్నాం. ఒక్కరే చాలు" అంది హరిణి.

కొద్ది క్షణాలు మౌనం. ఈ మాట అందరినీ ఎంధుకు నిరుత్తరుల్ని చేస్తుందో అర్ధం కాదు నాకు.

"మీరు పాపకు మేలు చేస్తున్నామని అనుకుంటున్నారు గానీ ముందు ముందు పాపను చాలా క్షోభకు గురి చేసినవారు అవుతారు" అంది వినయ.

మా సమస్యను ఆమె కొత్త కోణంలోంచి ఆలోచిస్తుందేమో అనిపించడంతో వాళ్ల సంభాషణ మీద మరింత ఆసక్తి పెరిగిపోయింది.

బాల్యం తాలూకు అద్భుత స్మృతులన్నీ పుట్టింటితోనే ముడిపడిఉంటాయి. బాల్యంలో ఏర్పడే అనుబంధాలకు చాలా శక్తి ఉంటుంది. మీ పాప పెరిగాక మీరు శాశ్వతం కాదు కదా. మీరు చనిపోయాక మీ పాపకు భర్తా, భర్త తరపు బంధువులు మినహా నా అనే వాళ్ళెవరుంటారు? కనీసం ఇంట్లో బోర్ కొట్టినప్పుడు గానీ, సమస్యలు ఎదురైనప్పుడు చెప్పుకోవడానికి గానీ, ఎటైనా వెళ్లాలనిపించినా గానీ, వెళ్ళడానికి ఒక తోబుట్టువు ఉన్న ధీమా మీ పాపకు కరువవుతుంది. తోబుట్టువు భర్త కన్నా కూడా గొప్ప స్నేహితుడు. ఎందుకంటే ముందే చెప్పాగా బాల్యంలో ఏర్పడే బంధాలు గొప్పనైన వని..."

వినయ మాట్లాడ్డం ఆపేయడంతో నిశ్శబ్దం ఇల్లంతా అగరుపొగలా ఆవరించింది.

చివరి మాటలంటున్నప్పుడు వినయ గొంతు వణికింది. ఆమె గొంతులోని వేదన నిండిన జీరను ఎవరైనా ఇట్టే గుర్తించగలరు.

వినయ వెళ్ళిపోయాక పాప స్కూల్ నుంచి రావడంతో పాపను తీసుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది హరిణి. చాలా రాత్రి వరకూ మేమిద్దరమూ ఒకరికొకరం ఎదురు పడినా ఒకరి మొహంలోకి ఒకరం మాత్రం చూసుకోలేదు.

రాత్రి 'మమ్ము' పడుకున్నాక హరిణి వచ్చి నా పక్కన కూచుంది. వర్షించడానికి సిద్ధంగా భారమైన మేఘమాలలా కనిపించిందామె.

ఎప్పుడో తెల్లవారుజామున అంది హరిణి.

"ఏమండీ, మరొకర్ని మాత్రం కనాలనుంది. ఒక్కరిని మాత్రమే సుమా! దానికీ మార్గాన్ని ఆలోచించాను. నేను కూడా ఉద్యోగం చేస్తాను." అంది పూడుకుపోయిన గొంతుతో.

అంత గంభీర క్షణాల్లోనూ ఆమె మాటలకు నాకు నవ్వొచ్చింది.

సరిగ్గా నాలుగు నెలల తరువాత హాస్పిటల్ నుంచి వచ్చి మా పాపను అడిగామిద్దరమూ.

"ఏరా మమ్మూ! నీకు చిన్ని తమ్ముడు కావాలా? లేక చిట్టి చెల్లెలు కావాలా?" అని.

"తమ్ముడూ, చెల్లీ ఇద్దరూ కావాలి" ఠకీమని అంది పాప ఎలాంటి తడబాటూ లేకుండా.

అలా అంటున్నప్పుడు పాప మొహంలో కనిపించిన సంతోషం నన్ను ఆ తరువాత చాలారోజులు వెంటాడింది.

మరో ఆరు నెలలు గడిచాక

స్కూల్‌లో పిల్లలకు పాఠాలు చెబుతూంటే అటెండర్ వచ్చి చెప్పాడు.

"సార్ మీకు ఫోన్"

ఆ ఫోన్ ఎక్కడినుంచో ఊహించగలను.

వెళ్ళి ఫోన్ అందుకున్నాను.

"అవలతి వైపు నుంచి మా బావమరిది"

"హలో బావా డబుల్ కంగ్రాట్స్" అన్నాడు గట్టిగా.

(ఈనాడు ఆదివారం 2-8-98)

* * *

18

ఋణం

- ఎనుగంటి వేణుగోపాల్

మనిషి జీవితపు పొరల మీద వార్ధక్యాన్ని ఒలికించే కాలం ఆదరణ, ఆప్యాయతల్ని సైతం చిలికిస్తే...వృద్ధుల శేషజీవితం శోకభాగితం కాదు.

టైము పదకొండయినా తిండి తినక పోవడంతో రాజయ్య ముసలి ప్రాణమంతా బేజారైపోతోంది. ఆకలికి పేగులు ఉండచుట్టుకు పోతుంటే కుక్కి మంచం మీద బిక్కుబిక్కుమంటూ కూచుండి పోయాడలాగే.

అన్నం పెట్టమని నోరు విడిచి కోడల్ని అడగలేదు. ఒకవేళ అడిగినా ఆమె పెడ్తుందన్న నమ్మకం లేదు. ఇంటిపని, వంటపని చేసి...పిల్లల్ని స్కూళ్ళకి, భర్తని ఆఫీసుకి పంపి...అప్పుడు రాజయ్యకింత పడేస్తుంది. అందాకా అతనాగాల్సిందే.

"ఇగో అన్నం...తిను" అన్న కోడలి పిలుపుకి తలెత్తి మసకబారిన చూపుల్ని సారించాడతను. విసిరేసినట్టు పళ్ళాన్ని అతడి ముందుకి తోసి, నీళ్ళ చెంబు మంచం కిందపెట్టి విసవిసా లోనికెళ్ళి పోయింది లక్ష్మి.

వృద్ధ శిశువులా ఆదుర్దాగా పళ్ళాన్ని చేతిలోకి తీసుకొని అన్నాన్ని కలుపబోయాడు. కానీ కలుపకుండానే మొహం మాడ్చుకొని పళ్ళాన్ని మరికాస్త పైకెత్తి ముక్కుదగ్గరుంచాడు. చల్లన్నం ఆది. నిరాశగా దాన్ని పక్కన పెట్టేసాడు.

"లచ్మీ...లచ్మీ..." కోడల్ని కేకేసి పిలిచాడు.

రెండో పిలుపుకి "పులుసు పోయన్నా ?!"అంటూ వచ్చిందక్కడికి.

"కాదవ్వ, గీ అన్నం..." గొంతుకడ్డం పడిందో తడితెర పెదవి విప్పలేదు. మాట పెగలడం లేదు.

"ఏమైందన్నానికి ?"ఉరిమి చూస్తు ప్రశ్నించింది.

"అన్నం...పాసిపోయింది బిడ్డా..." వణుకుతున్న కంఠంలోంచి ముద్దగా రాలిపడ్డాయా అక్షరాలు.

"ఆకలైతే గుఙ్జం వరిగడ్డి తింటదట. పోనీ ఆకల్లేకపోతే తిననని చెప్పచ్చుగద ? ... అయినా పనాపాటా తిన్నది అరగడానికి, అరిగినా ఆకలయ్యేతందుకు." మూతి మూడువంకర్లు తిప్పింది.

వచ్చదనం కోల్పోయిన పండుటాకు ఒదిగొదిగి ఉండాలే గానీ చిగురాకులా ఎగిరెగిరిపడకూడదు...రాజయ్యకి అతడివృద్ధాప్య జీవనానుభవం నేర్పిన తొలి పాఠమిది.

అందుకే "అవ్వతోడు బిడ్డ...నువద్దిగనే పాసిపోయింది !..." చాలా సౌమ్యంగా చెప్పాడు.

"ఏదీ చూడనీ..." అంటూ పళ్ళాన్ని విసురుగా చేతులోకి తీసుకొని వాసన చూసింది.

వెంటనే "ఇది...పాసిపోయిందా ?" అంటూ తెగ ఆశ్చర్యపోతూ "సల్లన్నం గద అట్లన్పిస్తుంది. వాసన్లేదు గీసన్లేదు...తిను". అంటూ గదమాయించి తిరిగి పళ్ళెం రాజయ్య చేతికిచ్చింది.

కోడలు స్వభావం తెలుసా వృద్ధుడికి...మారు మాట్లాడలేదు, "గీపాంటె కూడు తినకపోతె సత్తానా ?" అనుకున్నాడు.

"అయ్యగారికి వేడివేడి అన్నం వండి నైవేద్యం పెట్టాలేమో ?! పని మాత్రం చాతకాదు గానీ రెండు పూట్లా తిండికైతె తయార్..." విసుక్కుంట అని వెళ్ళిపోయిందక్కడి నుండి.

"కొడుకుకి కొలువయ్యిందని తెల్వంగనె ఎనకటి సుట్టిరికం సెప్పి...అయ్యలేని పోరి అని దీనవ్వ కాల్లుపట్టుకుంటె...ఏం మంచిగలేదని కొడుకలిగినా, గట్లనకుర బిడ్డ అని దీన్ని సేసుకుంటే...గిట్లయిపాయె బతుకు..." అని ఈసారా ముసలి మనసు బాధతో మూల్గలేదు.

కానీ ఆకాశంలోంచి నక్షత్రాలు రాలిపడ్డట్టు...అసంకల్పితంగా ఆ వృద్ధ నేత్రాల్లో మెరుస్తోన్న అశ్రుకణాలు... నిర్వేదంగా నిశ్శబ్దమై పోయాడు.

"ఏం జేత్తున్నవురో రాజిగా !" చేతికర్రాడించుకుంటూ వస్తోన్న వెంకటయ్య గుమ్మంలోంచే అరుస్తున్నాడు. చప్పున కంటి నీరొత్తుకున్నాడు రాజయ్య.

"దా...దా...గీన్నే గూసున్న..." దగ్గరికొచ్చాడు.

"బువ్వ తిన్నవా ?" పక్కనే మంచంమీద కూచుంటూ అడిగాడు వెంకటయ్య

"తిన్నగనీ...గియ్యాల పొద్దుగాల్నె అచ్చినవేందిరా ?"

"ఏం జేసుడు ? పొద్దు పొడిత్తె బాదనే...పొద్దుగూకుతె బాదనే...ముసలి ముండా కొడుకులం...పని సేద్దామంటె రెక్కల్లేవ్వకపాయె. కూసుందామంటే ఉత్తగనే కూసోలేం. నీకాడ కూసొని నేను, నాకాడ కూసొని నువ్వు బాతకానీ కొట్టుకోంది పొద్దెట్ల గడుత్తదిర? " నాన్‌స్టాప్‌గ మాట్లాడేస్తున్నాడు వెంకటయ్య.

అవసరమైతేనే తప్ప పొడిపొడిగా మాట్లాడే రాజయ్యకి పూర్తిగా విరుద్ధం వెంకటయ్య. ఆన్‌చేసి వదిలిన రేడియోలా గలగలా మాట్లాడ్తాడు.

"నువద్దిగనేరా, నీయవ్వ సత్తె మంచిగున్నపుడె జల్ది సావాలెగని...గిట్ల కట్టపడుతూ మనోల్లని కట్టపెడ్తు సావద్దురా..."

"అవునుగాని, గీ అన్నం పళ్ళెం గీడుందేందిర బువ్వ తిన్లేదా ఏంది ?" వెంకటయ్య దృష్టి మంచం కింద పడింది.

"తిన్న...తిన్న..." రాజయ్య కంగారుని పసిగట్టలేకపోతే వెంకటయ్య దోస్తెలా అవుతడు...పైగా ఆ ఇంటి బాగోతమంతా తెలుసు వెంకటయ్యకి.

ముగ్గురు కొడుకులు కలిసి తన శేషజీవితాన్ని తలా నాల్గునెలలుగా భాగించుకొంటే...శేషభాగాన్ని బాధగా భరిస్తున్నాడు వెంకటయ్య. ఒక్క నలుసుతోనే నరకయాతననుభవిస్తున్నాడు రాజయ్య. వాళ్ళ వార్ధక్యాల్లో తేడాల్లేవు.

రాజయ్య సమాధానం రుచించలేదు. వెంకటయ్య చూపుల్లో అనుమానం...

గమ్మున వంగి పళ్ళాన్ని చేతిలోకి తీసుకున్నాడు...క్షణంలో అర్థమైందతనికి

"గిదేందిరో ! రాన్రాను నీ బతుకు కుక్కయవ్వారమైతంది. గీ పాసిపోయిన బువ్వెడ్తొందిర నీ కోడలు ఏమ్మనిసిర..."

మరోమాట పెగల్నీయకుండా చేతులు జోడించాడు రాజయ్య. కోడలు వింటేగనక పెద్ద రాద్ధాంతం చేస్తుందని భయం. సోపతోని నిస్సహాయతకి నుదురుమీద కొట్టుకుంటా ముచ్చట మార్చేసాడు వెంకటయ్య. ఈడ్డికేదైనా తొవ్వ జూపెట్టాల అనుకున్నాడు వెంకటయ్య.

లోపల్నుండి వాళ్ళసంభాషణ వింటున్న లక్ష్మి మనసు కుతకుతా ఉడిగిపోయింది. ముసలాళ్ళ మీద పీకల్దాకా కోపం ముంచుకొచ్చింది. ఆ ముసలాడొచ్చి ఈ ముసలాడ్ని చెడగొడ్తుండు గద ! అనుకొని ఆ ముసలాన్నేమన్నా అంటే ఈ విషయం నలుగుర్లో పడ్తుందని తమాయించుకుంది.

* * *

"అడ్డమైనోళ్ళకి చాకిరీ చేస్తూ..వండి పెట్టడం నా వల్ల కాదు. ఈ ఇంట్లో ఉంటే ఆ ముసలాడుండాలి లేదంటే నేనుండాలి..." తాను వినడం లేదేమోనని భర్తొచ్చాక లేనిపోనివి చెప్పి సాధిస్తున్న కోడలు మాటలు చెవుల్లో గింగురుమంటుంటె మూగవోయిన మనసుని ఓదార్చుకుంటూ నడుస్తున్నాడు రాజయ్య

అంగడిబజారు దాటి రోడ్డు మీద కెక్కాడు ఆయాసం...వయోభారం...అతడిని వడివడిగా నడవనీయలేక పోతున్నాయి. తనయుల స్వార్థచింతనల్లా పెరిగిపోతున్న భవన సముదాయాల్ని దాటుకుంటూ నెమ్మదిగా నడుస్తున్నాడు... మళ్ళీ ఆలోచనలు..

"ఇక నావల్ల కాదు బాపూ ! బండెడు చాకిరీ చేస్తోంది. దాని మీదే వాడకట్టోల్లందరికి చెప్తున్నవంట. నిన్ను సాదుడే కష్టమంటే..." కొడుకు గొంతు తన గుండెని కోస్తున్నా...దుఃఖం బలవంతాన ఆపుకున్నాడు.

"తప్పయిందిరా మల్లగిట్ల జర్గదు..." తండ్రి కంఠంలో వేడుకోలు.

"నాకేం తెలియదు. ఇక్కడి నుండెళ్ళిపో... నీకెక్కడ మంచిగ తోస్తే అక్కడే బతుకు..నీకు తిండి పెట్టడం నాతోని కాదు..." కొడుకు నిర్ద్వందంగా చెబుతోంటే - వృద్ధుడి గుండెలో విస్ఫోటనం... స్రవిస్తోన్న కన్నీటిలో తుఫాను బీభత్సం...

"గీ గుండెల మీదనె గద ఆడిత్తూ పెంచింది...గదే గుండెల మీదనె తంతున్నడు...ఎవరికీ చెప్పుకోలేని వేదన. సద్దామంటే ధైర్యం చాలడంలేదు. అలా అని బతుకుడెట్ల ?"

* * *

రాజయ్య తన ఆలోచనల్నుండి తేరుకొని గేటుతీసి లోపలికెళ్ళాడు. ఆయనెందుకు పిలిచిండో గద! అనుకొన్నాడు. వెంకటయ్య తన అల్లుని వరుసైన దేవయ్య వకీలుకు రాజయ్యవిషయం చెబితె పిలిపించాడు వకీలు. ఆ విషయమై రాజయ్యతో కాసేపు చర్చించాడు.

పదిహేను నిముషాల తర్వాత శేఖర్ వచ్చాడు.

"ఆ...ఇప్పుడు చెప్పు." అని ముసలాయన్ని కదిపాడు వకీలు దేవయ్య.

"నా కీడొక్కడే పోరడు దేవన్న ! దినానికి రొండుపూట్ల గింత కూడెట్టమంటే నాతోని గాదంటున్నాడు!" వర్షిస్తోన్న కళ్ళని పంచెతో తుడుచుకుంటూ వణుకుతున్న కంఠంతో ఆవేదనగా చెప్పాడా వృద్ధుడు.

పక్కనే ఉన్న శేఖర్‌కేసి చూస్తూ "మీ అయ్య చెప్పింది నిజమేనా ?"అనడిగాడు వకీలు కళ్ళద్దాల్ని సవరిస్తూ. అవునూ, కాదన్న ధోరణిలో సందిగ్ధంగా తలూపాడు శేఖర్.

"మరి మీ నాన్న బ్రతకడమెట్లా? " తిరిగి ప్రశ్నించాడు వకీలు దేవయ్య!.

మౌనంగా తలదించుకున్నాడే తప్ప సమాధానం లేదతని నుండి.

ఈసారి వృద్ధుడి కేసి చూస్తూ "ఇండ్లూ భూములేమైనా వున్నాయా ? "అంటూ అడిగాడు వకీలు దేవయ్య.

"గప్పట్లుండె గా ఎకురమున్నర పొలం, ముప్పై గజాల పెంకుటిల్లు ఆడి సదూకోసమే

అమ్మేసిన! ఆడు పైకి రావాల్నని, మా లెక్క కట్టం దెల్వకుండ ఉజ్జోగం సేయాలని సచ్చిన ఆడి తల్లికుండె. గట్లనే సేసిన!"

"రకుతం వున్నన్ని దినాలు కాయకట్టం జేసిన, ఆడికి కట్టం దెల్వకుండ జేసిన గియ్యాల్నో, రేపో అన్నట్టుంది పాణం. గటువంటప్పుడు గీడుతప్పనన్నెవడు జూడాలె! జర సాయం మీరే జెప్పుండ్రు. గందుకే మీ కాడికి పోదామని ఈడ్ని దొల్కొచ్చిన" వయోభారం తెచ్చిన మార్పువల్లనేమో మధ్యలో ఆయాసపడ్తూ ఒక్కోపదం నెమ్మది నెమ్మదిగా చెప్పాడు.

"మీ తండ్రి చెప్పిన దానికి నీ సమాధానం ?" శేఖర్‌ని అడిగాడు వకీలు.

"నాది చిన్న గుమస్తా ఉద్యోగం. దాంతో నా పిల్లల్ని, భార్యని పోషించాలి. చిన్న పిల్లలే అయినా వాళ్ళ కాన్వెంట్ చదువులకి, ఇంటద్దెకే భారమౌతోంది. వీటికి తోడు మా తండ్రిని పోషించడమంటే నావల్ల కాదండీ !" ముఖం మీద గుద్దినట్టు విషయం చెప్పేశాడతను.

"ఏ ఆధారమూ లేని మీ నాన్నెలా బ్రతకడం ?"శేఖర్ చెప్పిన దానికి ఆశ్చర్యచకితుడౌతూ అడిగాడు వకీలు దేవయ్య.

"జగిత్యాల గొడ్డుపోయిందా. సత్రంలో ఉంటడు" తేల్చి చెప్పేసాడు శేఖర్.

ఆ మాటకి విభ్రాంతికి గురైన వకీలు, "మీరిద్దరూ రెండ్రోజుల్లో కలవండి నా సలహా ఆలోచించి చెబుతాను అందాకా తండ్రిని మీ ఇంట్లోనే ఉంచుకో" అని చెప్పి వాళ్ళిద్దర్నీ పంపించేసాడు.

* * *

"మీ విషయం బాగా ఆలోచించాను. మీ అబ్బాయి చెప్పినట్లు నువ్వు వృద్ధాశ్రమంలో ఉండడమే సబబు. నిన్ను పోషించాల్సిన అవసరం నీ కొడుక్కి లేదు. ఈ తీర్పు నచ్చకుంటే నీ బ్రతుకేదో నువ్వే చూసుకోవాలి..." అని వకీలు చెబుతోంటే

"అయ్యా" అంటూ బావురుమన్నాడా వృద్ధుడు. అతని గాజుకళ్ళల్లో నీటిపొర ఉవ్వెత్తున లేచింది.

"ఇది నీకు సమ్మతమే కదా ?" శేఖర్‌ని అడిగాడు వకీలు దేవయ్య. సంతోషంగా తలూపాడతను.

"కానీ ఒక్క షరతు..."

"చెప్పండి"

"ఇదిగో ఈ బాండ్ పేపర్ మీద నీవొక సంతకం పెట్టాలి." కోర్టు పేపర్‌ని అతని ముందుకి తోస్తూ అడిగాడు లాయర్.

"ఎందుకు" ? అడిగాడు శేఖర్

"భవిష్యత్‌లో అంటే నీ అవసానదశలో నీ పిల్లలు నిన్ను పోషించనవసరం లేదని, పట్టించుకోనవసరం లేదని, నీకు నీవుగా బతకాలని నీవు స్వయంగా నీ పిల్లలకి రాసి ఇస్తున్న పత్రమిది" అంటూ ఆగి శేఖర్‌కేసి చూసాడు వకీలు దేవయ్య.

అతని ముఖంలో నెత్తుటి చుక్కలేదు.

"...అర్థమైందనుకుంటా, న్యాయం అందరికీ ఒక్కటే కదా ! నేడు నీవు నీ తండ్రిని వదిలించుకున్నట్లు, రేపు నీ పిల్లలు నీ బాగోగుల్ని చూడకూడదనే ఒప్పందమది. అందుకని సంతకం చేయి."

"నేను చేయను"

"అలాగయితే మరి మీ తండ్రిని నీ వెంట తీస్కెళ్ళు."

"...." మౌనం వహించాడు.

"చూడూ ! తమ ఆనందాల్ని, కోరికల్ని చంపుకొని ఆప్యాయతల్ని, అనురాగాల్ని రంగరించి పెంచి పెద్దచేసే తల్లిదండ్రులకి వాళ్ళ అవసానదశలో కొడుకులు అందివ్వాల్సింది రవ్వంత ఆదరణ, అది లేకుండా చేస్తానంటున్నావు నువ్వు. దీన్ని ఏ ధర్మమూ, ఏ న్యాయమూ, ఏ చట్టమూ చివరికి ఏ సాంప్రదాయమూ హర్షించదు. నిన్ను కని, పెంచి నీ సర్వతోముఖాభివృద్ధికి తన సర్వస్వం అర్పించిన నీ తండ్రిని వృద్ధుడన్న జాలి, దయ లేకుండా సత్రంలోనో, వృద్ధాశ్రమంలోనో పడేస్తానంటావా ?" అంటూ ఆగాడు.

తలవంచుకున్నాడతను.

"నీకో వాస్తవం చెబుతాను. వెంకటయ్య మామ నీ మీద మీ నాన్న తరుపున మెన్‌టెనెన్సు కేసు వేయిరా అని చెప్పాడు. సంగతి తెలుసుకొందామని మొన్నొక పెళ్ళిలో మీ వీధిలోకి వచ్చాను. మీ కుటుంబం గురించి వాకబు చేసాను. అందరి నోళ్ళలోనూ మీ నాన్న మంచితనమే పరిమళించింది. నీమీద మెయిన్‌టెనెన్స్ కేసు పెడితే నువ్వే దారికి వస్తావని చాలా మంది చెప్పారు. కేసు పెట్టడమే జరిగితే నీ జీతంలో నుండి వన్‌బై ఫోర్త్ నెలనెలా మీ తండ్రికి చెల్లించాల్సి వుంటుంది. దాంతో ఒక్కడే హాయిగా బతకొచ్చు. కానీ కన్న పేగుకదా, కొడుకుని కోర్టుకీడ్చానన్న అపకీర్తి తనకిగానీ, తండ్రిని బాగా చూసుకోవడం లేదన్న అపవాదు నీకుగానీ రాకుండా సమస్యని పరిష్కరించి,నిన్నెలాగైనా ఒప్పించమన్నాడు మీ నాయిన . మీ నాన్న హృదయం ఎంత గొప్పదో ఆలోచించు నీ మనసు మార్చుకుంటే సర్వత్రా శుభం. లేదంటే మిమ్మల్ని శాసించను.. నిర్ణయం మీ చేతుల్లో వుంది, గడువు తీసుకొనయినా అదేమిటో నాకు చెప్పండి".

అప్పటికే శేఖర్ ముఖంలో రంగులు మారసాగాయి.తండ్రి కోర్టు కెడితే పరువుపోతుందన్న భయమో...కొడుగ్గా బాధ్యత గుర్తుకొచ్చిందో...కొన్ని సెకన్ల అనంతరం పశ్చాత్తాప వదనంతో

"గడువవసరం లేదు. తల్లిదండ్రుల పట్ల కొడుగ్గా నా కర్తవ్యమేమిటో తెలిసేలా చేసారు. నా బాధ్యత గుర్తించాను. నా ఆలోచనా సరళికి నా సంకుచిత ప్రవర్తనకి నన్ను క్షమించండి" అన్నాడు.

"నిన్ను క్షమించాల్సింది నేను కాదు మీ నాన్న" అన్నాడు వకీలు దేవయ్య.

మరో మాట మాట్లాడలేదు శేఖర్. అప్పుడు వచ్చాడు వెంకటయ్య అక్కడికి.

సిగ్గుపడుతూ తండ్రి పాదాలపై పడ్డాడు శేఖర్. కొడుగ్గా ఋణం తీర్చుకుందామన్న కృతనిశ్చయంతో.

ఆ ముసలి గుండె సంతృప్తితో నిండిపోయి...కళ్ళవెంట ఆనందభాష్పాలు రాలడంతో...ప్రేమగా కొడుకుని పైకి లేవనెత్తాడు అనురాగం అల్లుకొన్న చేతులతో.

(మా జీవితాలు వెలగడం కోసం తాను నిస్వార్థంగా కరిగిపోయారు మాతండ్రి శ్రీ ఎనుగంటి రాజమల్లయ్య తనలోని రచయితని నాలో చూసుకొంటూ మురిసిపోయే ఆ అనురాగమూర్తి పాదపద్మాలకే ఈ కథ అంకితం...రచయిత).

(స్వాతి సపరివార పత్రిక 24-1-1997)

* * *

19

ఆవలి తీరం

- వనమాల చంద్రశేఖర్

"సంఘర్షణ లేని జీవితం ఉండదేమో? కానీ - సంఘర్షణే జీవితమై బతకాల్సి వచ్చినప్పుడు ఆ మనోవేదన వర్ణనా తీతం"

ఎంత మరిచిపోదామనుకున్నా మరిచిపోలేని వాక్యాలు... రెండేళ్ళ క్రితం సునీత ఇండియా వచ్చినప్పుడు అన్నమాటలివి. మనసులో ఎంత సంఘర్షణ ఉన్నా పైకి మాత్రం మల్లెలు విరిసినట్లు నవ్వుతుంది సునీత. ఆనవ్వుతోనే ప్రతి ఒక్కరిని ఆకట్టు కుంటుంది. చిన్నప్పట్నుంచి ఆమెదొక విచిత్రమైన మనస్తత్వం.

ఏజ్ఞాపకాల్ని నానుంచి దూరం చేద్దామనుకుంటున్నానో...

అవే నన్నింకా దగ్గరికి చేర్చుకుంటున్నాయి...

సునీత అయిదో తరగతి నుండి పదవ తరగతి వరకు మావూల్లోని స్కూల్లో కలిసిచదువుకునే రోజుల్లో ఎంతో చలాకీగా నవ్వుతూ-నవ్విస్తూ-ఆడుతూ పాడుతూ తిరిగేది. ఫ్రెండ్సందర్నీ ఆటపట్టించేది. ఆ రోజుల్లో ఆమెలో మన సంస్కృతి సంప్రదాయాల పట్ల గౌరవం ఉండేది. వాళ్ళ నానమ్మే అందుకు కారణం అనుకుంటాను. నానమ్మ తన ప్రేమతో సునీతను తాను ప్రేమించే సంస్కృతిని ప్రేమించేట్టు చేయగలిగింది.

అప్పటికే సునీత వాళ్ళ నాన్న అమెరికాలో డాక్టరుగా పనిచేస్తున్నాడు. నానమ్మ కోసం సునీత యిక్కడే వుండిపోయింది. గ్రీన్ కార్డు, ఆతర్వాత సిటిజన్ షిప్, నానమ్మ సైకలాజికల్‌గా రెడీ కాగానే మొత్తం కుటుంబాన్ని అమెరికా తీసుకెళ్ళాడు. అప్పటికే సునీత జగిత్యాల జూనియర్ కాలేజిలో అడ్మిషన్ తీసుకుంది. అయినా క్యాన్సిల్ చేయించి. సునీతను తనతో పాటు అమెరికాకు తీసుకెళ్ళారు.

పోతూ పోతూ సునీత "స్నేహాకాశంలో తారలెన్నో రాలినా.... నీవు చివరిదాక వెలిగితే చాలు...' ' అంటూ రాసి చేతికిచ్చిన ఉత్తరం ఇప్పటికీ హృదయంలో భద్రంగా వుంది.

అమెరికా వెళ్ళిపోయిన తర్వాత అడపాదడపా ఉత్తరాలు వ్రాసేది సునీత. ఇంజనీరింగులో చేరాక నెల రోజులు ఇండియాలో వుండడానికి వచ్చింది. అప్పుడు కలిసిన తర్వాత మనం రెగ్యులర్‌గా ఉత్తరాలు వ్రాసుకోవాలని బాసలు చేసుకున్నాం. నా ఉత్తరాలకి కొంత కాలం జవాబులిచ్చి అతర్వాత సడెన్‌గా అపేసింది. నేను రాస్తే కూడా జవాబులు వచ్చేవి కాదు. నేను కూడా ఆతర్వాత ఉత్తరాలు వ్రాయడం మానివేసాను. సునీతతో పూర్తిగా టచ్ లేకుండా పోయింది. 10 ఏళ్ళ తర్వాత రెండేళ్ళ క్రితం హఠాత్తుగా ఇండియాకు ఊడిపడింది. హైదారాబాద్‌లో నా అడ్రస్ సంపాదించి డైరెక్టుగా నేనుంటున్న అపార్టుమెంటుకు వచ్చేసింది. ఆశ్చర్యం... ఆనందం... సంప్రదాయిక భారత స్త్రీ రూపంతో ఉన్న సునీతను

పోల్చుకోలేకపోయాను. ఊహించలేనంత మారిపోయింది. ఎన్నోవిషయాలు గుర్తు చేసింది.

ఏదో ప్రాజెక్టు వర్కు మీద భారతదేశానికి వచ్చానని రెండు నెలల వరకు ఇక్కడే ఉంటానని అంది.

ఇండియా నుండి అమెరికా వెళ్ళిన తర్వాత ఇంజనీరింగ్ మరియు బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులు పూర్తి చేసానంది. ప్రస్తుతం న్యూయార్కులోనే వందమిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులున్న ఒక పెద్ద కార్పోరేట్ కంపెనీకి టెక్నికల్ అడ్వయిజర్గా పనిచేస్తున్నానని చెప్పింది.

"ఇంత చిన్న వయసులోనే అమెరికాలోని ఒక పెద్ద కంపెనీకి టెక్నికల్ అడ్వయిజర్ కావడమనేది. అందులోను ఇక్కడి ఒక పల్లెటూరి అమ్మాయివైన నీవు సాధించడమంటే గొప్ప విషయం' ' అంటూ అభినందించాను.

" మనిషి కావాలనుకుంటే దేన్నైనా సాధించగలడు" అంది సునిత. ఆమె ఆత్మవిశ్వాసానికి ఆశ్చర్యపోయాను.

"అన్నీ అందరికి సాధ్యం కావేమో!" అన్నాను.

" అనుకుంటే సాధ్యమే...! ఎదుటివాళ్ళను సంస్కరించడం ఒక్కటే సాధ్యపడదు. మిగతావన్నీ సాధ్యమే." అంది నవ్వుతూ.

"అన్నీ సాధ్యమైనప్పుడు ఇది మాత్రం ఎందుకు కాదు?"

"ఎందుకంటే... మనిషి తన చుట్టూ ఒక వలయాన్ని ఏర్పరచుకొని అందులో జీవిస్తుంటాడు. ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి ఎదుటి వాళ్ళను మభ్య పెట్టడానికే మారినట్లుగా కనిపిస్తాడు గాని నిజంగా మారడమనేది ఉండదు." అంది సునీత

"జీవితంలో చాలా దెబ్బలు తిన్నవాళ్ళలాగా కాంట్రడిక్టరీ స్టేట్మెంట్స్ ఇస్తున్నావేమిటి సునీతా!"

"చాలా దెబ్బలు తిన్నట్లుగా కాదు... దెబ్బల్నే జీవితంగా గడుపుతున్నాను. నేనే కాదు ఈ దేశపు స్త్రీలు చాలా మంది అంతే..." మాటల్లోని ఆవేశాన్ని ముఖంలో కనబడకుండా సునీత జాగ్రత్త పడటాన్ని గమనించాను.

"చదువు, విచక్షణ,హోదా, సంస్కారం ఇవన్నీ ఉన్న నీలాంటి వాళ్ళే జీవితాన్ని సంఘర్షణ మయం చేసుకుంటే మామూలు వాళ్ళ పరిస్థితి ఏమిటి...? అయినా ఇప్పుడు నీవు ఇండియన్వి కాదు గదా! ప్రపంచంలోనే అత్యంత మాడరనైజ్డ్ దేశంలో బ్రతుకుతున్న దానివి. నీ స్టేట్మెంట్స్ సగటు భారత స్త్రీ ఆరోపణల్లా ఉన్నాయి." అంటూ నవ్వాను.

సునీత విషాదంగా నవ్వింది. అది స్త్రీలకే సాధ్యమయ్యే నవ్వు.

"నీకో విషయం తెలుసా సురేష్...? ఇండియన్ స్త్రీ ఇండియాలో జీవిస్తున్నదా అమెరికాలో జీవిస్తున్నదా అనేది కాదు ముఖ్యం. ఇండియన్ స్త్రీ ఏ దేశంలో ఉన్నా ఇండియా లక్షణాలే ఉంటాయి. అంత తొందరగా మారిపోతారా?"

"సునీతా! నువు చేప్పేవాటితో ఏకీభవిస్తున్నాను. కాకపోతే సమస్యల పట్ల అవగాహన ఉన్న నీలాంటి వాళ్ళు సంఘర్షణకు లోనవుతున్నారే తప్ప పల్లెల్లో జీవించే స్త్రీలు తమ జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు. హక్కులు, అధికారాలు... సమానత్వమంటూ జీవితమంతా ఘర్షణతో గడిపే కన్నా హాయిగా రాజీపడటం మంచిది కాదా?"

"సురేష్! రాజీ అంటే నీవిచ్చే అర్ధంఏమిటో నాకు అర్ధం కావడంలేదు. వ్యక్తిగా బతుకుతూ

రాజీ పడితే ఓ అర్ధం ఉంటుంది. ఆశలన్ని చంపుకొని వ్యక్తిగా చనిపోయేదాక రాజీ పడాలనా నీ ఉద్దేశం?

ఆ మాటతో నేను సునీతకు ఏమి చేప్పాలో తోచలేదు. టాపిక్ మార్చాను.

ఆతర్వాత టూర్ మీద కొంత కాలం కలిసి తిరిగాము. నర్మదా వ్యాలీలో మేధాపాట్కర్తో పది రోజులుండి వస్తానని సెలవు తీసుకున్న సునీత మళ్ళీ కలవ లేదు. నెల తర్వాత సునీత నుండి ఉత్తరం... ఆశ్చర్యపోయాను.

* * *

డియర్ సురేష్...!

ఈ ఉత్తరం నీకందేసరికి నేను ఇండియాకి దూరంగా ఆకాశంలో ఎగురుతూ వుంటాను. నేను చెప్పకుండా వెళ్ళిపోతున్నందుకు ఫీలవుతుంటావు కదూ...! కానీ, చెప్పివెళ్ళడానికి నాకు ధైర్యం చాలలేదు. పదిహేనేళ్ళ అమెరికా జీవితంలో నేను కోల్పోయిన వెన్నో ఈ రెండు నెలల్లో కొన్నింటినైనా సాధించుకోగలిగాను. అది నీ మంచితనం వల్లనే. నువు బాధపడ్తుంటే చూస్తూ వెళ్ళిపోయే ధైర్యం నాకు లేదు.

"చాలా సార్లు అడిగావు. ఎందుకు నీలో సంఘర్షణ అని...? జీవితంతో ఎందుకు రాజీ పడటం లేదని అన్నావు." నీ ముందు అలా ప్రవర్తించాను. అంతే... నేను జీవితంతో రాజీపడక పోయి ఉంటే నీకు కనిపించడానికి బతికి ఉండేదాన్ని కాదు. అమెరికాకు వెళ్ళిన తర్వాత ప్రతి విషయంలో అందరితోను రాజీ పడటం నేర్చుకొన్నాను. జీవితంలో నేనెవరితోనైనా రాజీపడనిది ఉందంటే అది నీ ఒక్కడితోనే. ఎందుకంటే నీది కూడా నాలాగే రాజీపడే మనస్తత్వం కావడం వల్ల.

"సురేష్... నీకు తెలుసా? నా చిన్నప్పటి నుండి కూడా ఈ దేశ సంస్కృతి అన్నా సాంప్రదాయ మన్నా నాకు చాలా ఇష్టమని. కానీ ఆ ఇష్టాన్ని నానుండి బలవంతంగా లాగేసుకుంది అమెరికా పట్ల మోజున్న నా కుటుంబం. ఇండియాలోనే అమ్మమ్మ వాళ్ళింట్లో ఉండి చదువుకుంటానంటే 'బ్లడీ ఇండియా! అక్కడేం చదువు కుంటావు?" అమెరికాలో చదువుకోవడమన్నా... అమెరికాలో సెటిల్ అవడమన్నా ఒక వరంగా భావిస్తారెందరో. నీవేంటి ఇండియాలో చదువుతానంటావు?' కుదరదు అమెరికాలోనే నీచదువు అని నన్ను బలవంతంగా లాక్కెళ్ళారు నాన్న గారు. అప్పుడు మొదటిసారిగా రాజీపడ్డాను.

నీకు ఉత్తరాలు రాయడం ఎందుకు మానేసానో తెలుసా? ఒక రోజు నీ ఉత్తరాన్ని పట్టుకుని నాన్న అమ్మతో అంటున్నాడు." దీన్ని ఉత్తరాలు రాయడం మానేయమని చెప్పు. ముందే ఇండియన్స్, చీప్మెంటాలిటీ ఉంటుంది. ఉత్తరాలు రాసి రాసి ఏదో ఒకరోజు నాది డిగ్రీ పూర్తయిందనో., ఇంజనీరింగ్ పూర్తయిందనో చెప్పి అమెరికాకు వద్దామని అనుకుంటున్నాను. మీ నాన్నతో చెప్పి నాకు 'స్పాన్సర్షిప్' చేయించమని అంటారు. ఆతర్వాత మననెత్తినెక్కి కూచుంటారు. అందుకే సన్నీ (సునీత)కి చెప్పి ఉత్తరాలు రాయడం మానిపించు. లేదంటే వాడి అడ్రస్కు నేనే లెటర్ వ్రాస్తాను. తిక్కకుదిరేలాగ" అన్నాడు. అప్పుడు రెండవసారి రాజీపడ్డాను. "ఎందుకో తెల్సా సురేష్! నిన్ను బాధపెట్టడం ఇష్టం లేక".

ఆ తర్వాత కొద్దిరోజులకు మన జిల్లాకు చెందిన వినయ్ కుమార్ పరిచయంమయ్యాడు. వాళ్ళ అమ్మా నాన్న లిద్దరు కూడా డాక్టర్లే. వాళ్ళ నాన్న మానాన్నకు కొలీగ్. అప్పుడప్పుడు ఇంటికి వచ్చి వెళ్ళే వారు. నా డ్రెస్సింగ్ చూసి ఇంట్లో అందరి ముందే వికారంగా మాట్లాడేవాడు. పక్కనే ఉన్న అమ్మ కూడా వాడికే సపోర్టుగా మాట్లాడేది. పైగా ముసలి దానిలా ఈ పంజాబీ డ్రెస్, పట్టులంగా పరికిణీలేంటి చక్కగా జీన్స్... టీషర్ట్లు...స్కర్ట్స్... బ్లేజర్స్ వేసుకుంటే బాగుంటావనేది. ఫంక్షన్కి వెళ్తే నాచేత బలవంతంగా జీన్స్, స్కర్టు, మిడ్డీస్ వేయించేవాళ్ళు. వేసుకోనని మొరాయిస్తే అమ్మ అనేది "ఏదేశంలో ఉంటే ఆదేశపు

అలవాట్లు నేర్చుకోవాలి" అని... రాజీ పడాలో వద్దో తెలియని స్థితిలో మూడోసారి రాజీపడ్డాను.

నేను ఇక్కడ ఇంజనీరింగ్ చదువుకునే రోజుల్లో నా క్లాస్‌మేట్ ఒకతను శ్రీనివాస్ అని మన ప్రాంతం వాడు ఉండేవాడు. చాలా సిన్సియర్, చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోతే వాళ్ళ ఊరి సర్పంచు కొడుకు అమెరికాలో ఉంటే వాళ్ళింట్లో పనిచేయడానికి అమెరికాకు పంపించారు. యజమాని మంచివాడు కావడం వల్ల అందులోను అతనికి పిల్లలు లేక పోవడం వల్ల అతన్ని చదివిస్తున్నారని ఛెప్పుకున్నాడు. మన దేశమన్నా... మనదేశ సాంప్రదాయమన్నా చాలా గౌరవం. చాలా నచ్చేవాడు. ఒకటి రెండ్లు సార్లు ఇంటికి తీసుకువెళ్ళాను, ఒక రోజు అతని గురించి అమ్మ అగిడితే వివరంగా చెప్పాను. అందుకు ఆమె నాతో చాలా సీరియస్‌గా "వాడి కులమెంటో...? ఎవడికిపుట్టాడో! సాంప్రదాయమేంటో వాడితో నీకు ఫ్రెండ్‌షిప్ ఏంటి?" మానేయమని అంది.

ఆమె బాధంతా అతను నా ఫ్రెండ్ అయినందుకు కాదు. నేను అతనితో తిరిగి చివరకి ఎక్కడ పెళ్ళి ప్రపోజల్ పెడతానోనని...

నేను తెగేసి చెప్పాను అతనితో తిరగడం మానేయనని. అంతే...!

మా మధ్య గొడవ మొదలైంది. మాటామాటా పెరిగింది. నేను కాస్త ఎక్కువే అన్నాను.

"అక్కయ్య ఎవడో కెనెడియన్‌తో 'డేటింగ్...రేసింగ్... అని తిరిగి కడుపు తెచ్చుకుంటే ఆదరాబాదరాగా అబార్షన్ చేయించినప్పుడు ఎక్కడ పోయిందమ్మా నీ కులం? ఇండియా వాడనగానే నీకు కులం గుర్తొస్తుందా? ఆ తర్వాత ఆరు నెలలు తిరగకుండానే అది ఓ బంగ్లాదేశ్‌వాడితో లేచిపోయి మూన్నెళ్ళకు తిరిగివచ్చినప్పుడు ఎక్కడ పోయిందమ్మా నీ సాంప్రదాయం? అమెరికా పౌరసత్వం గల గుణవతి శీలవతియైన అందమైన గ్రాడ్యుయేట్ అమ్మాయికి సంప్రదాయిక కుటుంబానికి చెందిన అందమైన యోగ్యుడైన వరుడు కావలెను. వరునికి అమెరికాలో మంచి ఉద్యోగం ఇప్పించబడును. అని భారతదేశంలోని ఈనాడు పత్రికలో అచ్చువేయించి అమెరికా మీద మోజున్న ఒక భారతీయ నిరుద్యోగిని బలిపశువును చేసినప్పుడు ఎక్కడ పోయిందమ్మా నీ సంస్కారం? పోనీ ఇప్పటికైనా అక్కలో మార్పువచ్చిందా? చేసుకున్న కర్మానికి నా అనేవాళ్ళు ఎవరులేక బావ ఎంత బాధ పడుతున్నాడో గమనించావా? ఒక్కసారైనా చెడుతిరుగుళ్ళు తిరగవద్దని అక్కను బెదిరించావా? నీకు సంప్రదాయాన్ని, సంస్కారాన్ని గురించి మాట్లాడే అర్హత వుందా? నా ఫ్రెండ్ సురేష్ కులమేమిటో తెలుసుకొని మీరు నన్ను ఉత్తరాలు వ్రాయకుండా చేసారు. అక్క గురించి మాట్లాడని మీరు నా గురించి, ఇండియన్స్ గురించి కులం తక్కువ వాళ్ళని అవాకులు చవాకులు మాట్లాడుతున్నారు. ఎందువల్ల వాళ్ళు మీకు చులకనైపొయ్యారు?"

ఆ రోజు ఇంట్లో చాలా గొడవ అయింది. నాన్నతో ఒకటికి నాలుగు ఛెప్పింది అమ్మ. దానికి తెలివి ఎక్కువ వుంది. ఆ గర్వంతోనే ఎవరితోనైనా ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతుంది. అని చెప్పింది అమ్మ. నాన్న కూడా వత్తాసు పలికాడు. రెండు రోజులు ఇంట్లో ఎవరితోను మాట్లాడలేదు.

మూడవ రోజు నాన్న ఒక డాక్టరు సంబంధాన్ని ఖాయం చేసినట్లు చెప్పాడు. నాకు ఇప్పుడే పెళ్ళి వద్దన్నాను, వినిపించుకోలేదు.

"ఆకులం గాని వాడితో ఏంటీ? వాన్ని పెళ్ళి చేస్కుంటే ఏం సుఖ పడతావు?" నాన్న మాటలకు నా ఒళ్ళంతా మొద్దుబారింది. కాళ్ళ కింద భూమి లేనట్లుగా అనిపించింది.

"నేను అతన్ని పెళ్ళి చేసుకుంటానని ఎప్పుడన్నాను? అతడు నా క్లాస్‌మేట్. నాకు మంచి ఫ్రెండు. ఆ మాత్రం దానికే మీరు అమ్మ కలిసి ఇంత రాద్ధాంతంచేస్తారనుకోలేదు" ధైర్యం చేసి అన్నాను.

నాన్నను ఎదిరించాను.

" వాడితో తిరుగుతున్నావంటే... ఏదో ఒక రోజు బీచ్‌లకు రమ్మంటాడు... రైడింగ్... ఆతర్వాత డేటింగ్... ఆతర్వాత ప్రెగ్నెన్సీ..."

మధ్యలోనే ఆపేస్తూ "స్టాప్!" అని గట్టిగా అరిచాను.

"మీరనుకునే డర్టీకల్చర్‌కు నేనింకా ఎదగలేదు. నేనతన్ని ఎప్పుడు అదృష్టితో చూడలేదు. మీరు అనవసరంగా ఏవేవో ఊహించుకుని మాట్లాడుతున్నారు... కూతురు అనే విచక్షణ కూడా లేకుండా ఇంత నీచంగా మాట్లాడతారనుకోలేదు." ఏడుస్తూనే అన్నాను.

"సరే ఇంకా మంచిది కదా! నీకెలాగూ అతన్ని చేసుకోవాలని లేదు. అందుకే నేను సెటిల్ చేసిన డాక్టర్ సంబంధాన్ని ఒప్పుకో మరి! చాలా మంచి కుటుంబం. పైగా మనకు చాలా కావల్సివాళ్ళు.' ' అన్నాడు నాన్న. వాళ్ళు నామాట వినిపించుకోలేదు.

"నేనిప్పుడు పెళ్ళి చేసుకోదల్చుకోలేదు." అన్నాను మళ్ళీ.

"నేను ఆల్రెడీ మాటిచ్చాను. అబ్బాయి కూడా నిన్ను చూసాడట...! నచ్చింది అని కూడా చెప్పాడు.వచ్చేనెలలో పెళ్ళి" అన్నాడు.

వారం రోజులు నాలో నేను ఘర్షణ పడ్డాను. ఎన్నోరకాలుగా ఆలోచించాను. సమస్యకి పరిష్కారం కనిపించలేదు. ఇంట్లోంచి పారిపోవటమో లేక ఆత్మహత్య చేసుకోవటమో ఏదో ఒకటి ఎంచుకోవాలనుకున్నాను. నానమ్మను పావుగా ఉపయోగించి నన్ను ఒప్పుకునేలా చేసారు. నేను ఒప్పుకోకపోతే నాయనమ్మ చచ్చిపోతానంది. నేను చావకుండా... పారిపోకుండా నాతో ఒట్టు వేయించుకుంది. నన్ను కన్నతల్లి కన్నా ఎక్కువగా చూసుకుంటున్న నానమ్మని బాధపెట్టడం ఇష్టం లేక ఒప్పుకున్నాను. ఇలా జీవితంలో నాల్గవ సారి రాజీ పడ్డాను.

నా భర్తని బీజీ డాక్టర్ అనాలో... డాలర్స్ డ్రీమర్ అనాలో తేల్చుకోలేక పోతున్నాను. ఆయన డాక్టర్ చదివింది డాలర్ల కోసమే. ఆయన దృష్టిలో డాలరే అన్నీనూ... మాటల్లోనూ, చేతల్లోనూ... చివరికి అతని స్పర్శలోను వ్యాపార దృష్టే. పెదవులతో అర్డర్ వేయడమేగాని హృదయంతో మాట్లాడటం తెలియని వ్యక్తి. నాకొక విషయం స్పష్టంగా అర్థమయ్యింది. అతనికి డబ్బు ఎంత ముఖ్యమో భార్య అతని చెప్పుచేతుల్లో ఉండటం కూడా అంతే ముఖ్యం.

సురేష్... నాలో ఆవేశం చచ్చిపోయి చాలా ఏళ్ళయుంది. ఇప్పుడు నేను డబ్బులు సంపాదిస్తున్న ఒక యంత్రాన్ని మాత్రమే. నా జీవితం మిద నాకే అసహ్యం వేసి కొద్దిరోజుల క్రితం చాలా సేపు ఆలోచిస్తే ఆత్మహత్యే శరణ్యమని పించింది. కానీ ధైర్యం కోల్పోకూడదని నిశ్చయించుకున్నాను. మానసిక ప్రశాంతత కోసం నీ దగ్గరికి రావాలనుకున్నాను. కానీ ఇండియాలో నీ పరిస్థితి ఏమిటో తెలియదు కదా! అందుకే రాగానే నీతో నిజం చెప్పలేక పోయాను.

ఇండియాలో నీతో ఉన్నంత కాలం నాలో జరిగిన సంఘర్షణ రెండవ ప్రపంచ యుద్ధం కన్నా గొప్పదే. ఇంకో పది రోజులు నేను ఇండియాలోనే ఉండి ఉంటే నిన్ను... ఈ దేశాన్ని వదిలి వెళ్ళలేననుకున్నాను. అందుకే చెప్పకుండా బయలు దేరాను. జీవితంతో చివరిసారి రాజీ పడ్డాను. అమెరికా మోజులో డబ్బు కోసం బతుకు గురించి రాజీ పడడం నావల్ల కావడం లేదు.

సురేష్... నేను ఇండియాకు వచ్చేటప్పుడు ఊహించిందివేరు. నువ్వయినా నీ భార్య పిల్లలతో సుఖంగా ఉన్నావనుకున్నాను. నీ బ్రతుకులోని ఆనందాన్ని చూసి నా బ్రతుకు మీద నేను కుళ్ళి కుళ్ళి ఏడ్వాలనుకున్నాను. ఏడ్చి... ఏడ్చి రాజీ పడిపోవాలనుకున్నాను. కానీ, ఆశ్చర్యమనిపించింది. నాలాగే

ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ వయ్యుండి మంచి కంపెనీలో ఉద్యోగం చేస్తూ సుఖంగా లేకపోవడాన్ని డైజెస్ట్ చేసుకోలేక పోయాను. నీవు నన్ను ఇంతగా ప్రేమిస్తున్నానని తెలిసి వుంటే నేను ఉత్తరాలు రాయడం మానేసి ఉండేదాన్ని కాదు. నేను జీవితమంతా ఇలా రాజీ పడి ఉండే దాన్ని కాదు. అయితే పొరపాటు నాదే. నీ ఉత్తరాలకు జవాబు ఇవ్వకపోవడం.

"ఓడిపోయిన జీవితాన్ని తిరిగి గెలుచుకోవచ్చు...

కానీ రాజీ పడిపోయిన జీవితాన్ని తిరిగి పొందడం సులభం కాదు...!"

సురేష్...! నీ నిస్వార్థ ప్రేమ ముందు అనురాధ ఆదరణ ముందు నా మనస్సు తిరిగి ఓడిపోయింది.

అనురాధా! అన్నింటికి డబ్బు అవసరమే. జీవితం కోసం డబ్బు అవసరం. కానీ డబ్బు కోసం జీవితం కాదు కాకూడదు. అని నా జీవితం నుంచైనా నేర్చుకుంటే నీ సంసారమైనా సుఖంగా వుంటుంది. ఎదో తెలియని మూడ్‌లో నేను ఏమైనా అయిపోతానని భయపడకండి అంత పిరికిదాన్ని కాదు, అంత ధైర్యం లేదు. అసలు అనుక్షణం రాజీ పడగలిగే వారికి ఆత్మహత్యలతో ఏం పని...? ఉంటాను.

ఇట్లు
నీ చిన్ననాటి స్నేహితురాలు
సునీత

ఉత్తరం చదివాక నా మనసంతా ఎలాగో అయింది...

* * *

ఇటీవల ఏదో గిరిజన ప్రాంతంలో అమెరికన్ స్త్రీ ఆర్థిక సహాయంతో గత రెండ్పేగా చేస్తున్న అద్భుతమైన మహిళల అభ్యున్నతి గూర్చి వచ్చిన వార్త నన్ను ఆకర్షించింది. నాకు ఆశ్చర్యం ఆనందం కలిగింది. అరా తీసాను. నా అంచనా తప్పు కాలేదు. సునీతే ఆ స్కీమ్ వెనుక వుండి నడిపిస్తున్నది. నాకు ఒకందుకు బాధ అనిపించింది. సునీత నాతో ఒక్కమాటైనా చెప్పనందుకు. కొత్త అడ్రస్ సంపాదించి అభినందిస్తూ ఫోన్ చేశాను. నాకన్న సునీతే ఎక్కువ బాధ పడుతూ అంది.

"సురేష్...! ఇండియా నుండి ఇక్కడి వచ్చాక జరిగిన గొడవల గురించి నీకు చెప్పి నీ మనసు బాధ పెట్టతలచుకోలేదు. నేను ఇండియాకు బయలు దేరేముందు నిజానికి ఆ ప్రాజెక్టును నీ మేనేజ్‌మెంట్‌లో నడిపించాలను కున్నాను. కానీ... నీ అనురాధ నీ పై... ఇటు నా భర్త నా పై... లేని పోని అనుమానాలతో రెండు సంసారాలు విచ్ఛిన్నమౌతాయని బాధతో నీకు చెప్పలేకపోయాను. ఇప్పుడు నేను విడాకులకు అప్లై చేశాను. విడాకులు వచ్చాక ఇండియాలోనే సెటిల్ అవుదామనుకుంటున్నాను."

"వద్దు... సునీతా...! ఆవలి తీరం దూరంగా ఎప్పుడు అందంగానే వుంటుంది. నీకు అమెరికా అందంగా వుంటుంది. నీకు ఇండియా అందంగా వుంటుంది. నువ్వు ఇండియా రాకపోవడమే మంచిది. నువ్వు ఇండియాకు వస్తే మరెన్నో కొత్త సమస్యలు మొదలు అవుతాయి. నీ ఓడిపోయిన జీవితాన్ని అక్కడే గెలుచుకోవడం మంచిది."

గొంతు పెగలక నా మాటలు నాకే వినిపించలేదు. సునీతకు వినిపించాయో లేదో...!

(మార్గదర్శి పక్షపత్రిక 1-15, ఆగష్టు 1999)

20

కన్న తల్లి

– పెద్దింటి అశోక్‌కుమార్.

తెల్లవారుతుందనడానికి సూచనగా కోడికూసింది. కుక్కి మంచంలో బొంతవేసుకుని ముసుగుతన్ని పడుకున్న యాదవ్వ రగ్గుతీసి బయటకు తేరిపార జూసింది. ఇంకా చీకటి గానే ఉంది. మూల్గుతూ అటుపక్క నుండి ఇటు పక్కకు తిరిగింది. కుక్కి మంచం కూడా ఆమెతో పాటే కిర్రుమని మూల్గింది.

రెప్పలు టపటప కొట్టుకుంటూ గంపలో కమ్మిన కోడి మరోసారి కూసింది. తెల్లారిపోతుంటే వీళ్లింకా లెవ్వరేందీ...? అనుకుంటూ కొడుకును పిలిచింది యాదవ్వ.

"నారీ...ఓరి నారాయణా ...ఇంకా లెవ్వరేందిరా అంబటాల్లదాక పంటాౘ్రా. కాపుదనపోడంటే పొద్దుకరకర పొడిచే వారకు చేన్లుండాలె. లేచి ఎడ్లకు గడ్డేసుకో. బంగారమోలె దున్నే పోతుల్ని అమ్మి ఉరుకులాడుకుంట ఎడ్లను తెత్తివి. ఎకురం చేనుదున్నకముందే వాటికి మెత్తగాల్లువడె. ఏం ఎవుసమో ఏమో నాకు ఏం సమజైతలేదు... అంటూ కొడల్ని కూడా లేపింది. "...నువ్వుగూడా లెవ్వేపిల్లా. ఇయాల్ల మంగలారం. వాకిలి సానుపు. లేచి మొలుకమండెకు నీల్లుపొయ్యి. ఇత్తునాలు పాడుగాను. ఈసలికి అసలే మొలకెత్తలేదు. ఎల్లుండే అలుకుడు."

తల్లిమాటలు వినిపించినా వినపడనట్టే ముడుచుకుని పడుకున్నాడు నారాయణ. కోడలు పోచవ్వ మాత్రం లేచి ఇంటిపనుల్లో మునిగిపోయింది.

మరో పావుగంట గడిచిపోయింది. కోడి మరోరెండు మూడుసార్లు కూసింది. కొడుకు ఇంకా నిద్రలేవకపోవడంతో యాదవ్వలో అసహనం పెరిగిపోయింది. ఆమె అసహానానికి ఇదొక్కటే కారణం కాదు. ఎప్పుడూ కష్టపడి పనిచేసే నారాయణ ఈ మధ్య పని సరిగా చేయడం లేదు. మాటిమాటికి విసుక్కుంటున్నాడు.

తల్లి వద్దని చెప్పినా వినకుండా పాలిచ్చే బఱ్ఱెను అమ్మాడు. తల్లికి చెప్పకుండానే ఎకరం చేనును కౌలుకు ఇచ్చాడు. ఇంతకు ముందెన్నడూ తల్లిమాటకు ఎదురు చెప్పనివాడు. ఇప్పుడు ఇలా చేయడం ఆమె జీర్ణించుకొలేకపోతుంది.

ఇద్దరు పిల్లల తండ్రి అయినా ఇప్పటివరకూ నారాయణ తల్లి చాటుకొడుకే. బనీన్లు, దోతులు, చెడ్డీలు, బీడీకట్టలు వగైరా వస్తువులన్నీ అతడి అవసరాన్ని గుర్తించి కొనితెచ్చేది. కరంట్ బిల్, తహసీలు, ఇంటిపన్ను మొదలగునవి కట్టాలన్నా యాదవ్వనే వెళ్ళికట్టేది. సావుకారి దగ్గర పంట అమ్మిన లెక్కలు నిత్యావసర సరుకుల ఖాతా కూడా యాదవ్వనే చూసేది.

"నారీ...లెవ్వుబిడ్డా. తెల్లారిపోయింది. లేచి ఎడ్లకు గడ్డివెయ్యి. పొద్దంతా దున్నెటివాయె. పొద్దుగల్ల ఇంత గడ్డిమేత్తెనే గదా వాటికి ఆసర ఉండేది. అవ్వీటిది గూడా మనలెక్క పాణమే. గడ్డిమెయ్యక

పోతే బేజేలిపోతయి. మరోసారి కొడుకును పిలిచింది యాదవ్వ కోపంగా ఆమె కంఠంలోని తీవ్రతకు కాస్త బయపడినా మొండిగా సమాధానం చెప్పాడు నారాయణ.

"నాకు చాతనైతలేదు. నీ ఎడ్లు వద్దు ఎవుసం వద్దు. ఈ దిక్కుమల్లె పని నేను చెయ్య. ఎవ్వనికన్నా అమ్ముకో. లేకుంటే జీతగాన్ని పెట్టి ఎల్లదీసుకో. ఇగనన్ను ఒర్రియ్యకు నువ్వొర్రకు."

నారాయణ అంతమొండిగా చెప్పడం చూసి ఆశ్చర్యపోయింది యాదవ్వ. ఆమె గుండెల్లో గుబులు మొదలయింది. కొడుకు అలా ఎందుకు మారిపోయాడో అర్థం కావడం లేదు. ఆమెకు తెలిసినంత వరకు నారాయణకు ఎలాంటి చెడు అలవాట్లు కూడా లేవు. కల్లు కూడా తాగేవాడు కాదు. తన బలవంతం మీదనే కల్లు తాగుడు నేర్చుకున్నాడు.

"వీడు గిట్ల వంగలేని తనం ఎందుకు నేర్చుకున్నాడు. ఒర్వలేక ఎవడన్న ఏదన్న పుల్లపెట్టెనా ఏందీ..! ఎల్లమ్మ మొక్కు దుర్గమ్మ మొక్కు పోయినేడే చెల్లిస్తిని. చెప్పుడు మాటలు వట్టిండు గాడిది కొడుకు. వీడు ఎట్లదారికి రావాలే ! " గొణుక్కుంటూ ఆలోచనల్లో పడిపోయింది యాదవ్వ.

తలుపు చప్పుడు విని లేచికూర్చుంటూ "ఎవలుండ్లా...పొద్దుగల్ల పొద్దుగల్లనే బిందెలు పట్టుకొని వత్తరు. బాయికాడ మాకు మెసులరాకుంట జేత్తరు. మాపనంత తీరినంక చేయకపోండ్రి." అంటూ కొడుకు మీది కోపంతో గద్దించింది యాదవ్వ.

ఆ ఊరిలో ఎన్నో బాయిలున్నా మంచి నీల్ల బాయిలు రెండే. అందులో ఒకటి యాదవ్వది. ఆ బాయిల నీల్లుతాగితే గాని దూప దీరదంటారు ఆ వాడలో ఉండే వారు. తానికితోడు యాదమ్మ కలుపుగోలు మనిషి. అందుకే అందరు అదే బాయిల నుండి మంచినీల్లు తీసుకుపోతారు. ఏద్దైనా కొట్లాట పెట్టుకుని మాటలు బందుచేసినా మంచినీల్ల కొరకైనా యాదవ్వతో మాటలు కలుపుకుంటారు.

"నేను నర్సింలును యాదమ్మా. నారన్న ఉన్నడా. జెరమాట్లాడేది ఉంది తలుపు తియ్యి." బయట నర్సింలు మాటలు వినిపించాయి. యాదమ్మకంటే ముందుగా వెళ్ళి తలుపు తెరిచింది పోచవ్వ

"ఏంది బిడ్డా నర్సింలు...ఏమో పొద్దుగాల్లనే వచ్చినవు. నారన్నతో ఏంపని." అనుమానంగా అడిగింది యాదవ్వ. ఈ మధ్య నర్సింలు నారాయణతో ఎక్కువగా తిరుగుతున్నాడు. అందుకే అతడంటే మనసులో కోపంగా ఉంది. దగ్గరి చుట్టరికం కాబట్టి పైకి ఏమీ అనలేకపోతుంది.

"ఏం లేదమ్మా...నిన్న పొద్దుగూకి మా నాయినతో నారన్న ఏదో అన్నడట. నిన్ను అడిగి నంకనే లెక్క అని మానాయిన అన్నడట. మరి ఆ ముచ్చట నీకు ఎరుకేనా లేదా తెలుసుకుందామని వచ్చిన" గచ్చు అంచుకు గొంగడి వేసుకుని కూర్చుని, బీడీ ముట్టించుకుంటూ అన్నాడు నర్సింలు.

యాదవ్వ మనసు ఏదో కీడును శంకిస్తుంది. దిగులు మొదలయింది. పైకిమాత్రం గంభీరంగా విషయాన్ని ఆరా తీస్తున్నట్లుగా అడిగింది.

"ఏంది బిడ్డా...ఏం ముచ్చటరా...ఏమన్న బాకీగిట్ల అడిగిండా ఏంది...? ఈ నడుమ వాడు లంగల సోపతి పట్టిబజార్లు తిరుగమరిగిండు."

యాదవ్వ మాటలు నర్సింలుకు సూటిగా తగిలాయి. ఆమె తనను ఉద్దేశించి అన్నదే అని అతడికి తెలుసు. అతడు అలా తెలుసుకోవాలనే ఆమె ఆ మాటలు అన్నది. ఏం మాట్లాడాలో తోచక మౌనంగా ఉండిపోయాడు నర్సింలు. ఇల్లు ఊడ్చుకుంటూ వస్తున్న పోచవ్వ నర్సింలు వద్దకు వచ్చి ఆగి "గట్ల అరుగంచు మీద కూచున్న వేందే...కుర్చిమీద కూసో" అంటూ తనపనిలో మునిగిపోయింది.

"యాడకూసుంటేంది గని" విసురుగా అంటూ లేచి మీదకూచున్నాడు నర్సింలు. నారాయణ

లేచి వచ్చి నర్సింలు పక్కన మౌనంగా కూర్చున్నాడు.

"ఇప్పల్ల చేను అమ్ముతనని మా నాయినతోని నారన్న అన్నడట. అటు తరువాయి మాచేనే ఉంది కదా. అవ్వను గట్టిగ తెలుసుకుని చెప్పు అని మా నాయిన అన్నడట. రేపు నర్సింలును రమ్మను మాట్లాడుదాం అని నారన్న అన్నడట. నేను సిరిసిల్లకు పోయి రాత్రి బసుకు వచ్చిన మా బామ్మర్దిలగ్గం. ఇయ్యాల్లకూడా పోతున్న. నిన్ను కల్సి పోదామని వచ్చిన." వచ్చిన విషయం చెప్పాడు నర్సింలు.

ఆ మాటలకు యాదమ్మ గుండెలో రాయిపడ్డట్టయింది. కొన్ని క్షణాలునోటమాట రాక అలాగే ఉండిపోయింది. ఇప్పల్లో ఉన్నది రెండెకరాల చేను. అది అమ్మితే మిగిలేది కోటకింద అర్ధెకురం పొలం మాత్రమే. అది అమ్మాల్సిన అవసరం ఎందుకు వచ్చిందోఆమెకు అర్థంకాలేదు. కొడుకు మీద చెప్పలేని కోపంవచ్చింది.

"అవురా నారిగా... చేను అమ్ముతనన్నవా ...చేనమ్మి గాడిది పండ్లుతోముతననుకున్నవా. నీకు ఏం తక్లీబువచ్చిందని చేను అమ్ముతనన్నవు. నీకు పిచ్చిగిట్ల లేసిందా ఏందిరా". గయ్యిమని లేచింది యాదవ్వ.

ఉలుకూ పలుకూ లేకుండా మౌనంగా ఉండిపోయాడు నారాయణ. పోచవ్వ తనపని తాను చేసుకుంటూ వారి సంభాషణను జాగ్రత్తగా వింటుంది. వారందరూ మౌనంగా ఉండడంతో తనే చెప్పడం ప్రారంభించాడు నర్సింలు.

"ఇంక నీకు తెల్వదా యాదమ్మా ? నారన్న దుబాయ్ పోతడట. ఎముడాలల ఏజెంట్ యాదగిరి దగ్గర పాస్‌పోటు పెట్టిండు. మనూరు మనుషుల్ని ఇంతకుముందే యాదగిరి మస్కట్ తోలియ్యలేదా...? ఇది గప్పటిముచ్చట. మొన్న వచ్చి నారన్నకు విజావచ్చిందని చెప్పిండు. రంజాన్ తెల్లారి పోవాలె. పైసలు జమచేసుకొమ్మని చెప్పిండు."

అసలు విషయం అప్పుడు అర్థమైంది యాదవ్వకు. దుఃఖంతోపాటు కోపం కూడా ముంచుకొచ్చింది. గొంతు బొంగురుగా మారింది. కళ్ళలో నీల్లు సుడులు తిరిగాయి. కొడుకు చెడిపోతున్నాడన్న బాధ ఆమె హృదయాన్ని కలవరపరుస్తుంది.

"నీకేం పోయేకాలంరా నారిగా...ఎవడు బతుకలేడని దుబాయి పోతనన్నవు. చెయ్యశాతగాక ఇదో ఏశం పెట్టుకున్నావు. దుబాయి లేదు గిబాయి లేదు. వారీ నర్సింలు. దగ్గరి మాట బిడ్డా. వాడు గట్లనే నరుకుతడు. చేనమ్మము చెల్కమ్మము. వాని మాటలు పట్టుకుని మీరు పరెషాన్ గాకుండ్రి. నన్ను పరేషాన్ చెయ్యకుండ్రి యాడికిపోతడో పోని." విసురుగా అన్నది యాదవ్వ. ఆమె గొంతులో దుఃఖం మిలితమై గొంతుకీచుగా వినిపించింది.

ఆమె మాటలకు విసురుగా లేచాడు నర్సింలు. గొంగడి దులిపి కొప్పెరపెట్టుకున్నాడు. మీసాలను ఒకసారి సవరించుకుని సరాయించి ఉమ్మివేసాడు.

"నారన్న అన్నడుగదా అని నేను అంటున్న. నీచేను గొనాలన్నయావ మాకులేదు. మాకు పైసలు పుచ్చివట్టి పోతలెవ్వు. నీకు ఇష్టమైతేనే సరి. ఏదో పక్కనే ఉందిగదా పనికత్తదని అనుకున్నం." అంటూ బయటకు వెళ్ళిపోయాడు నర్సింలు కోపంగా.

నర్సింలు ముందు అలా అన్నందుకు నారాయణకు కోపం వచ్చింది. మళ్ళీ కలిసినప్పుడు నర్సింలు మాట్లాడే ఎత్తిపొడుపు మాటలు ఊహించుకుని అతడి హృదయం మండిపోయింది ఆ కోపాన్ని తల్లిమీద చూపించాడు.

"ఇంటికచ్చిన బ్యారాన్ని జారగొడితివి. ఇప్పుడు కొనడానికి ఎవడు వస్తడు నువ్వేదైనా గిట్లనే

చేత్తవు. పందిరి మీది గుండోలే పటుక్కుమని నోరు జారుతవు. నీరెండెకరాల చేను అమ్మితే కోట్లు వత్తయనుకుంటున్నవా...? మహా అయితే తొంబైవేయిలు. అదీ నర్సిమ్మడు కొంటేనే. మిగితా ఎవ్వడైనా సరుదుకు లేదని ఏనుబైవెయిలుపెట్టడు." అంటూ తల్లి సమాధానం కొరకు ఎదురుచూడకుండా బయటకు వెళ్ళిపోయాడు.

ఆ రోజు ఇంట్లో ఎవ్వరూ భోజనం చేయలేదు. యాదమ్మ మొగుడిని తలుచుకుని ఏడ్పులు మొదలుపెట్టింది. ఆమెను ఊరడించడానికి వచ్చిన ఇరుగుపొరుగువారు ఎవరికి నచ్చిన రీతిలో వారు మాట్లాడారు. కొందరు దుబాయి పోవుడెందుకన్నారు. మరి కొందరు. ఎంత మంది పోతలేరు రెండేండ్లు పోని తియ్యి అన్నారు. వదిన మరదలు వరుసైన మరికొందరు పోచవ్వ ముందే "నల్లిపోరి. మొగనికి ఏమని మొటిచ్చిందో ఏమో. లగ్గంగాక ముందు గింత అద్దుమానం లేకుండె" అన్నారు. పోచవ్వ మౌనంగా ఉండిపోయింది.

యాదవ్వకు ఇప్పల్ల చేను ఎలా సంపాదించింది గుర్తుకు వస్తున్నది. నారాయణ రెండేండ్ల పిల్లగానప్పుడే భర్త చనిపోయాడు. మనిషి ఆజానుబాహుడు. రెక్కలిరుగ కష్టం చేసేవాడు. మీసాలు పెద్దగా ఉండేవి. మంత్రాలు వస్తాయని అందరూ బయపడేవారు. రాత్రి మక్కకావలి పోయాడు. తెల్లవారే సరికి శవమై మోటబాయిలో తేలాడు.

అతడు ఎలా చచ్చాడో ఎవరికీ తెలియదు. దొర కొడుక్కు మంత్రం చేసి చంపాడని, అందుకే దొర ఒక ప్లాన్ ప్రకారం పాలేర్లతో చంపించాడని అనుకుంటారు. అప్పుడు యాదవ్వ తల్లిగారింటి వద్ద ఉన్నది. విషయం తెలియగానే సొమ్మసిల్లి పడిపోయింది. భర్త శవం మీదపడి గుండెపగిలేలా ఏడ్చింది. కొన్నాళ్ళు పుట్టింట్లో ఉన్నా అన్నా వదినలతో పడక తన ఇంటికి తాను వచ్చేసింది. భర్త చనిపోయేటప్పుడు ఆమెకు మిగిలిన ఆస్తి కోట కింద అర ఎకరం పొలం. ఆ పొలాన్ని అమ్మినా తేరని అప్పు.

చేనును అమ్మి అప్పు కట్టమని ఎంతో మంది ఉచిత సలహాఇచ్చారు. అప్పులవాల్లయితే ఎంతో ఇబ్బంది చేసారు. యాదమ్మ చేను అమ్మలేదు. రెక్కల్ని నమ్ముకుంది. తన చేను నాటువేసుకున్నాక కూలిపనికి వెళ్ళేది. చేనునాటుకు వచ్చిన వాల్లకు బదలు వెళ్ళేది. వరినాట్లమీద ఎకరాలకెకరాలు గుత్తలు పట్టేది. బాయిల పూడికలు తీసుడు చెరుకువాడె తీసుడు గుత్తలు పట్టింది. ఇద్దరు ముగ్గరు కైకిలోల్లను పెట్టుకునేది. వారికంటె ఒక అడుగు ముందు ఉండి పని తొందరగా చేత్తలేరని గదరాయించేది. అలా ఇద్దరితో నలుగురి పనిచేయించేది. తను ఒక్కతే ఇద్దరి పనిచేసేది. పొద్దుపొడవక ముందే గుత్తపనికి వెళ్ళేది. చీకటిపడితేకాని ఇంటికి చేరేది కాదు. తన కైకిలిపోను గుత్తల్లో కొంతసొమ్మును లాభంగా సంపాదించేది.

రెండేండ్లు తిరక్కముందే బాకీలన్ని మిత్తితో సహ తీర్చివేసి అందరి మెప్పును పొందింది. అన్నా, తమ్మి అంటూ వరుసలు కలుపుకుని అందరిలో మంచిపేరు తెచ్చుకుంది.

ఇలా యాదవ్వ అభివృద్ధి పాలివాళ్ళకుచురకలాతగిలింది. వారిలో ఓర్వలేని తనం మొదలయింది. మొగతోడు లేదని పొలంగెట్టు దగ్గర, కాలువ దగ్గర కావాలని ఏదో కయ్యం చేసేవారు. యాదవ్వ మాత్రం బయపడేదికాదు. గాయికెత్తుకునేది. ఆడోళ్ళను మొగోళ్ళను కలిపితిట్టేది. తను ఏమాత్రం వెనుకడుగువేసినా తనని అక్కడ నెగులనియ్యరని ఆమెకు తెలుసు. ఆమె నోటి దురుసుతనానికి బయపడి తోకముడిచేవారు.

ఆమె పొలం వద్దలేనప్పుడు మాత్రం ఒడ్లకు గండ్లు పెట్టేవారు. రాత్రిపూట కాలువనీల్లన్ని మర్రగట్టి యాదవ్వ పొలంలోకి వదిలేవారు. నీటి ప్రవాహానికి నారుకొట్టుకుపోయేది. యాసంగి నీల్లులేక మక్కఏత్తే కంకులన్నీ ఇరుసుకుపోయేవారు. గడ్డివామును కాలవెట్టారు. ఒకసారైతే రాత్రికిరాత్రి చేనులో

ఎడ్లను తోలిమేపించారు.

రోజురోజుకు పెరుగుతున్న పాలివాళ్ళ బాధలను చూసి కలవరపడిపోయినా, మొండి ధైర్యంతో ముందుకు కదిలివారితో పోరాడింది యాదవ్వ. చేనును మేపిండ్రని సంగంలో పంచాది పెట్టించింది. చూసిన గవాయిలు లేకపోవడం వల్ల పంచాది నిలువలేదు. చేను మేపింధి మేముకాదని వాదించారు పాలివాళ్ళు. గవాయిని తెమ్మన్నారు. సంగం పెద్దలు కూడా వారికి సపోటుగా గవాయిలు ఏరన్నారు. గవాయిలు లేకుండా వారిమీద పంచాది పెట్టినందుకు యాదవ్వను తప్పుపట్టారు.

యాదవ్వ సంగాన్నే ఎదిరించింది. మేమే చేను మేపించలేదని పోచమ్మ గుడిలో ఇమానం చేయ్యమని సవాల్ విసిరింది. ఆమాటను కూడా తప్పుపట్టింది సంగం. పాలివాళ్ళకు సంగం పెద్దల అండదొరకడంతో మరింతగా రెచ్చిపోయారు. నాటువేసాక పొలం ఎడ్లచేత తొక్కించేవారు. నాగండ్లను ఎత్తుకుపోయేవారు. యాదవ్వతన చేనును పైసలిచ్చిదున్ని పిచ్చేది. ఎవరు దున్నకూడదని హెచ్చరించేవారు.

ఒకసారైతే వరికోసి కుప్పవేసినంక రాత్రికి రాత్రి వరికుప్పకు నిప్పుపెట్టారు. కుప్పకాలి పోవడం చూసి ఎవరో చెబితే గుండె బాదుకుంటూ వెళ్ళింది. చేతికచ్చిన పంట కండ్లముందే బూడిద అవుతుంటే కిందపడి ఏడ్చింది. అప్పుడు నారాయణకు పదేండ్ల వయసు. తల్లిని ఎలా ఓదార్చాలో తెలియని పసితనం. ఎవరో సలహాఇస్తే దుమాల గుట్టలల్లకుపోయి అన్నలను కలిసింది. తన గోడును చెప్పుకుని ఏడ్చింది. అప్పటివరకూ అన్నలంటే ఎవరికీ తెలియదు. దళాలు ఊర్లు తిరిగేవి కావు. అప్పుడప్పుడే మొదలవుతుంది.

అన్నలు ఊరిలోకివచ్చారు. పాటలు పాడారు. యాదవ్వను పాలివాళ్ళ నలుగురు మొగవాళ్ళను పిలిపించారు. తుపాకి చూపించి అడిగితే నిజాన్ని ఒప్పుకున్నారు పాలివాళ్ళు. నష్టపరిహారం ఇస్తామన్నారు. ఇకముందు అలాంటి పని చేయమని యాదవ్వ కాళ్లుమొక్కారు.

యాదవ్వను ఏమైనా అంటే కాళ్ళు చేతులు నరుకుతమని అన్నలు వార్నింగ్ ఇచ్చివెళ్ళారు. ఆనాటి నుండి యాదమ్మను ఎవరూ ఏమీ అనలేదు. కాయకష్టం చేసి అరెకరం పొలంతో మరో రెండెకరాలు ఇప్పల్ల చేనును సంపాదించింది. మేనపిల్లతో నారాయణకు పెళ్ళిచేసింది.

* * *

ఎటువెళ్ళాడో కాని రెండురోజులు ఇంటిముఖం చూడలేదు నారాయణ. ఈ విషయం తెలిసి అతడి మామవచ్చాడు. తండ్రిని చూడగానే గొల్లుమని ఏడ్చింది పోచవ్వ. యాదవ్వకూడా అన్నమీద పడి ఏడ్చింది. ఆవునూరు, గూడెం, కొండపురం, ముస్తాబాద్...ఎక్కడెక్కడ చుట్టాలున్నారో అక్కడక్కడ నారాయణ కొరకు వెదికారు.

చివరకు వేములవాడలో ఏజంట్ యాదగిరి దగ్గర ఉన్నట్టు జాడతెలిసి అక్కడికి అన్నతో వెళ్ళింది యాదవ్వ. యాదగిరి దూరపు చట్టం. ఊరికి వచ్చినప్పుడల్లా యాదవ్వను కలవందే వెళ్ళడు.

తల్లిని మామను చూసి మొహం తిప్పుకున్నాడు నారాయణ. వారు ఎంత ఏడ్చినా మారుమాట చెప్పలేదు. ఎటో వెళ్ళిన యాదగిరి సాయంత్రానికి ఇంటికి వచ్చాడు. వాళ్ళను చూసాక గాని అసలు విషయం బోధపడలేదు. అంతవరకూ ఇంట్లో చెప్పివచ్చాడనుకున్నాడు.

"ఎందిరా యాదిగా... తమ్ముని గిట్ల ఆగమాగం తిప్పుతున్నావు. చాతగాక పోతే ఎవుసం తీసెయ్యాని. చేన్లు పాలుకియ్యాని. లగ్గాని కచ్చిన ఆడిపిల్లలున్నరన్న బాధనా...? జామ పండ్లోలె ఇద్దరుకొడుకులు ఏ అయ్యనన్న కాల్లు మొక్కుకుంట పిల్లను దించి పోతడు. ఈనికి మస్కట్ ఎందుకు దుబాయి ఎందుకు...? వంగి చేసుకుంటే ఇక్కడ బతుకుదెరువు లేదన్న తండ్లాటనా...? యాదగిరిని నిలదీస్తూ అడిగింది యాదవ్వ. యాదగిరి ఏదో చెప్పబోతుండగా నారాయణ అందుకున్నాడు.

"గండ్ల యాదన్నదేం తప్పలేదు. నేనే ఆయన ఎంబడవడ్డ. అందరిని అవుటాప్‌తోలిత్తున్నవు. నన్నుగూడా తొలియ్యమని పిక్స్‌చేసిన. మా అవ్వ ఏమనకుండా నాజిమ్మదారని చెప్పిన."

"నీకేంది నువ్వు గట్లనే అంటవు. ఎన్ని రోజులున్నా మన్నుదిని మన్నుగక్కుడే ! ఎన్నడన్న వైనంగ బట్టగట్టిన్నా వైనంగ కూడుతిన్నానా ! ఎప్పుడు గిదే సాలిసాలని బతుకాయె. ఎంత కట్టపడ్డా లాగోడికి సాలుతలేదు. పంట పండినంక లెక్కసూత్తె నా కైకిలు గూడా పడుతలేదు. ఎవుసంల ఏం లాభం ఉంది. బాలెల్లయ్య నాకంటే చిన్నోడు. రెండేండ్లు మస్కట్ పోయిండు. మనిషి ఎంత నిగనిగ అయిండు. లక్షకుపైన సంపాయించిండట. ఇక్కడ ఎన్నేండ్లు కట్టంచేసినా గిట్లనే ఉంటం. ఇగో అవ్వా... నీకు కొడుకు కావాలంటే గాచేను అమ్మి పైసలియ్యి. లేదంటే నీకొడుకు సచ్చిండనుకో." కట్టె విరిచినట్టుగా చెప్పి మొహం తిప్పుకున్నాడు నారాయణ.

ఆ మాటలకు యాదవ్వ గుండె చెరువయింది. ఎంత నచ్చచెప్పినా అతడు వినడని తెలిసిపోయింది. కొడుకు మీదిప్రేమ దుఃఖంగా మారింది.

"ఓరి కొడుకా...ఒక్క కొడుకువని ఒడిగట్టిసాదుకున్న. కూలీనాలి చేసి ఉపాసం ఉప్పిడుండి పెద్దచేసిన. నువ్వులేకపోతే నేను బతుకరా..." ఏడుపు అందుకుంది యాదవ్వ. నారాయణకు కోపం ముంచుకొచ్చింది.

"ఏం సావవు తియ్యి, సత్తె టెలిగ్రాం కొడుతారు. అయినా నేనుంటే మాత్రం సచ్చేదాన్ని ఆపుతనా ఏందీ ." అన్నాడు.

ఎక్కడ యాదగిరి మనసు మార్చుకుంటాడో అని అతడి బాధ. అందుకే ఎవ్వరినీ ఎక్కువ మాట్లాడనీయడం లేదు. మాటకు మాట కరాకండిగా చెబుతున్నాడు. ఒకటి రెండు మాటలు మాట్లాడి మౌనంగా ఉండిపోయాడు నారాయణ మామ. అతడికి గూడ మనసు లోపల నారాయణ దుబాయికి వెళ్ళాలనే ఉంది. అదను చూసి చెల్లెల్ని మెప్పించే ప్రయత్నం చేసాడు. అతికష్టం మీద నారాయణను ఇంటికి రప్పించారు.

పోచవ్వకూడా మనసులో భర్త గల్ఫ్ వెళ్ళాలనేఉంది. కాని ఎవరూ బయటపడడం లేదు. నారాయణ వినడం లేదన్న నెపంతో యాదవ్వను ఒప్పించాలని ప్రయత్నిస్తున్నారు.

"ఏదో తియ్యి అత్త. అయిన గట్ల మొండికేసుకుని కూసుండే. చెప్పంగ ఇననోల్లను చెడంగ సూడాలంటరు. నీకు ఎంత ఆరాటం ఉంటే ఏం లాభం. అయిన ఇంటలేడుగద." మెల్లిగా నోరు విప్పింది పోచవ్వ. ఆమె మాటలకు గయ్యిమంది యాదవ్వ.

"ఇంట్లకూసుండి నీకేం ఏరుపడుతుందే. గాదేశంగాని దేశంల అయ్యనా అవ్వనా...? కాలు నొచ్చినా జరమచ్చినా ఎవలుదిక్కు. చాతనైన కాడికి కట్టంచేసుకుని కండ్ల ముందు ఉండనీ. శాతగాకపోతే ...ందు చెయ్యని. నాబాధ నీకు తెల్వదే. కరువుల, కాలంల నాకడుపు మాడ్చుకుని కొడుకును సాదుకున్న. వీడు అమాయకుడు. గండు గెలిచినోడు కాదు. రొండెండ్లు ఒక్కడు ఎట్లుంటడే."

ఆ మాటలకు "పోచవ్వ నీకు ఒక్కలకే ఉన్నడు కొడుకు. దేశంల ఎవ్వలకు లేరు. పోయేటోల్లంత ఎట్లపోతుండ్రు." అని మనసులో అనుకుని మౌనంగా ఉండిపోయింది.

రోజులు దగ్గర పడుతున్నాయి. కొడుకుమీది ప్రేమతో యాదవ్వ ఒప్పుకోవడం లేదు. అందరూ ఆమెకే నచ్చచెప్పుతున్నారు. మస్కట్, దుబాయికి వెళ్ళిన ఎందరో వ్యక్తుల గురించి చెబుతున్నారు. ఒప్పుకోకపోతే కొడుకు ఆగమౌతాడని హెచ్చరించారు. చివరికి తాను ఉరివేసుకుని చచ్చిపోతానని బెదిరించడంతో కాస్తపట్టు సడలించింది యాదవ్వ. తిండి తినడం మానేసింది. ఆమెకు జ్వరం పట్టుకుంది.

రెండెకరాల చేను కరెన్సీరూపంలో ఆమె ఇంటిలోకి చేరింది.

రంజాన్ రెండు రోజులుందనగా వచ్చాడు యాదగిరి. యాదవ్వ మంచం పట్టడం చూసి నొచ్చుకున్నాడు. ఆమెకు ధైర్యం చెప్పాడు.

"బిడ్డా యాదగిరీ...తమ్మున్ని ఎసొంటిదేశం తొలిత్తొన్నవో. గుంట శిక్కులు తెల్వనోడు. మంచి దేశంతోలు బిడ్డా. నాలుగు రోజులు ఎనుకైనా సరే! ఆదరబాదర చేసి చేతులు దులుపుకోకు. తమ్ముని జిమ్మదారునీదే ! తమ్మునికి ఏద్దైనా అయితే నీ ఇంటి ముంగటచ్చి కూసుంట" మూల్గుతూ చెప్పింది యాదవ్వ.

"అవ్వా...నేగసొంటోన్ని గాదే. మంచికంపెనికి తోలిత్తన్న. దేశం కూడా మంచిదే. సౌదీ, కువైట్, బైరన్ అయితే జెరంత తక్లీబుంటది. దుబాయిల గట్లగాదు. మన దేశం లెక్కనే ఉంటది. అక్కడ మనోల్లు మస్తుమంది" ఉన్నరు నచ్చచెప్పాడు యాదగిరి.

ఆమాటా ఈమాటా మాట్లాడాక విషయం పైసల మీదికి మళ్ళింది. తోలినందుకు ఎనభైవేయిలు కావాలని చెప్పాడు యాదగిరి. మెడికల్ కర్చు, బొంబాయి దాకా బస్సు కిరాయిలు తనే పెట్టుకుంటనన్నాడు. తనకు అందులో ఏమి మిగలదని, మిగతా దేశాలకైతే డెబ్బ వేయిలల్ల తోలిత్తనన్నాడు. మిగిలిన వాళ్ళ దగ్గర ఎనుబై అయిదువేయిలు తీసుకుంటున్ననని ఒట్టుపెట్టుకున్నాడు.

జీతం ఓవర్‌టైం కలుపుకుంటే నెలకు పదివేలు వస్తాయని ఎనిమిది నెలల్లో బాకీ తీర్చవచ్చునని చెప్పాడు. తను ఎవరెవరిని తోలిచ్చిందీ వాళ్ళు ఎంత సంపాదించిందీ పూసగుచ్చినట్లు చెప్పాడు.

నారాయణ వెళ్ళే రోజురానే వచ్చింది. బంధువులు, మిత్రులు ఇల్లు నిండారు. పిండివంటలు చేసారు. కల్లుతాగి కూరతో భోజనం చేసారు. నారాయణ అందరివద్ద సెలవుతీసుకుని బయలుదేరాడు. అతడితోపాటు మరో ముగ్గురు వ్యక్తులను తీసుకుని బొంబాయి ప్రయాణమయ్యాడు యాదగిరి. కరీంనగర్ వరకూ వెళ్ళి కొడుకును బొంబాయి బస్సు ఎక్కించింది యాదవ్వ. కొడుకు బస్సు ఎక్కగానే శోకంతో కూలబడిపోయింది.

నెలరోజులు తిరక్కముందే నారాయణ నుండి ఉత్తరం వచ్చింది. కంపెనీ మంచిదని తిండికూడ పెడుతుందని రాశాడు. తల్లిని బెంగపెట్టుకోవద్దని రాశాడు. జీతం మంచిగా ఉందని ఓవర్‌టైం కూడా దొరుకుతుందని రాశాడు. భార్యపేరు మీద బ్యాంకు నెంబరు తీసిపంపుమని రాశాడు.

ఒక్కయాదవ్వ తప్ప అందరూ తేలిగ్గాఊపిరిపీల్చుకున్నారు. వ్యవసాయం మూలకుపడింది. తాతలనాటి అరెకరం చేనును కౌలుకు ఇచ్చింది యాదవ్వ. పోచవ్వ ఇద్దరు పిల్లలను తీసుకుని మాటిమాటికి తల్లిగారింటికి వెళుతుంది. బీడీలు చేయడం నేర్చుకొమ్మంటే ఇప్పుడు చేయడం రావని చెప్పింది. క్రమక్రమంగా ఆమె మాటల్లో ఏదో గర్వం చోటుచేసుకోవడం గమనించి యాదవ్వ.

వ్యవసాయపు పనిముట్లతో సందడిగా ఉండే ఇల్లు ఇప్పుడు బోసిపోయినట్టయింది. ఒక్కొక్క పనిముట్టు అటకనెక్కాయి. పనేం లేకపోవడంతో యాదవ్వకు ఏమి తోచడంలేదు. రోజు రెండుసార్లు చేనువద్దకు వెళ్ళి తిరిగి వస్తుంది.

మూడు నెలలకాలం గడిచింది. చెప్పా చేయకుండా జీపులో నుండి ఇంటిముందు దిగాడు నారాయణ. అందరూ ఆశ్చర్యంతో నోరు తెరిచారు. రందితో మనిషి కట్టెపుల్లలా తయారయ్యాడు. పోల్చుకోలేకుండా ఉన్నాడు.

తల్లిమీదపడి బావురుమని ఏడ్చాడు నారాయణ. ఏం జరిగిందో వివరించి చెప్పాక అందరూ సానుభూతిగా చూసారు అతని వైపు. కంపెనీలో పని అయిపోవడం మూలాన అందరినీ వెనక్కి పంపారని

అతడి మాటల సారాంశం.

పోచవ్వ, ఆమె తండ్రి మిగిలిన బంధువులు. మిత్రులు బెంబేలుపడిపోయారు వారి ముందు ఏజెంట్‌కు కట్టిన ఎనభై వేయిల రూపాయలే కదులుతున్నాయి. ఇప్పుడెలా బ్రతకడం అన్నదేవారి ప్రశ్న.

సానుభూతి వాక్యాలు చెప్పి అధైర్యపడి ఏదైనా అఘాయిత్యం చేసుకోవద్దని నారాయణకు హితవు చెప్పారు బంధువులు. చివరి వరకూ ఉండి అందరూ వెళ్ళిపోయాక చెప్పేమాటలు చెప్పి తనుకూడా వెళ్ళిపోయాడు నారాయణ మామ. మిగిలింది ముగ్గురు మాత్రమే. కొడుకు, కోడలు, యాదవ్వ

అవమానభారంతో ఇంట్లోంచి బయటకు వెళ్ళడం లేదు నారాయణ. ఎలా బ్రతకడం. అనే ప్రశ్న అందరికంటే ముందు అతనికే మొదలయింది. తండ్రి చనిపోయే వాడున్న అరెకరం తప్ప మరేంలేదిప్పుడు.

కొడుకు పరిస్థితి గమనించి లేచింది యాదవ్వ. కొడుకు ఏమై పోతాడోనని భయపడింది.తనను తాను సముదాయించుకుంటు క్షొడుకును సముదాయించింది.

"ఏంది బిడ్డా గట్ల బయపడ్తాన్రా చేతిమైలపోయింది. పోతేపోనీ మీ నాయిన పోయిన్నాడు మనకు ఎంత భూమి ఉండే. బెంగటిల్లితే ఇప్పుడే మన్న వత్తదా ! ఎవల్దన్న రెండెనురాలు పాలుకు పట్టుకుందాం. కాల్లు రెక్కలు సల్లగుంటే మల్ల సంపాయించుకుంటం." అంటూ నడుముకు కొంగును చుట్టి నాట్లు, బాయిలు, చెరుకువాడె గుత్తలు పట్టడానికి బయలుదేరింది.

ఎంతో తిడుతుందనుకున్న తల్లి తననే ఓదార్చడం నారాయణను కదిలించింది. వలవలా ఏడ్చాడు. "అవ్వా ! నువ్వు చెప్పినట్లు వింటే యిట్లాగాకపోవు". అంటూ కాళ్ళమీదపడ్డాడు నారాయణ.


యాదవ్వ కండ్లల్లో నీళ్ళు తిరిగాయి. కొడుకును గుండెకు హత్తుకుంది.

1999

* * *

రచయితల పరిచయం

- పత్తిపాక మోహన్,
- సిహెచ్.వి. ప్రభాకరరావు.



జి. రాములు (1921), తొలికథ ప్రచురణ 1942. పద్మశాలి పత్రిక బ్రహ్మపుత్రభక్త సమాజం అను కథ (పొగకు తినెవారి గురించిన కథ) కరీంనగర్ జిల్లా తొలికథకులు. డా॥సి.నారాయణరెడ్డి, యు.జి.సి. ఛైర్మన్ ప్రొఫెసర్ జి.రాంరెడ్డి, సుప్రీంకోర్టు జడ్జి బి.పి. జీవన్‌రెడ్డి వంటి విశ్వవిఖ్యాతులైన శిష్యుల్ని తయారుచేసిన వీరు 1983లో ఉపాధ్యాయులుగా రిటైరయ్యారు. వీరి అచ్చయిన పుస్తకాలు 1. ఆత్మఘోష(1945) 2.పెరటిచెట్టు (పెద్దకథ) (1954) 3. పిచ్చి శాయన్న (నవల) (1956) 4. గాంధీసూక్తులు (1948) 5. శాంతి పధం (గేయనాటికల సంపుటి) (1958) 6. 'బాలనీతి' (అర్ధశతకం 1979)

జి. రాములు, 4-2-99, పాత మేన్‌రోడ్, గాంధీ చౌక్ దగ్గర, సిరిసిల్ల - 505 301. ఫోన్ నం. 08723 - 33166.




డా॥పి.యశోదారెడ్డి. ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగుశాఖలో ప్రొఫెసర్‌గా, అధికారభాషా సంఘం అధ్యక్షురాలుగా పనిచేసి రిటైరయ్యారు. ప్రముఖ చిత్రకారులు కీ.శే. పి.టి.రెడ్డి గారి భార్య. ఎన్నో గ్రంథాలు రాశారు. వందకు పైగా కథలు రాశారు. వీటిలో చాలా మేరకు రేడియోలో ప్రసారం అయిన అముద్రితాలు. జన్మస్థలం మహబూబ్‌నగర్ జిల్లాలోని బిజినేపల్లి. మెట్టిన గ్రామం కరీంనగర్ జిల్లాలోని మానకొండూరు మండంలంలోని అన్నారం. అచ్చయిన కథల సంపుటి 'మా వూరి ముచ్చట్లు (1973). వీరు రాసిన వాటిలో బాలసాహిత్యం, పాఠ్యపుస్తకాలు కూడా ఉన్నాయి.

డా॥పి.యశోదారెడ్డి, కిషోర్ టాకీస్ ప్రక్కన, నారాయణగూడ చౌరస్తా, హైద్రాబాద్ - 500 029. ఫోన్ నం. 7561866.



జి. సురమౌళి (1935-1995) బి.ఎ.,ఎల్.ఎల్,బి., ప్రముఖ జర్నలిస్టు సోషలిస్టు. రామమనోహర్ లోహియా రచనలను అనువదించారు. 20 దాకా కథలు రాశారు. కొంతకాలం ఆకాశవాణిలో ప్రాంతీయ వార్తలు చదివారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాసన సభకార్యాలయంలో అనువాదకులుగా పని చేశారు. ఎన్నో గ్రంథాలు రాశారు. హైద్రాబాద్‌లో స్థిరపడ్డారు. విలాసాగర్‌లో పుట్టి వేములవాడ వాస్తవ్యులుగా పేరుపొందిన వీరి పూర్తిపేరు గర్శకుర్తి సురమౌళి. వీరు రాష్ట్ర కులనిర్మూలనా సంఘ నిర్మాతల్లో ఒకరు. తెలంగాణా తొలితరం కథకుల్లో వీరొకరు. జి. రాములు, సురమౌళి, గూడూరి సీతారాం గారలు ఈ జిల్లా తొలితరం కథకత్రయంగా ప్రసిద్ధులు.

జి. విప్లవదత్, తండ్రి : కీ॥శే॥ జి. సురమౌళి, ప్లాట్ నెం. 83, వినాయక నగర్, గచ్చిబౌలి, హైదరాబాద్. ఫోన్ : 3000677



గూడూరి సీతారాం (1936) పుట్టింది డా॥ సి. నారాయణరెడ్డి గారి స్వగ్రామమైన హన్మాజిపేట. సి.నా.రె.కి విద్యార్థి దశనుండి రూమ్మేట్లు, ఇప్పటికీ ఆప్తులు. జి. సురమౌళి గారి వద్ద చదువు నేర్చిన విద్యార్థి. కథలు రాయడంలోనూ వారిదే స్ఫూర్తి. 1953-55ల్లో సిరిసిల్ల పాఠశాల సంచికకు సంపాదకులు. బ్లాక్ ప్రోగ్రెసివ్ అసిస్టెంట్‌గా పనిచేసి దాన్ని వదిలేసి వస్త్ర వ్యాపారంలో స్థిరపడ్డారు. ఇపుడు దాన్నించి రిటైరయ్యారు. 1953లో తెలంగాణా రచయితల సంఘం సంయుక్త కార్యదర్శి. ప్రస్తుతం మానేరు రచయితల సంఘం అధ్యక్షులు. 1953 నుండి 1970 దాకా 70-80 కథలు అనాటి ప్రముఖ పత్రికలు భారతి, ప్రభ, గోల్కొండ, యువ, తెలుగుదేశం, ప్రజామత లో అచ్చయ్యాయి. తెలంగాణ తొలితరం కథకుల్లో వీరొకరు. వీరి 'కొత్తపాతలు' నవల 'తెలుగుదేశం'' పత్రికలో సీరియల్‌గా వచ్చింది.

గూడూరి సీతారాం, 4-2-99, సెస్‌రోడ్, గాంధీచౌక్, సిరిసిల్ల - 505 301. ఫోన్‌నం. (08723) 32291.




డా॥ మలయశ్రీ (10-10-1940) (కార్తీక పౌర్ణమీ) స్వగ్రామం చెంజెర్ల. ఉపాధ్యాయులుగా పనిచేసి లెక్చరర్‌గా రిటైరయ్యారు. 1968 నుండి పుస్తకాలు ప్రచురిస్తున్నారు. కరీంనగర్ జిల్లా వెయ్యేళ్ళ సాహిత్య చరిత్రపై పిహెచ్.డి. చేసి అచ్చేశారు. 12 నవలలు రాశారు. నవల, కథ, పాట, వచన కవిత, పద్యం, నాటకం, లేఖాసాహిత్యం, సాహిత్య విమర్శ మొ॥ ప్రక్రియల్లో 70 పుస్తకాలు అచ్చయ్యాయి.. వీరి శాంతివధం నాటకం 75-78లో ఇంటర్ ఉపవాచకం. తిరుగుబాటు (1982) నవల కాకతీయుల కాలం నాటీ సమాజీక జీవితం (1989), డా॥ బి.ఆర్. అంబేద్కర్ చరిత్ర రాష్ట్ర ప్రభుత్వ బహుమతులు పొందాయి. కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర ఆష్వఘోశునీ వజ్ర సూచి అనువాదం ప్రసిద్ధం.

డా॥ మలయశ్రీ, వేమననగర్, ద్వారకానగర్ కాలనీ, రేకుర్తి, వయా కొత్తపెల్లి–505 451. కరీంనగర్.




అల్లం రాజయ్య (5-6-1952) బి.యస్.సి. మంథని మండలం గాజులపల్లిలో పుట్టారు. మంచిర్యాల ఎ.సి.సి. సిమెంటు ఫ్యాక్టరీలో టైం ఆఫీసు ఇంచార్జిగా పనిచేస్తున్నారు. 100కు పైగా కథలు, 6 నవలలు అచ్చయ్యాయి. వీరి కథా సంకలనాలు: 1. భూమి (1982) 2. సృష్టికర్తలు ఎన్నో సంకలనాల్లో వీరి కథలు చోటు చేసుకున్నాయి. 1974 నుండి రాస్తున్నారు. విప్లవ రచయితల్లో ప్రముఖులు. కొన్ని కథలు కన్నడం, మళయాలం, మరాఠి, హింది, బెంగాలీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువదింపబడ్డాయి. వీరి ఇటీవల వ్రాసిన మనిషిలోపలి విధ్వంసం, అతడు, మధ్య వర్తులు, ప్రత్యర్థులు కథలు సుప్రసిద్ధం.

అల్లం రాజయ్య, క్వార్టర్ నం. D-24-A, A.C.C. కాలనీ, మంచిర్యాల - 504 209, ఆదిలాబాద్ జిల్లా. ఫోన్ : 08736 - 52838.



రేగులపాటి కిషన్‌రావు (12-1-1946) ఏం.ఏ., బి.ఇడి. ఉపాధ్యాయులు. చింతల్‌ఠానా స్వగ్రామం. కథలు, నవలలు, పాటలు, వ్యాసాలు రాశారు. 17 పుస్తకాలు అచ్చయ్యాయి. కథా సంపుటులు: 1. ఈ తరం కథ (1981) 2. స్వామీజీ కథలు.

రేగులపాటి కిషన్‌రావు, స్కూల్ అసిస్టెంటు, జెడ్.పి. హైస్కూలు, రుద్రంగి - 505 307.



డా॥ బి. దామోదరరావు (25-1-1947) ఏం.ఏ., పిహెచ్.డి. స్వగ్రామం గూడెం, ముస్తాబాద్ మండలం. లెక్చరర్. కరీంనగర్ జిల్లా సాహితీ గౌతమి అధ్యక్షులుగా, కార్యదర్శిగా పనిచేశారు. తెలుగు జానపద సామెతలపై డాక్టరేట్ తీసుకున్నారు. మాండలిక భాషలో రాసిన 'సింగిడి' (1993) వీరి అచ్చయిన కథల సంపుటి.

డా॥ బి. దామోదరరావు, 8-2-147/1, భగత్‌నగర్, కరీంనగర్ - 505 001. ఫోన్: 08722 - 30629.


తుమ్మేటి రఘోత్తంరెడ్డి(1-12-1959) వరంగల్ జిల్లా చిట్యాల మండలం, వెలంపల్లిలో పుట్టారు. సింగరేణి కార్మికుడుగా గోదావరిఖనిలో స్థిరపడ్డారు. 1981 నుండి కథలు రాస్తున్నారు. మొదటి కథ 'ధిక్కారం'. ఎన్నో కథా సంకలనాల్లో వీరి కథలు చేరాయి. దాదాపు 25 కథలు, నల్లవజ్రం నవల రాశారు.

తుమ్మేటి రఘోత్తంరెడ్డి, T2-572, ఐ.బి. కాలనీ, గోదావరిఖని - 505 209.




కె.వి. నరేందర్ (7-6-1967) బి.ఎస్సి. బి.ఇడి. ఉపాధ్యాయులు. చిల్వాకోడూర్ స్వగ్రామం. 1982 నుండి కథలు రాస్తున్నారు. 3 నవలలు రాశారు. వెలువడిన కథా సంపుటులు : 1. మనోగీతం (1991) 2. అమ్మ (1999) 3. యుద్ధం (1998) 4. బురదలో జాబిల్లి (1998). కొంతకాలం ఈ టీవీలో పనిచేసి 360 ఎపిసోడ్స్, 46 స్పెషల్ ఎపిసోడ్స్ రాశారు. 100 పైగా కథలు రాశారు. ఎన్నో అవార్డులు పొందారు. 1998లో రాష్ట్రప్రభుత్వం నుండి జిల్లాస్థాయి యువసాహితీవేత్త అవార్డు అందుకున్నారు. కొన్ని కథలు కన్నడ, తమిళ, హిందీ భాషల్లోకి అనువదించబడ్డాయి. అమ్మ, యుద్ధం, బురుదలో జాబిల్లి కథా సంపుటాలకు కలిపి ఇటీవల **విశాల సాహితీ - బి.ఎస్. రాములు అవార్డు** అందుకున్నారు.

కె.వి. నరేందర్, కెనాల్ పక్కన, జంబిగద్దెరోడ్, జగిత్యాల - 505 327, కరీంనగర్ జిల్లా. ఫోన్: 08724 - 24094.



బి.ఎస్. రాములు (23-8-1949) పుట్టిపెరిగిన ఊరు, స్థిరనివాసం జగిత్యాల. విద్యార్థి దశ (1964) నుండి రచనలు చేస్తున్నారు. 1968లో 'బాలమిత్ర' మాసపత్రికలో ''జగిత్యాల కథ'' వీరి అచ్చయిన తొలి కథ. అచ్చయిన కథా సంపుటాలు: 1. పాలు (1982) 2. స్మృతి




(1998) అచ్చయిన నవల బతుకుపోరు (1982) సుప్రసిద్ధం. డెబ్బయి పైగా కథలు, నాలుగు నవలలు రాశారు. తత్తశాస్త్రం, సాహిత్య విమర్శ, కథ, నవల ప్రక్రియల్లో కృషి చేస్తున్నారు. గతితర్క తత్వదర్శన భూమిక, గతితర్కం అంబేద్కరిజం, అంబేద్కరిజం-సోషలిజం, ప్రేమ అంటే ఏమిటి, కన్యాశుల్కంను ఇపుడెలా చూడాలి, కథలబడి కథా సాహిత్యాలంకార శాస్త్రం మొదలైన పది గ్రంథాలు వెలువడ్డాయి. 1968 నుండి రచయితల సంఘాలను ఆర్గనైజ్ చేస్తున్నారు. దేశమంతటా విస్తృతంగా పర్యటించారు. అధునిక భారతీయ సమాజిక తత్వవేత్తగా, తెలుగు కథా తాత్విక చైతన్యంగా ప్రసిది చెందారు. కొన్ని కథలు తమిళ, మరాఠీ, హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువదించబడ్డాయి. విశాల సాహితి వ్యవస్థాపకులు.

బి.ఎస్. రాములు, 6-2-157, మిషన్ దవాఖానా దగ్గర, జగిత్యాల - 505 327. ఫోన్: 08724 - 22056.



డా॥ కాలువ మల్లయ్య (24-1-1952) ఎం.ఎస్సీ., ఏం.ఏ., పిహెచ్.డి. తేలుకుంట స్వగ్రామం. 1982 నుండి కథలు రాస్తున్నారు. 350 కథలు, 6 నవలలు వ్రాశారు. కొన్ని కథలు కన్నడ, హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువదించబడ్డాయి. అచ్చయిన కథా సంపుటులు : 1. కట్నం కథలు (1983) 2. ఘర్మజలానికి ఖరీదు కట్టే షరాబు (1991) 3. రాజు కోడి (1993) 4. మా కథలు (1998). ఎన్నో కథా సంకలనాల్లో వీరి కథలు చేరాయి. రావిశాస్త్రి అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం వంటి ఎన్నో అవార్డులు , బహుమతులు 25 పైగా పొందారు. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ప్రజల జీవితాల్ని యిన్ని కోణాల్లో చిత్రించింది కాలువమల్లయ్య గారొక్కరే. తెలుగు నేల 50 ఏళ్ళ సామాజిక పరిణామాలకు వీరి కథలు కాలనాళిక. వీరు **మా కథలు** సంపుటికి ఇటీవలే **విశాల సాహితీ-బి.ఎస్. రాములు అవార్డు** అందుకున్నారు.

డా॥ కాలువ మల్లయ్య, బి-37, ఫర్టిలైజర్ సిటీ-505 210, కరీంనగర్ జిల్లా. ఫోన్ 08728 - 66606.



గూడూరి అమరావతి (1964) స్వగ్రామం అంతక్కపేట. దళిత రచయితల కళాకారుల, మేధావుల ఐక్యవేదిక వర్క్షాపు ద్వారా కథకులుగా రూపుదిద్దుకున్న వారిలో వీరొకరు. తన విప్లవ జీవితాన్ని "కల్లోలనేత్రం" నవలగా రాశారు. పది దాకా కథలు రాశారు. **గూడూరి అమరావతి, మేన్‌రోడ్, హుస్నాబాద్ - 505 467.**



ముదిగంటి సుజాతారెడ్డి (1942) నల్లగొండ జిల్లాలో పుట్టారు. మెట్టినిల్లు హుస్నాబాద్ తాలూకా పోత్కపెల్లి. భర్త డా॥ గోపాలరెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ సంస్కృతశాఖ అధ్యక్షులుగా రిటైరయ్యారు. సుజాతారెడ్డి గారు రావుబహదూర్ వెంకట్రామారెడ్డి మహిళా డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. 4వేల ఏళ్ళ సంస్కృతి సాహిత్య చరిత్ర, తెలుగు సాహ్యిత చరిత్ర, వేమననాథ సంప్రదాయం గ్రంథాలు రాశారు. వసుమను



పంజాల జగన్నాథం,

చరిత్రల తులనాత్మక అధ్యయనం.వీరి పిహెచ్.డి. గ్రంథం. 1990 నుండి కథలు, నవలలు రాస్తున్నారు. 50 కథలు, 3 నవలలు రాశారు. వీరి 'విసుర్రాయి' (1998) కథలసంపుటికి **విశాలసాహితి - బి.ఎస్. రాములు అవార్డు**, జ్యేష్ట లిటరరీ అవార్డు వచ్చాయి. జిల్లాలో తొలి నవలా రచయిత్రి.


ముదిగంటి సుజాతారెడ్డి, 2-2-1105/21, రోహిణం, తిలక్‌నగర్, హైదరాబాద్ - 500 044. ఫోన్: 040-4656534.



పంజాల జగన్నాథం (5-8-1952) ఎం.ఎస్సీ. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కెమిస్ట్రీ లెక్చరర్. 1992 నుండి కథలు, కవితలు రాస్తున్నారు. యాస్వాడ స్వగ్రామం. పది కథలు రాశారు.

పంజాల జగన్నాథం, ఇ.నెం. 7-2-74, మంకమ్మతోట, కరీంనగర్ - 505 002. ఫోన్: 08722 - 46541.


కొక్కుల పద్మావతి (28-5-1958) మరాఠీ మాతృభాష. తెలుగింటి ఇల్లాలు. తెలుగు, హిందీ, మరాఠీ భాషల్లో ఒక భాషనుండి మరో భాషకు కథలు అనువాదాలు చేస్తున్నారు. అనువాద కథలు, వార్త, ఆంధ్రజ్యోతి, విపుల, పద్మపీఠం మొ॥ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. బి.ఎస్. రాములు గారి "ప్రేమంటే ఏమిటి" తాత్విక గ్రంథాన్ని హిందీలోకి అనువదించారు. ఇటీవలే కథలు రాయడం ప్రారంభించారు. అయిదారు కథలు రాశారు. వీరి భర్త కొక్కుల మారుతి విద్యుత్ శాఖలో సీనియర్ అసిస్టెంట్.



కొక్కుల పద్మావతి, 1-2-30/5, యావర్‌రోడ్, జగిత్యాల - 505 327. ఫోన్: 08724 - 23964.

బెజ్జారపు వినోద్‌కుమార్ (20-10-1965) ఎం.ఏ. టి.టి.సి. ఉపాధ్యాయులు. గత పదేళ్ళుగా 45 కథలు రాశారు. ఇవి ఈనాడు, ఉదయం, ఆంధ్రభూమి, స్వాతి, పల్లకి, స్రవంతి మొ॥ ప్రముఖ పత్రికల్లో ప్రచురింపబడ్డాయి.

బెజ్జారపు వినోద్‌కుమార్, 6-1-30, కాలువగడ్డ, కోరుట్ల - 505 326, జిల్లా: కరీంనగర్. ఫోన్: 08725 - 52335.




ఎనుగంటి వేణుగోపాల్ (27-12-1966) ఎం.ఏ. (తెలుగు) ఎం.ఏ. (సమాజశాస్త్రం) బి.ఇడి. హిందీ విద్వాన్. ఉపాధ్యాయులు. ఆంధ్రప్రభ, స్వాతి వంటి ప్రముఖ పత్రికల్లో 30 కథలు రాశారు. సినిమాలకు, టీవీలకు కూడా రాయాలని లక్ష్యం పెట్టుకున్నారు.

ఎనుగంటి వేణుగోపాల్, 1-3-169/1, కృష్ణానగర్, జగిత్యాల - 505 327.



వనమాల చంద్రశేఖర్ (15-3-1963) ఎం.ఏ. ఎల్.ఎల్.యం. సొంత ఊరు జగిత్యాల. అడ్వకేటుగా ప్రాక్టీసు చేశారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో జగిత్యాలలో డిప్యూటీ తహసీలుదారుగా పనిచేస్తున్నారు. చరిత్ర, అధ్యయనం, 10 ఏళ్ళుగా కవితలు, వ్యాసాలు రాస్తున్న వీరు ఇటీవల కథలు కూడా రాస్తున్నారు. **వనమాల చంద్రశేఖర్, 6-6-203, పద్మనగర్, తహసీలు ఆఫీసు వెనుక, జగిత్యాల - 505 327. ఫోన్: 08724 - 23934.**



పెద్దింటి అశోక్‌కుమార్ (1970) ఉపాధ్యాయులు. 22 కథలు రాశారు. ఆంధ్రభూమి, స్వాతి, జ్యోతి, ప్రజాశక్తి పత్రికలలో అచ్చయ్యాయి. సిరిసిల్ల తాలూకా కోరుట్లపేట వీరి స్వగ్రామం. మంచి కథలు వ్రాయాలని వీరి సంకల్పం.

పెద్దింటి అశోక్ కుమార్, టీచర్, పోస్ట్ : మల్లారెడ్డిపేట,
మం॥ గంభీరావ్‌పేట - 505 304, కరీంనగర్ జిల్లా



డా॥ జె. రమణయ్య,

డా॥ జె. రమణయ్య (1938) ఎం.ఏ. బి.ఇడి. ఎం.ఫిల్. పిహెచ్.డి. సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు. దక్షిణ భారతదేశ దేవాలయాలు అనేది వీరి డాక్టరేట్ పట్టా గ్రంథం. చాళుక్యులు, కాకతీయుల కాలం అనేది వీరి ఎం.ఫిల్. గ్రంథం. కరీంనగర్ జిల్లా చరిత్ర గురించి హిస్టరీ కాంగ్రెస్‌లో ఎన్నో సెమినార్ పేపర్లు సమర్పించారు.

డా॥ జె. రమణయ్య, **అరవింద నగర్, జగిత్యాల. ఫోన్: 22105**




సిహెచ్.వి. ప్రభాకర్ రావు,

పత్తిపాక మోహన్ (5-1-1972) ఎం.ఏ. (పిహెచ్.డి.) ఉపాధ్యాయులు. రాష్ట్రప్రభుత్వం నుండి వీరు యువసాహితీవేత్త జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి అవార్డులు పొందారు. యువసాహితీ విమర్శకులు, కవి.

పత్తిపాక మోహన్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్, సిరిపూర్ కాగజ్‌నగర్. జిల్లా॥ ఆదిలాబాద్.

సిహెచ్.వి. ప్రభాకర్‌రావు (4-10-1955) సీనియర్ జర్నలిస్టు. మంటలు వారపత్రికను చాలాకాలం నడిపారు. మంటలు ప్రభాకర్‌గా ప్రసిద్ధులు. ప్రస్తుతం జగిత్యాల శాతవాహన హైస్కూల్ ఇంగ్లీషు మీడియం కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.
సిహెచ్.వి. ప్రభాకర్ రావు, ప్రిన్సిపాల్ శాతవాహణ హైస్కూల్, **బ్రాహ్మణవాడ, జగిత్యాల. ఫోన్ : 21627, 23103.**


బి.ఎస్ రాములు 50 వ జన్మదిన స్వర్ణోత్సవ దృశ్యాలు
23-8-98 జగిత్యాల




గతి తర్క తత్వదర్శనభూమికను ఆవిష్కరిస్తున్న
శిలావీర్రాజు - బి.ఎస్.రాములు, జ్వాలాముఖి



బి.ఎస్. రాములు శ్యామల దంపతుల్ని సత్కరిస్తున్న
డా॥ మలయశ్రీ, భారతి దంపతులు




స్మృతి కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న
గూడూరి సీతారాం - బి.ఎస్. రాములు, జ్వాలాముఖి



బి.ఎస్.రాములు 51వ జన్మదినం కథారచయితల సమ్మేళనంలో
ప్రసంగిస్తున్న కె. ప్రతాపరెడ్డి (అసిస్టెంట్ ఎడిటర్ - సుప్రభాతం వారపత్రిక)



వనమాల చంద్రశేఖర్ (15-3-1963) ఎం.ఏ. ఎల్.ఎల్.యం. సొంత ఊరు జగిత్యాల. అడ్వకేటుగా ప్రాక్టీసు చేశారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో జగిత్యాలలో డిప్యూటీ తహసీలుదారుగా పనిచేస్తున్నారు. చరిత్ర, అధ్యయనం, 10 ఏళ్ళుగా కవితలు, వ్యాసాలు రాస్తున్న వీరు ఇటీవల కథలు కూడా రాస్తున్నారు. **వనమాల చంద్రశేఖర్, 6-6-203, పద్మనగర్, తహసీలు ఆఫీసు వెనుక, జగిత్యాల - 505 327. ఫోన్: 08724 - 23934.**



పెద్దింటి అశోక్‌కుమార్ (1970) ఉపాధ్యాయులు. 22 కథలు రాశారు. ఆంధ్రభూమి, స్వాతి, జ్యోతి, ప్రజాశక్తి పత్రికలలో అచ్చయ్యాయి. సిరిసిల్ల తాలూకా కోరుట్లపేట వీరి స్వగ్రామం. మంచి కథలు వ్రాయాలని వీరి సంకల్పం.

పెద్దింటి అశోక్ కుమార్, టీచర్, పోస్ట్ : మల్లారెడ్డిపేట, మం॥ గంభీరావ్‌పేట - 505 304, కరీంనగర్ జిల్లా



డా॥ జె. రమణయ్య,

డా॥ జె. రమణయ్య (1938) ఎం.ఏ. బి.ఇడి. ఎం.ఫిల్. పిహెచ్.డి. సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు. దక్షిణ భారతదేశ దేవాలయాలు అనేది వీరి డాక్టరేట్ పట్టా గ్రంథం. చాళుక్యులు, కాకతీయుల కాలం అనేది వీరి ఎం.ఫిల్. గ్రంథం. కరీంనగర్ జిల్లా చరిత్ర గురించి హిస్టరీ కాంగ్రెస్‌లో ఎన్నో సెమినార్ పేపర్లు సమర్పించారు.

డా॥ జె. రమణయ్య, **అరవింద నగర్, జగిత్యాల. ఫోన్: 22105**

పత్తిపాక మోహన్ (5-1-1972) ఎం.ఏ. (పిహెచ్.డి.) ఉపాధ్యాయులు. రాష్ట్రప్రభుత్వం నుండి వీరు యువసాహితీవేత్త జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి అవార్డులు పొందారు. యువసాహితీ విమర్శకులు, కవి.

పత్తిపాక మోహన్, సోషల్ వెల్‌ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్, సిరిపూర్ కాగజ్‌నగర్. జిల్లా॥ **ఆదిలాబాద్.**




సిహెచ్.వి. ప్రభాకర్ రావు,

సిహెచ్.వి. ప్రభాకర్‌రావు (4-10-1955) సీనియర్ జర్నలిస్టు. మంటలు వారపత్రికను చాలాకాలం నడిపారు. మంటలు ప్రభాకర్‌గా ప్రసిద్ధులు. ప్రస్తుతం జగిత్యాల శాతవాహన హైస్కూల్ ఇంగ్లీషు మీడియం కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

సిహెచ్.వి. ప్రభాకర్ రావు, ప్రిన్సిపాల్ శాతవాహణ హైస్కూల్, బ్రాహ్మణవాడ, జగిత్యాల. **ఫోన్ : 21627, 23103.**

బి.ఎస్ రాములు 50 వ జన్మదిన స్వర్ణోత్సవ దృశ్యాలు


23-8-98 జగిత్యాల




గతి తర్క తత్వదర్శనమూమకను ఆవిష్కరిస్తున్న
శీలావీర్రాజు - బి.ఎస్.రాములు, జ్వాలాముఖి



బి.ఎస్. రాములు శాస్త్రుల దంపతులను సత్కరిస్తున్న
డా॥ మలయశ్రీ, భారతి దంపతులు



స్మృతి కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న
గూడూరి సీతారాం - బి.ఎస్. రాములు, జ్వాలాముఖి



బి.ఎస్.రాములు 51వ జన్మదినం కథారచయితల సమ్మేళనంలో
ప్రసంగిస్తున్న కె. ప్రతాపరెడ్డి (అసిస్టెంట్ ఎడిటర్ - సుప్రభాతం వారపత్రిక)

విశాల సాహిత్య అకాడమి ప్రచురణలు

1. గతితర్క తత్వదర్శన భూమిక - బి.ఎస్. రాములు	కాపీలు లేవు
2. గతి తర్కం అంబేద్కరిజం మార్క్సిజం - బి.ఎస్. రాములు	,,
3. కన్యాశుల్కంను ఇప్పుడెలా చూడాలి - బి.ఎస్. రాములు	,,
4. ప్రభాతం నాటిక - కె. సీతారాములు	,,
5. హాస్టల్ కథలు - కె. సీతారాములు	రూ॥ 25-00
6. దళిత భారతి (కవితలు) - ఆకుల గంగాధర్	రూ॥ 10-00
7. కరీంనగర్ జిల్లా దళిత పాటలు - సం॥ బి.ఎస్. రాములు	కాపీలు లేవు
8. అంబేద్కరిజం సోషలిజం - బి.ఎస్. రాములు	కాపీలు లేవు
9. ప్రేమంటే ఏమిటి? - బి.ఎస్. రాములు (మూడవ ముద్రణ)	రూ॥ 15-00
10. ప్రవహించే పాట ఆం.ప్ర. దళిత పాటలు - సం॥ బి.ఎస్. రాములు	రూ॥ 50-00
11. కె. రామలక్ష్మన్ - దళిత పాటలు	రూ॥ 10-00
12. స్మృతి - బి.ఎస్. రాములు కథలు	రూ॥ 40-00
13. కథల బడి కథా సాహిత్య అలంకారశాస్త్రం - బి.ఎస్. రాములు	రూ॥ 50-00
14. నేను ఎవరు? గతితర్క తత్వదర్శన భూమిక - బి.ఎస్. రాములు	రూ॥ 60-00
15. జన్మభూమి - నాటికలు, పాటలు - కె. సీతారాములు.	రూ॥ 30-00
16. విసుర్రాయి కథలు - ముదిగంటి సుజాతారెడ్డి	రూ॥ 60-00
17. అమ్మ కథల సంపుటి - కె.వి. నరేందర్	రూ॥ 30-00
18. మమతలు మానవ సంబంధాల కథలు - బి.ఎస్. రాములు	రూ॥ 40-00
19. ఆధునిక కథా సరిత్సాగరం కరీంనగర్ జిల్లా కథలు మొదటి సంపుటి సంపాదకులు : బి.ఎస్. రాములు, వనమాల చంద్రశేఖర్ ఎం.ఎ., ఎల్.ఎల్.ఎం.	రూ॥ 30-00
20. భూ నిర్వాసితులు ఇతర కథలు - పి. చంద్	రూ॥ 20-00
21. భౌతికవాద ప్రాపంచిక దృక్పథం - బి.ఎస్. రాములు	రూ॥ 20-00
22. బి.ఎస్. రాములు 50వ జన్మదిన సంచిక	రూ॥ 50-00

విశాల సాహితి బి.ఎస్. రాములు కథా పురస్కారాలు :

నవీన్ (జీవితకాల కృషికి)

భూపాల్ (అంబల్ల బండ కథల సంపుటికి)

ఆడెపు లక్ష్మిపతి (నాలుగు దృశ్యాలు కథల సంపుటికి)

డా॥ కాలువ మల్లయ్య (మా కథలు -కథల సంపుటికి)

డా॥ ముదిగంటి సుజాతా రెడ్డి (విసుర్రాయి కథల సంపుటికి)

డా॥ శాంతి నారాయణ (పల్లేరు ముళ్లు కథల సంపుటికి)

కె.వి. నరేందర్ (అమ్మ, యుద్ధం, బురదలో జాబిల్లి 3 కథల సంపుటులకు కలిపి)